ఈనాడు

విజయవాడ 19-8-2017 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 10
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00 పేజీలు 16+20
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



కొత్త 50 నోటు

త్వరలో ప్రవేశ పెట్టనున్న ఆర్‌బీఐ

ముంబయి: రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) త్వరలో నీలి రంగు రూ.50 నోట్లను ప్రవేశ పెట్టనుంది. మహాత్మ గాంధీ (నూతన) సిరీస్‌లో భాగంగా ఈ నోట్లను తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ఈ నోటు వెనుకవైపు హంపి రథాన్ని ముద్రించనున్నారు. ఫ్లోరోసెంట్ నీలి రంగులో ఉండే ఈ నోటుకు రెండు వైపులా ఆంగ్లం, దేవనగరిల్లో సూక్ష్మక్షరాల్లో ఆర్‌బీఐ, ఇండియా, నోటు విలువ రాసి ఉంటాయి. మహాత్మ గాంధీ చిత్రం కూడా ముద్రించి ఉంటుంది ముందువైపు కుడి దిక్కున అశోక స్తంభం చిహ్నం.. వెనుకవైపున స్వచ్ఛభారత్ చిహ్నం, నినాదం, వివిధ భాషల్లో నోటు విలువలు ఉంటాయి. కొత్త నోట్ల జారీ తర్వాత కూడా పాత రూ.50 నోట్లు చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ తెలిపింది.



కొత్త 50 నోటు వెనుక భాగం

బీచ్‌లు బంగారు బాతులే!

తీర్చిదిద్దుకుంటే పర్యాటకంగా అద్భుత పురోగతి

- రాష్ట్రంలో లెక్కకుమిక్కిలి ఆకర్షణీయ బీచ్‌లు
- ప్రధానంగా అలరిస్తున్నవి 35
- వసతులు, సౌకర్యాలు కల్పిస్తే స్వర్గధామాలే
- గోవా, మెరీనా తరహా అభివృద్ధి ఆచరణీయం
- పర్యాటకశాఖ చర్యలు మాత్రం నిస్తేజం
- కనీస సౌకర్యాలూ కల్పించలేకపోతున్న దుస్థితి

రాష్ట్రంలో తీర ప్రాంతం	
సముద్ర తీరం:	970 కి.మీ
మొత్తం బీచ్‌లు:	50కి పైగా
ప్రధాన బీచ్‌లు:	14



కృష్ణా జిల్లాలోని మంగినపూడి బీచ్

పర్యాటకులను ఆహ్లాదపరిచే అలల సోయగాలు.. మనసుదోచే ప్రకృతి శోభ.. పాదాలను సున్నితంగా పలకరించే ఇసుక రాశులు సముద్రతీర ప్రాంతాల సొంతం..

అటువంటి వేయి కిలోమీటర్లపైబడిన తీర ప్రాంతం రాష్ట్రానికి వరం. పర్యాటకానికి పూర్తి అనుకూలమైన 35 బీచ్‌లు మన రాష్ట్రానికి ప్రత్యేకం. ప్రకృతి రమణీయతను ఒడిసిపట్టే అందాలు వీటికి ప్రత్యేకం. బీచ్ పర్యాటకం(బీచ్ టూరిజం)తో జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను పెద్ద సంఖ్యలో ఆకర్షించేందుకు అవకాశాలు అపారం. ఇంతటి ప్రాధాన్యమున్న బీచ్‌లను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సి ఉంది. తద్వారా రాష్ట్ర ఆర్థిక వనరులను పరిపుష్టం చేసుకోవడమేకాక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకోవచ్చు అనడంలో సందేహం లేదు.

ప్రస్తుతం రాష్ట్రంలో అనేక బీచ్‌ల్లో వేధిస్తున్న సమస్యల్లో రక్షణ, రహదారులు, తాగునీరు, మరుగుదొడ్లు ప్రధానమైనవి. చాలా బీచ్‌ల్లో పర్యాటకులకు తినేందుకు ఆహారం, తాగేందుకు మంచినీరు దొరకని పరిస్థితి ఉంది. బీచ్ పక్కనే మురుగునీటి ప్రవాహాలు, చుట్టూ దుర్గంధం సర్వసామాన్యమైపోయాయి. సాగరంలో కేరింతలు కొట్టాక మహిళలకు దుస్తులు మార్చుకునే మరుగు సౌకర్యాలు కానరావు. ప్రమాదకర సమయాల్లో పర్యాటకులను హెచ్చరించే వ్యవస్థలు, ప్రమాదవశాత్తు సముద్రంలో కొట్టుకుపోయే పర్యాటకులను కాపాడే ఏర్పాట్లు అరకొరే. ప్రసిద్ధి చెందిన బీచ్‌ల్లో ఉండే సౌకర్యాలు, వసతులూ మనకు అందని ద్రాక్షలే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన బీచ్‌ల్లో పరిస్థితులపై...

సమగ్ర కథనం 13లో



'సిక్కా'ముడి పడింది

- ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ పదవులకు రాజీనామా
- విశాల్ సిక్కా అనూహ్య నిర్ణయం

భారత ఐటీ రంగానికి తొలి పాఠాలు చెప్పిన ఇన్ఫోసిస్‌లో భారీ కుదుపు. కంపెనీ సీఈఓ, ఎండీ విశాల్ సిక్కా శుక్రవారం రాజీనామా చేశారు. తనపై వస్తున్న వ్యక్తిగత ఆరోపణలను తట్టుకోలేకే ఈ నిర్ణయం తీసుకున్నానని ఎవరి పేరూ ఉటంకించకుండా పేర్కొన్నారు. ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ పాలన ప్రమాణాలను తుంగలో తొక్కుతున్నారంటూ సంస్థ సహ-వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కొద్దికాలంగా బాహాటంగానే విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాలతో ఇన్ఫోసిస్ షేరుతో పాటు స్టాక్ మార్కెట్లు కూడా నష్టాల పాలయ్యాయి. - బిజినెస్ పేజీలో

ధర 'ఇసుక'ంతయు తగ్గలేదు

- 48% మంది మనోగతమిదే
- సరఫరాలోనూ 'అవినీతే'
- అక్రమ రవాణాను అరికడితేనే మేలు
- పరిష్కార వేదిక సర్వేలో వెల్లడి

ఈనాడు, అమరావతి: 'ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టాక ఇసుక ధరలు తగ్గాయా'?.. అంటూ ప్రభుత్వం పరిష్కార వేదిక ద్వారా ప్రజాభిప్రాయం తీసుకున్నప్పుడు.. ఏమాత్రం తగ్గలేదంటూ దాదాపు 48% మంది కుండబద్దలుకొట్టారు. మరో 7% మంది ధర వాలేదన్నారు. 45% మంది ధరలు తగ్గాయనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రభుత్వం ఇసుక ధరలు నియంత్రించడానికి, మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసి సామాన్యులకు ధరలు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తోంది. వీటి ఫలితాలు ఎలా ఉన్నాయనే (మిగతా 2లో)

వణికిన ఐరోపా

- స్పెయిన్‌లో మరో ఉగ్రదాడి
- 14కు చేరిన మృతుల సంఖ్య
- ఐదుగురు ఉగ్రవాదుల హతం
- ఫిన్లాండ్, జర్మనీల్లో కత్తిపోట్లు
- ముగ్గురి మృతి 16లో



శుక్రవారం ఫిన్లాండ్‌లోని తుర్కులో కత్తితో ఓ ఆగంతకుడు దాడి చేసిన ప్రాంతంలో మోహరించిన పోలీసులు

ప్రశాంతంగా ఉండే ఐరోపా దేశాలు దాడులతో విలవిల్లాడాయి. స్పెయిన్‌లో గురువారం వీధుల్లో ఉన్న అమాయకులపై వాహనం నడిపి వారి మరణానికి కారకులైన ఉగ్రవాదులు శుక్రవారమూ మరోసారి అలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారు. తొలుత బార్సిలోనాలో వ్యానుతో దాడి చేయగా, అనంతరం క్యాంబ్రిల్స్‌లో కారునే ఆయుధంగా మార్చుకున్నారు. ఈ రెండు దుర్ఘటనల్లోనూ 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది తమ పనేనని అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ప్రకటించింది. క్యాంబ్రిల్స్‌లో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు అయిదుగురు అనుమానిత ఉగ్రవాదులను కాల్చి చంపారు. వారు తమ ఒంటికి పేలుడు పదార్థాలను అమర్చుకున్నట్టు, బ్యూటేన్ వాయువుతోనూ దాడి చేయాలని ప్రణాళిక వేసుకున్నట్టు తెలుస్తోంది. ఫిన్లాండ్, జర్మనీల్లో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడులు చేశారు. ఫిన్లాండ్‌లోని టుర్కులో జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు, జర్మనీలోని వుప్పెర్టల్ నగరంలో జరిగిన దాడిలో ఒకరు మరణించారు.



అందరికీ పద్మ అవకాశం

వచ్చే నెల 15లోగా ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు పంపాలి

దిల్లీ: పద్మ పురస్కారాల కోసం ఎవరైనా ఎవరి పేరునైనా ప్రతిపాదించవచ్చు. అజ్ఞాత ప్రతిభావంతులకు గుర్తింపు ఇచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. 2018 సంవత్సరానికి సంబంధించిన పురస్కారాల కోసం సెప్టెంబరు 15వ తేదీ వరకు ప్రతిపాదించే అవకాశం ఉంది. ప్రతిపాదనలను ఇందుకోసం కేంద్ర హోంశాఖ రూపొందించిన www.padmaawards.gov.in పోర్టల్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సంఘ సేవ, వైజ్ఞానిక శాస్త్రాలు, ఇంజినీరింగ్, పౌర సేవలు, ప్రజా వ్యవహారాలు, వాణిజ్యం, పరిశ్రమల రంగాల్లో ప్రతిభ చూపిన వారి పేర్లను ప్రతిపాదించవచ్చు. గతంలో ఇలాంటి వారి పేర్లను మంత్రులు, రాజకీయ నాయకులు సిఫార్సు (మిగతా 2లో)

నంద్యాలలో కాసుకో

- అత్యంత ఖరీదైన ఉపఎన్నిక!
- రూ.50లక్షలు స్వాధీనం
- తెదేపా, వైకాపా అధినేతల ప్రచారాలతో రాజకీయ వేడి
- ఎటుచూసినా కార్ల హోరు.. ప్రచారాల జోరు
- అత్యంత సమస్యాత్మకంగా 141 పోలింగ్ కేంద్రాలు

నంద్యాల నుంచి ఈనాడు ప్రత్యేక ప్రతినిధి

నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో కాసుల గలగలలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు అధికారులు రూ.50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. డబ్బుల పంపిణీపై పరస్పర ఆరోపణలు, ఫిర్యాదులూ హోరెత్తుతున్నాయి. ఒక్క శుక్రవారమే వైకాపా, తెదేపా కార్యకర్తల నుంచి పోలీసులు దాదాపు రూ. 22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ప్రచారపర్వం తారాస్థాయికి చేరింది. అధికార, ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు, ప్రధాన నాయకులు, మంత్రులు ఎమ్మెల్యేలతో నంద్యాల కిక్కిరిసింది. రోడ్లపై వందలాది కార్లు తిరుగుతూ మహానగరాన్ని తలపింపజేస్తున్నాయి. స్థానికంగా తక్కువగా కనిపించే ఖరీదైన బెంజ్, బీఎండబ్ల్యు, వోల్వో, ఆడిలాంటి కార్లు ఇప్పుడు గల్లీలలో చక్కర్లు కొడుతున్నాయి. రాజకీయ నేతల ప్రచార సందడి, వాహనాల హోరుతో నంద్యాల రద్దీగా మారింది. అల్పాహారం, భోజనం కోసం ఏ హోటల్‌కు వెళ్లినా గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోంది. కొంత ఆలస్యమైతే టిఫిన్లు, భోజనాలు దొరకడం లేదు. ఇప్పటికే హోటళ్లు, లాడ్జీల్లో గదులు లేవు. దీంతో కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు తెలిసిన వాళ్ల ఇళ్లలో ఉంటున్నారు. మరికొందరు ప్రత్యేకంగా గదులను అద్దెకు తీసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత జరుగుతున్న ఈ మొదటి ఉపఎన్నిక అత్యంత ఖరీదైనదిగా రాష్ట్ర చరిత్రలో (మిగతా 2లో)



నంద్యాలలో ఓ హోటల్ వద్ద కార్లు, బైక్‌ల సందడి

డోక్లామ్‌కు టెలికాంతో విరుగుడు

- విద్యుత్, కమ్యూనికేషన్ రంగాల్లో చైనా కంపెనీలపై భారత్ గురి 16లో
- నిబంధనలను కఠినతరం చేస్తున్న ప్రభుత్వం



హిల్‌వ్యూ కొండపై నుంచి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర స్టాండింగ్ కమిటీ బృందం సభ్యులు, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు

భవిష్యత్తులో మిగులు జలాల్లో రాష్ట్రం ముందంజ

- కేంద్ర జలసంఘం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ హుకుంసింగ్
- చంద్రబాబు ముందుచూపు అభినందనీయమని ప్రశంస

2లో

కుళ్లిన పచ్చళ్లతో తిరిగి తయారీ!

- 200 డ్రమ్ముల నిల్వలు పట్టివేత
- రూ.75 లక్షల సరకు జప్తు 14లో


తమిళనాడులో పతాక స్థాయికి 'విలీనం' 3లో

- పళని, పన్నీర్ వర్గాల కీలక చర్చలు
- పదవులపై కుదరని సయోధ్య?

ప్రాంగణ నియామకాల మందగమనం 2లో

- వేచిచూసే ధోరణిలో కొన్ని ఐటీ కంపెనీలు
- తగ్గనున్న అభ్యర్థుల ఎంపికలు

ఇదీ సంగతి!



చేతివాటానికి వాతలేవి?

- స్టెంట్ల ధరలు తగ్గించినా.. తగ్గని యాంజియోప్లాస్టీ ధర
- మోకీలు కృత్రిమ పరికరాల ధరలపైనా అవే సందేహాలు
- మొత్తంగా చికిత్స ఖరీదు తగ్గకపోతే.. లక్ష్యానికే దెబ్బ
- అమలుపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

ఈనాడు - హైదరాబాద్

కేంద్రం కీలెరిగి వాతపెట్టింది.. మరి వ్యాపారులు, దవాఖానాల తీరు మారుతుందా? మోకీలు మార్పిడిలో వినియోగించే కృత్రిమ పరికరాల ధరలను నియంత్రిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నా.. మరోవైపు మొత్తంగా మోకీలు



మార్పిడి శస్త్రచికిత్స ధరలు తగ్గుతాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే కొద్దినెలల కిందటే కేంద్ర ప్రభుత్వం స్టెంట్ల ధరలను నియంత్రిస్తూ ఆదేశాలిచ్చినా.. ఆచరణలోకి వచ్చేసరికి రోగులకు నిరాశే ఎదురవుతోంది. కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు తగ్గిన స్టెంటు ధరను పూడ్చుకోవడం కోసం వేర్వేరు సేవల్లో ధరలను పెంచేస్తున్నాయి. దీంతో రోగులకు స్టెంట్ల ధరలు తగ్గడం వలన ఎలాంటి ఊరట లభించలేదు. తాజాగా మోకీలు కృత్రిమ పరికరాల ధరల నియంత్రణా అలాగే ఉంటుందా? లేక ఫలితమిస్తుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలు ధరలకు అడ్డుకట్ట

ఇప్పటి వరకూ ధరలపై నియంత్రణ లేకపోవడంతో సరఫరాదారు, ఆసుపత్రులు ఎవరి స్థాయిలో వారు అడ్డగోలుగా ధరలను వసూలు చేస్తున్నారు. కృత్రిమ మోకీలు పరికరం దిగుమతి ధర రూ.23 వేలుంటే.. రోగికి చేరేసరికి రూ.75 వేలవుతోంది. అంటే దాదాపు 250 శాతం మేరకు పెరుగుతోంది. కొన్ని ఆసుపత్రుల్లో ఇదే పరికరానికి రూ. 1.25 లక్షలు కూడా వసూలు చేస్తున్నారు. తెలంగాణలో నెలకు సుమారు 1000 వరకూ మోకీలు మార్పిడిలు చేస్తుండగా వాటిలో 95 శాతం విదేశీ పరికరాలతోనే జరుగుతున్నాయి. వాటిలోనూ 90 శాతం పరికరాల ధర రూ.75 వేల నుంచి రూ.1.25 లక్షల వరకూ.. కొన్ని ప్రత్యేక లక్షణాలున్న పరికరాలకు రూ. 2.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. తాజా నియంత్రణలో భాగంగా రాష్ట్రంలో అత్యధికంగా వినియోగించే కోబాల్ట్- క్రోమియం కృత్రిమ మోకీలు పరికరం (మిగతా 2లో)

భవిష్యత్తులో మిగులు జలాల్లో రాష్ట్రం ముందంజ



శుక్రవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయిన హుకుంసింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్థాయి సంఘం బృందం

ఈనాడు-అమరావతి: పోలవరం, కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: దేశంలో మిగులు జలాల విషయంలో 2019 తర్వాత ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాలతో పోలిస్తే అన్ని విధాల ముందుంటుందని పార్లమెంటరీ జలవనరుల స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ హుకుంసింగ్ అంచనా కట్టారు. పోలవరం ప్రాజెక్టు పనుల్లో పురోగతి పట్ల ఆయన సంతృప్తి ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రాజెక్టు ప్రాంతంలో విలేకరులతో మాట్లాడుతూ.. నీటి భద్రతకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపును అభినందించారు. 2018 నాటికి గ్రావిటీ ద్వారా, 2019 నాటికి నిర్మాణం పూర్తిచేసే లక్ష్యంతో వేగంగా జరుగుతున్న పనుల తీరును ప్రశంసించారు. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పోలవరం రూపుదిద్దుకుంటోందన్నారు. రానున్న రోజుల్లో అనేక రాష్ట్రాలు నీటికొరతను ఎదుర్కొనే అవకాశమున్నా పోలవరం ప్రాజెక్టు పుణ్యమాని ఆంధ్రప్రదేశ్ మాత్రం మేలైన స్థితిలో ఉంటుందన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్న బృంద సభ్యుల పర్యటన జోరువానలోనూ కొనసాగింది. ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించిన బృందానికి ఎస్ఈ రమేష్‌బాబు పనుల వివరాలను తెలియజేశారు. ప్రాజెక్టు నమూనాను తిలకించిన వారికి జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని వివరించారు. చైనాలోని త్రీగోర్జెస్ ప్రాజెక్టు కంటే మిన్నగా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 50 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లేలా రూపకల్పన చేసినట్లు వివరించారు. ప్రాజెక్టు కోసం సేకరించిన భూములు, పునరావాస కాలనీలకు సంబంధించి కలెక్టరు కాటంనేని భాస్కర్‌ను బృందం ఛైర్మన్ హుకుంసింగ్ ఆరాతీశారు. అనంతరం ప్రాజెక్టు హిల్‌వ్యూ కొండపై నుంచి స్పిల్‌వే, ఎర్త్ కమ్ ర్యాక్‌ఫిల్ డ్యామ్ ప్రదేశాలను గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. పవర్‌ప్రాజెక్టు ప్రదేశాన్ని అక్కడినుంచే చూపించారు. గేట్ల తయారీ కేంద్రం వద్ద కార్మికులతో మాట్లాడారు. అక్కడి నుంచే ప్రాజెక్టు కుడికాలువపై నిర్మించిన డెలివరీ సిస్టంను పరిశీలించారు. పర్యటనలో కమిటీ సభ్యులు వి.సత్యభామ, అపురూప పొద్దార్, మాగంటి మురళీమోహన్, సర్దార్ బల్వీందర్‌ఎస్.భండార్, హర్షవర్ధన్ సింగ్, రాపోలు ఆనంద్‌భాస్కర్, ప్రదీప్ తమ్టా, సిద్దార్థ్ మహాపాత్ర, ఎంపీ మాగంటి బాబు, మంత్రులు దేవినేని ఉమ, పితాని సత్యనారాయణ, పోలవరం అథారిటీ కార్యదర్శి ఆర్‌కెగుప్తా, తదితరులు ఉన్నారు.

దేశానికి అన్నంపెట్టే ప్రాజెక్టు.. న్యాయం చేయండి: ముఖ్యమంత్రి చంద్రబాబు.. అంతకు ముందు శుక్రవారం ఉదయం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో హుకుంసింగ్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగు కమిటీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయింది. ఈ సందర్భంగా సీఎం వర్చువల్ విధానంలో పోలవరం ప్రాజెక్టు పనులను కమిటీలోని ఎంపీలకు, అధికారులకు చూపించారు. పోలవరం ప్రాజెక్టు దేశానికే ప్రధానమైన ప్రాజెక్టు అని, రాబోయే 50 ఏళ్లలో దేశ ఆహార అవసరాలకు ఇది ఎంతో కీలకమైందని ఆయన కమిటీకి వివరించారు. సంపూర్ణంగా సహకరించాలని విన్నవించారు. దాదాపు 40 నిముషాల పాటు ఆయన కమిటీకి వివిధాంశాలపై సమగ్ర సమాచారం అందించారు. ఈ కమిటీ బాధ్యాతాయుతమైనదని, ప్రాజెక్టులపైనే కాక దేశంలోనే జల నిర్వహణపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించాలని విన్నవించారు.



ధర 'ఇసుక'ంతయు తగ్గలేదు

(మొదటి పేజీ తరువాయి)

దానిపై పరిష్కార వేదిక ద్వారా రాష్ట్రంలోని కొంత మంది ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించింది. మొత్తం 86,175 మంది తమ అభిప్రాయాలను అధికారులకు వెల్లడించారు. 29,287 మంది ఇసుక ధరలు తగ్గలేదని తెలిపారు.

అవినీతికి అడ్డుకట్ట పడలేదు..

ఇసుక సరఫరాలో అవినీతికి అడ్డుకట్ట పడలేదని 50% మంది ప్రజలు తెలిపారు. మరో 9% మంది తమకు తెలియదని చెబితే.. 41% మంది మాత్రం సరఫరాలో అవినీతి లేదని తెలిపారు. ఇసుక ధరను నియంత్రించాంటే ప్రభుత్వం ఏంచేయాలన్న ప్రశ్నకు 45% మంది ప్రభుత్వమే ఇసుక ధరను నియంత్రించాలని చెప్పారు. 19% మంది ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని తెలిపారు. అయితే ఇసుక ధరల అదుపునకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై 73% మంది సంతృప్తి ప్రకటించడం గమనార్హం. చర్యలు బాగా లేవన్న వారిలో 36% మంది ఇసుక మాఫియాను ప్రభుత్వం అరికట్టలేకపోతోందని అభిప్రాయపడ్డారు. మరో 18% మంది ధరలు నిర్ణయించడంలో పారదర్శకత లేదన్నారు. ఇసుక ధరల నియంత్రణకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలు నియమిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని 84% మంది స్వాగతించారు. గత వారానికి ఈ వారానికి మధ్య ఇసుక అంశంపై ప్రజల్లో సంతృప్తి సూచి 23% పెరిగిందని ఈ అధ్యయనం పేర్కొంది. గత వారం ఇసుక విధానంపై 58% మంది ప్రజలు సంతృప్తిని ప్రకటిస్తే ఈ వారం అది 82 శాతానికి పెరిగింది. విశాఖపట్నం, విజయనగరం, కడప, గోదావరి జిల్లాల్లో పరిస్థితి మెరుగ్గా లేదని అక్కడ మరింత దృష్టి సారించాలని ఈ అధ్యయనం పేర్కొంది.

ఇసుకపై సర్వే ఇలా

మొత్తం ప్రయత్నించిన ఫోన్ నంబర్లు	: 6,61,325
అందుబాటులోకి వచ్చినవారు	: 2,58,474
అభిప్రాయాలు చెప్పినవారు	: 86,175

ఇసుక సరఫరాలో అవినీతి జరుగుతోందా?

స్పందించిన వారు	: 53,414
జరుగుతోంది	: 26,969
జరగడం లేదు	: 21,703
తెలియదు	: 4,742

'ఉచిత ఇసుక పథకం' వచ్చాక ధరలు తగ్గాయా?

స్పందించినవారు మొత్తం	: 60,851
తగ్గాయి	: 27,088
తగ్గలేదు	: 29,287
ఫరవాలేదు	: 4,476

(జిల్లాల వారీగా గణాంకాలు శాతాల్లో)

జిల్లా	తగ్గలేదు	తగ్గాయి	ఫరవాలేదు
అనంతపురం	49	44	7
చిత్తూరు	52	41	7
తూర్పు గోదావరి	51	42	7
గుంటూరు	43	49	8
కడప	49	44	7
కృష్ణ	41	50	9
కర్నూలు	55	38	7
నెల్లూరు	41	52	7
ప్రకాశం	44	48	8
శ్రీకాకుళం	44	48	8
విశాఖపట్నం	59	34	7
విజయనగరం	44	50	6
పశ్చిమ గోదావరి	48	43	9

కేంద్రం ఇవ్వాల్సిన నిధులు ఇచ్చేలా చూడండి

ఈనాడు అమరావతి: ఆకర్షణీయ నగరంగా ఎంపికైన అమరావతికి కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.500 కోట్లు త్వరగా విడుదలయ్యేలా కృషి చేయడంతో పాటు, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, రుణాల ద్వారా మరో రూ.874 కోట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని దిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్‌ను సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ కోరారు. జాతీయ రహదారుల ప్రాజెక్టు ఐదో దశలో మంజూరైన విజయవాడ బైపాస్ రోడ్డుని ప్రస్తుత రాజధాని అవసరాలకు అనుగుణంగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్ ప్రకాశ్ శుక్రవారం రాజధాని ప్రాంతాన్ని సందర్శించారు. అమరావతిలో నిర్మాణంలో ఉన్న వివిధ విద్యా సంస్థలన్ని పరిశీలించారు. విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్ చెరుకూరి శ్రీధర్, ప్రత్యేక కమిషనర్ రామమనోహరరావు తదితరులతో సమావేశమయ్యారు. రాజధాని నిర్మాణ పురోగతిని శ్రీధర్ వివరించారు. రాష్ట్ర విభజన చట్టాన్ని అనుసరించి రాజధానిలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాల్సి ఉందని, వివిధ సంస్థలతో సంప్రదించి నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు.

రాజధానిలో 8 స్టార్ హోటళ్లు!

- ఎకరం రూ.3 కోట్లు చొప్పున కేటాయింపు
- టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలి దశలో ఎనిమిది స్టార్ హోటళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో మూడు పరిపాలన నగరంలో రానున్నాయి. రాజధానిలో స్టార్ హోటళ్ల నిర్మాణానికి దరఖాస్తులు (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్-ఆర్ఎఫ్‌పీ) ఆహ్వానిస్తూ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) శుక్రవారం టెండరు ప్రకటన విడుదల చేసింది. 2 ఐదు నక్షత్రాలు(ఫైవ్ స్టార్), 2 నాలుగు నక్షత్రాలు, 4 మూడు నక్షత్రాల హోటళ్ల ఏర్పాటుకి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. ఐదు నక్షత్రాల హోటల్‌కి 4 ఎకరాలు, నాలుగు నక్షత్రాల హోటల్‌కి 2 ఎకరాలు, మూడు నక్షత్రాల హోటల్‌కి ఎకరం చొప్పున కేటాయిస్తామని తెలిపింది. ఎకరం ధరను రూ.3 కోట్లుగా నిర్ణయించింది.

అర్హత నిబంధనలు.. రాజధానిలో స్టార్ హోటళ్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ గతంలో టెండర్లు పిలిచింది. అప్పట్లో భూమి ధరను ముందే నిర్ణయించకుండా.. ఎవరు ఎక్కువ ధరకు కోట్ చేస్తే వారికి భూమి కేటాయించే ప్రాతిపదికన టెండర్లు ఆహ్వానించింది. స్పందన పెద్దగా లేకపోవడంతో స్టార్ హోటళ్లకు భూ కేటాయింపు విధానంలో మార్పులు చేసింది. ఈసారి భూమి ధరను ముందే నిర్ణయించి టెండర్లు ఆహ్వానించింది. గతంలో ఇలాంటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయడం, నిర్వహణల పరంగా ఆయా సంస్థలకు ఉన్న అనుభవం, ఏ సంస్థలతో వారికి అవగాహన(బ్రాండింగ్) ఉంది... అన్న అంశాల్ని అర్హతలుగా నిర్ణయించింది. టెండరు దరఖాస్తులు దాఖలు చేసిన సంస్థలకు ఈ మూడు అంశాల వారీగా మార్కులు వేస్తుంది. ఎక్కువ మార్కులు వచ్చిన సంస్థలకు స్థలాలు కేటాయిస్తుంది. ఇప్పుడు టెండర్లు పిలిచిన 8 స్టార్‌హోటళ్లలో మూడు పరిపాలన నగరంలో నిర్మించాలని నిర్ణయించారు. ప్రతి కేటగిరీలో ఒకటి చొప్పున మూడు స్టార్ హోటళ్లను ఏర్పాటుచేయనున్నారు. మిగతా ఐదు స్టార్‌హోటళ్లకు రాజధానిలో వేర్వేరుచోట్ల స్థలాలు కేటాయిస్తారు.

ఓటర్లకు డబ్బులు పంచుతున్న నాయకులు

- 47 మంది వైకాపా, అయిదుగురు తెదేపా నాయకుల నుంచి రూ. లక్షలు స్వాధీనం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల పరిధిలో శుక్రవారం ఓటర్లకు డబ్బు పంచుతూ 47 మంది వైకాపా నాయకులు, అయిదుగురు తెదేపా నాయకులు పట్టుబడ్డారు. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ప్రాంతంలో 25 మంది వైకాపా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.4,02,030 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఏడుగురు వైకాపా నాయకుల నుంచి రూ.1.88 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో వైకాపాకు చెందిన అయిదుగురి నుంచి రూ.ఐదున్నర లక్షలు, తెదేపా నాయకులు ఐదుగురి నుంచి రూ.34,500 స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. మండలంలోని అయ్యలూరులో వైకాపాకు చెందిన అయిదుగురి నుంచి రూ.18వేలు, చాపిరేవులలో వైకాపాకు చెందిన అయిదుగురి నుంచి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలకు రూ.వందల కోట్లు తరలిస్తున్నారన్న అనుమానంతో మహానంది వద్ద ఓ కంటైనర్‌ను గ్రామస్థులు అడ్డుకున్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తెరిచిచూడగా అందులో తినుబండారాల వస్తువులు ఉన్నాయి.

అందరికీ పద్మ అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

చేసేవారని, తమ ప్రభుత్వ హయాంలో ఎవరైనా ప్రతిపాదించే అవకాశం కల్పిస్తున్నట్టు ప్రధాని మోదీ ప్రకటించారు కూడా. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ఎంపీలు, కేంద్ర మంత్రులు, భారత రత్న, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీతలు కూడా పేర్లను సిఫార్సు చేయవచ్చు. ప్రధానమంత్రి ఏర్పాటు చేసే పద్మ పురస్కారాల కమిటీ వీటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తుంది. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం రోజున పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేయనున్న విషయం విదితమే.

ఒడిశా తీరాన అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఒడిశా తీరాన్ని ఆనుకుని బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ వెల్లడించింది. ఇది సముద్రమట్టానికి 9.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసి ఉందని తెలిపింది. దీని ప్రభావంతో శనివారం కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లుఅధికారులు చెబుతున్నారు. మరోపక్క కోస్తా, రాయలసీమ మీదుగా ఉన్న ద్రోణి అలాగే కొనసాగుతోంది.

నంద్యాలలో కాసుకో

(మొదటి పేజీ తరువాయి)

నిలిచిపోనుంది. ఒకప్పుడు గిరాకీ లేక మూసేద్దామనుకున్న హోటల్‌లోనూ రెండు, మూడు వందల భోజనాల వ్యాపారం సాగుతోందంటే రద్దీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హోటళ్లలో అద్దెకు గదులు దొరకకపోవడంతో అటు మహానంది, ఇటు కర్నూలులోనూ బస చేసి ఇక్కడికి రాకపోకలు సాగిస్తున్నారు.

పెరిగిన ఎన్నికల వేడి

ఉపఎన్నికల పోలింగ్ 23న జరగనున్నందున 21మధ్యాహ్నానికి ప్రచారానికి బ్రేక్ పడనుంది. మిగిలింది మూడు రోజులే కావడంతో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపాలు ప్రచారాన్ని వేడెక్కిస్తున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసిన పార్టీల జెండాలు కనిపిస్తున్నాయి. నేతల ప్రసంగాలు, ఇంటింటి ప్రచారాలతో వీధివీధి హోరెత్తుతోంది. తెదేపా తరపున శుక్రవారం పది మంది మంత్రులు ప్రచారంలో పాల్గొన్నారు. అఖిలప్రియ, కాల్వ శ్రీనివాసులు, అమర్‌నాథ్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శిద్దా రాఘవరావు కొన్ని రోజుల నుంచి నంద్యాలలోనే మకాం వేశారు. మూడు రోజులుగా నక్కా ఆనందబాబు, తాజాగా పరిటాల సునీత, గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ ప్రచారానికి వచ్చారు. వీరు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, స్థానిక సంస్థల అధ్యక్షులు, ఛైర్మన్లు ఉన్నారు. నేతలు ఎవరికి వారు తమకు పరిచయం ఉన్న స్థానిక నేతలతో కలిసి వార్డులు, గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. శని, ఆదివారాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇక్కడ పర్యటించనున్నారు. వైకాపా తరపున ఆపార్టీ అధినేత జగన్ ఈనెల 9నుంచి ఇక్కడే మకాం వేసి ప్రచారం చేస్తున్నారు. నంద్యాల గ్రామీణం, గోస్పాడు మండలాల్లో మూడు రోజుల్లో ప్రచారం పూర్తి చేసిన ఆయన నంద్యాలలోనే తిష్ఠవేశారు. పురపాలక ఎన్నికలను తలపించేలా వార్డులు, ప్రాంతాలవారీగా ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే రోజా ఇప్పటికే తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రధాన నాయకులు దాదాపు 30 మంది వరకు గ్రామాలు, పట్టణంలో మకాం వేసి వ్యూహాలను రచిస్తున్నారు.

ఉద్రిక్తంగా గ్రామాలు

ప్రతిష్ఠాత్మకంగా సాగుతున్న ఈ ఉపఎన్నిక కారణంగా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో 255 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిలో అత్యంత సమస్యాత్మక కేంద్రాలు 141 ఉన్నాయి. సమస్యాత్మకం 74 ఉన్నాయి. ఈ లెక్కన దాదాపు 215 పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉంది. నంద్యాల గ్రామీణం, గోస్పాడు మండలాలలోని పలు గ్రామాల్లో రెండు వర్గాల మధ్య పోరు తీవ్రంగా ఉంది. పరిస్థితి సున్నితంగా మారడంతో ఏ వర్గానికి చెందిన వారు సైతం నోరు విప్పడం లేదు. ప్రజల నాడి తెలియడం లేదు. మౌనంగా ఉంటున్న ఓటరు తీర్పు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

ప్రాంగణ నియామకాల్లో మందగమనం

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలల్లో ఈసారి ప్రాంగణ నియామకాలు మందకొడిగా జరుగుతున్నాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఎంపిక చేసుకునే కంపెనీలు ఇంకా రంగంలోకి దిగలేదు. మరికొన్ని వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నాయి. ఆటోమేషన్ ప్రభావం.. ప్రాజెక్టులు దక్కే పరిస్థితిపై ఇప్పటికీ అంచనాకు రాకపోవడంతో ప్రాంగణ నియామకాల సంఖ్య నిరుటిలాగే ఈ ఏడాదీ తగ్గనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొన్ని కంపెనీలు మాత్రం ఎంపికయ్యే ఉద్యోగుల సంఖ్య తగ్గదని పైకి చెబుతున్నా వాస్తవం అందుకు భిన్నంగా ఉంది.

ఏటా ఆగస్టు వచ్చిందంటే ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రాంగణ నియామకాల సందడి జోరుగా ఉండేది. ఈసారి అది నెమ్మదించింది. ప్రతిభావంతులైన వారిని ఎంపిక చేసుకునేందుకు పరిశ్రమలు పోటీపడుతుంటాయి. ఈసారి ఆ పోటీ పెద్దగా కనిపించడం లేదు. కొన్ని ఉత్పాదక సంస్థలు చేపడుతున్నా ఎంపిక చేసుకునే వారి సంఖ్య తగ్గినట్లు కళాశాలల ప్రాంగణ నియామకాల అధికారులు చెబుతున్నారు. అత్యధిక సంఖ్యలో అభ్యర్థులను తీసుకొనే కంపెనీలు ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో తదితర పరిశ్రమలు సెప్టెంబరు లేదా అక్టోబరు నుంచి నియామకాలు ప్రారంభిస్తామని సమాచారం ఇచ్చినట్లు వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జేఎన్‌టీయూహెచ్, ఓయూ, మరికొన్ని అగ్రశ్రేణి ప్రైవేటు కళాశాలల్లో ప్రాంగణ నియామకాలు జరుగుతున్నాయి. ఈసారి వాటి సంఖ్య తగ్గుతుందని ఇప్పటికే నాస్కామ్ అంచనా వేసింది. ప్రాంగణ నియామకాల సంఖ్య తగ్గితే ద్వితీయ శ్రేణి కళాశాలల్లో ఎంపికలపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. గత ఏడాది 150 మందిని ఎంపిక చేసుకున్న ఓ ప్రముఖ పరిశ్రమ ఈసారి ఇప్పటివరకు కేవలం 20 మందినే ఎంపిక చేసుకోనుంది. అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలిచ్చే కంపెనీలు కొన్ని ఈసారి ఎంపిక చేసుకొనే వారి సంఖ్య తగ్గవచ్చని సమాచారం ఇచ్చాయని ఎంవీఎస్ఆర్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి ప్రసన్నకుమార్ తెలిపారు. అమెరికా లాంటి దేశాల నుంచి ప్రాజెక్టుల రాకపై స్పష్టత లేదు. దీంతో కంపెనీలు వేచిచూసే ధోరణిని అనుసరిస్తున్నాయి. 'ప్రస్తుతం పరిస్థితి మందకొడిగానే ఉంది. నవంబరు, డిసెంబరు నాటికి ఊపందుకోవచ్చు. మూడేళ్ల క్రితం ఆగస్టులోనే ముమ్మరంగా ఎంపికలు ఉండేవి' అని బీవీఆర్ఐటీ కళాశాల ప్రాంగణ నియామకాల విభాగం సంచాలకుడు సతీష్ చంద్ర తెలిపారు. ఆరేడు సంవత్సరాలుగా వేతన ప్యాకేజీలు పెరగడం లేదు. అత్యధిక సంఖ్యలో ఎంపిక చేసుకునే కంపెనీలు ఒక్కో అభ్యర్థికి వార్షిక వేతనం రూ.3 లక్షల నుంచి 3.50 లక్షల వరకు ఇస్తున్నాయి. ఆ వేతనం 2010 నుంచీ అదే స్థాయిలో ఉందని చెబుతున్నారు. రూ.10 వేలు, రూ.20 వేలు తప్ప పెరిగిందేమీ లేదని ప్రాంగణ నియామకాల అధికారులు పేర్కొంటున్నారు. తక్కువ సంఖ్యలో ఉద్యోగులను ఎంపిక చేసుకునే ఓ ప్రముఖ ఉత్పాదక సంస్థ ఇచ్చే వేతనం రూ.11 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్యే కొనసాగుతోంది. డిజిటల్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సోషల్ మీడియా తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో పనిచేసే కంపెనీలు మాత్రం ఈసారి 5-10 శాతం వేతనాలను పెంచుతున్నాయని నారాయణమ్మ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి నరేంద్రబాబు తెలిపారు.

ఈ ఏడాది గరిష్ఠంగా 1.50 లక్షల ఉద్యోగాలే

దేశంలోని ఐటీ ఉద్యోగుల సంఖ్య, ఏటా కొత్తగా చేరుతున్న వారి సంఖ్య (లక్షల్లో)ఇలా ఉన్నాయి..

సంవత్సరం	మొత్తం ఉద్యోగులు	కొత్త కొలువుల కల్పన
2014-15	34.85	2.17
2015-16	36.88	2.03
2016-17	38.63	1.75
2017-18	----	1.30 నుంచి 1.50 (నాస్కామ్ అంచనా)

చేతివాటానికి వాతలేవి?

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠ చిల్లర ధరను రూ.54,720గా, ఆక్సిడైజ్డ్ జిర్కోనియం ఔషధంతో కూడిన టైటానియం కృత్రిమ కీలు గరిష్ఠ ధరను రూ.76,600గా, కదలికలకు అనువుగా బాగా వంగే రకం కృత్రిమ కీలు ధరను రూ.56,490గా కేంద్రం నిర్ణయించింది.

ప్యాకేజీలతోనే సమస్య.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సను మొత్తం 'ఒక ప్యాకేజీ'గా అమలు చేస్తున్నారు. ఉదాహరణకు ఒక పేరున్న కార్పొరేట్ ఆసుపత్రిలో ఇద్దరుండే భాగస్వామ్య గదిలో చికిత్స పొందితే మోకీలు మార్పిడికి ప్రస్తుతం రూ. 1.80 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఇందులో సాధారణంగా వినియోగించే విదేశీ కృత్రిమ మోకీలు పరికరం ఖరీదు రూ. 90 వేలుగా చెబుతున్నారు. ఇదే పరికరంతో ఒకవేళ ఒక్కరుండే గది తీసుకుంటే రూ. 2.25 లక్షలు, డీలక్స్ గదిలో ఉంటే రూ. 2.75 లక్షలు.. సూట్ గది అయితే రూ. 3.25 లక్షలుగా వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు పరికరం ధర రూ.54 వేలకు తగ్గింది. అంటే చికిత్స ధరలో దాదాపుగా రూ.36 వేల నుంచి 55 వేల మేరకు తగ్గాలి. అయితే ఇక్కడే కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి. పరికరాల ధరల్లో తగ్గిన మొత్తాన్ని చికిత్స ధరల్లో పూడ్చుకుంటున్నాయి. స్టెంట్ల విషయంలో అచ్చంగా ఇలాగే జరిగింది. తగ్గించిన పరికరాల ధరలను బిల్లులో అలాగే వేస్తూ.. శస్త్రచికిత్స గది, ఐసీయూ, వైద్యులు, సహ వైద్యులు, నర్సులు, సాధారణ గది.. ఇలా ఇతర సేవల ధరలను అనూహ్యంగా పెంచేస్తున్నాయి. దీంతో చికిత్స ధర తగ్గుతుందని ఆశించిన రోగులకు భంగపాటే ఎదురవుతోంది. ఔషధ నియంత్రణాధికారులు కేవలం ధరల అమలుపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఆసుపత్రుల్లో ఇష్టానుసారంగా పెంచే ధరలపై నియంత్రణ లేకపోవడంతో.. ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

ఇప్పటికే ఆ ధరలు అమలు



మన దగ్గర కృత్రిమ మోకీలు పరికరాల ధరలు రూ.లక్షల్లో లేవు. నా 17 ఏళ్ల శస్త్రచికిత్స సేవల్లో ఎన్నడూ రూ.4 లక్షల విలువైన పరికరాన్ని వాడలేదు. రూ.2 లక్షలు విలువైన పరికరాలను ఏడాదికి 500 వరకూ చేస్తుంటా. మిగిలినవన్నీ కూడా రూ.75-90 వేల ఖరీదువే. తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల రోగికి మరికొంత వెసులుబాటు లభిస్తుంది.

–డాక్టర్ గురవారెడ్డి, ప్రముఖ మోకీలు మార్పిడి నిపుణులు

రోగికి ప్రయోజనం కలిగినప్పుడే..



ప్రభుత్వం ధరలు నియంత్రించడం హర్షణీయం. అయితే తగ్గించిన ధరల వల్ల రోగులకు ప్రయోజనం కలగాలి. ఆసుపత్రిలో చికిత్స ధర తగ్గాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని అమలుచేయాలి. అలాకాకుండా మరోరూపంలో లోటును భర్తీ చేసుకోవాలని ప్రయత్నిస్తే.. ప్రభుత్వమే ఆసుపత్రుల్లో సేవల ధరల నియంత్రించడంపైనా దృష్టిపెట్టడానికి అవకాశాలున్నాయి.

–డాక్టర్ నరేంద్రనాథ్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, నిమ్స్ మాజీ సంచాలకులు

ఒకే గాటన కట్టొద్దు



కృత్రిమ మోకీలు పరికరాలను ప్రభుత్వం అత్యవసర ఔషధాల జాబితాలోకి చేర్చింది. ఇది మంచి పరిణామం. అయితే అన్ని ఉత్పత్తులనూ ఒకే గాటన కట్టడం సరైంది కాదు. అలాగే వైద్యసేవల్లోనూ ఆసుపత్రుల స్థాయిలను బట్టి గ్రేడ్‌లను నిర్ణయించాలి. వాటి ఆధారంగా ప్రభుత్వమే ధరలను నియంత్రించవచ్చు.

–డాక్టర్ కృష్ణయ్య, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్

గ్రహం అనుగ్రహం

19–8–2017 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; బహుళ పక్షం
ద్వాదశి: ఉ. 6-10 తదుపరి త్రయోదశి
తె. 3-59 తదుపరి చతుర్దశి
పునర్వసు నక్షత్రం: రా. 7-21 తదుపరి పుష్యమి
అమృతఘడియలు: సా. 5-05 నుంచి 6-35 వరకు
వర్జ్యం: ఉ. 8-06 నుంచి 9-36 వరకు
తిరిగి రా. 2-53 నుంచి 4-24 వరకు
దుర్ముహూర్తం: ఉ. 5-47 నుంచి 7-28 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ. 5-46; సూర్యాస్తమయం: సా. 6-21
శని త్రయోదశి

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	23.9	26.1
తాడేపల్లిగూడెం	24.0	27.0
గుంటూరు	24.0	28.0
సూర్యాపేట	24.0	33.0
రామగుండం	24.4	26.6
తిరుపతి	24.5	34.2
నరసాపురం	24.7	29.4
శ్రీకాకుళం	25.0	33.0
ఖమ్మం	25.0	35.0
అనంతపురం	25.1	33.3
రాజమహేంద్రవరం	25.5	28.0
విశాఖపట్నం	25.8	28.6
ఒంగోలు	25.8	31.1
కర్నూలు	25.9	30.9
కడప	26.0	33.0
నెల్లూరు	26.0	35.0
విజయవాడ	26.4	27.7


బాలల హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గంటా హైమావతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఛైర్‌పర్సన్‌గా విజయనగరం జిల్లాకు చెందిన గంటా హైమావతిని నియమించారు. పీవీవీ ప్రసాద్(శ్రీకాకుళం), వీఎస్‌వీ క్రిష్ణ కిశోర్(విజయవాడ), వి.గాంధీబాబు(తూర్పుగోదావరి), కె.అప్పారావు(విజయనగరం), వై.రాజేశ్వరమ్మ(కర్నూలు జిల్లా నంద్యాల), పి.పద్మలత(గుంటూరు)లను సభ్యులుగా నియమించినట్లు రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో వెల్లడించారు. వీరు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మూడేళ్లపాటు లేదా ఛైర్‌పర్సన్ అయితే 60ఏళ్ల వయసు, సభ్యులైతే 65ఏళ్ల వయస్సు ఏది ముందైతే అప్పటి వరకూ పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.

ఈసీ నిర్ణయంపై హైకోర్టులో సవాలు

అహ్మదాబాద్: ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాన్ని సవాలు చేస్తూ గుజరాత్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో ఓడిపోయిన భాజపా అభ్యర్థి బల్వంత్ సిన్హ్ రాజ్‌పుట్ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. ఇద్దరు కాంగ్రెస్ తిరుగుబాటు ఎమ్మెల్యేలు వేసిన ఓట్లను అనర్హమైనవిగా ఎన్నికల సంఘం ప్రకటించడాన్ని ఆయన తప్పుపట్టారు.

వెస్టింగ్‌హౌస్ అణు విద్యుత్‌కు షాక్


అమెరికా దక్షిణ కరోలిన రాష్ట్రంలో మధ్యలోనే పనులు ఆపేసిన అణు విద్యుత్కేంద్రం

◆ అమెరికాలో కర్మాగార నిర్మాణ పనుల్ని ఆపేసిన కంపెనీలు
◆ పనుల్లో జాప్యం, అసాధారణ ఖర్చువల్లే నిర్ణయం

ఏపీ కొవ్వాడలో పెట్టబోతున్నదీ ఇలాంటి విద్యుత్కేంద్రమే

ఈనాడు - హైదరాబాద్

అమెరికాలో నిర్మాణంలో ఉన్న భారీ అణు విద్యుత్ కర్మాగారాన్ని మధ్యలో ఆపేయాలని సంబంధిత సంస్థలు కొద్దిరోజుల కిందట నిర్ణయించడం ప్రపంచ అణువిద్యుత్ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడలో నిర్మించతలపెట్టిన భారీ అణువిద్యుత్ కర్మాగారం, అమెరికాలో ఇప్పుడు మధ్యలోనే పని ఆపేసిన కర్మాగారం ఈ రెండూ కూడా 'వెస్టింగ్‌హౌస్' అనే కంపెనీతో, అది అభివృద్ధిచేసిన సాంకేతిక పరిజ్ఞానంతో ముడపడి ఉన్నవి కావడం గమనార్హం. వెస్టింగ్ హౌస్ ద్వారా కొవ్వాడలో దశలవారీగా ఏర్పాటు చేయదల్చుకుంది ఆరు అణు రియాక్టర్లతో కూడిన 7248 మెగావాట్ల అతిభారీ ప్రాజెక్టు. దీనికి మొత్తం లక్షా నలభై వేల కోట్లకు పైగా ఖర్చవుతుంది. అమెరికాతో కుదుర్చుకున్న అణు ఒప్పందంలో భాగంగా కొవ్వాడలో ప్రాజెక్టును నిర్మించదలపెట్టిన సంగతి తెలిసిందే. అమెరికా తాజా అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు భారత్ పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది.

వెస్టింగ్‌హౌస్‌కు ఏమయింది?

అమెరికాకు చెందిన వెస్టింగ్ హౌస్ కంపెనీ అణు రియాక్టర్లను అభివృద్ధి చేసే, కర్మాగారాల్ని నిర్మించి ఇచ్చే వ్యాపారంలో ఉంది. పదేళ్ల నుంచి ఈ కంపెనీ జపాన్‌కు చెందిన తొషిబా యాజమాన్యంలో ఉంది. ఇది కొత్తగా అభివృద్ధిచేసిన ఏపీ 1000 అణురియాక్టర్లతో అమెరికాలోని దక్షిణ కరోలిన, జార్జియా రాష్ట్రాల్లో విద్యుత్ కర్మాగారాల్ని నిర్మించుకునేందుకు కొన్ని సంస్థలకు పనులు అప్పగించింది. ఈ పనులు చేసే క్రమంలో వెస్టింగ్ హౌస్ తీవ్ర నష్టాల పాలై దివాలా పిటిషన్‌ను కోర్టులో వేసుకుంది. వెస్టింగ్ హౌస్ ద్వారా దక్షిణ కరోలినలోని జెన్‌కిన్స్‌విల్లేలో ఒక్కొక్కటి 1117 మెగావాట్ల సామర్థ్యంగల రెండు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టిన దక్షిణ కరోలిన విద్యుత్..గ్యాస్ కంపెనీ, శాంటీకూపర్ అనే సంస్థలు తమ ప్రాజెక్టును మధ్యలోనే ఆపేయాలని నిర్ణయించాయి. ఈ రెండు సంస్థల్లో శాంటీకూపర్ అనేది దక్షిణ కరోలిన ప్రభుత్వ సంస్థ. ప్రాజెక్టులో దానికి 45 శాతం వాటా ఉంది. మొత్తం ప్రాజెక్టు 11.45 బిలియన్ల డాలర్లలో పూర్తవుతుందని 2009లో అంచనా వేశారు(దీనిని ప్రస్తుతం రూపాయల్లోకి మారిస్తే 73,417 కోట్లు అవుతుంది). అనేక కారణాలతో పనులు ఆలస్యంగా జరుగుతూవచ్చాయి. అమెరికా ప్రభుత్వ అణు నియంత్రణ సంస్థ విధించిన ప్రమాణాలకు అనుగుణంగా రియాక్టర్ల డిజైన్లలో, విడిభాగాల రూపకల్పనలో పలు మార్పులు చేయాల్సి వచ్చింది. ఫలితంగా వ్యయాలు పెరిగిపోయాయి. ఇప్పటివరకూ దాదాపు 9.6 బిలియన్లు(రూ.61555 కోట్లు) ఖర్చయ్యాయి. పనులు సగం కూడా జరగలేదు. ప్రాజెక్టు పూర్తి కావాలంటే ఇంకా అదనంగా 11.7 బిలియన్లు(రూ.75,020 కోట్లు) ఖర్చవుతుందని అంచనా. అంతేకాకుండా ప్రాజెక్టు 2024లోపు పూర్తయ్యే పరిస్థితి లేదు. తన వాటాగా ఇప్పటికే 4.7 బిలియన్లను ఖర్చుపెట్టిన శాంటీకూపర్ తాజా పరిస్థితిని మదింపుచేసుకుని.. ప్రాజెక్టు పూర్తి కావాలంటే మరో 7 బిలియన్లను తాను పెట్టాల్సి ఉంటుందని అధికారికంగా ప్రకటించింది. అంత భారం భరించలేమని, అందువల్ల ప్రాజెక్టును ఆపేస్తున్నామని ప్రకటించింది. తద్వారా తమ ఖాతాదారులపై ఆ 7 బిలియన్ల భారం పడకుండా ఆదా అవుతుందని నిర్ధారణకు వచ్చినట్లు తెలిపింది. రెండో సంస్థ కూడా వెంటనే దీనిని అనుసరించింది.

భారాన్ని భరించలేకే..

ప్రాజెక్టును నిలిపేస్తూ సంబంధిత కంపెనీలు చేసిన తీర్మానాలను చూస్తే ప్రాజెక్టు పనులు, వ్యయాలు ఎంత అదుపులేకుండా పోయాయో తెలుస్తుంది. తమ వ్యయ నియంత్రణ కోసం ఈ రెండు కంపెనీలు వెస్టింగ్‌హౌస్‌తో 2015లో ఒక ఒప్పందానికి వచ్చాయి. ప్రాజెక్టు వ్యయాన్ని తొలుత అనుకున్న దాని కంటే పెంచి 13.9 బిలియన్ డాలర్లుగా నిర్ణయించుకున్నాయి. అప్పుడు నిర్ణయించిన వ్యయాల్లో ఇక మార్పు ఉండకూడదని, అది స్థిరమని అవగాహనకు వచ్చాయి. వెస్టింగ్‌హౌస్ దివాలా ప్రక్రియలోకి వెళ్లడంతో అది ఆ ఒప్పందానికి కట్టుబడకుండా ఉండేందుకు చట్టంలో వెసులుబాటు ఉంది. దీంతో వెస్టింగ్‌హౌస్ ఒప్పందాన్ని పాటించే అవకాశం లేదని సంబంధిత కంపెనీలు నిర్ధారణకు వచ్చాయి. పనులు అనుకున్న దానికంటే కంటే 75 శాతం అదనపు సమయం తీసుకుంటుండటం వాటిని కుంగదీశాయి. గత నెలలో వెస్టింగ్‌హౌస్ మాతృసంస్థ అయిన తొషిబా ఈ రెండు కంపెనీలకు తన వంతుగా రూ.2.2 బిలియన్ల పరిహారం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దానివల్ల కూడా పెద్దగా ఉపశమనం ఉండదని భావించిన కంపెనీలు పని ఆపేయాలని నిర్ణయించుకున్నాయి.

అమెరికా ప్రజలపై వేలకోట్ల భారం

అమెరికాలో ఏదైనా విద్యుత్ కర్మాగారం నిర్మాణానికి తొలుత బేస్ లోడ్ రివ్యూ యాక్ట్(బీఎల్ఆర్ఏ) ప్రకారం సంబంధిత రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కింద వ్యయ ప్రణాళికను కూడా సమర్పించి కంపెనీలు ఆమోదం పొందుతాయి. అవి ఏవైనా కారణాలతో మధ్యలో నిర్మాణాన్ని నిలిపివేస్తే పెట్టుబడి వ్యయాలను వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవచ్చు. నిలిపివేతకు కారణం ఆర్థికంగా సహేతుకమైనదేనని పబ్లిక్‌సర్వీసు కమిషన్ ఆమోదించాల్సి ఉంటుంది. ఎంత మొత్తాన్ని, ఎన్ని సంవత్సరాల్లో వసూలు చేసుకోవాలనేది కూడా ఒక విచారణ ద్వారా కమిషన్ నిర్ధారిస్తుంది. తాను పెట్టిన 4.9 మిలియన్ డాలర్ల వ్యయంలో ఆదాయపు పన్ను మినహాయింపులు, తొషిబా ఇచ్చే పరిహారం మినహా మిగిలిన 2.2 బిలియన్లను(14106 కోట్లు) ఖాతాదారుల నుంచి రాబోయే 60 సంవత్సరాల వ్యవధిలో వసూలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని దక్షిణ కరోలిన విద్యుత్తు, గ్యాస్ కంపెనీ చేసిన విజ్ఞప్తిపై ప్రస్తుతం ఆ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విచారణ జరుపుతోంది. రెండో భాగస్వామి కూడా కొంచెం తక్కువగా ఈ స్థాయి మొత్తమే ప్రజల నుంచి వసూలు చేసుకునే అవకాశం ఉంది.

జార్జియాలోని ప్రాజెక్టు పరిస్థితీ అంతే...

అమెరికాలోని మరో రాష్ట్రమైన జార్జియాలో వెస్టింగ్ హౌస్ ద్వారా రెండు రియాక్టర్లతో మరో భారీ అణు విద్యుత్ కేంద్రం నిర్మాణంలో ఉంది. దాని పరిస్థితీ ఇలానే ఉంది. దానినీ త్వరలోనే ఆపేసే అవకాశం ఉందని అక్కడి అణువిద్యుత్ వర్గాలు భావిస్తున్నాయి. అమెరికాలోని త్రీమైల్ ఐలాండ్ అణువిద్యుత్ కేంద్రంలో 1979లో ప్రమాదం జరిగాక 30 ఏళ్లపాటు అణువిద్యుత్ కేంద్రాల స్థాపనకు విరామం ప్రకటించారు. ఆ తర్వాత మొదటగా వెస్టింగ్‌హౌస్ ద్వారా చేపట్టిన ప్రాజెక్టుల కథ ఇలా పరిణమించింది.

భారత్ గమనించాల్సిన కీలక అంశాలు

- దక్షిణ కరోలినలో వెస్టింగ్ హౌస్ ఏ రకమైన ఏపీ1000 సాంకేతిక పరిజ్ఞానంతో రియాక్టర్ల పనులను చేపట్టిందో అవే రియాక్టర్లతో కొవ్వాడలో కర్మాగారం నిర్మించాలని భారత్ నిర్ణయించుకుంది. ఈ రియాక్టర్లతో అమెరికాకు ఎదురైన చేదు అనుభవమే భారత్‌కూ ఎదురైతే అంతటి వృథా వ్యయాలను భరించడం ప్రజలకు చాలా కష్టమవుతుంది.
- తాము ప్రాజెక్టును తొలుత ప్రతిపాదించినప్పుడు సహజవాయువు ధరలు ప్రస్తుతంతో పోలిస్తే మూడురెట్లు ఎక్కువగా ఉన్నాయని, అవే అలాగే కొనసాగుతాయని నాడు అంచనా ఉందని శాంటీకూపర్ తన విశ్లేషణలో పేర్కొంది. సహజవాయువు ధరలే కాదు, చమురు ధరలు, సౌర, పవన వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే ధరలు నేడు బాగా తగ్గాయి. వీటిని దృష్టిలో పెట్టుకుంటే.. వేల కోట్లతో భారీ అణువిద్యుత్ ప్రాజెక్టు భారత్‌కు అవసరమా? అని ఆలోచించాలి.

ప్రణాళికలో మార్పు లేదు


జి.వి.రమేష్
కొవ్వాడ ప్రాజెక్టు డైరక్టర్

అమెరికాలో వెస్టింగ్‌హౌస్ ప్రాజెక్టు పరిణామాలను పరిశీలిస్తున్నామని, అది అభివృద్ధిచేసిన ఏపీ 1000 రియాక్టర్లతో కొవ్వాడలో అణువిద్యుత్ కర్మాగారం నిర్మించాలన్న ప్రణాళికలో మార్పు ఉండదని భారత అణువిద్యుత్ సంస్థ ఉన్నతాధికారి, కొవ్వాడ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.రమేష్ 'ఈనాడు'కు చెప్పారు. అమెరికాలో సహజవాయువు ధరలు బాగా తగ్గడంతో ఆ పరిస్థితి వచ్చిందని, మన వద్ద సహజవాయువుకు బాగా కొరత ఉందని వివరించారు. సహజవాయువు ఆధారంగా నిర్మించిన విద్యుత్ కార్మాగారాలను పూర్తి స్థాయిలో పనిచేయించలేని పరిస్థితి ఇక్కడ ఉందని అన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల విపరీతమైన కాలుష్యం వెలువడుతుందని, ప్రపంచంలో ప్రస్తుతం అనేక చోట్ల థర్మల్ కేంద్రాలను మూసివేస్తున్నారని చెప్పారు. మనం అణువిద్యుత్‌ను పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. వెస్టింగ్‌హౌస్ రియాక్టర్లతో చైనాలో చేపట్టిన అణువిద్యుత్ కేంద్రం త్వరలోనే ఉత్పత్తిని ప్రారంభించనుందని వివరించారు.

కృష్ణా బోర్డుకు లోగో సిద్ధం..

● 22న రెండు రాష్ట్రాల భేటీలో పరిశీలన, నిర్ణయం

ఈనాడు-అమరావతి: తెలుగు రాష్ట్రాల పరంగా కృష్ణా జలాలకు సంబంధించిన అంశాలను పరిష్కరించే కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు లోగో సిద్ధం చేస్తున్నారు. 2014 రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రంలో గోదావరి, కృష్ణానదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటయ్యాయి. ఛైర్మన్లు- కార్యదర్శులు, ఇతర సిబ్బందితో ఈ బోర్డులు పని చేయడం ప్రారంభించాయి. ఇంకా బోర్డు విధివిధానాలు, ప్రాజెక్టులను వీటి పరిధిలోకి తీసుకోవడం వంటి అంశాలు పెండింగులో ఉన్నాయి. కేంద్రం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయలేదు. ఈ బోర్డులు ఏర్పడి మూడేళ్లు దాటిపోయింది. ప్రస్తుతం కృష్ణాబోర్డుకు లోగో ఖరారు చేయబోతున్నారు. ఇప్పటికే ఈ బోర్డుకు అద్దంపట్టే రెండు ప్రతిపాదిత లోగోలను సిద్ధంచేసి ఏపీ, తెలంగాణలకు ఎజెండా ప్రతితో పాటు పంపారు. అంశాలు ఒకేలా ఉన్నా, రంగుల్లో మార్పులతో రెండు లోగోలను బోర్డు నమూనాగా ప్రతిపాదించింది. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల పటాలు, నాలుగు సింహాల బొమ్మ, అశోకచక్రంతో పాటు త్రాసును పొందుపరిచారు. సమానత(ఈక్వాలిటీ), ధర్మం(ఈక్విటీ), న్యాయం(జస్టిస్) అన్న పదాలతో ఈ బోర్డు ఉద్దేశాన్ని అందులో పొందుపరిచారు. వచ్చే 22న అమరావతిలో నిర్వహించనున్న కృష్ణా బోర్డు ఆరో సర్వసభ్య సమావేశంలో ఎజెండాలో ఇతరత్రా అంశాలతో పాటు ఈ లోగోపైనా చర్చ జరగనుంది. రెండు రాష్ట్రాల జలవనరులశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ సమావేశంలో లోగోపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రాష్ట్రానికి 18 కొత్త అగ్నిమాపక వాహనాలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర అవసరాల కోసం వివిధ రకాల 18 అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేస్తున్నట్టు విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల డైరెక్టర్ జనరల్ కె.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లా దర్శిలో ఇటీవల కొత్త అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించామని, పోలవరంలో కొత్తగా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదించామని అన్నారు. విశాఖ, అమరావతి అవసరాల కోసం 54 మీటర్ల హైడ్రాలిక్ ప్లాట్‌ఫాం కొనుగోలుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. అన్ని రకాల ప్రమాదాల్లో సేవలు అందించేలా ప్రథమ సహాయ ప్రతిస్పందన బృందాలు చక్కని సేవలు అందిస్తున్నాయని, బోరుబావిలో పడిపోయిన బాలుడిని రక్షించడంలోనూ ఈ బృందం సహకరించిందని వివరించారు.

మరుగుదొడ్ల నిర్మాణ, నిర్వహణపై కొత్త ఆలోచనలకు ఆహ్వానం

ఈనాడు అమరావతి: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై ప్రజల నుంచి కొత్త ఆలోచనలు ఆహ్వానిస్తున్నామని పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాలపై సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై ప్రజల్లో అవగాహన అవసరమని, ఇందుకోసం నిర్వహించే పోటీలకు విస్తృత స్థాయి ప్రచారం కల్పించాలని సూచించారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ డి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త ఆలోచనలు అందించే ప్రజలకు బహుమతులు అందజేస్తామని, పాఠశాలల విద్యార్థులకూ ప్రత్యేక బహుమతులు ఉంటాయని ఆయన వివరించారు. ఈ పోటీలలో అన్ని వయసుల ప్రజలు పాల్గొనవచ్చని, వీటిని మూడు రౌండ్లలో నిర్వహిస్తామని, పూర్తి వివరాలకు https://innovate.mygov.in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

సీఆర్పీల డిమాండ్లను నెరవేర్చాలి: రఘువీరా

ఈనాడు, అమరావతి: సర్వశిక్షఅభియాన్‌లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సీఆర్‌పీ)గా పని చేస్తున్న వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలలో ఉన్న మాదిరిగా సీఆర్‌పీలకు నాలుగేళ్లుగా వేతనాలు చెల్లించడంలేదని సీఎంకు శుక్రవారం రాసిన లేఖలో ఆయన తెలిపారు. సర్వశిక్ష అభియాన్‌లో పని చేస్తున్న వారి గౌరవ వేతనం పెంచుతున్నట్లు మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారని, కానీ వేతన పెంపులో వ్యత్యాసం చూపుతున్నారని రఘువీరా పేర్కొన్నారు.

రిజర్వేషన్లు ప్రకటిస్తారా... పాదయాత్రకు అనుమతిస్తారా

ప్రభుత్వం వెంటనే తేల్చాలి: ముద్రగడ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: పాదయాత్ర చేస్తామంటే ప్రభుత్వం ఎందుకంత భయపడుతుందో అర్థం కావడం లేదని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి శుక్రవారం ఐకాస, కాపు సంఘాల నాయకులతో కలిసి ముద్రగడ పాదయాత్రకు బయలుదేరారు. వారిని ముద్రగడ ఇంటి గేటు వద్దే పోలీసులు అడ్డగించారు. రోజూ ఇలానే అడ్డుకుంటున్నారని, సహనం కోల్పోతే గోడదూకి వెళ్లి ఏదొక ప్రాంతం నుంచి పాదయాత్ర చేస్తానని ఓఎస్డీ రవిశంకర్‌రెడ్డితో ముద్రగడ అన్నారు. పాదయాత్రను 24వ రోజు కూడా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ వెంటనే కాపు రిజర్వేషన్లు ప్రకటిస్తారా... లేకుంటే పాదయాత్రకు అనుమతి ఇస్తారో తేల్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేకమంది పాదయాత్రలు చేసిన సందర్భాలు ఉన్నాయని, అనుమతులు ఒక కాపులకే ఎందుకు అవసరం వస్తుందన్నారు. తుని సంఘటనను తమపై రుద్దడం దారుణమన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం నుంచి కాపు సంఘాల నాయకులు, మహిళలు తరలివచ్చి ముద్రగడకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఐకాస రాష్ట్ర నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, ఆరేటి ప్రకాష్, గౌతు స్వామి, గుండా వెంకటరమణ, గోపు అచ్యుత రామయ్య, తుమ్మలపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు నుంచి సినీ ప్రముఖులకు డ్రగ్స్ సరఫరా!

వేలూరు, న్యూస్‌టుడే: తెలుగు సినీ ప్రముఖులకు తమిళనాడులోని వేలూరుకు చెందిన ఇద్దరు యువకులు మాదక ద్రవ్యాలు సరఫరా చేసినట్లు హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. దీనికి సంబంధించి కొంత కాలంగా వేలూరు నగరంలోని సత్తువాచారి ప్రాంతంలో నిఘా వేశారు. పక్కా సమాచారంతో ఇద్దరు యువకులను శుక్రవారం అదుపులోకి తీసుకొని విచారణ నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లారు. రెండు నెలల కిందట కాట్పాడికి చెందిన ఓ యువకుడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి విచారించారు. ఆ యువకుడు ఇచ్చిన సమాచారంతో తాజాగా ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వివరాలు చెప్పడానికి పోలీసులు నిరాకరించారు. ఈ కేసులో మరికొందరిని అదుపులోకి తీసుకొనే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు.

డాక్టర్ కె.వరప్రసాద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్న డాక్టర్ రఘురాం

ఈనాడు, హైదరాబాద్: ఉషాలక్ష్మి రొమ్ము క్యాన్సర్ ఫౌండేషన్ సీఈవో డాక్టర్ పి.రఘురాం గుంటూరు జిల్లాకు చెందిన ప్రఖ్యాత వైద్యుడు డాక్టర్ వరప్రసాద్ స్మారక ఉపన్యాసం ఇవ్వనున్నారు. భారతీయ శస్త్రవైద్యుల సంఘం ఏపీ విభాగం వార్షిక సమావేశాల్లో భాగంగా శనివారం గుంటూరు వైద్య కళాశాలలో జరిగే కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తారు. రొమ్ము క్యాన్సర్ పరీక్షలు తదితర అంశాలపై మాట్లాడతారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మంది వైద్యులు ఇందులో పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్ర, గిరిజన వర్సిటీలపై కేబినెట్ నోట్ సిద్ధమవుతోంది

● శీతాకాల సమావేశాల్లో ఈ 2 బిల్లులు తీసుకొస్తాం
● ఏపీలో తెలుగు పీఠం గురించి ఎవరూ అడగలేదు
● కేంద్ర మంత్రి జావ్‌డేకర్ వెల్లడి



ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో చెప్పినట్లుగా ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, గిరిజన విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి కేబినెట్ నోట్ సిద్ధమవుతోందని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి ప్రకాశ్‌జావ్‌డేకర్ తెలిపారు. నెలలోపు ఇది మంత్రివర్గం ముందుకొస్తుందని స్పష్టంచేశారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ రెండు బిల్లులు ప్రవేశపెడతామని వెల్లడించారు. ఆయన శుక్రవారం ఇక్కడి తన కార్యాలయంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ ఏర్పాటుచేసిన ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ ఐటీలకు భవనాలు, మౌలికవసతుల కల్పనకు సంబంధించిన డీపీఆర్‌లను సంబంధిత సంస్థలు, రాష్ట్రప్రభుత్వం తయారుచేసి పంపితే పరిశీలించి నిధులు విడుదల చేస్తామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేకంగా ప్రాచీన తెలుగుపీఠం ఏర్పాటు అంశాన్ని ఎవ్వరూ తన దృష్టికి తేలేదన్నారు. ఇపుడది మైసూరులో ఉన్నట్లు తెలియదని, దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ఐఐఎంలపై ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేత

దేశంలోని 20 ఐఐఎంఐలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వబోతున్నట్లు జావ్‌డేకర్ తెలిపారు. "ఇప్పటివరకూ పాలకమండళ్లకు మానవవనరుల అభివృద్ధి మంత్రి ఛైర్మన్‌గా ఉండేవారు. ఇకమీదట అలాంటిది ఉండదు. ప్రభుత్వ ప్రతినిధులంతా పాలక మండలి నుంచి వైదొలగుతారు. వారి స్థానంలో నలుగురు పూర్వ విద్యార్థులతోపాటు, ప్రముఖ వ్యక్తులను నియమిస్తారు. ఐఐఎంలకు ఏడేళ్ల పాటు కేంద్రమే నిధులిస్తుంది. తర్వాత సొంత కాళ్లపై నిలబడాల్సి ఉంటుంది. ఇప్పుడున్న పాలకమండలి కొత్త మండలిని ఎంపికచేస్తుంది. ప్రభుత్వ నియంత్రణ ఎత్తివేసినా వాటికి జవాబుదారీతనం ఉంటుంది. వార్షిక నివేదికలను పార్లమెంటుకు సమర్పించడం తప్పనిసరి. మంత్రిత్వశాఖ అనుమతులు లేకుండా వారు సొంతంగా విస్తరించవచ్చు. అవసరమైన కోర్సులు ప్రవేశపెట్టుకోవచ్చు. విదేశీ బోధనా సిబ్బందిని నియమించుకోవచ్చు" అన్నారు.

2018-19 విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ, ప్రైవేటురంగంలో కలిపి దేశంలో 20 ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేయాలన్నది లక్ష్యమని జావ్‌డేకర్ తెలిపారు. వీటి ఎంపిక ప్రక్రియ 2018-19 విద్యాసంవత్సరంకల్లా పూర్తవుతుందని స్పష్టంచేశారు. ఉన్నత విద్యా ప్రమాణాలు పాటిస్తున్న విశ్వవిద్యాలయాలపై యూజీసీ, ఏఐసీటీఈ పెత్తనాన్ని పూర్తిగా ఎత్తేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు అనుగుణంగా యూజీసీ, ఏఐసీటీఈని సంస్కరిస్తున్నట్లు చెప్పారు. 1 నుంచి 8వ తరగతి వరకు చదువు చెబుతున్న టీచర్లంతా సెప్టెంబర్ 15లోపు శిక్షణ కోసం dled.nios.ac.inలో పేర్లు నమోదుచేసుకొని టీచర్‌ట్రైనింగ్‌లో డిప్లొమా కోర్సు పూర్తి చేయాలని జావ్‌డేకర్ తెలిపారు. ఇంటర్‌మీడియట్‌లో 50% మార్కులులేని ప్రభుత్వ, ఎయిడ్‌డెడ్, ప్రైవేటు స్కూల్ టీచర్లు కూడా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ ద్వారా మళ్లీ 12వ తరగతి చేసి 50% మార్కులు పొందాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తమిళనాడును నీట్ నుంచి మినహాయించే అంశం తమ పరిధిలో లేదని జావ్‌డేకర్ తెలిపారు.

ఆదిదంపతుల ఆలయానికి స్వర్ణశోభ



శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయం స్వర్ణమయంగా మారింది. స్వామి అమ్మవార్ల గర్భాలయ, అంతరాలయానికి రూ.కోటితో ఏర్పాటు చేసిన బంగారు కవచ ఏర్పాట్లు శుక్రవారంతో పూర్తయ్యాయి. ఈ వ్యయాన్ని అంతా ఒక భక్తుడు విరాళంగా సమర్పించారు. స్వామి అమ్మవార్ల ఆలయ ద్వారబంధనాలకు సువర్ణ కవచం పనులు చేశారు. బంగారు కవచ ఏర్పాట్లు పూర్తికావడంతో స్వామి అమ్మవార్ల ఆలయాలు నవ్యకాంతులతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. దేవస్థానం ఈవో భరత్‌గుప్తా నిర్ణయం మేరకు బంగారు ద్వారబంధనాలను ఏర్పాటు చేశారు.

సువర్ణశోభతో స్వామివారి గర్భాలయ ద్వారం

స్వర్ణతాపడ శోభతో భ్రమరాంబదేవి ద్వారబంధనం



తమిళనాట పతాక స్థాయికి 'విలీనం'

చెన్నై: తమిళనాట అన్నాడీఎంకే వర్గాల విలీన వ్యవహారం పతాక స్థాయికి చేరుకుంది. కొన్ని రోజులుగా చోటు చేసుకుంటున్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో శుక్రవారం పన్నీర్‌సెల్వం వర్గం నుంచి కీలక ప్రకటన వస్తుందని అంతా అనుకున్నారు. పదవుల విషయంలో స్పష్టత లేమి, రాతపూర్వకంగా విలీన ఒప్పందం ఉండాలన్న అంశాలపై పన్నీర్ వర్గం పట్టుదలతో ఉండటంతో ప్రకటన వెలువడలేదని తెలిసింది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామితో సీనియర్ మంత్రులు రాత్రివేళ సమావేశమయ్యారు. అంతకుముందు ఉదయం కూడా సచివాలయంలో ఆయన కొందరు మంత్రులతో సమావేశమయ్యారు. మరోవైపు పన్నీర్‌సెల్వం నగరంలోని గ్రీవెన్స్ రోడ్డులో ఉన్న తన నివాసంలో సాయంత్రం ఐదింటి నుంచి రాత్రి తొమ్మిది వరకు మద్దతుదారులతో సమావేశమయ్యారు. పన్నీర్ వర్గం ప్రకటనపై స్పందించడానికి ముఖ్యమంత్రి పళనిస్వామి, సీనియర్ మంత్రులు సచివాలయంలోనే ఉన్నారు. ప్రకటన రాకపోవడంతో మంత్రులు ఎవరికివారు విలేకరులతో మాట్లాడకుండానే వెనుదిరిగారు. సమావేశం అనంతరం రెండు వర్గాల విలీనానికి సంబంధించి పన్నీర్‌సెల్వం కీలక ప్రకటన చేస్తారని, మెరీనా తీరంలోని అమ్మ జయలలిత సమాధి వద్దకు చేరుకుంటారని, అక్కడికి ముఖ్యమంత్రి పళనిస్వామి కూడా వెళతారని ప్రచారం సాగింది. దానికి తగినట్లే అక్కడ ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను కూడా మోహరించారు. రాత్రి తొమ్మిది దాటినా ఎలాంటి ప్రకటన వెలువడకపోవడం, వర్షం పడుతుండటంతో ఒక్కొక్కరు వెనుదిరిగారు.

ఇంకెన్నాళ్లో...?: గతంలో చిన్నమ్మ శశికళపై ఇక్కడినుంచే పన్నీర్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. రెండు అంశాలను లేవనెత్తి ప్రజల మద్దతు కూడగట్టారు. అప్పటినుంచి అన్నాడీఎంకే వర్గాల మధ్య ఢీ అంటే ఢీ అన్నట్లు రాజకీయ ప్రకటనలు, మాటలు సాగాయి. కాంగ్రెస్‌కు మిత్రపక్షమైన డీఎంకే బలపడకుండా మరోవైపు కమలనాథులు చర్యలు చేపట్టారు. అన్నాడీఎంకేను ఏకం చేసి భవిష్యత్తు రాజకీయాల్లోనూ లబ్ధి పొందాలని భాజపా భావించింది. ఇందులో భాగంగా జయలలిత మరణం తర్వాత అనేక పర్యాయాలు రాష్ట్రంలో భాజపా అగ్రనాయకులు పర్యటించారు. కేంద్ర మంత్రులు సైతం వచ్చి వ్యూహాలు రచించారు. ఇందులో భాగంగా పన్నీర్, పళని వర్గాలు ఒక్కటవ్వాలని సూచించారు. ఇలా చేస్తే పూర్తికాలం అధికారంలో కొనసాగడమే కాకుండా వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధించవచ్చని నచ్చజెప్పారు. విలీన ప్రక్రియలో భాగంగా రెండు వర్గాలు ఇటీవల దిల్లీలో సమావేశమయ్యాయి. భాజపా అగ్రనాయకత్వం మధ్యవర్తిత్వం వహించింది. ముఖ్యమంత్రి పళనిస్వామి కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. పన్నీర్‌సెల్వం డిమాండ్లను అంగీకరించి విలీనానికి బాటలు వేశారు. ఇదే నేపథ్యంలో శుక్రవారం రెండు వర్గాల్లోని కీలక నేతల ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. శుక్రవారం రాత్రి వరకు విలీనానికి సంబంధించి ప్రకటన మాత్రం వెలువడలేదు.

మరోవైపు టీటీవీ దినకరన్ శశికళ పుట్టినరోజు సందర్భంగా బెంగళూరు జైలుకు వెళ్లి ఆమెతో సమావేశమయ్యారు. ఆయన వర్గం ఎమ్మెల్యేలు చెన్నై నగరంలోని హోటల్‌లో భేటీ అయ్యారు.

బిల్డర్ ఇంట్లో ఐటీ సోదాలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: నెల్లూరుకు చెందిన సునిల్‌రెడ్డి అనే బిల్డర్ ఇంట్లో ఆదాయపుపన్ను విభాగం అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని శ్రీనివాసమ్ అపార్ట్‌మెంట్‌లో పోలీస్ బందోబస్తుతో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు సోదాలు జరిగాయి. తెలంగాణలో మిషన్ భగీరథ పథకం పనులు దక్కించుకున్న ఓ గుత్తేదారుకు సునిల్‌రెడ్డి వ్యాపార భాగస్వామి అని సమాచారం. సోదాల్లో పలు పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులు ఆ వివరాలు చెప్పడానికి నిరాకరించారు.

శశికళతో దినకరన్ సుదీర్ఘ మంతనాలు

బెంగళూరు (మల్లేశ్వరం), చెన్నై, న్యూస్‌టుడే: అక్రమాస్తుల కేసులో కారాగారవాసం గడుపుతున్న ఏఐడీఎంకే నాయకురాలు శశికళతో పార్టీఉప ప్రధాన కార్యదర్శి టి.టి.వి.దినకరన్ శుక్రవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. అధికారుల అనుమతితో బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలోనే గంటన్నర పాటు చర్చించారు. పార్టీ సీనియర్‌నేతలు పన్నీరుసెల్వం, పళనిస్వామి వర్గాలు ఒక్కటి కావటం, దివంగత సీఎం జయలలిత నివాసం వేద నిలయాన్ని జయ స్మారకంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపైన కీలకంగా చర్చించారని సమాచారం. అన్నా డీఎంకే వ్యవస్థాపకుడు ఎం.జి.రామచంద్రన్ మృతి చెందిన తరువాత పార్టీ రెండుగా చీలింది. జయలలిత ముఖ్యమంత్రి అయిన తరువాత రెండు గ్రూపులు ఒక్కటయ్యాయి. ఆమె మృతి తరువాత పార్టీ మళ్లీ చీలింది. "పన్నీరుసెల్వం, పళనిస్వామి గ్రూపులు ఒక్కటైనప్పటికీ, అవసరమైన సమయంలో మనకు మద్దతుగా నిలుస్తామని కొందరు శాసనసభ్యులు నాకుహామీఇచ్చారు" అని దినకరన్ ఆమెకు విశదీకరించారు. వేద నిలయాన్ని స్మారకంగా మార్చేందుకు తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

వేద నిలయం వారసులకు పరిహారం ఇచ్చేందుకు సిద్ధం: మంత్రి సీవీ షణ్ముగం

పోయెస్ గార్డెన్‌లోని వేద నిలయంపై సంబంధిత వారసులు హక్కు ఉందని ముందుకొస్తే వారికి పరిహారం చెల్లించి ఆ ఇంటిని జయలలిత స్మారక మందిరంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తమిళనాడు న్యాయశాఖ మంత్రి సీవీ షణ్ముగం పేర్కొన్నారు. స్మారక మందిరంగా మార్చనున్నట్లు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రకటించినప్పటికీ దీనికి చట్టపరమైన సమస్యలు ఎన్నో ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

పళనిస్వామికి జయ మేనల్లుడి లేఖ

వేద నిలయాన్ని జయ స్మారక మందిరంగా మార్చనున్నట్లు వెలువడిన ప్రభుత్వ ప్రకటనపై ముఖ్యమంత్రికి జయలలిత సోదరుడి కుమారుడు దీపక్ ఒక లేఖ రాశారు. ఆ ఇల్లు జయ వారసులుగా దీపకు, తనకు సొంతమని పేర్కొన్నారు. స్మారక మందిరంగా మార్చటంపై తనకు అభ్యంతరం లేదని వారసులమైన తమ అనుమతి పొందిన తర్వాతే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై దీప హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.


ఈనాడు

ఏదీ సమగ్ర సేద్య కార్యాచరణ?

దేశంలో వ్యవసాయాభివృద్ధికి రెక్కలు తొడగడమే ధ్యేయమంటున్న కేంద్రప్రభుత్వ నిర్ణయానుసారం, ప్రత్యేక వడ్డీ రాయితీతో రైతులకు స్వల్పకాలిక రుణాలు ఇవ్వనున్నట్లు రిజర్వు బ్యాంకు తాజాగా ప్రకటించింది. మూడు లక్షల రూపాయలలోపు రుణాల్ని ఏడు శాతానికే పొందవచ్చునంటున్న ఆర్‌బీఐ, సకాలంలో తిరిగి చెల్లించినవారికి అదనంగా మూడు శాతం వడ్డీ రాయితీ వర్తింప జేస్తామంటోంది. వాస్తవానికి, గత సంవత్సరమే దీనిపై భారీ కసరత్తు జరిగింది. బ్యాంకులకు అందించే వడ్డీ రాయితీ పథకాన్ని లోగడ ఆర్థిక శాఖ నిర్వహిస్తుండేది. నిరుడు ఆ పథక నిర్వహణ బాధ్యత తనకు బదిలీ అయ్యాక స్వల్పకాలిక రుణాలు తీసుకోగోరే రైతులకు వడ్డీరాయితీ ప్రతిపాదనను వ్యవసాయ మంత్రిత్వ శాఖ తెరపైకి తెచ్చింది. గడువు తప్పకుండా చెల్లించినవారినుంచి మొత్తంమీద పావలా వడ్డీయే వసూలు చేసే పద్ధతిని ఈ ఏడాదీ కొనసాగించడం, రైతాంగానికి పరిమిత సాంత్వన ప్రసాదించేదే. దేశవ్యాప్తంగా 70శాతానికిపైగా సేద్య భూమిలో సాగు చేస్తున్నది చిన్న సన్నకారు రైతులే అయినా, వ్యవసాయ రుణాల్లో వారికి దక్కుతున్నవి 35శాతం లోపే! బ్యాంకులు, సహకార సంఘాల నుంచి పరపతికి నోచుకుంటున్న గ్రామీణ కుటుంబాల సంఖ్య బొత్తిగా 17శాతానికి పడిపోయిందని పార్లమెంటు స్థాయీసంఘం నివేదిక ఇటీవలే స్పష్టీకరించింది. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిస్సహాయ రైతులపై వడ్డీ వ్యాపారుల ఆధిపత్యం అధికంగా ఉన్నట్లు ఆర్థిక సర్వే గతవారమే ధ్రువీకరించింది. స్వల్పకాలిక పంటరుణాలపై వడ్డీరాయితీని ఈ ఏడాదీ కొనసాగించినంత మాత్రాన- కడగండ్ల సేద్యం ఒక్కుదుటున తెరిపిన పడే అవకాశం లేదు. రైతాంగానికి కాస్తో కూస్తో మేలు చేయగల పరిమిత చర్యలు కాదు, పకడ్బందీ వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక పట్టాలకు ఎక్కాల్సి ఉందిప్పుడు!

పేరుకే మనది వ్యవసాయ ప్రధాన దేశం. కష్టాలతో సహజీవనం సాగిస్తున్న సగటు రైతుది నిరంతర నష్ట జాతకం! విత్తనాల సరఫరా లగాయతు పంటల విక్రయాల దాకా ప్రభుత్వ యంత్రాంగం నుంచి అందేది అరకొర సాయమేనని, చెరకు మినహా తక్కిన పైర్లకు కనీస మద్దతూ ఎండమావేనంటూ చేదు నిజాలెన్నింటినో జాతీయ నమూనా సర్వే ఏకరువు పెట్టింది. దేశంలో సగటు రైతు కుటుంబ నెల ఆదాయం ఆరువేల రూపాయలకు మించడంలేదు. ఎటు చూసినా పటు నిరాశతో ఉక్కిరిబిక్కిరవుతున్న రైతు కోరేది కంటి తుడుపు రాయితీలు కాదు. ఇంటిల్లిపాదీ చెమటోడ్చినా అట్టడుగు సర్కారీ ఉద్యోగి జీతంలో మూడోవంతుకైనా నోచని రైతుల జీవితాలతో చీడపీడలు, ప్రకృతి ఉత్పాతాలు సైతం కసిగా చెలగాటమాడుతున్నాయి. పగలు మండుటెండ, రాత్రి గజగజ వణికించే చలి వాతావరణంలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను తట్టుకోలేక ఈ ఏడాది మామిడి పంటకు అపార నష్టం వాటిల్లింది. విపరీత వాతావరణ మార్పుల మూలాన దేశంలో ఏటా రూ.64వేల కోట్ల మేర దిగుబడులు కోల్పోవాల్సి వస్తున్నదని స్వయంగా వ్యవసాయ మంత్రిత్వశాఖే మదింపు వేసింది. పోనుపోను వరి, గోధుమ, నూనెగింజలు, తృణధాన్యాలు, పళ్లు, కూరగాయల ఉత్పత్తికీ వాతావరణ మార్పులు తూట్లు పొడవనున్నాయన్న అంచనాల దృష్ట్యా, దిద్దుబాటు వ్యూహాలపై ప్రభుత్వాలు ఇక ఎంతమాత్రం అలసత్వం వహించే వీల్లేదు. తన పరిధిలో లేని ఏ కష్టనష్టాలకూ రైతు బాధ్యత వహించనవసరం లేని రీతిలో పటుతర ప్రణాళికలు రూపుదిద్దుకోవాల్సి ఉంది. మార్కెట్ యార్డుల్లో దురన్యాయాలు, తూకాల్లో మోసాలు, దళారుల దగాకోరు విధానాలపై 'నీతి ఆయోగ్' నివేదికాంశాల్ని కేంద్రం క్షుణ్నంగా పరిశీలించాలి. అన్ని ప్రాంతాలకు, అన్ని రకాల పంటలకు వర్తించే సమగ్ర బీమా రక్షణ పథకమన్నది లేని లోటునూ తీర్చేలా పాలకశ్రేణి వడివడిగా దిద్దుబాట పట్టాలి!

పదకొండేళ్ల క్రితం విదర్భ ప్రాంత రైతుల ఆత్మహత్యల ఉద్ధృతి యావద్దేశాన్నీ తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్న తరుణాన, వివరణాత్మక సూచనలతో డాక్టర్ స్వామినాథన్ మేలిమి నివేదికలు క్రోడీకరించారు. దేశానికి వ్యవసాయ విధానం కాదు, రైతు సంక్షేమ విధానం కావాలని ఎలుగెత్తారు. యువతరాన్నీ సేద్యరంగంవైపు సూదంటురాయిలా ఆకర్షించగల సిఫార్సులకు నేటికీ మన్నన దక్కని పర్యవసానంగా- పొలాల్లో సంక్షోభాలు విరగకాస్తున్నాయి. ఏటికి ఎదురీదుతూ రైతన్న పండించేది తన కోసమో, కుటుంబం కోసమో కాదు- దేశంకోసం! ఎంత మొత్తుకున్నా గిట్టుబాటు కావడం లేదని రైతు నాగలి పట్టడమే మానేస్తే- 130 కోట్లకు పైబడిన జనావళి ఆహారావసరాలు తీరేదెలా? రైతు జీవనభద్రతతో జాతి ఆహార భద్రతా ముడివడి ఉంది. నూట పాతికకు పైగా విభిన్న వాతావరణ జోన్లు కలిగిన సువిశాల భారత్‌లో స్థానిక సానుకూలాంశాల్ని పరిగణనలోకి తీసుకుని, ఎక్కడ ఏ రకం పంట లసాగు గరిష్ఠ ప్రయోజనదాయకమో శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించాలి. భూసారం, కరవులు, వరదలు, తుపానులపట్ల సంపూర్ణ సదవగాహనతో పంటల ప్రణాళికలు సిద్ధం కావాలి. దేశీయ అవసరాలు, ఎగుమతి అవకాశాల్ని సాకల్యంగా మదింపువేసి నిర్దిష్ట లక్ష్యాల సాధనకోసం రైతాంగానికి సకల విధ సహాయ సహకారాలు సమకూర్చాలి. సాగుదారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, శాస్త్రవేత్తలు, సేద్య ఆధారిత పరిశ్రమల మధ్య అర్థవంతమైన సమన్వయం ఇజ్రాయెల్‌లో అద్భుతాలు సృష్టిస్తోంది. ఇక్కడా ఆ తరహా విస్తృత కార్యాచరణ సాకారమైతేనే- రైతు నిలదొక్కుకుంటాడు, దేశమూ తెప్పరిల్లుతుంది. యావన్మంది దేశవాసుల ఆహార భద్రత ఏ దశలోనూ బీటలు వారకూడదన్న లక్ష్యంతో రైతు బతుకు పచ్చగా ఉండేలా కాచుకోవడం జాతి ఉమ్మడి బాధ్యత!





జల జగడాలు ఆగేదెన్నడు?


చెరుకూరి వీరయ్య

దేశంలోని ప్రధాన నదులు బ్రహ్మపుత్ర, గంగ, గోదావరి, కృష్ణ, కావేరి, నర్మద పరీవాహక ప్రాంతాలు- రెండు అంతకన్నా ఎక్కువ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. అందువల్లే వాటిని అంతర్రాష్ట్ర నదులుగా పిలుస్తారు. ఈ నదీజలాలకు సంబంధించి ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరించడానికి 1956లో పార్లమెంటు ఓ చట్టాన్ని ఆమోదించింది. దీని ప్రకారం నదీజలాల వినియోగంలో ఏదైనా ఒక రాష్ట్రం తన అభ్యంతరాలను వ్యక్తంచేసి అభ్యర్థించినప్పుడు కేంద్రం ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు. కృష్ణ, గోదావరి, నర్మద, కావేరి, రావి, బియాస్ తదితర నదీజల వివాదాల పరిష్కారానికి ట్రైబ్యునళ్లు ఇలా ఏర్పాటైనవే. ట్రైబ్యునళ్ల నియామకంలో కేంద్రం తన నిర్ణయాన్ని ప్రకటించడంలో విపరీతమైన జాప్యం చోటుచేసుకుంటోంది. ట్రైబ్యునళ్లు సైతం తీర్పు ప్రకటించడానికి చాలా సమయం తీసుకుంటున్నాయి. దీనివల్ల రాష్ట్రాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లుతున్నాయి. ట్రైబ్యునళ్ల తీర్పుల్లోనూ సారూప్యత ఉండటం లేదు. తీర్పుల అమలులో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రాలు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తుండటంతో వివాదాలు జటిలమవుతున్నాయి. ట్రైబ్యునళ్ల తీర్పులపై రాష్ట్రాలు తరచూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో అంతిమంగా నదీ జల సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి. కృష్ణా జల వివాదంపై బచావత్, బ్రజేశ్ కుమార్ ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులు, వాటి పర్యవసానాలే అందుకు దాఖలా!

తీర్పుల్లో తగని వైరుధ్యం

కృష్ణా ట్రైబ్యునళ్ల తీర్పుల్లో ప్రవాహశ్రేణి ఎంపిక, నికర జలాల విశ్వసనీయత శాతం నిర్ధారణ, మిగులు జలాల కేటాయింపు, ప్రథమ వినియోగదారుడికి ప్రథమ హక్కు సూత్రం అమలు, ఆలమట్టి జలాశయ మట్టం నిర్ధారణ అంశాలే కీలకమైనవి. వీటిలో రెండు ట్రైబ్యునళ్లు భిన్నమైన ప్రాతిపదికలు ఎంపిక చేయడంవల్ల రాష్ట్రాల జల వివాదాలు మరింత జటిలమయ్యాయి. మొదటగా ప్రవాహశ్రేణి ఎంపిక విషయానికి వస్తే అధిక, అల్ప, వార్షిక నదీప్రవాహం సరళిని కచ్చితంగా అంచనావేసి, నికర జలాల్ని నిర్ధారించడానికి వీలైనంత ఎక్కువ కాలావధిని పరిగణనలోకి తీసుకోవడం అవసరమని బచావత్ ట్రైబ్యునల్ నిర్ణయించింది. కృష్ణానదిలో 1894-95 నుంచి 1971-72 వరకు 77 ఏళ్ల జలాల లెక్కలను పరిగణనలోకి తీసుకుంది. బ్రజేశ్ కుమార్ ట్రైబ్యునల్ అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించింది. 1894-95 నుంచి 2007-08 వరకు 113 సంవత్సరాల వార్షిక ప్రవాహ వివరాలు అందుబాటులో ఉన్నా వాటిని లెక్కలోకి తీసుకోలేదు. ఏవో కారణాలు చూపి, అధిక లభ్యతగల 47 సంవత్సరాల (1961-62 నుంచి 2007-08 వరకు) ప్రవాహ సరళినే పరిగణనలోకి తీసుకొంది. దీనివల్ల నికరజలాల నిర్ధారణలో సారూప్యత కొరవడింది. నికర జలాల విశ్వసనీయత శాతం నిర్ధారణలోనూ ఇదే వైరుధ్యం కనిపిస్తోంది. 1960లో జాతీయాభివృద్ధి సంస్థ, 1969లో భారతీయ ప్రమాణాల సంస్థ, 1972లో రెండో సాగునీటి సంఘం చేసిన సూచనలు, సిఫార్సులు, అంతర్జాతీయ ప్రమాణాలు, దేశంలో అనుసరిస్తున్న విధానాలను బచావత్ ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకుంది. ఆ మేరకు 75 శాతం విశ్వసనీయతతో కృష్ణానది వార్షిక ప్రవాహాన్ని లెక్కగట్టింది. ఎగువ రాష్ట్రాలు 50 శాతం, దిగువ రాష్ట్రం 86 శాతం విశ్వసనీయతతో నికర జలాలను లెక్కించాలని కోరినా, ఆ అభ్యర్థనలను బచావత్ ట్రైబ్యునల్ తోసిపుచ్చింది. 75 శాతం విశ్వసనీయతను 2002కు ముందే నిర్ధారించినందువల్ల ఇక అది పరిశీలించాల్సిన సమస్యే కాదు. అయినా బ్రజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ఈ అంశాన్ని విస్మరించింది. నదీజల ప్రవాహ పరిమాణాన్ని కొంతభాగం 75 శాతం, మరికొంత భాగం 65 శాతం విశ్వసనీయతతో నిర్ధారించి మూడు రాష్ట్రాలకు విభజించడం చట్ట ఉల్లంఘనే అవుతుంది. ఏ ట్రైబ్యునల్ కూడా గతంలో నదీజలాలను ఇలా విభజించలేదు. రెండు విధాల విశ్వసనీయతతో నదీ జలాలను విడుదల చేసి, వినియోగించడం ఆచరణ సాధ్యంగాని పని!

అత్యంత కీలకమైన మిగులు జలాల కేటాయింపు అంశానికి వస్తే, 75 శాతం విశ్వసనీయతతో నికర జలాలను నిర్ధారించి, 25 శాతం కాలావధిలో నీటి కొరత వల్ల ఎగువ రాష్ట్రాలకన్నా దిగువన ఆంధ్రప్రదేశ్ ఎక్కువగా నష్టపోతుందని బచావత్ ట్రైబ్యునల్ భావించింది. దానికి పరిహారంగా 75 శాతం కాలావధిలో లభించే మిగులు జలాలను వినియోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు వెసులుబాటు కల్పించింది. ఈ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు భాగం కల్పించలేదు. బ్రజేశ్ ట్రైబ్యునల్ మాత్రం దీనికి విరుద్ధంగా నిర్ణయించింది. 65 శాతం విశ్వసనీయత ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల నీటికొరత 25 శాతం నుంచి 35 శాతానికి పెరిగింది. మళ్ళీ సగటు వార్షిక ప్రవాహాన్ని (58 శాతంతో) 2,578 శత కోటి ఘనపుటడుగులుగా లెక్కించింది. ఈ జలరాశిని మూడు రాష్ట్రాలకు పంచింది. దీనివల్ల నీటి కొరత 42 శాతానికి పెరిగి దిగువ తెలుగు రాష్ట్రాలకు కష్టాలు మరింత ఎక్కువయ్యాయి.



శాశ్వత కేంద్ర ట్రైబ్యునల్ ఏర్పాటే పరిష్కారం!

'ప్రథమ వినియోగదారుడికి ప్రథమ హక్కు' అనేది నీటిపారుదల రంగంలో అనాదిగా అవలంబిస్తున్న మౌలిక న్యాయసూత్రం. నది, వాగులపై ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చేటప్పుడు, దిగువ నిర్మించినవాటి ప్రయోజనాలకు భంగం కలగకుండా చూస్తారు. ఈ విధానం కాలక్రమంలో ముందుగా నిర్మించిన ప్రాజెక్టుకు 'నదీ సంబంధ హక్కు'గా మారింది. దేశంలోని అన్ని నదీ బేసిన్లలో ఈ సూత్రాన్నే పాటిస్తున్నారు. అంతర్జాతీయ న్యాయసూత్రాలు సైతం దీన్ని బలపరుస్తున్నాయి. బచావత్ ట్రైబ్యునల్ ఈ న్యాయసూత్రాన్నే అనుసరించింది. 1960 సెప్టెంబరు నాటికి కృష్ణానదిపై మహారాష్ట్ర, కర్ణాటక, అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు 2,060 శ.కో.ఘ.ల నికర జలాల్లో అగ్రప్రాధాన్యంగా కొంతభాగం ప్రత్యేకించింది. మిగిలిన నీటిని మాత్రమే తదుపరి నిర్మితమైన ప్రాజెక్టులకు కేటాయించింది. కేటాయింపుల ప్రకారం ఆయా ప్రాజెక్టులకు కచ్చితంగా జలాలు అందజేయకపోవడంవల్ల నదీ సంబంధ హక్కులకు విఘాతం కలుగుతోంది. 160 ఏళ్లనాటి కృష్ణా డెల్టా, 50 ఏళ్లనాటి నాగార్జున సాగర్‌కన్నా తరవాత నిర్మించిన ఆలమట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల ఆయకట్టుకే ముందుగా నీరందుతోంది. ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిగా నిండేవరకు కర్ణాటక ప్రభుత్వం దిగువకు నీరు వదలడం లేదు. అందువల్ల నాగార్జున సాగర్, కృష్ణా డెల్టా ఆయకట్టు భూములు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు సకాలంలో నీరందక సతమతమవుతున్నాయి. ఈ ఏడాదీ ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు దాదాపు నిండినా- నదిలో దిగువకు నీటిని విడుదల చేయడం లేదు. కర్ణాటక ప్రభుత్వం 1996లో భారతీయ విజ్ఞాన సంస్థ (బెంగళూరు) ద్వారా ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలను క్షుణ్నంగా అధ్యయనం చేయించింది. ఎగువ కృష్ణా ప్రాజెక్టు కింద కేటాయించిన 173 శ.కో.ఘ.ల వినియోగానికి ఆలమట్టి జలాశయ నీటిమట్టం +519.6 మీటర్లుంటే సరిపోతుందని ఆ సంస్థ నివేదిక సమర్పించింది. ఆ నివేదికను బ్రజేశ్ కుమార్ ట్రైబ్యునల్ పరిగణనలోకి తీసుకోలేదు. కర్ణాటక అభ్యర్థన ప్రకారం ఆలమట్టి పూర్తి జలాశయ నిల్వ +519.6 మీటర్ల నుంచి +524.256 మీటర్లకు పెంచింది. జలాశయ సామర్థ్యాన్ని 173 నుంచి 303 శ.కో.ఘ.లకు కేంద్ర జల సంఘం ఆమోదం లేకుండానే ఏకపక్షంగా అధికం చేసింది. అంత జలరాశి చేరే వరకు కర్ణాటక ప్రభుత్వం నీటిని విడుదల చేయడంలేదు. దీంతో ఆగస్టు నుంచి అక్టోబరు వరకు దిగువకు ప్రవాహ పరిమాణం తగ్గి నాగార్జున సాగర్, కృష్ణా డెల్టా ఆయకట్టుకు సకాలంలో నీరందడం లేదు. ఖరీఫ్ పంట దిగుబడి తగ్గిపోయింది. రబీ పంటకూ బొత్తిగా నీరందని ప్రమాదం ఏర్పడింది.

తెలుగు రాష్ట్రాలకు కష్టకాలం

రెండు తెలుగు రాష్ట్రాలకు కృష్ణా బేసిన్‌లో కేవలం 369 శ.కో.ఘ.ల నీరు మాత్రమే లభిస్తోంది. బచావత్ ట్రైబ్యునల్ అప్పటి ఆంధ్రప్రదేశ్‌కి కేటాయించిన 811 శ.కో.ఘ.ల నికర జలాల్లో మిగిలిన 442 శ.కో.ఘ.ల నీరు ఎగువ రాష్ట్రాల నుంచి రావాలి. ప్రస్తుతం ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిస్థాయిలో నిండి నిండుకుండలను తలపిస్తున్నాయి. మరోవైపు దిగువ శ్రీశైలం జలాశయంలో (పూర్తి సామర్థ్యం 215.867 శ.కో.ఘ.లు) 20.37 శ.కో.ఘ. జలరాశి మాత్రమే ఉంది. నాగార్జున సాగర్‌లో (పూర్తి సామర్థ్యం 312.045 శ.కో.ఘ.లు) 115.78 శ.కో.ఘ.ల నీటినిల్వే ఉంది. రెండు జలాశయాలు నిండాలంటే ఎగువ నుంచి 391 శ.కో.ఘ.ల నీరు రావాలి. కర్ణాటక ఎంతవరకు నీరు వదులుతుందన్నది సందేహమే. ఎగువన భారీ వర్షాలు పడితే తప్ప, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికే వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నదిలో వరదలు వచ్చినప్పుడు ముంపు బారినపడటం, నీరందనప్పుడు క్షామ పరిస్థితులు ఏర్పడటం రెండు తెలుగు రాష్ట్రాలకు ఆనవాయితీ అవుతోంది. ఈ పరిస్థితి మారాలి. ప్రథమ వినియోగదారుడికి ప్రథమ హక్కు అన్న సూత్రం కాగితాలకే పరిమితం కారాదు. ఆ హక్కుకు మన్నన దక్కాలంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు నీటి విడుదలలో అగ్రప్రాధాన్యం దక్కాలి. ఆలమట్టి జలాశయంలో ఎప్పటికప్పుడు ప్రత్యేక నీటి నిల్వ పరిమితిని నిర్ధారించి, అదనంగా వచ్చే నీరు దిగువకు రావడానికి ఏర్పాట్లు జరగాలి. రాష్ట్రాల మధ్య జలవివాదాలు శాశ్వతంగా పరిష్కారం కావాలంటే కేంద్రప్రభుత్వం మరింత క్రియాశీలంగా వ్యవహరించాలి. సర్కారియా కమిషన్ సిఫార్సుల ప్రకారం రాష్ట్ర అభ్యర్థన అందిన ఏడాది వ్యవధిలో ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి. పార్లమెంట్ స్థాయీసంఘం తాజా సిఫార్సు మేరకు రెండేళ్లలోనే ట్రైబ్యునల్ తన తీర్పు ప్రకటించాలి. తీర్పును రెండేళ్లలో అమలుపరచాలి. ట్రైబ్యునల్ తీర్పును సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైనదిగా పరిగణించాలి. రాష్ట్రాలు వివరణ కోరిన పక్షంలో ఆరు నెలల వ్యవధిలో వాటిని ట్రైబ్యునల్ పరిష్కరించాలి. అంతర్రాష్ట్ర నదీజల వివాదాలను వేగంగా పరిష్కరించగలిగేలా అవి ఉండాలి. నదీ జల వివాదాలకు సంబంధించి ఏకైక శాశ్వత ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలన్న యోచనను కేంద్రం కార్యరూపంలోకి తీసుకురావాలి. ట్రైబ్యునల్ తీర్పును అమలుపరచాల్సిన సంస్థకు తగిన అధికారాలు దఖలుపరచాలి. నిబంధనలను అతిక్రమించినవారిని శిక్షించే మెజిస్టీరియల్ అధికారాలూ ఆ సంస్థకు అప్పగించాలి. వివిధ ప్రాజెక్టులకు జల కేటాయింపులు కాగితాలకు పరిమితం కాకుండా నీటి వినియోగంలో విధిగా అమలయ్యేలా చూడాలి. ఇవన్నీ ఆచరణలోకి వచ్చినప్పుడే అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలు దశాబ్దాలపాటు నానకుండా సత్వరం పరిష్కారమవుతాయి!

(రచయిత- సాగునీటి పారుదల రంగ నిపుణులు)

ఉపాధి కొరవడి... అలజడి!


వీరేంద్ర కపూర్

నిప్పు కణిక కనిపించగానే ఆర్పేయాలి. ఏమీకాదని వదిలేస్తే, అది పెద్ద మంటై చుట్టుముడుతుంది. అప్పుడు దాన్ని అదుపుచేయడం చాలా కష్టం. నిప్పు కణిక చూస్తూండగానే పెద్ద మంటగా మారుతున్నా, మన రాజకీయ నాయకులు అసలేమి పట్టించుకోరు. సెగ తాకేదాకా మేలుకోరు. అప్పటికే పరిస్థితి చెయ్యిదాటుతుంది. ఒక్క భారతదేశంలోనే కాదు, ప్రపంచమంతటా రాజకీయ నాయకులది ఇదే తరహా. ఏవో సమస్యలంటారు. వాటిని తక్షణం పరిష్కరించాల్సిన అవసరం ఉందంటారు. ఇంకేవో వ్యవహారాలు, లావాదేవీల్లో తలమునకలైపోతారు. రాచకార్యాలు వెలగబెడుతుంటారు. చాప కిందకు నీరొచ్చేదాకా ఏమైందో వారికి అర్థం కాదు. ముందస్తు హెచ్చరికల్ని పెడచెవిన పెడతారు. చివరకు పెను సంక్షోభం ముంచుకొచ్చాక, నానా హైరానా పడిపోతారు. ఎక్కడైనా, ఎప్పుడైనా వారు అంతే!

ఇలాంటి దృష్టాంతాలు చరిత్ర నిండా పోగుబడి ఉన్నాయి. చైనా, కశ్మీర్‌ల విషయంలో నెహ్రూకు ఎవరెన్ని హెచ్చరికలు చేసినా చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లే అయింది. హిందీ-చీనీ భాయ్ భాయ్ అంటూ గుడ్డిగా చైనాను నమ్మవద్దని సర్దార్ పటేల్ మొదలుకొని జేబీ కృపలానీ వరకు ఎంతోమంది సీనియర్ నాయకులు హితవు చెప్పినా, నెహ్రూ ఆలకించలేదు. సరిహద్దుల్లో చైనా కత్తులు నూరుతుంటే, తృతీయ ప్రపంచ నాయకుడిగా ఎదిగే క్రమంలో తన పర్యటనలు, ప్రయత్నాల్లో తలమునకలైపోయారు. కశ్మీర్ నుంచి మందిర్-మసీదు వరకు అనేక వివాదాలు ఈ విధంగా ఉత్పన్నమైనవే. నిజం చెప్పాలంటే ఇవన్నీ మన రాజకీయ నాయకత్వం మనకు అందించిన చేదు ఫలాలు. నెహ్రూ గొప్పనాయకుడని అదేపనిగా పొగుడుతున్నవారు, దేశ ప్రథమ ప్రధాని చేసిన కొన్ని ఘోరమైన తప్పిదాల కారణంగానే నేటి తరాలు సైతం పెను సంక్షోభాలు ఎదుర్కొనవలసి వస్తోందన్న చేదు నిజాన్ని మరచిపోతున్నారు. ఇది దురదృష్టకరం.

నేడు దేశంలో కొన్నిచోట్ల అగ్నిజ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మొదట్లోనే వాటిని ఆర్పివేస్తే సమస్యే ఉండేది కాదు. తక్షణం తగిన చర్యలు చేపట్టకపోతే నిప్పుల ఉప్పెన ముంచెత్తడం ఖాయం. తాజాగా ముంబయిలో ప్రమాద ఘంటిక మోగింది. ఆర్థిక, సామాజిక రంగాల్లో అణగారిపోతున్నామని భావిస్తున్న మరాఠాలు, తమకూ రిజర్వేషన్లు కావాలని కోరుతూ దేశ వాణిజ్య రాజధానిలో బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించారు.


ముంబయిలో మరాఠాల ఆందోళన (పాతచిత్రం)

ఆర్థికాభివృద్ధిలో అందరికీ వాటా

విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పిస్తున్న రిజర్వేషన్లను తొలగించాలని వారు కోరడం లేదు. కానీ, ఆ రిజర్వేషన్ల కారణంగా తాము నష్టపోతున్నామని, అందువల్ల తమకూ ఆ తరహా ప్రాధాన్యం కల్పించాలని అంటున్నారు. కొద్దినెలల క్రితం హరియాణాలో జాట్లు సైతం రిజర్వేషన్ల కోసం ఉద్యమించారు. ఇసుకలో తలదూర్చి భద్రం భద్రం అనుకొనే నిప్పుకోళ్లలా మన రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు. వారి వైఖరి ఇలాగే ఉంటే పరిస్థితి పూర్తిగా చెయ్యిదాటిపోవచ్చు. అలాగని, రిజర్వేషన్లకు సంబంధించి ప్రస్తుత విధి విధానాలను మార్చాలని కానీ, ఇప్పటి లబ్ధిదారుల విషయంలో పునరాలోచన చేయాలనికానీ ఎవ్వరూ సూచించరు. అదే సమయంలో ఇతరులకూ ఏ రకంగా ప్రయోజనం చేకూర్చవచ్చో ఆలోచించాలి. గుజరాత్, రాజస్థాన్, పశ్చిమ యూపీ, హరియాణా, ఇప్పుడు మహారాష్ట్రల్లో ఉవ్వెత్తున లేస్తున్న ఉద్యమాలు నేర్పుతున్న పాఠమిదే.

మరాఠాల ఉద్యమం ఇప్పటివరకు శాంతియుతంగానే సాగుతోంది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగడంలేదు. రాజకీయాలతో ఎలాంటి సంబంధంలేనివారే ఉద్యమాన్ని ముందుండి నడుపుతుండటమే ఇందుకు కారణం. వాస్తవంలో మహారాష్ట్రలో కాంగ్రెస్-ఎన్సీపీ సంకీర్ణం అధికారంలో ఉన్నప్పుడే ఈ నిరసనోద్యమం ప్రారంభమైంది. ఇప్పుడు భాజపా-శివసేనల హయాములో అది మరింత ఉద్ధృతమైంది. వరస వెంబడి కరవుకాటకాలు దాడి చేస్తున్నాయి. పెద్ద సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకొంటున్నాయి. వ్యవసాయాన్ని నమ్ముకొనే పరిస్థితి లేదు. వేరే జీవనమార్గాలు కనిపించడంలేదు. అందుకే మరాఠా బాలబాలికలు ఇప్పుడు ఉద్యోగాలు కోరుకొంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కొలువులు కావాలంటున్నారు. కానీ, ఉద్యోగావకాశాలు మాత్రం పెద్దగా లేవు. ఉన్న ఉద్యోగాలూ అందుబాటులో లేకుండా పోతున్నాయి. అందుకే, వారిలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. ఇప్పటికైతే అది శాంతియుత నిరసన ప్రదర్శనల రూపంలోనే వ్యక్తమవుతోంది. ముందుముందు ఏమి జరుగుతుందో చెప్పలేం.

గుజరాత్‌లో పటిదార్‌లు, హరియాణలో జాట్లు, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లలో కొన్ని వర్గాల వారు ఇదే తరహా డిమాండ్లతో ఉద్యమించారు, ఉద్యమిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి ఫలాల్లో తమకూ వాటా కావాలంటున్నారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో సరికొత్త ఉపద్రవం తలెత్తుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వాటిని విస్మరించడానికి వీల్లేదు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మరాఠాల సమస్యమీద దృష్టి సారించారు. దాని పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. కానీ, సమస్యను ఎలా పరిష్కరిస్తారన్నదే అంతుపట్టడంలేదు. ప్రభుత్వాల తప్పుడు ఆర్థిక, సామాజిక విధానాల ఫలితంగానే ఇలాంటి విపత్కర పరిస్థితి తలెత్తింది. రాజకీయ వర్గం ఇప్పటికైనా సంకుచితాన్ని విడనాడాలి. జాతి విశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా, లేక తమకు ఎంతమాత్రం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించినా పరిస్థితులు మరింత విషమిస్తాయి. చేతులు కాలాక ఆకులు పట్టినా ప్రయోజనం ఉండదు!

ఈనాడు లేఖలు

మట్టి ప్రతిమలతో మేలు

ఏటా వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఇళ్ల వద్ద, కాలనీల కూడళ్లలోనూ చిన్నా పెద్దా విగ్రహాల్ని ఏర్పాటుచేయడం పరిపాటి. వాటిలో పలు పదార్థాలు- ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసినవి అధిక సంఖ్యలో కనిపిస్తుంటాయి. అటువంటి వాటి కంటే, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి ప్రతిమల తయారీ-ఏర్పాటుకే సమధిక ప్రాధాన్యం కల్పిస్తే బాగుంటుంది. రంగుల హంగులతో కాకుండా సర్వసాధారణ రీతిలో మట్టితో చేసిన విగ్రహాలే ఉత్తమంగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఇతరవాటిని వినియోగించి రూపొందించిన విగ్రహాల్ని జలాల్లో నిమజ్జనం చేస్తే, ఆ రంగుల్లోని రసాయనాలు చెరువుల్లో కలిసి కాలుష్యానికి దారితీస్తాయి. అటువంటి నీరు ఎంత ప్రమాదకరమో తెలియంది కాదు. అందుకే మట్టి విగ్రహాల్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి ప్రభుత్వం మరింత విస్తృతంగా ప్రచారాలు సాగించాలి.

- సరికొండ శ్రీనివాసరాజు, హైదరాబాద్

నిర్లక్ష్యం ఖరీదు!

ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో ఆక్సిజన్ అందక పదుల సంఖ్యలో చిన్నారులు మృతి చెందడం బాధాకరం. ఇది అనూహ్యంగా చోటుచేసుకున్న దుర్ఘటన కాదు. ఆస్పత్రిలోని లోపాలను గతంలో గోరఖ్‌పూర్ ఎంపీగా యోగి ఆదిత్యనాథ్ లోక్‌సభలో ప్రస్తావించారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తరవాతా పరిస్థితుల్లో మార్పు రాకపోవడమే విషాదం. చిన్నారుల మెదడువాపు వ్యాధి చికిత్సలో ఆక్సిజన్ అందుబాటు ఎంత అవసరమో ఆస్పత్రిలోని వైద్యులు, అధికారులకు తెలియని విషయమేమీ కాదు. ఇది గోరఖ్‌పూర్ ఆస్పత్రికే పరిమితమైన సంక్షోభం కాదు. దేశవ్యాప్తంగా అన్ని నగరాలు, పట్టణాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ తరహా లోపాలే తిష్ఠ వేసుక్కూర్చున్నాయి. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి రాజధానుల్లోని ఆస్పత్రుల వరకు అన్నింటినీ ఆసాంతం ప్రక్షాళించనిదే పరిస్థితులు చక్కబడవు.

- డాక్టర్ ఎ.నరసింహం, నెల్లూరు

మూడు హితాలు

మానవ జీవితంలో మాటలకు గల విలువ అమూల్యం. వాటి వల్ల మనిషి చెడిపోవటం, బాగుపడటం- రెండూ సంభవాలే! ఇష్టమైన వాటిని, తన మనసుకు నచ్చే మాటల్ని వినాలని అతడు కోరుకుంటాడు. అది బలం, బలహీనత- ఏదైనా కావచ్చు. అన్నింటికంటే వ్యక్తి మాట తీరే ప్రధానమవుతుంది. అలా అని, అన్ని మాటలూ అతడికి మంచి కలిగిస్తాయని చెప్పడం సాధ్యం కాదు.

విలువైన, మేలు కలిగించే మాట లభించడం ఎంతో కష్టం. సదా హితాన్ని చేకూర్చే, మనసును ఆహ్లాదపరచే మాట దొరకడం అసంభవం- అంటాడు 'కిరాతార్జునీయం' కావ్యకర్త భారవి మహాకవి. ఆయన అభిప్రాయం ప్రకారం- హితం కలిగించే మాట మనోహరం కాకపోవచ్చు, మనోహరమైన ప్రతి మాటా హితకరం కాకపోవచ్చు. ఈ రెండూ కలిసిన మాట లోకంలో దుర్లభం!

అనాదిగా గల వాఙ్మయమంతా మనిషికి హితం పలికేందుకే అవతరించిందని పెద్దలు చెబుతారు. అజ్ఞానం వల్ల చెడు వైపు పయనించే మనిషిని సరైన దారిలోకి తెచ్చేందుకు అపారమైన సాహిత్యం వెలువడింది.

మనుషులు విభిన్నంగా ఉంటారు. ఒకడు కఠినంగా చెబితే తప్ప వినడు. ఒకడు మృదువుగా చెబితే చాలు, వింటాడు. ఒకడు ఎంతో చెబితే గానీ వినడు. మరొకడు ఒక్క మాటతోనే దారికి వస్తాడు. ఇలా మనుషుల తీరుతెన్నులు అనేకం. ప్రబోధ సాహిత్యంలో మూడు విధాలైన హితాలను చూడవచ్చు. ప్రభుసమ్మిత, మిత్రసమ్మిత, కాంతాసమ్మితాలు!

ప్రభుసమ్మితం అంటే, రాజులా శాసించే మాట. ప్రజల్ని పాలించే ప్రభువు అందరినీ సమాన న్యాయం, సమాన ధర్మంతో రక్షించడానికి శాసనం చేస్తాడు. ఆ శాసనమే అందరికీ శిరోధార్యమవుతుంది. దానికి తిరుగు ఉండదు. అటువంటి మాటలు వేదాల్లో ఉన్నాయి. అందువల్ల 'వేదాలు ప్రభుసమ్మితాలు' అంటారు విజ్ఞులు. వేదాల్లోని- సత్యాన్నే పలుకు (సత్యం వద), ధర్మాన్నే ఆచరించు (ధర్మం చర) వాక్యాలు శాసనాల్లా కనిపిస్తాయి. సార్వకాలిక సత్యాలు కాబట్టి, అవి ప్రభుశాసనం వంటివి.

మిత్రసమ్మితం అంటే, మిత్రుడిలా ప్రబోధించే మాటలు. కష్టసుఖాల్లో, కలిమిలేముల్లో సర్వదా అండగా ఉండేదే మైత్రి. అది కలిగినవాడే మిత్రుడవుతాడు. అన్నివేళలా హితాన్ని కోరుతూ మంచి సూచనలిచ్చే మిత్రుడి



అంతర్యామి

మాటలు కాంతిపథంలో నడిపిస్తాయి. ఎదురుపడినప్పుడు తీయని మాటలు చెబుతూ, చాటున ద్రోహం తలపెట్టేవాళ్లు మిత్రులు కారు. వాళ్లు పయోముఖ విషకుంభాల వంటివాళ్లు అని నీతిశాస్త్రం చెబుతుంది. పయోముఖ విషకుంభం అంటే- కుండ లోపల అంతా విషాన్ని నింపి, పైకి మాత్రం తెల్లని పాల నురగను ఉంచడం! పురాణేతిహాసాల్లో మంచిమిత్రుడి మాటల వంటి ఉపదేశాలు అనేకం కనిపిస్తాయి. అవి మిత్రసమ్మితాలు.

కాంతాసమ్మితం అంటే, భార్యలా మనోహరంగా పలికే మాట. భర్త మనసును అనురాగంతో వశంచేసుకొన్న మనోహరిగా, అతడి శరీరంలో సగాన్ని సొంతం చేసుకొన్న అర్ధాంగిగా ఆమెకు గల స్థానం ఎనలేనిది. చెడు దారిలో నడిచే భర్తను భార్య ప్రియమైన మాటలతో దారికి తెచ్చి, మంచి వైపు పురోగమింపజేస్తుంది. తనతో ముడివడిన అతడి జీవితాన్ని ఆహ్లాద మధురంగా మారుస్తుంది. ఆమె మాటలు కావ్యాల వంటివి. కావ్యాల్లోని కమనీయ వర్ణనలతో ప్రభావితమై జీవితాన్ని అమృత భావనామయంగా మలచుకోవడం అంటే, అది ప్రియమైన భార్య పలికే మాటల్ని భర్త వినడం వంటిదే!

మనిషి జీవనకాలంలో ప్రతి క్షణాన్నీ ఆనందమయం చేసుకోవడానికి ఇలా మూడు హితాలున్నాయి. వీటన్నింటినీ వివరించి చెబుతున్న సాహిత్య గంగాప్రవాహం అందుబాటులో ఉన్నప్పుడు, మనిషి బాధలతో కుంగిపోవడం ఎందుకు? సాహితీ సంపదను ఎద నిండేలా ఆస్వాదించి, ఆ ఆనంద మకరందాన్ని ఆసాంతం పొందడమే అతడి కర్తవ్యం!

- డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ

శతమానం ఇకిగాయ్

జపాన్‌కు ప్రత్యేకం ఈ జీవన్మంత్రం

నిండు నూరేళ్లు వర్ధిల్లమంటూ 'శత మానం భవతి' అని ఆశీర్వదిస్తుంటారు మన పెద్దలు. నూరేళ్లు బతకమని దీవించడం భారతీయ సంస్కృతిలో భాగం. కానీ జపాన్‌లో దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి. నూరేళ్లు బతకమని ఆశీర్వదిస్తే వారు వింతగా చూస్తారు. ఎందుకంటే.. వందేళ్లకు మించి జీవించటం అక్కడ సర్వసాధారణం. వయసు పైబడినా ఇంకా ఆరోగ్యంగా, హుషారుగా జీవిస్తున్న వారెందరో కనిపిస్తారక్కడ.

ఇదెలా సాధ్యం. అసలు జపనీయులు ఇంత సుదీర్ఘకాలం ఎలా బతికి ఉండగలుగుతున్నారు? ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్న ప్రశ్న. దీనిపై పలువురు సామాజిక, జీవశాస్త్రవేత్తలు ముమ్మర పరిశోధనలు సాగిస్తున్నారు.

■ సగటు ఆయుర్దాయం 80 ఏళ్లకు పైనే

జపాన్ ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం అక్కడి ప్రజల సగటు ఆయుర్దాయం 80 ఏళ్లకు పైగానే ఉంది. జపాన్‌లో మహిళలు అత్యధికంగా 87 ఏళ్లు జీవిస్తున్నారు. పురుషుల సగటు ఆయుర్ధాయం 81 ఏళ్లు ఉంది. సగటున ఇంత ఎక్కువకాలం జీవించే ప్రజలు మరే దేశంలోనూ లేరంటే అతిశయోక్తి కాదు. జపాన్‌లోని ఒకినోవా దీవిలో అయితే నూరేళ్లకు పైబడిన వారు అధిక సంఖ్యలో ఉంటారు! .

■ ఒకినావా దీవి ప్రత్యేకత

జపాన్ దీవుల్లోని అయిదో అతిపెద్ద దీవి ఒకినావా. రైక్యూ ద్వీపాల్లో భాగంగా ఉంటుంది. సరిగ్గా చెప్పాలంటే దక్షిణ జపాన్, తైవాన్‌ల మధ్య ఉండే ప్రాంతం. యుద్ధ విద్య అయిన కరాటేకు పెట్టింది పేరు. అమెరికాకు జపాన్‌తో సైనిక-ఆర్థిక సంబంధాలు ఉన్న విషయం తెలిసిందే. అమెరికా సైనికులు ఈ దీవి నుంచే కొరియా, వియత్నాం యుద్ధాల్లో పాల్గొన్నారు. వీటన్నింటి కంటే నూరేళ్లకు పైగా ప్రజలు జీవించే దీవిగా దీనికి ఎక్కువ పేరు వచ్చింది. ఇక్కడ ఉండే ప్రతి లక్షమందిలో నలభైమంది వందేళ్లకు పైబడిన వారు ఉంటారు. ఇతర అంశాలకు తోడు ఒకినావా దీవుల్లోని ప్రజల జన్యు నిర్మాణం (డీఎన్ఏ), వారు సుదీర్ఘకాలం జీవించే అవకాశం కల్పిస్తున్నట్లు శాస్త్రవేత్తల విశ్లేషణ.

■ పని.. పని.. పని..

'ఇకిగాయ్'.. ఈ జపనీస్ పదానికి ఇతర భాషల్లో సరైన పదం లేదు. కానీ దేని కోసం జీవిస్తున్నావు? అని దీనికి అర్థం. జపాన్ ప్రజలకు తమకు ఏం కావాలో, ఏం వద్దో.. అనే విషయాలపై ఎంతో స్పష్టత ఉంటుంది. నీ 'ఇకిగాయ్' ఏమిటి? అని అడిగితే మూడోవంతు మంది 'పని' అని సమాధానం చెబుతారు. జపనీయులు పని రాక్షసులు అని తెలిసిందే. రోజంతా పని.. పని.. పని. మరొకటి తెలీదు వారికి. జపాన్‌లో నాలుగో వంతు ఉద్యోగస్తులు నెలలో వారికి నిర్దేశించిన పని గంటల కంటే 80 గంటలు అధికంగా పనిచేస్తున్నారు. 'నీకు ఇష్టమైనదేది, నీవు ఏపని బాగా చేయగలవు, సమాజం నీనుంచి ఏమి ఆశించవచ్చు, నీకు ఎందుకు విలువ ఇవ్వాలి.. అనే ప్రశ్నలు కూడా 'ఇకిగాయ్'లో భాగం. స్పష్టమైన దృక్పథం ఉండటం దీర్ఘాయుష్కులు కావటానికి దోహదపడుతోందని చైనీస్ యూనివర్సిటీ ఆఫ్ హాంగ్ కాంగ్‌లోని ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ గార్డెన్ మాథ్యూస్ అభిప్రాయపడ్డారు.

■ జపాన్‌లో మాత్రమేనా...

- కేవలం జపాన్‌లో మాత్రమే ప్రజలు దీర్ఘకాలం పాటు జీవిస్తున్నారా? ఇతర దేశాల్లో ఇంకెక్కడా ఇటువంటి పరిస్థితి లేదా? అని పరిశీలించినప్పుడు ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూశాయి.
- ఇటలీ, గ్రీస్, కోస్టా రీకా, కాలిఫోర్నియాల్లో సైతం ఎక్కువకాలం జీవిస్తున్న ప్రజలు కనిపిస్తారు.





వారి ఆహారం, అలవాట్లు ఏమిటి?

- దీర్ఘకాలం జీవించే వారు పూర్తిగా శాకాహారులు కానప్పటికీ వారి ఆహారంలో ఎక్కువగా కూరగాయలు, పళ్లు-ఫలాలు, ఆకుకూరలు ఉంటున్నాయి.
- పోషక విలువలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవటం వల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించే అవకాశం కలుగుతోంది.
- కేవలం ఆహారం మాత్రమే కాకుండా ఇతర అలవాట్లు, జీవన విధానం, ఇష్టాఇష్టాలు మనిషి ఆయుర్ధాయాన్ని నిర్ణయిస్తాయి.

- వందేళ్లు జీవించటం అనేది ఈ ప్రాంతాల్లో మామూలు విషయం.
- ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ప్రజలు ఎక్కడి వారైనా దీర్ఘాయుష్కుల జీవన విధానంలో, ఆహార నియమాల్లో పోలికలు కనిపించాయి.
- అతి సాధారణ జీవన విధానం, తమకేం కావాలనే స్పష్టత, ఖాళీగా లేకుండా ఆసక్తి ఉన్న పని చేస్తూ ఉండటం, పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవటం ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలు దీర్ఘకాలం పాటు జీవిస్తున్నట్లు పరిశోధకులు విశ్లేషిస్తున్నారు.

■ బ్రిటన్ల ఆయుష్షు పెరగటం లేదు...

యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధకులు ఒక ఆసక్తికరమైన విషయాన్ని కనుగొన్నారు. అదేమిటంటే... 2010 నుంచి 2015 మధ్య కాలంలో బ్రిటన్ల సగటు ఆయుర్ధాయంలో పెరుగుదల దాదాపుగా నిలిచిపోయింది. ఆయుర్ధాయం అధికంగా ఉన్న దేశాల్లో కొంతకాలం క్రితం వరకూ యూకే 20వ స్థానంలో ఉండేది. కానీ ఇప్పుడు ఎంతో కిందకు దిగజారిపోయింది. స్వీడన్, ఇటలీ, ఫ్రాన్స్, ఐర్లాండ్ దేశాలు ఈ విషయంలో యూకే కంటే ముందుకు వచ్చాయి. ఆయుర్ధాయం అధికంగా ఉన్న దేశాల్లో జపాన్, స్విట్జర్లాండ్, సింగపూర్, ఆస్ట్రేలియా, స్పెయిన్ మొదటి అయిదు స్థానాల్లో ఉన్నాయి. ఈ దేశాల్లో ప్రజలు 80 ఏళ్ల కంటే ఎక్కువ కాలం జీవిస్తున్నారు. మరోపక్క సియర్రా లియోన్, అంగోలా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, చాద్ దేశాల్లో అతి తక్కువ ఆయుర్ధాయం ఉంది. ఇవన్నీ ఆఫ్రికా దేశాలు. ఈ దేశాల్లో ప్రజలు గరిష్ఠంగా 50 ఏళ్లు మాత్రమే జీవిస్తున్నారు. తీసుకునే ఆహారంతో పాటు విద్య, ఉద్యోగావకాశాలు, పని పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు ఒక మనిషి ఆయుర్ధాయం మీద ప్రభావం చూపుతాయని బ్రిటన్‌లోని పరిశోధకులు విశ్లేషిస్తున్నారు.

■ దీర్ఘకాలం జీవిస్తున్న ప్రజలు ఎక్కడున్నారు?

- ఒకినావా, జపాన్
- సర్డినియా, ఇటలీ
- ఇకారియా, గ్రీస్
- నికోయా, కోస్టా రీకా
- లోమా లిండ్, కాలిఫోర్నియా

- ఈనాడు ప్రత్యేక విభాగం

అర్చకుల వేతనాలు తగ్గించే ప్రశ్నే లేదు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఈనాడు, అమరావతి: అర్చకుల వేతనాలు తగ్గించే ప్రశ్నే లేదని, ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం తనను కలిసిన అర్చక ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఈ విషయం స్పష్టం చేశారు. అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రూ. 10 వేల వేతనం పొందుతున్న ధార్మిక సిబ్బందికి వేతనం తగ్గించే సమస్యే లేదన్నారు. అసలు వేతనాలు తగ్గించాలన్న ఆలోచనే తమకు లేదంటూ అర్చకుల్లో, ధార్మిక సంస్థల్లో ప్రభుత్వం మీద అపోహలు సృష్టించే శక్తులపై అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. పనిగట్టుకుని ఇలాంటి ప్రచారాలు చేస్తున్న శక్తులను ఒక కంట కనిపెట్టుకుని ఉండాలన్నారు.

దైవాలకు నైవేద్యాలు సమర్పిస్తూ, జన శ్రేయస్సు కోరే అర్చకుల పరిస్థితి తమను కలచివేయడం వల్లే వారి జీతం కనీసం రూ. 5000 ఉండేలా తాము జీవో తెచ్చిన విషయాన్ని సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. అర్చక, ఉద్యోగుల జీతం, పారితోషిక నిధికి సంబంధించి మూలనిధిపై వచ్చిన వడ్డీ నుంచి చెల్లించామన్నారు. గత ఏడాది జనవరి నుంచి వేతనాలను రూ.10వేలకు పెంచామని, 923 మంది ధార్మిక సిబ్బందికి పారితోషిక నిధి నుంచి నెలకు రూ.10 వేల వేతనం చెల్లిస్తున్నామన్నారు. ఈ స్థాయి వేతనం పొందుతున్న ధార్మిక సిబ్బంది రాష్ట్రంలో 1,458 మంది ఉన్నారని చెప్పారు.

ఆరోగ్య కార్డులు ఇవ్వాలి

ఈ సందర్భంగా తమకు ఆరోగ్య కార్డులు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని అర్చక ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎంను కలిసిన వారిలో అత్తలూరి అక్షయలింగ శర్మ, వై.ఎస్.ఆర్.కె.ప్రసాద్ అంగర రాంబాబు తదితరులు ఉన్నారు.

సీఎంకు మంచి చేయాలన్న ఆలోచన లేదు

- నంద్యాల ఉపఎన్నిక ప్రచారంలో జగన్ విమర్శ
- అధికారంలోకొచ్చిన 3 నెలల్లో అగ్రిగోల్డ్ బాధితుల్ని ఆదుకుంటాం
- అవసరమైతే ముఖ్యమంత్రి చొక్కా, మంత్రి ఆది నిక్కరు విప్పిస్తామని వ్యాఖ్య

నంద్యాల - న్యూస్‌టుడే

అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అగ్రిగోల్డ్, కేశవరెడ్డి విద్యాసంస్థల బాధితులకు డబ్బులు ఇస్తామని వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల ఉపఎన్నికల ప్రచారంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి చేయాలన్న ఆలోచన లేదని పేర్కొన్నారు. ఆయన, ఆయన కుమారుడు, మంత్రులు విలువైన ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితుల కోసం డబ్బులు ఎలా వసూలు చేయాలో ప్రభుత్వం చూసుకుంటుందని, అవసరమైతే చంద్రబాబునాయుడు చొక్కా, ఆదినారాయణరెడ్డి నిక్కర్ విప్పిస్తామని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం, ఇళ్లు కట్టిస్తానని చెప్పారని.. ఒక్క ఇల్లైనా కట్టించారా? అని ప్రశ్నించారు. పేదలందరికీ ఎకరం భూమి ఇచ్చి వ్యవసాయదారులను చేస్తానన్నారని, ఆ హామీ ఏమైందని నిలదీశారు. ఉన్న భూములు లాక్కోకుంటే చాలు దేవుడా అనే పరిస్థితిలో ప్రజలు ఉన్నారని తెలిపారు. రేషన్ దుకాణాలకు పోతే తొమ్మిది రకాల సరకులు వచ్చేవని, ఇప్పుడు కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని పునరుద్ఘాటించారు. వేలిముద్రలు పడడం లేదని ఉన్న బియ్యం కూడా ఊడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం నుంచి ఆదాయం పెరిగిందని, ప్రతి కాలనీలో మద్యం దుకాణం పెట్టారని, ఫోన్ చేస్తే మద్యం వచ్చే ఏర్పాట్లు చేశారని విమర్శించారు. ప్రజారంజకమైన వైఎస్ పాలనను గుర్తు చేసుకోవాలని సూచించారు. ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీతో పేద కుటుంబాలను వైఎస్ ఆదుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆస్పత్రులకు ఎనిమిది నెలలుగా బిల్లులు చెల్లించలేదని పేర్కొన్నారు. 108కి ఫోన్ చేస్తే డీజిల్‌కు డబ్బులు లేవని, డ్రైవర్లకు జీతాలు లేక సమ్మెలో ఉన్నారని సమాధానం వస్తుందని వివరించారు. తాము అధికారంలోకి వస్తే ఇల్లు లేని వారందరికీ బ్యాంకు రుణం ఇప్పించి ఇల్లు కట్టించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి నెలనెలా అప్పు తిరిగి చెల్లించేలా చూస్తామని అన్నారు. తనకు ముఖ్యమంత్రి పదవి లేదని, భయపెట్టే పోలీసులు లేరని, ఉన్నది లేనట్లు చూపించే ఛానళ్లు లేవని, ముఖ్యమంత్రిలాగా డబ్బులు లేవని పేర్కొన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చేందుకు ముఖ్యమంత్రి హామీనిచ్చారని, దాన్ని నెరవేర్చారా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక వారిని ఎస్టీలుగా మార్చేందుకు తీర్మానిస్తామని హామీనిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ అందించిన ఇంత పెద్ద కుటుంబం తనకు అండగా ఉందని పేర్కొన్నారు. ఎస్.మోహన్‌రెడ్డి పేరున్న పది మందితో నామినేషన్ వేయించి కుయుక్తులు పన్నారని, ఫ్యానును గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ అనంతవెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో నంద్యాలలో సెల్ఫీ దిగుతున్న అభిమానులు

కొడుకుపై నమ్మకం లేకే నంద్యాలకు రానివ్వడం లేదు: రోజా

ఉపఎన్నికలో ఓడిపోతానన్న భయం ముఖ్యమంత్రి చంద్రబాబును వెంటాడుతోందని వైకాపా ఎమ్మెల్యే రోజా విమర్శించారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలువలేని తన కొడుకును అడ్డదారుల్లో మంత్రిని చేసుకున్న చంద్రబాబు ఆయన్ని కనీసం ప్రచారానికి తీసుకొచ్చే పరిస్థితుల్లో లేరని విమర్శించారు. తన కుమారుడు ఎక్కడ కాలు పెడితే అక్కడ సర్వనాశనం అవుతుందని హైదరాబాద్ ఎన్నికల్లో తెలుసుకున్నందునే ఇక్కడి ప్రచారానికి దూరం పెట్టారని ఆరోపించారు. బాలయ్య బహిరంగంగా డబ్బులు పంచుతున్నా ఎలాంటి కేసు లేకుండా చేసుకున్న ఘనత బాబుకే దక్కిందని పేర్కొన్నారు.

నంద్యాల మనదే...

- కాకినాడలోనూ ఏకపక్షంగా గెలవాలి
- పార్టీ నాయకులతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

ఈనాడు అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలో తెదేపా గెలుపు ఖాయమైందని, కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలోనూ మన పార్టీ ఏకపక్షంగా గెలవాలని ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టంచేశారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కాకినాడ ఎన్నికల్ని పర్యవేక్షిస్తున్న మంత్రులు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, పరిశీలకులతో చంద్రబాబు శుక్రవారం రాత్రి బాగా పొద్దుపోయాక తిరుపతి నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొదట కాకినాడలో పరిస్థితిని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప వివరించారు. చంద్రబాబు మాట్లాడుతూ... "అన్ని వార్డుల్లో తెదేపా గెలుపు ఏకపక్షం కావాలి. ఏ మాత్రం ఉపేక్ష వద్దు. కష్టపడి పనిచేయండి. కాకినాడను ఆకర్షణీయ నగరంగా అభివృద్ధి చేస్తున్నాం. రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. రూ.1212 కోట్లతో మరిన్ని పనులు ప్రారంభిస్తున్నాం. మూడేళ్ల స్వల్పకాలంలోనే అనేక పనులు చేశాం. రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాం. పారిశుద్ధ్యం మెరుగుపరిచాం. మన సత్తా నిరూపించుకునే సమయం వచ్చింది. సమర్థ నాయకత్వం ఇవ్వాలి. ప్రజల్ని చైతన్య పరచాలి' ' అని పేర్కొన్నారు. ప్రచారానికి సమయం తక్కువగా ఉందని, ఈ 8 రోజుల్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. అన్ని వార్డుల్లో గెలవాలని, ఉత్సాహంగా పనిచేయాలని తెలిపారు. వార్డుల వారీగా పార్టీ బలాబలాలను ఆయన సమీక్షించారు. తెదేపా, భాజపా అభ్యర్థుల గెలుపుని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పనిచేయాలని స్పష్టంచేశారు.

డీఎస్పీపై ఎన్నికల సంఘం బదిలీ వేటు

ఈనాడు, అమరావతి: నంద్యాల డీఎస్పీ గోపాలకృష్ణను శుక్రవారం ఎన్నికల సంఘం ఆకస్మికంగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఓఎస్డీ రవిప్రకాశ్‌కు బాధ్యతలు అప్పగించింది. గోపాలకృష్ణపై పలు అవినీతి ఆరోపణలున్నాయని, ఎన్నికల ముందు ఉద్దేశపూర్వకంగానే ఆయన్ను నంద్యాలలో నియమించారని ఆరోపిస్తూ వైకాపా ఇటీవల ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై విచారణ జరిపిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపారు. ఆ నివేదిక ఆధారంగా గోపాలకృష్ణపై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. మరోవైపు నంద్యాల ఉప ఎన్నికల కోసం ప్రత్యేకంగా సాధారణ, ఎన్నికల వ్యయ, పోలీసు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. ఒక ఉప ఎన్నికకు ఇంత మంది పరిశీలకులను నియమించడం ఇదే తొలిసారని అధికార వర్గాలు చెబుతున్నాయి. నంద్యాల ఉప ఎన్నిక అత్యంత సున్నితంగా మారిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది.

ఈసీకి ఏపీ నిఘా విభాగం ఫిర్యాదు

- సీఎం ప్యాంట్రీ వాహనంపై తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై సమగ్ర విచారణ జరపాలని వినతి

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సంబంధించిన ప్యాంట్రీ వాహనంలో నగదు తరలిస్తున్నారంటూ ఎన్నికల సంఘానికి తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఏపీ నిఘా విభాగం అధికారులు శుక్రవారం రాత్రి ఎన్నికల సంఘానికి మౌఖికంగా ఫిర్యాదు చేశారు. శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు నిఘా విభాగాధిపతి ఏబీ వెంకటేశ్వరరావు తెలిపారు. అత్యంత భద్రత కలిగిన ప్రముఖుల జాబితాలో ఉన్న ముఖ్యమంత్రికి సంబంధించిన ప్యాంట్రీ వాహనం గురించిన సమాచారాన్ని బయట పెట్టి, ఆయన భద్రతకు ముప్పు కలిగించాలన్న దురుద్దేశంతో ఎవరైనా ఇలా ఫిర్యాదు చేశారా! లేదా ఇంకేమైనా కోణం ఉందా! దర్యాప్తు చేసి ఆ వివరాలు అందజేయాలని కోరినట్టు తెలిపారు.

సర్వేలపై నిషేధాన్ని ఎత్తేయాలి

కేంద్ర ఎన్నికల సంఘానికి తెలుగుదేశం పార్టీ వినతి

ఈనాడు, దిల్లీ: నంద్యాల ఉప ఎన్నిక పూర్తయ్యేంత వరకూ ఆ నియోజకవర్గ పరిధిలో ఒపీనియన్ పోల్స్, సర్వేలను నిషేధిస్తూ రిటర్నింగ్ అధికారి జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని తెలుగుదేశం పార్టీ కేంద్ర ఎన్నికలసంఘాన్ని కోరింది. ఈమేరకు తెదేపా ఎంపీలు కొనకళ్లనారాయణ, కేశినేని నాని, సీఎం రమేష్‌లు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించారు. "ఒపీనియన్ పోల్స్ నిషేధంపై కేంద్ర ఎన్నికలసంఘం ఇంతవరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయినప్పటికీ నంద్యాల నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఒపీనియన్ పోల్స్‌ను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాలను పాటించని సర్వే టీంలను కూడా అరెస్టుచేయమని ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికలసంఘం మార్గదర్శకాలు, రాజ్యాంగ మూలసూత్రాలకు వ్యతిరేకంగా ఏపీ, తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి జారీచేసిన మెమోను, నంద్యాల రిటర్నింగ్ అధికారి జారీచేసిన ఉత్తర్వులను తక్షణం రద్దుచేయాలి" అని కోరారు.

వైకాపా డబ్బు పంపిణీపై ఫిర్యాదు: నంద్యాల వైకాపా అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి కడప జిల్లా నుంచి రౌడీషీటర్లను తరలించి ఓటర్లకు పెద్దఎత్తున డబ్బుపంచుతున్నట్లు తెలుగుదేశం పార్టీ ఎంపీలు కొనకళ్లనారాయణ, కేశినేనినాని, సీఎం రమేష్‌లు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నడిచే సాక్షి మీడియా ప్రతినిధులు ఓటర్లకు డబ్బుపంపిణీలో కీలకపాత్ర పాత్రపోషిస్తున్నట్లు ఫిర్యాదుచేశారు. వైకాపా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కిరాయి మనుషులతోకలిసి నంద్యాలపోలీస్‌స్టేషన్‌పై దాడిచేసినట్లు తెలిపారు. ఉప ఎన్నిక నేపథ్యంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుపైనా, పార్టీ నాయకులపైనా సాక్షి పత్రికలోను, ఛానల్‌లోను విద్వేషపూరిత కథనాలు ప్రచురిస్తున్నారని, ప్రసారం చేస్తున్నారని కేంద్ర ఎన్నికల సంఘానికి తెదేపా ఫిర్యాదు చేసింది. ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పేరుతో కేంద్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు లేఖను పంపించారు.

జగన్ తీరుతో విద్యార్థుల జీవితాలు నాశనం

- మంత్రి సోమిరెడ్డి ధ్వజం

నంద్యాల, న్యూస్‌టుడే; ఈనాడు, అమరావతి: తనకున్నది విశ్వసనీయత అంటూ వైకాపా అధినేత జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని, డబ్బులు పంచడమేనా మీ విశ్వసనీయత అని వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. నంద్యాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడేళ్లు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు చేసి జప్తు చేసిన ఆస్తులు ఎవరివని ప్రశ్నించారు. నంద్యాలలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వైకాపా నాయకులు, కౌన్సిలర్లు డబ్బులు పంచుతూ పట్టుబడ్డారని వివరించారు. పట్టుబడ్డ వారిలో విద్యార్థులు ఉన్నారని, జగన్ వల్ల వారు కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వైకాపా చాప చుట్టడం ఖాయం: ఆనందబాబు

ఉపఎన్నికలో ఓడిపోతామనే భావనతో శాంతి భద్రతలకు విఘాతం కల్పించి ఎన్నికలు నిలిపివేసే ఆలోచనలో జగన్ ఉన్నారని మంత్రి ఆనందబాబు ఆరోపించారు. అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచిస్తుంటే అరాచకం సృష్టించేలా జగన్ యోచిస్తున్నారని విమర్శించారు.

అరాచకం సృష్టిస్తున్నారు: ఆదినారాయణరెడ్డి

గెలవడానికి జగన్ అరాచకం సృష్టిస్తున్నారని మంత్రి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేస్తుంటే వాటిని చూడకుండా గుడ్డిగా విమర్శిస్తున్నారన్నారు.

ఐఎస్ కంటే జగన్ ప్రమాదకరం: రవీంద్ర

ప్రపంచానికి ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ ఎంత ప్రమాదకారిగా మారిందో వైకాపా అధ్యక్షుడు జగన్ రాష్ట్రానికి అంతకంటే ప్రమాదకారిగా మారారని రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాశాఖల మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. వచ్చే రెండు నెలల్లో రాష్ట్రంలో నిరుద్యోగులకు నిరుద్యోగభృతిని అందజేయనున్నామని ప్రకటించారు.

గొడ్డలి గుర్తు పెట్టుకోవాలి: ఎమ్మెల్సీ రామకృష్ణ

వైకాపా అధినేత మాట్లాడుతున్న తీరు, ఆ పార్టీ నాయకులు చేస్తున్న పనులు రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామకృష్ణ తెలిపారు. సీఎంను సైతం కాల్చివేయాలంటూ అభివృద్ధికి ఆటంకవాదిగా మారిన వైకాపా ఫ్యాను గుర్తును తొలగించి గొడ్డలి గుర్తు పెట్టుకుంటే మంచిదన్నారు.

హుందాగా మాట్లాడటం నేర్చుకోవాలి: సునీత

కర్నూలు: ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై జగన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదని, ఆయన హుందాగా వ్యవహరించడం నేర్చుకోవాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత హితవు పలికారు. నంద్యాలలో మంత్రి అఖిలప్రియతో కలిసి ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. ఎవరెన్ని మాయమాటలు చెప్పినా, మభ్యపెట్టినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని.. తెలుగుదేశాన్ని గెలిపిస్తారని ఆమె పేర్కొన్నారు. పొదుపు మహిళలకు ప్రతి ఒక్కరికీ రూ.పది వేలు మూడు విడతలుగా అందజేశామని వివరించారు. రుణమాఫీ చేయలేదనడం జగన్ అవగాహన లేమికి నిదర్శనమన్నారు. 46 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. అప్పట్లో శోభానాగిరెడ్డి పెనుగొండ ఎన్నికల ప్రచారానికి వచ్చారని, ఈరోజు ఆమె లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న మంత్రి సునీత. పక్కన మంత్రి అఖిలప్రియ



కర్నూలులో శుక్రవారం ఉన్నతాధికారులతో సమావేశమైన డీజీపీ

ఉపఎన్నికకు ముగ్గురు ఐపీఎస్‌ల పర్యవేక్షణ

కర్నూలు, న్యూస్‌టుడే: నంద్యాల ఉపఎన్నిక నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, పర్యవేక్షణ బాధ్యతలను ముగ్గురు ఐపీఎస్‌లకు అప్పగిస్తున్నామని డీజీపీ సాంబశివరావు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఇన్‌స్పెక్టర్‌తో కూడిన బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉపఎన్నిక నేపథ్యంలో శుక్రవారం కర్నూలుకు వచ్చిన ఆయన రాయలసీమ రేంజి ఐజీ షేక్‌మహ్మద్ ఇక్బాల్, కర్నూలు రేంజి డీఐజీ ఘట్టమనేని శ్రీనివాస్, ఎస్పీ గోపీనాథ్ జెట్టిలతో గంటపాటు సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల సేవలను వినియోగించుకోనున్నట్లు చెప్పారు. ముఠాకక్షలు ఉన్న గ్రామాల్లో బందోబస్తుకు ఏపీఎస్పీ పోలీసులను, స్థానిక పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. ఎన్నికల రోజున షాడో పార్టీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నంద్యాలకు శుక్రవారం ఒక్క రోజునే ఆరు కంపెనీల నుంచి 600 మంది పారామిలటరీ బలగాలు వచ్చాయి.

నంద్యాలలో పులివెందుల రౌడీలు దిగారు: ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్

ఈనాడు, అమరావతి: ఉపఎన్నికలో వైకాపా నేతలు అల్లర్లు, అరాచకం సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారని తెలుగుదేశం నేత, ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. వెలగపూడి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరాచకం సృష్టించడానికి వారు ఇప్పటికే పులివెందుల నుంచి రౌడీలను, అల్లరిమూకలను నంద్యాలలో దించారని ఆరోపించారు. ఆర్థిక ఉగ్రవాదానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు విమర్శించారు.

ఒప్పంద ఉద్యోగుల సర్వీసులు పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సేవలను మరో ఏడాది పాటు పొడగిస్తూ ఆర్థిక శాఖ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఆగస్టు ఒకటి నుంచి వచ్చే ఏడాది జులై 31వ తేదీ వరకు వారి సేవలను పొడిగిస్తున్నట్లు ఇందులో పేర్కొన్నారు.

డయాలసిస్ రోగులకు రూ.2500 పింఛను

- త్వరలో కేబినెట్ ముందుకు దస్త్రం
- వైద్య విద్యలో బహుళైచ్ఛిక విధానం
- కర్నూలులో స్టేట్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు..
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని



రాష్ట్ర స్థాయి వైద్య విద్య కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి కామినేని శ్రీనివాస్

ఈనాడు–గుంటూరు, మంగళగిరి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ కింద అర్హులైన పేదలకు ఉచితంగానే డయాలసిస్ సేవలను నిత్యం అందించేలా యూనిట్లు నెలకొల్పుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపారు. జీవితాంతం డయాలసిస్ సేవలు అవసరమైన వారికి నెలకు రూ.2,500 పింఛన్ ఇవ్వాలని నిర్ణయించామని దీనికి సంబంధించిన దస్త్రం త్వరలో క్యాబినెట్ ముందుకు రాబోతుందని స్పష్టం చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 22 పడకలతో కొత్తగా ఏర్పాటైన డయాలసిస్ యూనిట్‌ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జీజీహెచ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డయాలసిస్ సేవలకు ఒక్కో పేషెంట్‌కు ఆరోగ్యశ్రీ కింద ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రులకు రూ.1250 చొప్పున ప్రజాధనాన్ని భారీగా దోచిపెట్టారని విమర్శించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే...

★ ప్రస్తుతం రూ.1027కు డయాలసిస్ సేవలు అందించేలా ఒప్పందం చేసుకున్నాం, ప్రతి రెండు పడకలకు ఒక టీవీ ఏర్పాటు చేయాలనేది నిబంధన . సగటున ఒక పేషెంట్ 5 గంటలు ఈ సేవలు పొందాల్సి ఉంటుంది, అంతసేపు వినోదం లేకుండా ఉండటం కష్టం. అందుకే ఈ ఏర్పాటు.

★ వైద్యులకు టైమ్ బౌండ్ (నిర్ణీత కాల వ్యవధిలో) పదోన్నతులు కల్పిస్తాం. మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు విశాఖ, కర్నూలు, గుంటూరులో నిత్యం జరిగేలా చర్యలు తీసుకుంటాం. తాజాగా కేంద్రం ప్రకటించిన విధంగా ఇంప్లాంట్ ధరల తగ్గుదలకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రులు వాటిని అమలు చేసేలా మార్గదర్శకాలు జారీ చేస్తాం

★ రాష్ట్ర విభజన అనంతరం గుంటూరు జీజీహెచ్ కేంద్ర బిందువుగా మారింది. దీని అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నాం. గతంలో సీఎం పర్యటించినప్పుడు కేటాయిస్తామన్న ప్రత్యేక అభివృద్ధి నిధి రూ.4 కోట్లు కేటాయిస్తాం.

వైద్య విద్యలో బహుళైచ్ఛిక విధానం

అంతకుముందు గుంటూరులో ఆంధ్రప్రదేశ్ సర్జన్ల సంఘం, ఎన్నారై, కాటూరి, గుంటూరు వైద్య కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వైద్య విద్య కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైద్య విద్యలో బహుళైచ్ఛిక(ఆబ్జెక్టివ్) విధానంలో ప్రశ్నలను ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఫిర్యాదు, నిపుణుల సూచన మేరకు.. ఈ విధానం అమలుపై భారత వైద్య మండలి(ఎంసీఐ) అధ్యక్షురాలితో చర్చించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

★ ప్రభుత్వాసుపత్రుల్లో సూపర్ స్పెషాలిటీ అర్హత ఉన్న వైద్యులకు ఇచ్చేవేతనాలు తక్కువగా ఉంటున్నందున కార్పొరేటు ఆసుపత్రుల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. వీరిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్వచ్ఛందంగా పనిచేసేందుకుఆసక్తిఉన్నవారిని ఆహ్వానిస్తున్నామన్నారు.

కర్నూలులో రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ సెంటర్

★ గుంటూరు జిల్లా మంగళగిరిలో మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. కర్నూలులో రూ.120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం దీనికి రూ.54 కోట్లు నిధులు మంజూరు చేస్తూ గురువారం లేఖ పంపిందన్నారు. గుంటూరులో నాట్కో రూ. 16.5 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.13 కోట్లు కలిపి గుంటూరులో లీనియర్ యాక్సిలరేటర్లు రెండు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మంగళగిరి ప్రభుత్వాసుపత్రిలో రూ.40 లక్షలతో సౌకర్యాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారు.

శ్రీశైలం అభివృద్ధికి కేంద్ర సాయం

'ప్రసాద్' పథకంలో రూ.50 కోట్ల మంజూరుకు ఆమోదం

ఈనాడు, అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీశైలం సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రిజునువేషన్ స్పిరిచ్యువల్ ఆగ్యుమెంటేషన్ డ్రైవ్) పథకంలో ఈ నిధుల మంజూరుకు సంబంధిత కమిటీ ఆమోదం తెలిపింది. ఇందులో తొలివిడత కింద 20 శాతం నిధులను వారం రోజుల్లోనే రాష్ట్రానికి ఇవ్వనున్నారు. శుక్రవారం దిల్లీలో జరిగిన కేంద్ర మంజూరు, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి ముకేష్‌కుమార్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జి ఎండీ హిమాన్షుశుక్లాలు శ్రీశైలం అభివృద్ధి పనులపై ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రధాన ఆలయం అభివృద్ధికి రూ.16.50 కోట్లు; కొండపై అంతర్గత రహదారుల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్‌కు రూ.13.61 కోట్లు; రెండు చోట్ల పార్కింగ్ ఏర్పాటుకు రూ.2.72 కోట్లు; శిఖరం అభివృద్ధికి రూ.4.28 కోట్లు అవసరమని నివేదించారు. పాతాళగంగకు వెళ్లేందుకు ఉన్న రోప్ వే విస్తరణ, హఠకేశ్వరంలో అభివృద్ధి పనులు, దేవాలయానికి విద్యుత్‌దీపాల అలంకరణ, అత్యాధునిక సాంస్కృతిక ప్రదర్శన కేంద్రం, సౌండ్ లైటింగ్ ప్రదర్శన ఏర్పాటుకు సిద్ధం చేసిన ప్రతిపాదనలను వివరించారు.

అయిదు కేంద్రాలనూ కలుపుతూ... రాష్ట్రంలోని అమరావతి, తొట్లకొండ, బావికొండ, నాగార్జునసాగర్, శ్రీకాకుళంలోని బుద్ధిస్ట్ కేంద్రాలను కలుపుతూ సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పనులకు 'ప్రసాద్' పథకం నుంచి నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరింది. సోమవారం దిల్లీలో జరగనున్న సమావేశంలో దీనిపై ఒక నిర్ణయం వెలువడనుంది.

ఎమ్మెల్యేలు, అధికారులకు బహుళ అంతస్తుల భవనాలు

- మొత్తం 68 టవర్ల నిర్మాణం
- అధికారులు, ఉద్యోగుల హోదాను బట్టి ఫ్లాట్ విస్తీర్ణం
- రూ.1991 కోట్లతో 3864 ఫ్లాట్లు
- 68.49 ఎకరాల్లో నిర్మాణం
- మూడు ప్యాకేజీలుగా టెండర్లు

ఈనాడు అమరావతి: రాజధాని అమరావతిలోని పరిపాలనా నగరంలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, గెజిటెడ్ అధికారులు, ఇతర ఉద్యోగులకు గృహనిర్మాణానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్‌డీఏ) శుక్రవారం టెండర్లు పిలిచింది. రూ.1991 కోట్ల అంచనా వ్యయంతో 3864 ఫ్లాట్లు నిర్మించనున్నారు. సెప్టెంబరు 30న పనులు ప్రారంభించి, 2018 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలన్నది లక్ష్యం. వీరి కోసం మొత్తం 68 బహుళ అంతస్తుల భవనాలు నిర్మించనున్నారు. ప్రతి భవనంలో స్టిల్ట్+12 అంతస్తులుంటాయి. అధికారుల హోదాని బట్టి ఫ్లాట్‌లో నిర్మిత ప్రాంతాన్ని నిర్ణయించారు. మొత్తం భవనాల్ని మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచారు. పరిపాలనా నగరంలో సెంట్రల్ స్పైన్(మధ్యలో ఉన్న రహదారి)కి అటూఇటూ ఈ నిర్మాణాలు వస్తాయి.

'షియర్‌వాల్ టెక్నాలజీ'తో నిర్మాణం.. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులకు నివాస భవనాల నిర్మాణానికి షియర్‌వాల్ టెక్నాలజీని వినియోగించనున్నారు. 3500 చ.అడుగుల కేటగిరీ భవనాలన్నీ ఒక ప్యాకేజీగా, 1800, 1500, 900 చ.అడుగుల కేటగిరీ భవనాలన్నీ మరొక ప్యాకేజీగా, 1200 చ.అడుగుల కేటగిరీ భవనాలు వేరొక ప్యాకేజీగా చేసి టెండర్లు పిలిచారు. ప్రతి కాలనీలో క్లబ్ హౌస్, రిక్రియేషన్ సెంటర్, ఈతకొలను, ఫంక్షన్ హాల్, సూపర్‌మార్కెట్, వెయిటింగ్ హాల్, పార్కులు, క్రీడా సదుపాయాలు వంటివి కల్పించనున్నారు. ప్రజాప్రతినిధులు, అఖిలభారత సర్వీసుల అధికారులకు కొంత విలాసవంతమైన ఫ్లాట్లు నిర్మించనున్నారు. వీరికి నిర్మించే భవనాల్లో ఒక్కో అంతస్తులో రెండు ఫ్లాట్లే ఉంటాయి.

ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల్ని ఆరు కేటగిరీలుగా విభజించారు. వారి హోదాని బట్టి 900 చ.అడుగుల నుంచి, 3,500 చ.అడుగుల వరకు నిర్మిత ప్రాంతం ఉన్న ఫ్లాట్లను నిర్మించనున్నారు. వివరాలు ఇలా..

కేటగిరీ	మొత్తం యూనిట్లు (ఫ్లాట్లు)	ఫ్లాటు విస్తీర్ణం (చ.అడుగులు)	ఎన్ని టవర్లు	ఒక్కో అంతస్తులో ఎన్ని ఫ్లాట్లు	వ్యయం (రూ.కోట్లలో)
ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ	288	3,500	12	2	386
అఖిల భారత సర్వీసుల అధికారులు	144	3,500	6	2	167
గెజిటెడ్ అధికారులు (టైప్-1)	384	1800	8	4	215
గెజిటెడ్ అధికారులు (టైప్-2)	336	1500	7	4	160
నాన్ గెజిటెడ్ అధికారులు	1944	1200	27	6	694
క్లాస్-డి ఉద్యోగులు	768	900	6	8	188
ఇతర ఖర్చులు	-----	-------	---	--	180

స్నానాల గదిలో గృహిణి దారుణ హత్య

- లైంగిక దాడి జరిగినట్లు అనుమానం
- కనిపించకుండా పోయిన భర్త, పిల్లలు
- భర్తే చంపాడని భావిస్తున్న పోలీసులు



రాజేశ్వరి మృతదేహం



రాజేశ్వరి భర్త రాజు

ఈనాడు, హైదరాబాద్: ఓ గృహిణి దారుణ హత్యకు గురైంది. స్నానాల గదిలో ఉండగా ఆమె గొంతుకు తువ్వాల, బెల్టు బలంగా బిగించి హత్య చేసినట్లు తెలుస్తోంది. హత్యకు ముందు ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన అనంతరం మృతురాలి భర్త, ఇద్దరు పిల్లలు కనిపించకుండా పోవడంతో భర్తే ఆమెను హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు ఘటన వివరాలను జూబ్లీహిల్స్ పోలీసులు వెల్లడించారు. వైజాగ్‌లోని నక్కపల్లికి చెందిన బొద్దాడి రాజు(32), భార్య రాజేశ్వరి(28) వీరి ఇద్దరు పిల్లలు ఆకాశ్(10), మహి(8) బోరబండ సమీపంలోని ఆరోగ్యనగర్‌లో నివసిస్తున్నారు. రాజు ఏ పనీ చేయకుండా తిరుగుతుంటే.. భార్య రాజేశ్వరి ఓ వ్యాయామశాలలో పని చేసేది. శుక్రవారం మధ్యాహ్నం వీరి ఇంటికి వెళ్లిన పక్కింటి మహిళ.. స్నానాల గదిలో రాజేశ్వరి అచేతనంగా ఉండటం చూసి స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వచ్చే సరికే ఆమె ప్రాణాలు విడిచినట్లు గుర్తించారు. ఆమె మెడను తువ్వాల, బెల్టుతో చుట్టి గట్టిగా లాగడంతో మృతిచెందినట్లు భావిస్తున్నారు. రాజేశ్వరి తల, శరీరంపై కూడా గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. రాజు, రాజేశ్వరి రెండు నెలల కిందటే ఆరోగ్యనగర్‌కు వచ్చారని, ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. వారి పిల్లలు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారని తెలిసి పోలీసులు అక్కడికి వెళ్లగా.. అప్పటికే వారిని తండ్రి తీసుకెళ్లారని ఉపాధ్యాయులు తెలిపారు. వివాహేతర సంబంధం విషయంపైనా తరచూ గొడవలు జరిగేవని పోలీసుల దర్యాప్తులో తెలుసుకున్నారు. గొడవ పడి భర్తే ఇలా చేశాడా..? లేక మరెవరైనా చేసి ఉంటారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డాలర్ శేషాద్రి, వాసుదేవన్‌లపై తదుపరి చర్యల ఉపసంహరణ

ఈనాడు–అమరావతి: తిరుమలలో అయిదు గ్రాముల బంగారం డాలర్లు మాయమైన వ్యవహారంలో అప్పటి సూపరింటెండెంట్ డాలర్ శేషాద్రి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఎ.వాసుదేవన్‌లపై తదుపరి చర్యలు ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఇద్దరూ ఇప్పటికే పదవీవిరమణ చేశారు. అప్పట్లో తిరుమలలో డాలర్ల మాయం వ్యవహారం పెద్ద సంచలనం రేపింది. దీనిపై విజిలెన్సు అధికారులు విచారణ జరిపి నివేదిక సమర్పించారు. ఈ వ్యవహారంలో షరాబు వెంకటాచలానికి న్యాయస్థానం గతంలోనే జైలు శిక్ష విధించింది. ఈ ఇద్దరికీ కేసుతో సంబంధం లేదని చిత్తూరు జిల్లా కోర్టు మూడేళ్ల కిందట పేర్కొంది. విజిలెన్సు నివేదికపై ప్రభుత్వం విచారణ కమిషన్‌ను నియమించింది. అది ఈ వ్యవహారంలో ఈ ఇద్దరి పాత్ర లేదని పేర్కొంది. ఆ నివేదికను చీఫ్ విజిలెన్సు కమిషనర్‌కు పంపించారు. వారి సిఫార్సు మేరకు ప్రస్తుతం ఈ ఇద్దరు అధికారులపై తదుపరి చర్యలు ఉపసంహరించుకుంటూ దేవాదాయ,ధర్మాదాయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.

పట్టాలెక్కని హుద్‌హుద్ తుపాను పనులు

- టెండర్ల దశలోనే భూగర్భ విద్యుత్ వ్యవస్థ

ఈనాడు, అమరావతి: హుద్‌హుద్ తుపాను నేపథ్యంలో విపత్తును తట్టుకునే విధంగా భూగర్భ విద్యుత్ వ్యవస్థను నిర్మించడంతోపాటు రోడ్ల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పనులు ప్రతిపాదించినా అవి ఇంకా పట్టాలెక్కలేదు. కొన్ని పనులకు ఇంకా సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు కూడా తయారు కాలేదు. ఇందు కోసం ఆంధ్రప్రదేశ్ విపత్తు పునరుద్ధరణ (రికవరీ) ప్రాజెక్టు కింద రూ.2,220 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఈ మొత్తంలో రూ.1,500 కోట్లు ప్రపంచ బ్యాంకు రుణం కాగా మిగిలింది రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానుకు చిగురుటాకు అయిన విశాఖపట్నంతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఈ మొత్తాన్ని వినియోగించనున్నారు. విద్యుత్ (తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ), పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలు, అటవీశాఖ, విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ తదితరాలను ఇందులో భాగస్వామి చేశారు. 2015 ఆగస్టులో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు కాలపరిమితి 2020 సెప్టెంబరుతో ముగుస్తుంది. విపత్తు ఏ స్థాయిలో ఉన్నా మళ్లీ విద్యుత్ పరంగా ఇబ్బంది లేకుండా ఉండేందుకుగాను విశాఖపట్నంలో భూగర్భ విద్యుత్ లైన్ల నిర్మాణానికిగాను టెండర్లను పిలిచారు. ఇవి మొత్తం నాలుగు ప్యాకేజీలు. అయితే టెండర్లు ఇంకా ఖరారు కావలసి ఉంది. తీరప్రాంత, బీచ్ ఫ్రంట్ పునరుద్ధరణ పనుల విషయంలో ఇంకా డీపీఆర్‌లు కూడా తయారు కాలేదు. ఈ నేపథ్యంలోనే అసంతృప్తిగా ఉన్న ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కనీసం నాలుగైదు వందల కోట్ల రూపాయల విలువ కలిగిన పనులు అయినా పూర్తి చేయాలని ఆయా శాఖలను ఆదేశించింది. పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ కూడా ఒత్తిడి తీసుకువస్తున్నారు.

వసుంధర

మెప్పించి.. తినిపించండి!

పిల్లలకి అన్నం తినిపించడం చాలామంది తల్లులకు ఓ పెద్ద ప్రహసనమే. వాళ్లకు ఏవీ ఓ పట్టాన నచ్చకపోవడమే అందుకు కారణం. మరి అలాంటి పిల్లలు ఇష్టంగా తినాలంటే..



పిల్లలకు ఆహారంపై ఇష్టం పెంచాలంటే కథల రూపంలో వాటి ప్రత్యేకతను వారికి తెలిసేలా చేయండి. అదీ కాదంటే ఆకట్టుకునేలా తయారుచేసి తినిపించే ప్రయత్నం చేయండి. మొక్కల పెంపకంపై ఇష్టాన్ని పెంచి... కొన్నింటిని వాళ్లే పెంచేలా చూడండి. ముఖ్యంగా టొమాటో, వంకాయ, కొత్తిమీర, మెంతికూర వంటివి వారు పెంచితే.. తెలియకుండానే వాటిపై ఇష్టం పెరుగుతుంది.

ఏ కూర వండినా, ఏ వంటకం చేసినా దాని రంగూ, రుచే కాదు.. రూపంతోనూ ఆకట్టుకోవచ్చు. ఉదాహరణకు ఎప్పుడూ ఒకే తరహా ఇడ్లీకి బదులు కూరగాయముక్కలన్నీ కలిపి వెజిటబుల్ ఇడ్లీని చేయొచ్చు. పండ్లూ, కూరగాయల్ని ఆకట్టుకునేలా కోసి... వడ్డించినా బాగుంటుంది.

మీ ఆహారపుటలవాట్లూ పిల్లలపై ప్రభావం చూపుతాయని మరిచిపోవద్దు మీరేమో ఘుమఘుమలాడేలా మసాలాలూ, జంక్‌ఫుడ్ తింటూ పిల్లలు ఫలానావే తినాలి అనడం, మీకు నచ్చని, తినని పదార్థాలను ఇంట్లో వండకపోవడం సరికాదు. ఇంట్లో పోషకాహారానికే ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. మీరు తింటే.. వాళ్లూ మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారు.

నిమ్మసువాసన వహ్వా!

కొన్ని వాసనలు మనసుకి హాయినిస్తాయి. అలాంటి పరిమళం కోసం.. బోలెడు ఖరీదు పెట్టి.. అరోమా నూనెల్నే వాడాలని లేదు. మరెలా అంటారా..



నిమ్మజాతి పండ్ల నుంచి వచ్చే వాసనలకి దుర్వాసను తొలగించే శక్తి ఉంటుంది. నీళ్లల్లో రెండు నిమ్మచెక్కల్ని వేసి మరగనివ్వండి. ఆ సువాసన గదంతా సులువుగా వ్యాపిస్తుంది. మనసూ తేలిక పడుతుంది.



దాల్చిన చెక్క నుంచి వచ్చే సువాసన ఒత్తిడిని ఇట్టే దూరం చేస్తుంది. దీని కోసం దాల్చిన చెక్కను పొడిగా చేసుకుని నిప్పుల మీద వేయాలి. అలా వచ్చే పొగ సువాసనలు వెదజల్లుతుంది. ఘాటైన దుర్వాసనలు దూరమవుతాయి.

సాంబ్రాణి పొగకూ అంతే శక్తి ఉంది. అది కూడా ఆధ్యాత్మిక పరిమళాలతో మెదడుని ఉల్లాసపరుస్తుంది. కాబట్టి కనీసం వారం పదిరోజులకోసారి ఇల్లంతా సాంబ్రాణీ పొగ వేయండి.

ఈ కాలంలో పూజామందిరం, హాలు వంటి చోట్ల చామంతులూ, గులాబీల్ని నీళ్లల్లో వేసి ఉంచి చూడండి. సువాసనలు వెదజల్లుతాయి.





ఒకరికి తండ్రి లేడు...మరొకరికి తల్లీతండ్రీ ఇద్దరూ లేరు అయితేనేం ఆటలోకి దిగితే మాత్రం ఇద్దరూ బంగారాలే. "ఆటలంటూ వెళ్తోంది....ఎక్కడికి వెళ్తోందో" అని కొందరు, "ఆటలాడితే అబ్బాయిలా మారిపోతారు.. పిల్లలూ పుట్టరు" అంటూ మరికొందరు సూటిపోటీ మాటలన్నా... తినడానికీ కష్టమైన పరిస్థితుల్లోనూ వారి కళ్ల ముందు లక్ష్యమే కనిపించింది. అడుగడుగునా ఎదురైన అడ్డంకులను సివంగుల్లా పోరాడి గెలిచిన ఆ అమ్మాయిలే... పవర్‌లిఫ్టర్‌లు సాయిరేవతి, చంద్రిక. తాజాగా కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు.

కష్టాలుంటేనేం... సాధించాలనుకున్నాం!

ఆడపిల్లకు ఆటలేంటీ అన్నారు!

- చంద్రిక

'పెళ్లి కావల్సిన ఆడపిల్లకు ఆటలు చేటు చేస్తాయి. ..' అన్నవాళ్ల మాటలు మొదట్లో నమ్మిన నేను కొన్నాళ్లు క్రీడలకే దూరం ఉండిపోవాల్సి వచ్చింది. అప్పుడు నేనెంత బాధపడ్డానో. కానీ ఆ తరవాతే అర్థం అయ్యింది. మన శక్తిని బాధపడటానికి కంటే మనపై మనం నమ్మకాన్ని పెంచుకోవడానికి ఉపయోగించాలని. అప్పుడే ఎంతటి కష్టాన్నైనా సులువుగా దాటేయగలుగుతాం అని. ఆ నమ్మకమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. ఎన్నో పతకాలు సాధించడానికీ, ఈ రోజు కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్ క్రీడలకు ఎంపికవ్వడానికీ అదే కారణం. నాకు ఊహ తెలిసేసరికే నాన్న అనారోగ్యంతో చనిపోయారు. మేం ముగ్గురం పిల్లలం. నేనే పెద్దదాన్ని. అంతా చిన్నపిల్లలమే కావడంతో అమ్మమ్మ మా బాధ్యత తీసుకుంది. ఏళ్లు గడిచిపోయాయి. అంతా కుదురుకున్నాం. మేం ముగ్గురం చక్కగానూ చదువుకుంటున్నాం. కానీ మనం ఒకటి తలిస్తే దేవుడు మరొకటి తలిచాడన్నట్లు అమ్మకి అనారోగ్యం. రెండు కిడ్నీలూ పాడైపోయాయి. బతికించుకోవాలని చేసిన ప్రయత్నమూ ఫలించలేదు. ఆమె మాకు దూరం అయ్యింది. అప్పటికి నేను టెన్త్ పాసయ్యానంతే. నిజానికి మొదటి నుంచీ నాన్న లేని పిల్లలం కావడంతో మా కాళ్లమీద మేం నిలబడాలనుకునేది అమ్మమ్మ. అందుకే ఉన్న కొద్దిపాటి భూమినీ అమ్మేసి మా పేరు మీద బ్యాంకులో వేసింది. ముగ్గురు పిల్లల్నీ మంచి చదువులు చదివించాలనుకున్నా ఆర్థిక స్థోమత సరిపోకపోవడంతో నేను మాత్రం ప్రభుత్వ పాఠశాలలో చేరిపోయా. అయినా ఎప్పుడూ చదువుల్లో ఫస్టే. పైగా కబడ్డీ కూడా ఆడేదాన్ని.

తప్పనిసరి పరిస్థితుల్లో... నేను కబడ్డీ ఆడుతున్నా నాకెందుకో పవర్‌లిఫ్టింగ్ అంటే ఇష్టం ఉండేది. అప్పటికే మా సీనియర్లు కొందరు పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాఠశాల స్థాయిలో రాష్ట్రం తరఫున పాల్గొన్నారు. పీటీ టీచర్‌ని అడిగితే సరేననడంతో అటు మారిపోయాను. అలా చదువుకుంటూనే ఆటల్లోనూ ఉండేదాన్ని. వెళ్లిన ప్రతిచోటా పతకం తేకుండా వచ్చేదాన్ని కాదు. ఇంట్లోవాళ్లు అది చూసి సంతోషించినా వేళాపాళా లేకుండా శిక్షణ, పోటీలు అంటూ వెళ్లడం బంధువులూ, ఇరుగుపొరుగువారికి వింతగా అనిపించేది. దాంతో అంతా ''ఎదుగుతోన్న ఆడపిల్లకి ఆటలేంటి'' అనేవారు. "ఆ నడక చూడండి. అచ్చం అబ్బాయిలా నడుస్తోంది. ఇక పిల్లలు పుట్టడమూ కష్టమే" అంటూ భయపెట్టేవారు. దాంతో ఇంట్లోవాళ్ల మాట కాదనలేక కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉన్నాను. ఇంటర్ పూర్తిచేసి, బీటెక్‌లో చేరా. నా అదృష్టమో ఏమో కానీ మా కాలేజీవాళ్లకి నేను పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణిని అని తెలిసి ప్రోత్సహించారు. అలా మళ్లీ ఆడటం మొదలుపెట్టా.

అడుగడుగునా ఇబ్బందులే: మళ్లీ ఆటల్లోకి అడుగు అయితే పెట్టాను కానీ... శిక్షణ కోసం నెల తిరిగే సరికి వేలల్లో డబ్బు అవసరమయ్యేది. మేముండేది మంగళగిరిలో. రోజూ రెండు పూటలా కాలేజీకి ముందూ, తరవాత విజయవాడ వెళ్లి సాధన చేసి రావాల్సి వచ్చేది. కాలేజీలో ఓ గంట ముందే పర్మిషన్ తీసుకుని సాధనకోసం వెళ్లిపోయేదాన్ని. ఇంటికి చేరుకునే సరికి రాత్రి పది. మళ్లీ ఉదయాన్నే నాలుగున్నరకే లేచి మళ్లీ సాధన. నెల తిరిగే సరికి వేలల్లో ఖర్చు...అంత మొత్తం ఎలా? అనుకున్నా. అమ్మమ్మ కొంతా, దాతలు మరికొంతా, కాలేజీవారు ఇంకొంతా సాయం చేయడంతో ఇబ్బందిలేకుండా సాగుతోంది. ఇక గాయాల సంఖ్య అయితే లెక్కేలేదు. వాటిని అధిగమించి సాధన చేస్తూనే ఉన్నా. వివిధ పోటీల్లో యాభైకి పైగా బంగార పతకాలు నా ఖాతాలో ఉన్నాయి. తాజాగా అలెప్పీలో జరిగిన సీనియర్ నేషనల్ 84 కేజీల విభాగంలో బంగారు పతకాన్నీ పొందాను. ఇప్పుడు ఆ గెలుపే.. కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకే ఎంపికయ్యేలా చేసింది.

జ్వరం వచ్చేసేది... - సాయిరేవతి

ఎన్ని సార్లు ఓడినా గెలవడానికి అవకాశం ఉంటుంది. అందుకే అనుకున్నది చేయలేకపోయానని బాధపడటం కంటే! ఇంకో కొత్త లక్ష్యం కోసం అడుగులేయడం మంచిదనుకున్నా. అదే నాకు కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో దేశం తరఫున ఆడే స్థైర్యాన్ని అందిస్తోంది. ఇప్పుడు అరవైమూడు కేజీల విభాగంలో పాల్గొనబోతున్నాను. నిజానికి మా ఇంట్లో ఎవరికీ క్రీడానేపథ్యం లేదు. అసలు ఆడపిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లే సందర్భాలూ తక్కువే. మాది గుంటూరు జిల్లాలోని బుర్రిపాలెం. నాలుగోతరగతిలో ఉన్నప్పుడే నాన్న అనారోగ్యంతో చనిపోయారు. దాంతో నానమ్మ వాళ్లు మమ్మల్ని దూరం పెట్టారు. ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. అమ్మ మమ్మల్ని తీసుకుని పుట్టింటికి పెద్దరావూరు వచ్చేసింది. ఈలోగా తాతయ్యా చనిపోయారు. ఉన్నది రెండెకరాల భూమి. మా బాధ్యతా అమ్మమ్మ మీదే పడింది. ఉన్న కొద్దిపాటి పొలం అమ్మేసి వచ్చిన మూడు లక్షల రూపాయలను బ్యాంకులో వేసి, ఇల్లు గడవడం కోసం అమ్మ కుట్టుపని చేయడం ప్రారంభించింది.

ఆర్థిక సాయంతో చదువు... నేను అక్కడే ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివా. డెబ్భై శాతం మార్కులతో పాసయ్యా. నా కల బీటెక్. అందుకే ఎంపీసీ చేయాలనుకున్నా. కానీ ఫీజులు కట్టే స్థోమత లేదు కాబట్టి సీఈసీలో చేరా. ఆ చదువుకీ హైదరాబాద్‌లో ఉన్న మా బంధువులు ఆర్థిక సాయం చేయాల్సి వచ్చింది. అక్క కూడా చదువుల్లో ముందుండేది. ఇంటరూ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యా. డిగ్రీలో చేరాకే మొదటిసారి నాకు పవర్‌లిఫ్టింగ్ గురించి తెలిసింది. ఓ రోజు మా కోచ్.. .'నీకు పవర్‌లిఫ్టింగ్ సరిపోతుంది. ప్రయత్నించొచ్చు కదా' అన్నారు. మొదట దాన్నో అభిరుచిలానే అనుకున్నా కానీ.. కష్టపడి పతకాలు తెచ్చుకుంటే గనుక మంచి ఉద్యోగం వస్తుందనీ, అంతకు మించి దేశంకోసం ఆడామన్న సంతృప్తి మిగులుతుందని అనిపించింది. అందుకే నేర్చుకోవడానికి సిద్ధమయ్యా.

ఎన్నో ఇబ్బందులు.. ఇంట్లో చెప్పకుండానే శిక్షణకు వెళ్లా మొదట్లో. కానీ నెమ్మదినెమ్మదిగా ఒంట్లో సత్తువ తగ్గిపోయేది. ఆ శిక్షణకు తగిన ఆహారం తీసుకోలేదుగా... అందుకే. అమ్మావాళ్లేమో భయపడ్డారు. 'మనకెందుకీ ఆటలు. ఓపిక ఉన్నంత వరకూ చదువుకో ఇవన్నీ వద్దు...' అనేశారు. కానీ నేను మొండిగా పట్టుబట్టడంతో ప్రోత్సహించారు. నాకేమో ప్రొటీన్ డైట్ సరిపోయేది కాదు. తరచూ జ్వరం వచ్చేసేది. బరువు పెరిగేదాన్ని కాదు. మొదట్లోనే నా తిండికోసం నెలకు ఇరవై వేల రూపాయలకు పైగానే ఖర్చుపెట్టేవారు. అమ్మా, అమ్మమ్మా తినకుండా నాకోసం దాచిపెట్టేవారు. నా తిండి కోసం కొన్నిసార్లు అప్పులు చేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇంటి అవసరాలను తీర్చలేక పెరట్లో కూరగాయలు పండించి అవి తినేవారు. అలా కష్టపడుతూనే పోటీలకు వెళ్లేదాన్ని. పతకాలు సంతోష తెచ్చిపెడుతున్నా..మరోపక్క బంధువులూ, తెలిసినవారు అమ్మ దగ్గరకు వెళ్లి 'ఆడపిల్ల ఆటలంటూ తిరుగుతోంది. మీదేమో మగదిక్కులేని కుటుంబం. రేపే సమస్య తెచ్చిపెడుతుందో. పెళ్లి చేసేయండి..' అని సలహా ఇచ్చేవాళ్లు.

అక్క జీతమూ నా తిండికే.. ఈలోగా అక్క చదువు పూర్తయి ఓ చిన్న ఉద్యోగంలో చేరింది. ఆమె ఖర్చులు మినహా మిగిలిన మొత్తం నా తిండికే పెట్టేది. అలా శిక్షణ మొదలుపెట్టిన ఎనిమిదినెలల తరవాత 2008లో కాలేజీ తరఫున మొదటిసారి నర్సరావుపేటలో పోటీలో పాల్గొన్నా. బంగారుపతకం వచ్చింది. అది మొదలు ఎక్కడ పోటీ జరిగినా పతకం సాధించేదాన్ని. నాగార్జునా విశ్వవిద్యాలయం పరిధిలో ఎనిమిది బంగారు పతకాలు అందుకున్నా. గత మూడేళ్ల నుంచీ సీనియర్ నేషనల్స్‌లో బంగారు పతకాలు వస్తున్నాయి. ఆ మధ్య ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు భుజం ఎముక విరిగిపోయింది. డాక్టర్లూ బరువులెత్తడం మంచిది కాదన్నారు. నా వల్ల ఇంకేమీ కాదన్నవాళ్లూ ఉన్నారు. కానీ అవేవీ పట్టించుకోలేదు. శారీరక బలహీనతను మానసిక స్థైర్యమే జయిస్తుందని నమ్మా. అదే నిజం అయ్యింది. తాజాగా జంషెడ్‌పూర్‌లో జరిగిన పోటీల్లోనూ స్ట్రాంగ్ ఉమన్ అవార్డుతోపాటు బెస్ట్ లిఫ్టర్ అవార్డునూ అందుకున్నా. ఇప్పుడు పద్నాలుగు విభాగాల్లో 63 కేజీల కేటగిరిలో నేను కామన్వెల్త్ పవర్‌లిఫ్టింగ్‌కి ఎంపికయ్యా. కచ్చితంగా ఈ సారి పతకం నాదే.

- స్వాతి కొరపాటి

సూర్య కిరణాల్లాంటి పూరేకలతో, ఎన్నెన్నో వన్నెల్లో, వర్ణ మిశ్రమాల్లో, పరిమాణాల్లో వికసించే అద్భుతమైన మొక్క డాలియా. మెక్సికోలో పుట్టిన ఈ అందాల రాశికి ప్రపంచవ్యాప్తంగా అందరూ అభిమానులే డాలియాలో దాదాపు యాభైవేల రకాలున్నాయి.

వారెవ్వా.. డాలియా!



డాలియాలు ప్రధానంగా బహువార్షికాలు. కానీ విత్తనాల నుంచి పెంచుకునే ఏక వార్షికాలు ఎక్కువ అనువుగా ఉంటాయి. వీటి దుంపల నుంచి రెండో ఏడాది కూడా మొక్కల్ని పెంచుకోగలిగినా, విత్తనాల ద్వారా పెరిగిన మొక్కలే బాగా పూస్తాయి. అందువల్ల వీటిని ఏకవార్షికాలనవచ్చు. ఈ రకాల పూలు చిన్నవిగా ఉన్నా ఎక్కువగా పూస్తాయి. కుండీల్లోకి, బోర్డరుగానూ, గుంపుగా నాటుకోవడానికి ఇతర మొక్కలతో కలిపి మిశ్రమ అమరికల్లోకీ చాలా బాగుంటాయి. బహువార్షిక డాలియాలు అంటే దుంపలను ఉపయోగించి పెంచుకునేవి. సాధారణంగా చలికాలంలో పూయడం మొదలుపెడతాయిగానీ ఈ ఏకవార్షికాలు మాత్రం వర్షరుతువును కూడా వర్ణభరితం చేస్తాయి. అందరి దృష్టినీ ఇట్టే ఆకట్టుకునే ఈ డాలియాలకు సీతాకోకచిలుకలూ, తేనెటీగలు దాసోహమనక ఏం చేస్తాయి మరి.

ప్రకాశవంతమైన వెలుతురులో... ఏకవార్షిక డాలియాలు అడుగు నుంచి అడుగున్నర ఎత్తువరకూ పెరుగుతాయి. గుబురుగా పెరిగి ఎక్కువ పూలు పూస్తాయి. సాధారణంగా ఒంటిరెక్క రెండు వరస రెక్కలు తప్ప ముద్దలు తక్కువ అయినా ఆకర్షణలో తీసిపోవు. వీటికి ప్రకాశవంతమైన వెలుతురు కావాలి. నీరు నిలవని, సారవంతమైన మట్టి మిశ్రమం అవసరం. రెండుపాళ్ల చొప్పున ఎర్రమట్టి, పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టు, కోకోపీట్ లేదా కుళ్లిన ఆకులు, ఒకపాలు చొప్పున ఇసుక, ఎముకల పొడి. కొద్దిగా వేపపిండి అన్నీ కలిపితే... ఆ మిశ్రమం దీనికి బాగా అనువుగా ఉంటుంది. నీళ్లు క్రమం తప్పకుండా పోయాలి. విత్తనాలు నారుపోసుకుని మూడు నుంచి నాలుగు ఆకులు వచ్చాక ముందు తయారుచేసుకున్న మడిలో నాటుకోవచ్చు. ప్రోట్రేలలో నారు పోసుకుంటే ఇంకా అనువుగా ఉంటుంది. వాడిపోయిన పూలను ఎప్పటికప్పుడు తుంచేస్తుంటే మొక్క గుబురుగా పెరిగి బాగా పూస్తుంది. మొగ్గ తొడిగిన దగ్గర్నుంచి ఎన్‌పీకే ఉండే సమగ్ర ఎరువును ద్రవరూపంలో వారానికోసారి ఇవ్వాలి.

ముందు జాగ్రత్త మేలు... బూడిద తెగులు వల్ల డాలియాకు ప్రమాదం ఎక్కువ. మొదట్లో అయితే వంటసోడా కలిపిన నీళ్లనూ, తెగులు ముదిరితే బాలిస్టిన్ మందునూ లీటరు నీటికి ఒక గ్రాము వంతున కలిపి పిచికారీ చేసుకోవాలి. రసం పీల్చే పురుగులు, గొంగళిపురుగులను వేపకషాయం, పొగాకు కషాయం వంటివి క్రమం తప్పకుండా చల్లి నివారించుకోవాలి. వర్షాకాలంలో తెగుళ్లు, పురుగుల బెడద ఎక్కువన్న విషయం గుర్తుంచుకుని ముందు జాగ్రత్త తీసుకోవడం మంచిది. మొక్కలు బలంగా, ఆరోగ్యంగా ఉంటే, మనం రోజూ శ్రద్ధగా గమనించి జాగ్రత్త పడితే రసాయన మందుల అవసరం ఉండదు. అంతేనా! డాలియాను బహుమతిగా ఇస్తే కలకాలం నిలిచే బంధానికీ, నిబద్ధతకూ సంకేతంగా భావిస్తారట చాలామంది!.

- బోడెంపూడి శ్రీదేవి, ల్యాండ్‌స్కేప్ కన్సల్టెంట్

మార్పు అవసరమే!



ఇంట్లో అయినా ఉద్యోగం అయినా.. ఎప్పుడూ తీరిక లేకుండా పనిచేయడం వల్ల మనల్ని మనం విశ్లేషించుకోవడం మానేస్తాం. దాంతో మనలోని లోపాలు అలాగే ఉండిపోతాయి.. మనల్ని మనం మార్చుకునే పరిస్థితి ఉండదు. అందుకే ఇకపై అప్పుడప్పుడూ మీకోసం కొంత సమయం పెట్టుకుని.. మిమ్మల్ని మీరు మార్చుకునే ప్రయత్నం చేసుకోండి.

లోపాలంటే అందం, ఆహార్యపరంగా కాదు. ముఖ్యంగా జుట్టు బాగాలేదు.. బరువున్నానేమో, రంగు తక్కువేమో అనే కోణంలో అస్సలు ఆలోచించకూడదు. దానివల్ల ఆత్మవిశ్వాసం తగ్గుతుంది. నలుగురిలోకి వెళ్లడానికి సందేహిస్తారు. వ్యక్తిత్వ పరంగా ఉన్న లోపాల్ని అంచనా వేసుకుని వాటిని మార్చుకునే ప్రయత్నం చేయాలి.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారేమో గమనించుకోవాలి. చాలాసార్లు ఆ సూచనలు కనిపిస్తున్నా కూడా మనం తేలిగ్గా తీసుకుంటాం. ఇకపై అలా వద్దు. ఆ సంకేతాలను పట్టించుకోండి. ముఖ్యంగా పెదవులు పొడిబారితే.. నీటిశాతం తగ్గిందని అర్థం. నోట్లో పొక్కుల్లాంటివి వస్తుంటే... బి విటమిన్ శరీరానికి సరిగ్గా అందడం లేదనుకోవాలి. వాటికి తగ్గ మార్పులూ చేసుకోవాలి. అంతే తప్ప తాత్కాలిక చిట్కాలపై ఆధారపడకూడదు.

నేనూ ఇంతే! అని గోడలు కట్టుకొని వాటి మధ్యే ఉండకండి. నేను కొంతమందితో మాత్రమే మాట్లాడతాను, నాకు ఇవే వచ్చు.. అని గిరిగీసుకుని దానికే పరిమితం కాకండి. అలాంటివేమైనా ఉంటే తక్షణమే కూల్చేయండి. అవకాశమున్నప్పుడు మార్పులు చేసుకునేందుకు సిద్ధంగా ఉండండి.

ప్రతికూల అంశాలను వీలైనంతవరకూ తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. వీలైనంతవరకూ సానుకూల అంశాలను పెంచుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. దానివల్ల కూడా మీలో మార్పు కనిపిస్తుంది.

దూరం పెరగకుండా...

కాలంతో పాటు పరుగెత్తడం ఇప్పుడు ప్రతి ఒక్కరికీ తప్పట్లేదు. ఆలుమగలు ఇద్దరూ ఉద్యోగస్థులైతే... కనీసం వారి మధ్య పలకరింపులూ ఉండటం లేదు. యాంత్రికత పెరుగుతోంది. ఫలితంగా అపార్థాలూ, అభద్రతా, అపోహలూ.. అంతకు మించి వాదనలు! ఇవన్నీ జీవితాన్ని నిస్సారంగా మార్చేస్తాయి. దీన్నుంచి బయటపడాలంటే!



భార్యాభర్తల మధ్య బంధం కేవలం పడకగదికే పరిమితం కాదు. మాటల్లో, చేతల్లో ఒకరిపై మరొకరు అభిమానం చూపించాలి. అందరూ తమ భావాలను నేరుగా వ్యక్తపరచలేరు. అందుకే ఉన్న సమయంలో భాగస్వామిలోని సానుకూలతల్ని గమనించండి. వాటని వారికి మనస్ఫూర్తిగా చెప్పండి. అవతలివారి నుంచీ అంతకు మించిన స్పందన వస్తుంది. ప్రయత్నించండి.

భార్యాభర్తలు ఇద్దరూ పని చేస్తుంటే వచ్చే వారంతపు సెలవుని విశ్రాంతి తీసుకోవడానికి ఉపయోగించుకోవాలనుకుంటారు. రోజంతా అలానే గడిపేయకుండా దాన్ని మధురంగా మార్చుకునే ప్రయత్నం చేయండి. ఇలా ఎందుకంటారా? ఇంట్లో ఉంటే చేతిలో ఫోను, కళ్ల ముందు టీవీ మీ సమయాన్ని సగం పంచేసుకుంటాయి. చివరికి అలసటా, నిద్రా మాత్రమే మిగులుతాయి. అలా కాకుండా... సాయంత్రానికల్లా ఇద్దరూ కాసేపు దగ్గర్లోని పార్కుకెళ్లండి. అక్కడ సేదతీరడమే కాదు.. ఒకరి భావాలను మరొకరు పంచుకునేందుకు చక్కని ఆహ్లాదకర వాతావరణం మీకు తోడవుతుంది. మీ మెదడూ తేలికపడుతుంది.

రోజంతా పనిఒత్తిడితో అలసటతో సతమతమవుతూ మీరుంటే... భాగస్వామికేమో కనీసం ఒక్కసారైనా నేను గుర్తురాలేదా అని పిస్తుంది. ఇద్దరి వాదనా నిజమే కానీ మీరే పనిలో ఉన్నా ఒక సెకను ఖాళీ చేసుకుని మీ పరిస్థితి అవతలివారికి తెలియచేస్తే అర్థం చేసుకోగలుగుతారు. మాట్లాడలేకపోయినా తిన్నావా అని అడిగే చిన్న సందేశం చాలు అవతలివారిలో అభద్రతా భావాన్ని తగ్గించడానికి.

ఇద్దరూ వేర్వేరు షిఫ్టుల్లో విధులకు వెళ్తారు. కనీసం ఇంటికి వచ్చాక పనిచేసే ఓపికా ఉండదు. ఇలాంటప్పుడు ఒకరిపై ఒకరు 'సాయం చేయలేదు.. పనులు పూర్తి చేయలేదు!' అని ఆరోపణలకి దిగొద్దు. వాదనలొద్దు. ఇంటి బాధ్యతల్ని ఇద్దరూ సమంగా పంచుకోండి. ఒకవేళ ఏదైనా కారణంతో ఒకరు ఆ పనిని పూర్తి చేయలేకపోయినా 'నీకు బాగోలేదు కదా! విశ్రాంతి తీసుకో!!' అనే చేదోడుగా ఉండండి. మీరెంత ప్రేమ చూపిస్తున్నారో అవతలివారికి అర్థం అవుతుంది!

మళ్లీ గర్భం దాల్చాలనుకుంటున్నా...

? నా వయసు ముప్ఫైఎనిమిది. ఒక బాబు. అనారోగ్యం కారణంగా వాడు ఏడాది క్రితం చనిపోయాడు. ఇప్పుడు మళ్లీ గర్భం దాల్చాలనుకుంటున్నా. ఈ వయసులో కష్టం అని కొందరు స్నేహితులు అంటున్నారు... నిజమేనా? **- ఓ సోదరి**




ఈ వయసులో గర్భం దాల్చొచ్చు. అయితే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా మీకు ముప్ఫైఆరేళ్లు దాటాయి కాబట్టి మధుమేహం, అధికరక్తపోటు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. మీకు ఇప్పటికే థైరాయిడ్, మధుమేహం లాంటివి ఉంటే గనుక వాటిని అదుపులో ఉంచుకోవాల్సి ఉంటుంది. పాపాయిలో అవకరాలు లేకుండా గర్భం దాల్చేందుకు కనీసం మూడు నెలల ముందు ఫోలిక్‌యాసిడ్ మాత్రలు వేసుకోవాలి. అలాగే ప్రస్తుతం మీకే సమస్యలు లేకపోయినా.. గర్భం దాల్చాక మధుమేహం, బీపీ వచ్చే ప్రమాదం ఎక్కువ కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. ఆ తరవాత కూడా టిఫా, ఫీటల్ ఎకో, డబుల్ మార్కర్ వంటి పరీక్షలు చేయించుకుంటే.. బిడ్డ ఆరోగ్యాన్ని ముందే అంచనా వేయొచ్చు. వాటన్నింటినీ బట్టీ జాగ్రత్తలు తీసుకోవచ్చు. అవసరం అనుకుంటే ఉమ్మనీటి పరీక్షనూ చేయాల్సి రావచ్చు.

బంగారం వెండి

18న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,795	2,776
వెండి (గ్రా)	42.60	42.10



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	-------	-------	30,150	30,100	29,950	29,950	29,420	29,690	30,150	30,150
ఆర్నమెంట్	-------	-------	28,000	28,000	27,730	27,730	27,950	27,760	27,740	27,740
వెండి(కిలో)	-------	-------	40,500	40,500	40,000	40,300	38,800	39,400	40,500	40,500



ఈనాడు బిజినెస్



ఇన్ఫోసిస్ సీఈఓగా నిష్క్రమించడానికి నిర్ణయించుకున్నాను. ఎటువంటి ఆధారాలు లేని, తప్పుడు ఆరోపణలు, వ్యక్తిగత దూషణలు కొనసాగుతూ ఉంటే నేను నా బాధ్యతలను ఎలా నిర్వర్తించగలను. చాలా అంతర్మధనం చెందాకే నేను ఈ నిర్ణయానికి వచ్చాను. నా చుట్టూ ఒకలాంటి వాతావరణం ఏర్పడింది. నా పనిపై దృష్టి పెట్టలేకపోతున్నా. ఎన్నో రకాలుగా ఆలోచించా. చివరకు ఒక స్పష్టమైన నిర్ణయానికే వచ్చా. ఈ కంపెనీలో, ఐటీ పరిశ్రమలో ఒక భారీ మార్పును తీసుకువచ్చే ఈ అవకాశంపై నాకు చాలా గౌరవం ఉంది. అయితే.. ఆ పనిచేయడానికి నాకు అవకాశం ఇవ్వడం లేదు. నాపై గౌరవం, విశ్వాసం ఉండే వాతావరణం, నాకు సాధికారతను అప్పజెప్పే వాతావరణంలోకి నేను తిరిగి వెళ్లాలనుకుంటున్నా.



నా వల్లే సిక్కా రాజీనామా చేశారని అంటున్నారు. ఆ ఆరోపణలపై నేను తీవ్రంగా కలత చెందా. వారి ప్రకటనలు, ఆ స్వరం నాకు బాధ కలిగించాయి. సరైన సమయంలో.. సరైన వేదికపై, సరైన దిశలో స్పందిస్తాను. పనయా కొనుగోలుతో పాటు ఇతరత్రా వివిధ అంశాలపై నేను వ్యక్తంచేసిన అభిప్రాయాలు సంస్థ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని చేసినవే. అలాగే పనయా కొనుగోలు విషయంలో దర్యాప్తు పక్షపాతంతో జరిగిందని చాలా మంది వాటాదార్లు నాతో చెప్పారు. ఆరోపణలకు గురైన వారే కొంత మంది న్యాయవాదులను నియమించుకుని.. వారికి వారే క్లీన్ చిట్ ఇచ్చుకున్నారు. అలాగే ఆ క్లీన్ చిట్ ఎలా వచ్చిందన్నది వారు బయటకు చెప్పుకోవడానికి కూడా నిరాకరిస్తున్నారు.

భారత్‌కు ఐటీ పాఠాలు నేర్పిన ఇన్ఫోసిస్‌లో ఏమవుతోంది? సగటు మదుపరి ప్రశ్న ఇది. ఈ కంపెనీకి వ్యవస్థాపకులు ఛైర్మన్‌గా ఉన్నంతకాలం సజావుగా, సాఫీగా కార్యకలాపాలు నడిపిన ఆ దిగ్గజం గత కొద్ది త్రైమాసికాలుగా భారీ కుదుపులకు లోనవుతోంది. కంపెనీ తొలి వ్యవస్థాపకేతర సీఈఓ విశాల్ సిక్కా శుక్రవారం రాజీనామా చేయడంతో యావత్ కార్పొరేట్ రంగం చూపు ఇన్ఫోసిస్‌పైనే నిలిచింది. స్టాక్ మార్కెట్ అయితే నష్టాలతో తన స్పందన తెలిపింది. ఇన్ఫోసిస్ షేరు సైతం ఒక దశలో 52 వారాల కనిష్ఠ స్థాయికి చేరింది. ఇన్ఫీలో తాజా పరిణామం కంపెనీని ఏ తీరానికి చేరుస్తుందో కాలమే చెప్పాలి.

కోటకు బీటలు

ఇన్ఫీ సీఈఓలు..

నారాయణ మూర్తి	1981-2002
నందన్ నీలేకని	2002-2007
ఎస్.గోపాల కృష్ణన్	2007-2011
ఎస్.డి.శిబులాల్	2011-2014
విశాల్ సిక్కా	2014-2017
యు.బి.ప్రవీణ్ రావు (తాత్కాలిక)	2017 ఆగస్టు 18 నుంచి

ఇన్ఫీలో వాటాల తీరు(%లో)

ప్రమోటర్ల వాటా	12.75
ప్రజల వాటా	86.76
ఎంప్లాయిస్ ట్రస్ట్	00.49
మొత్తం	100
ప్రమోటర్లలో మూర్తి కుటుంబం వాటా	3.44%
నారాయణ మూర్తి	0.38
సుధా మూర్తి	0.79
రోహన్ మూర్తి	1.38
అక్షతా మూర్తి	0.89

1 విభేదాలు మొదలు..

సిక్కా వేతనాన్ని 11 మిలియన్ డాలర్లకు(55% వృద్ధి) పెంచుతూ గతేడాది ఫిబ్రవరిలో బోర్డు నిర్ణయం తీసుకోవడంతో వ్యవస్థాపకులకు, బోర్డుకు మధ్య తొలిసారిగి విభేదాలు పొడసూపాయి. ఆ తర్వాత ఏప్రిల్ 2016లో మాజీ సీఎఫ్ఓ రాజీవ్ బన్సల్‌కు నిష్క్రమణ ప్యాకేజీ రూ.17.38 కోట్లు ప్రకటించడం సహా వ్యవస్థాపకులకు మింగుడు పడలేదు.

2 నాలుగు నెలల తర్వాత

జూన్ 2016లో ఇన్ఫోసిస్ మాజీ ఉద్యోగి డి.ఎన్. ప్రహ్లాద్‌ను బోర్డులోకి చేర్చమని మూర్తి సలహానిచ్చారు. ఈయన మూర్తి బంధువే. అయితే అక్టోబరు 2016లో కానీ ఆ పని జరగలేదు.

3 ప్రజల ముందుకు వివాదం..

జనవరి-ఫిబ్రవరి 2017లో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు, ప్రమోటర్లుకు , బోర్డుకు, యాజమాన్యానికి మధ్య కంపెనీ పాలనకు సంబంధహంచిన విభేదాలు పొడసూపాయి. మూర్తి తొలిసారిగా బాహాటంగానే ఇన్ఫోసిస్‌ను విమర్శించడం మొదలుపెట్టారు. ఏప్రిల్‌లో రవి వెంకటేశన్‌ను కంపెనీ బోర్డు స్వతంత్ర డైరెక్టర్‌గా నియమించింది.

4 పనయాపై తీవ్ర విమర్శలు

2015లో పనయా కొనుగోలు వల్ల ఎవరికీ లాభం లేదని మూర్తి తీవ్రంగా విమర్శించారు. దానిపై కంపెనీ దర్యాప్తు చేపట్టినప్పటికీ.. ఆ విషయాలన్నీ ప్రజలకు తెలపాలను జులైలో మూర్తి కోరారు. పనయాపై దర్యాప్తు నిర్వహించామని ఎటువంటి తప్పూ కనిపించలేదని వెంకటేశన్ ప్రకటించారు.

5 గత నెలలో తీవ్ర స్థాయికి

సిక్కా సీఈఓ కంటే సీటీఓ హోదాకే సరిపోతారని ముగ్గురు స్వతంత్ర డైరెక్టర్లు తనతో అన్నట్లు మూర్తి వ్యాఖ్యానించారు. దీంతో ఆగస్టు 18(నిన్న)న సిక్కా ఎండీ, సీఈఓ బాధ్యతల నుంచి తప్పుకుంటూ రాజీనామా చేశారు.

ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ పదవులకు సిక్కా అనూహ్య రాజీనామా

- నాపై తప్పుడు, ఆధారం లేని ఆరోపణలు చేస్తున్నారు
- వ్యక్తిగత దూషణలకూ దిగారు: సిక్కా
- మూర్తి వల్లే ఇదంతా: ఇన్ఫోసిస్ బోర్డు
- తీవ్రంగా కలతచెందా: నారాయణమూర్తి
- తాత్కాలిక సీఈఓగా ప్రవీణ్ రావు
- ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా సిక్కాకు కొత్త బాధ్యతలు

అవును.. విశాల్ సిక్కా రాజీనామా చేశారు. అనూహ్య నిర్ణయమే అయినప్పటికీ.. ఊహించని విషయం మాత్రం కాదు. ఎందుకంటే గత కొన్ని త్రైమాసికాలుగా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడైన నారాయణ మూర్తి, ఇతర సహ వ్యవస్థాపకుల నుంచి ఎదురవుతున్న ఆరోపణలను తట్టుకోలేక ఈ నిర్ణయం తీసుకోక తప్పింది కాదని విశ్లేషకులు అంటున్నారు. సిక్కా సైతం తనపై తప్పుడు, నిరాధారమైన, వ్యక్తిగత ఆరోపణలు ఎక్కువ కావడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. అయితే ఆయన ఎవరి పేర్లనూ ఉటంకించకపోవడం గమనార్హం.

సిక్కా మూడేళ్ల పదవీ కాలంలో ఇన్ఫోసిస్ ఆదాయం 25 శాతం దాకా పెరిగింది. అయినప్పటికీ కొన్ని అంశాలపై మూర్తి వర్గం ఆరోపణలు కొనసాగిస్తూనే ఉండడం సిక్కాకు మింగుడు పడలేదంటున్నారు. ఇన్ఫోసిస్ బోర్డు కూడా సిక్కాకు మద్దతు పలుకుతూ ప్రకటన చేసింది. వీటిపై సరైన సమయంలో, సరైన వేదిక మీద స్పందిస్తానని మూర్తి అంటున్నారు. సిక్కా రాజీనామాతో ఏడాది పాటు బోర్డుకు, వ్యవస్థాపకులకు మధ్య పరోక్షంగా జరిగిన యుద్ధం సమాప్తమవుతుందో లేదో చూడాలి. కార్పొరేట్ పాలన విషయంలో, మాజీ ఉన్నతాధికార్లకు ఇచ్చిన పారితోషికాలు, పరిహారాలపై మూర్తి వర్గం తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.

సిక్కా వేతనం ఒక డాలరే

సిక్కా రాజీనామాతో ఆయన స్థానంలో ప్రస్తుతం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరు(సీఓఓ)గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ప్రవీణ్ రావు తాత్కాలిక సీఈఓగా ఉంటారు. మార్చి 31, 2018 వరకూ ఆ హోదాలో కొనసాగుతారు. అదే సమయంలో సిక్కా ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా కంపెనీలో కొనసాగుతారు. ఏడాదికి ఒక డాలరు(రూ.65) వేతనంపై కొత్త ఎండీ, సీఈఓగా సహాయం చేస్తారు. సిక్కా సీఈఓ కంటే చీఫ్ టెక్నాలజీ ఆఫీసరుగా సరిపోతారని ఇన్ఫీ స్వతంత్ర డైరెక్టర్లకు మూర్తి లోగడ చెప్పినట్లు సమాచారం.

మూర్తి ఆరోపణలు సత్య దూరాలే.. ఇన్ఫోసిస్ బోర్డు

మూర్తి కొనసాగించిన ఆరోపణల పర్వం వల్లే సిక్కా రాజీనామా చేశారని బోర్డు తేల్చిచెప్పింది. 'మూర్తి వివిధ మీడియా సంస్థలకు ఓ లేఖ రాశారు. బోర్డు సమైక్యతను దెబ్బతీస్తూ వ్యాఖ్యలు చేశారు. కార్పొరేట్ ప్రమాణాలు పడిపోతున్నాయని యాజమాన్యంపై ఆరోపణలు చేశారు. ఆ లేఖలో అన్నీ అవాస్తవాలే ఉన్నాయి. ఇప్పటికే అవన్నీ సత్య దూరాలని తేలినవే'నని పేర్కొంది. ప్రపంచ స్థాయి దర్యాప్తు సంస్థలు బోర్డుతో కుమ్మక్కయ్యాయని.. సీఈఓపై వచ్చిన ఆరోపణలను పెద్దగా పరిశీలించకుండా.. క్లీన్ చిట్ ఇచ్చాయని మూర్తి చేసిన వ్యాఖ్యలను బోర్డు కొట్టిపారేసింది.

ప్రపంచ స్థాయి ఏజెన్సీలతో దర్యాప్తు చేయించినా.. మూర్తి వాటిని కూడా విశ్వసించకపోవడంపై ఇన్ఫోసిస్ ఛైర్మన్ ఆర్. శేషశాయి విచారం వ్యక్తం చేశారు. 'ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన న్యాయ, ఫోరెన్సిక్ సంస్థలు ఒకటికి రెండు సార్లు దర్యాప్తు చేసినా.. పూర్తిగా పరిశీలించకుండా.. క్లీన్ చిట్ ఇచ్చాయనడం మాకు సబబుగా తోచడం లేద'ని ఆయన మూర్తిని తప్పుపట్టారు. ప్రమోటర్లు, సహ వ్యవస్థాపకులు చేసిన ఫిర్యాదులన్నిటిపైనా మేం దర్యాప్తు చేశాం. కార్పొరేట్ పాలనలో ఎటువంటి అవకతవకలూ జరగలేదు. ముఖ్యంగా ప్రమోటర్లంటున్నట్లుగా పనయా కొనుగోలులోనూ అది చోటు చేసుకోలేదు. ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడడం, వాటిపై దర్యాప్తు చేయడం బోర్డు బాధ్యత. ఆ పనే బోర్డు చేసింద'ని ఆయన వివరించారు. అదే సమయంలో మూర్తి ఇటీవల రాసిన లేఖలో చేసిన ఆరోపణలు అవాస్తవాలనీ.. కొన్నాళ్లుగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయనీ ఆయన అన్నారు. మూడు సందర్భాల్లో తప్పులు జరిగాయని ఆయన చెప్పారు. కానీ దర్యాప్తు ప్రకారం.. అలా జరిగిన దాఖలాలు లేవని శేషశాయి శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో తెలిపారు.

ఎవరీ ప్రవీణ్ రావు..



విశాల్ సిక్కా రాజీనామా అనంతరం యు.బి.ప్రవీణ్ రావును తాత్కాలిక ఎండీ, సీఈఓగా కంపెనీ నియమించింది. ప్రస్తుతం నిర్వహిస్తోన్న ముఖ్య నిర్వహణ అధికారి (సీఓఓ) పదవిలోనూ ఆయన కొనసాగుతారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ఆయన పట్టా అందుకున్నారు. 1986లో ఇన్ఫోసిస్‌లో అడుగుపెట్టారు. అప్పటి నుంచి వివిధ కీలక బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం అంతర్జాతీయ కార్యకలాపాల బాధ్యతను చూసుకుంటున్నారు. అలాగే ఇన్ఫోసిస్ బీపీఓ సర్వీస్‌కు ఛైర్మన్‌గానూ విధులు నిర్వహిస్తున్నారు. నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీలో సభ్యుడిగా కూడా ఉన్నారు.

మూర్తికి రూ.1000 కోట్ల నష్టం


ఇన్ఫోసిస్ మదుపర్లకు ఊహించని షాక్. అనుకోని ఝలక్. విశాల్ సిక్కా తీసుకున్న రాజీనామా నిర్ణయంతో ఇన్ఫీ షేరుకు సెగ మామూలు స్థాయిలో తాకలేదు. గురువారం నాటి 'బైబ్యాక్' జోరు శుక్రవారం కూడా కొనసాగుతుందేమో అనుకుంటే భారీ నష్టాలను కళ్ల చూడాల్సి వచ్చింది. ఉదయం రూ.1021.50 వద్ద మామూలుగానే ప్రారంభమైన షేరు ఆ తర్వాత క్రమక్రమంగా నష్టాల బాట పట్టింది. మధ్యాహ్నం తర్వాత తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనై రూ.137 (13.38%) నష్టంతో రూ.884.20కు దిగివచ్చింది. ఇన్ఫీ షేరుకు ఇది ఏడాది కనిష్ఠ స్థాయి. చివర్లో కాస్త కోలుకున్నప్పటికీ రూ.98.05 (9.6%) నష్టపోయి రూ.923.10 వద్ద ముగిసింది. తద్వారా సెన్సెక్స్, నిఫ్టీ భారీగా నష్టపోవడానికి కూడా కారణమైంది. ఇన్ఫీ షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.22,519 కోట్లు హరించుకుపోయింది. ఈ ప్రకారం చూస్తే ఇన్ఫీలో మూర్తికున్న వాటా విలువ కూడా రూ.1000 కోట్లు ఆవిరయ్యింది.

బైబ్యాక్ యథాతథం: విశాల్ సిక్కా రాజీనామా చేసినప్పటికీ, ఇన్ఫీ బైబ్యాక్ (షేర్ల తిరిగి కొనుగోలు) ప్రక్రియ యథాతథంగానే కొనసాగనుంది. బైబ్యాక్‌లో భాగంగా రూ.13,000 కోట్ల విలువైన షేర్లను కంపెనీ తిరిగి కొనుగోలు చేయనుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారమే నేడు జరిగే బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనను పరిశీలించనుంది.

నీలేకనిని తీసుకురండి

ఇన్ఫోసిస్‌లో నెలకొన్న తాజా సంక్షోభ పరిస్థితికి తెరపడాలంటే కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకనిని తిరిగి బోర్డులోకి తీసుకొచ్చి, నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని ద ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ అడ్వైజరీ సర్వీసెస్ (ఐఐఏఎస్) అభిప్రాయపడింది. 'ఇన్ఫోసిస్ బోర్డు తన సీఈఓకు రక్షణగా నిలవలేకపోయింది. తదుపరి సీఈఓని ఎంపిక చేసేందుకు బోర్డు బలోపేతం అవ్వాల్సిన అవసరం ఉంద'ని ఐఐఏఎస్ తెలిపింది. భారత ఐటీ పరిశ్రమకు ఇన్ఫోసిస్ గుండెకాయ లాంటిది కనుక ఈ బాధ్యతను ఇతర కార్పొరేట్ కంపెనీల్లో చేసే ఉద్యోగంగా నీలేకని భావించకూడదని తెలిపింది. ప్రస్తుతం దేశవిదేశాల్లో వెతికినా ఇన్ఫోసిస్‌కు నందన్ నీలేకని మాత్రమే అత్యుత్తమ అభ్యర్థిగా కనిపిస్తున్నారని అభిప్రాయపడింది. 'అధునాతన సాంకేతికత పరిజ్ఞానం, డిజిటలీకరణ అంశాలపై ఆయనకు పట్టు ఉంది. దేశీయ, అంతర్జాతీయంగా అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయి. కార్పొరేట్ సంస్కృతిపై పూర్తి అవగాహన ఉన్నందున ఇన్ఫోసిస్‌కు చెందిన మిగతా వ్యవస్థాపకులను కలుపుకొని పోగలుగుతార'ని తెలిపింది. తాజా పరిణామం ఒక విధంగా ఇన్ఫోసిస్‌కు కుదుపులాంటిదే అయినప్పటికీ బోర్డును బలోపేతం చేస్తే ఈ పరిస్థితి నుంచి తిరిగి బయటపడుతుందని భావిస్తున్నామని ఏంజెల్ బ్రోకింగ్ వైస్ ప్రెసెడెంట్ (ఐటీ రీసెర్చ్) సర్బజిత్ కౌర్ నంగర తెలిపారు.

ఒకప్పుడిలా కలిసున్నవారే..



1,98,000

2017 జూన్ ముగిసే నాటికి కంపెనీ మొత్తం సిబ్బంది సంఖ్య 1.98 లక్షలుగా ఉంది. గత మార్చి త్రైమాసికానికి ఉద్యోగుల సంఖ్య 2,00,364. 32 దేశాల నుంచి 122 దేశస్థులు ఇందులో ఉన్నారు. 93.8 శాతం మంది సాఫ్ట్‌వేర్ నిపుణులే.

8

భారత్‌లో అత్యధిక మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో ఇన్ఫోసిస్ స్థానం. 2017 ఆగస్టు 11 నాటికి కంపెనీ మార్కెట్ల విలువ రూ.2.26 లక్షల కోట్లు.

25

ఆగస్టు 2014లో సీఈఓగా బాధ్యతలు చేపట్టిన సిక్కా.. ఇన్ఫోసిస్‌ను 2015-16లో 9.1 శాతం(డాలర్లలో) ఆదాయ వృద్ధిని సాధించేలా చేశారు. 2016-17లో 7.6 శాతానికే అది పరిమితమైనప్పటికీ.. మూడేళ్ల పదవీ కాలంలో ఆదాయం 25 శాతం పెరగడం విశేషం.

2021

అయిదేళ్ల పదవీ కాలం కోసం 2014లో సిక్కాను నియమించిన ప్పటికీ..అర్ధాంతరంగా రాజీనామా చేశారు. విచిత్రం ఏమిటంటే గతేడాది ఫిబ్రవరిలో మరో రెండేళ్ల పాటు అంటే 2021 వరకూ పదవీ కాలాన్ని పొడిగించడం విశేషం.

250

కంపెనీ మొదటి పెట్టుబడి 250 డాలర్లు. 1981లో ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఎన్ఆర్ నారాయణ మూర్తి, నందన్ నీలేకని, ఎస్.గోపాలకృష్ణన్, ఎస్డీ శిబులాల్, కె.దినేశ్, ఎన్ఎస్ రాఘవన్, అశోక్ అరోరాలు సంయుక్తంగా స్థాపించారు.

సెన్సెక్స్ ▼ 271	నిఫ్టీ ▼ 67
31525	9837

రూపాయి 64.15 (ఒక అమెరికా డాలరుకు)

బంగారం 29,285 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 175

వెండి 39,300 ▲ ముంబయిలో కిలో రూ.లలో 300

ముడి చమురు 53.00 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,731	–20
నాస్‌డాక్	6,229	+8
నిక్కీ 225 (జపాన్)	19,470	–232
హాంగ్‌సెంగ్ (హాంకాంగ్)	27,048	–297
షాంఘై(చైనా)	3,269	+01
ఎఫ్‌టీఎస్ఈ (బ్రిటన్)	7,327	–64
డాక్స్ (జర్మనీ)	12,165	–38

డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.38	67.69
పౌండ్ స్టెర్లింగ్	75.21	87.27
యూరో	68.49	79.43
జపనీస్ యెన్/100	53.34	61.88
ఆస్ట్రేలియా డాలరు	46.10	53.33
సింగపూర్ డాలరు	42.77	50.65
థాయ్ బాత్/100	175.65	210.07
బ్రహెయిన్ దీనార్	158.19	181.18
కువైట్ దీనార్	175.72	218.82
ఒమన్ రియాల్	154.79	177.13
సౌదీ రియాల్	15.52	18.40
యూఏఈ దిర్హమ్	15.89	18.57
మలేషియా రింగిట్	13.30	16.36




శుక్రవారం నిఫ్టీ కదలికలు



నష్టాలన్నీ ఇన్ఫీ వల్లే

271 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ ● ఐటీ, ఫార్మా షేర్లు డీలా



సమీక్ష

వరుస లాభాలకు అడ్డుకట్ట పడింది. ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సీఈఓ విశాల్ సిక్కా ఆకస్మిక రాజీనామా నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయి. ఫార్మా, బ్యాంకింగ్ షేర్లు సైతం డీలాపడటం సైతం ఇందుకు తోడైంది. స్పెయిన్‌లో ఉగ్రదాడులు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా షేర్లు సైతం నిరుత్సాహంగా ట్రేడయ్యాయి. ఇక వారం ప్రాతిపదికన చూస్తే.. సెన్సెక్స్ 311.09 పాయింట్లు, నిఫ్టీ 126.60 పాయింట్లు చొప్పున నష్టాలు నమోదు చేశాయి. గత ఏడువారాల్లో సూచీలు లాభపడటం ఇది ఆరోసారి కావడం విశేషం.

చివరి వరకూ నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 31729.88 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ఆద్యంతం అదే తీరు కొనసాగించిన సూచీ.. ఒకానొకదశలో 31349.13 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 270.78 పాయింట్ల నష్టంతో 31,524.68 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ సైతం 66.75 పాయింట్లు కోల్పోయి 9,837.40 వద్ద ముగిసింది.

■ జేకే యాన్సెల్‌లో ఆస్ట్రేలియా సంయుక్త సంస్థ భాగస్వామి యాన్సెల్ వాటాను రూ.19.30 కోట్లకు కొనుగోలు చేసిన నేపథ్యంలో రేమండ్ షేరు రాణించింది. ఇంట్రాడేలో రూ.798.95 వద్ద గరిష్ఠాన్ని తాకిన షేరు.. చివరకు 3.80 శాతం లాభంతో రూ.774.35 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 డీలాపడ్డాయి. సన్ ఫార్మా 3.81%, ఎన్‌టీపీసీ 2.01%, కోల్ ఇండియా 1.51%, లుపిన్ 1.40%, డాక్టర్ రెడ్డీస్ 1.35%, సిప్లా 1.33% చొప్పున నష్టపోయాయి. మరోవైపు హిందుస్థాన్ యునిలీవర్ షేరు 2.13 శాతం పెరగ్గా.. పవర్‌గ్రిడ్ 1.55%, టీసీఎస్ 1.32%, భారతీ ఎయిర్‌టెల్ 1.21%లు రాణించిన వాటిలో ఉన్నాయి. సూచీల వారీగా చూస్తే.. ఐటీ సూచీ 3.53% కుదేలైంది. టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, స్థిరాస్తి రంగాలు సైతం అదే బాటలో నడిచాయి.

లారస్ ల్యాబ్స్ యూనిట్లలో 2 లోపాలు

ఈనాడు, హైదరాబాద్: లారస్ ల్యాబ్స్‌కు విశాఖపట్నంలోని పరవాడలో ఉన్న యూనిట్లను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) తనిఖీ చేసింది. ఏపీఐలను తయారు చేసే యూనిట్ 1, 3లలో అమెరికా నియంత్రణ సంస్థ తనిఖీలను పూర్తి చేసిందని, రెండు లోపాలను గుర్తించిందని లారస్ ల్యాబ్స్ పేర్కొంది. ఈ లోపాలు విధాన (ప్రొసీజర్) పరమైనవేనని, డేటా ఇంటిగ్రిటీ (సమాచార కచ్చితత్వం)కి సంబంధించినవి కావని కంపెనీ వెల్లడించింది.

కాల్ అంతరాయాలకు..

రూ.10 లక్షల వరకు జరిమానా


- మార్గదర్శకాలు జారీచేసిన ట్రాయ్
- టవర్ పరిధిలో పరిశీలన
- త్రైమాసికం వారీగా జరిమానా పెంపు
- అక్టోబరు 1 నుంచి అమలు

దిల్లీ

కాల్ అంతరాయాల నివారణ కోసం టెలికాం నెట్‌వర్క్ సంస్థలకు మార్గదర్శకాలను, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసింది. వరుసగా 3 త్రైమాసికాల పాటు ట్రాయ్ నిర్దేశించిన ప్రమాణాలు అందుకోలేని ఆపరేటర్లకు గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఇవి అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. 'మేము రూ.1-5 లక్షల వరకు జరిమానా విధించాలనుకున్నాం. అది దశలవారీగా పెరుగుతూ పోతుంది. నెట్‌వర్క్ తీరుకు అనుగుణంగానే విధిస్తారు' అని ట్రాయ్ ఛైర్మన్ ఆర్ఎస్ శర్మ తెలిపారు. కాల్ అంతరాయాలకు సంబంధించి, ట్రాయ్ ప్రమాణాలను అందుకోలేకపోతే, తొలి త్రైమాసికంలో రూ.5 లక్షల వరకు జరిమానా చెల్లించాలి. వరుసగా రెండో త్రైమాసికంలోనూ నెట్‌వర్క్ మెరుగుపడకపోతే, అప్పుడు జరిమానా 1.5 రెట్లు (రూ.7.5 లక్షల వరకు) అవుతుంది. మూడో త్రైమాసికంలోనే తీరు అలానే ఉంటే, రెట్టింపు జరిమానా (రూ.10 లక్షల వరకు) వసూలు చేస్తారు' అని ట్రాయ్ కార్యదర్శి ఎస్‌కే గుప్తా వివరించారు. గరిష్ఠంగా నెట్‌వర్క్‌కు విధించే జరిమానా రూ.10 లక్షలు ఉంటుందన్నారు. ఇప్పటివరకు సేవల్లో నాణ్యతా లోపం వల్ల కాల్ అంతరాయాలు ఏర్పడితే, జరిమానా రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు ఉండేది.

ఇకపై టవర్ పరిధిలో లెక్కిస్తారు

ఇప్పటివరకు టెలికాం సర్కిల్ పరిధిలో కాల్ అంతరాయాలను లెక్కిస్తూ వచ్చారు. ఇకపై సర్కిల్ పరిధిలోని టవర్ల వారీగా లెక్కించే సామర్థ్యాన్ని ట్రాయ్ ఆర్జించింది. 'కాల్ అంతరాయాల లెక్కింపులో కొన్ని సమస్యలు వస్తుంటాయి. సగటును పరిగణనలోకి తీసుకుంటే, అనేక అంశాలు మరుగున పడుతున్నాయి. రద్దీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో మొబైల్ టవర్లు పనిచేయకపోవడం, అరకొరగా సేవల నాణ్యత వంటివి లెక్కలోకి వచ్చేవి కాదు. కొత్త మార్గదర్శకాల్లో, నెట్‌వర్క్ పరిధిలో ఇలాంటి తాత్కాలికంగా ఏర్పడిన ఇబ్బందులనూ గుర్తిస్తాం. అదీ ప్రాంతాల వారీగా గుర్తించగలం' అని శర్మ వివరించారు.



అన్నీ ఆపరేటర్ చేతుల్లో ఉండవు

–కాయ్ డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్

సేవల నాణ్యత అనేది అందించే సంస్థ చేతుల్లోనే పూర్తిగా ఉండదు. ఒక నెట్‌వర్క్‌ను ఒక సమయంలో వినియోగిస్తున్న వారి సంఖ్య, వాతావరణం, ఆ టవర్ పరిధిలోని ప్రాంతం ఎలా ఉంది, వినియోగదారుడు భవనం లోపల ఉన్నాడా, బయట ఉన్నాడా అనేదీ ప్రభావం చూపుతుంది.

ఇవీ తాజా నిబంధనలు

- ■ ఒక టెలికాం సర్కిల్‌లో 90 శాతం మొబైల్ టవర్లు, 98 శాతం కాల్స్ అందుకోవడంలో 90 శాతం సమయం పాటు విఫలం కాకూడదు. అంటే 2 శాతం కాల్స్‌లో మాత్రమే అంతరాయాలు ఏర్పడవచ్చు.
- ■ ఒకవేళ క్లిష్ట పరిస్థితులు ఏర్పడినా, కాల్స్ రద్దీ విపరీతంగా ఉన్నా, 90 శాతం టవర్ల పరిధిలో 3 శాతానికి మించి కాల్స్ అంతరాయాలు ఏర్పడకూడదు.
- ■ కాల్ కట్ అయినా, అది నమోదు కాకుండా చూసుకునేందుకు టెలికాం ఆపరేటర్లు వినియోగిస్తున్నారని ఆరోపణలున్న రేడియో లింక్‌అవుట్ టెక్నాలజీ (ఆర్ఎల్‌టీ)కి ప్రమాణాలు నిర్దేశించారు. వాస్తవానికి వినియోగదారుడు సంచరిస్తూ, కాల్ మాట్లాడుతున్నపుడు, ఒక టవర్ నుంచి మరో టవర్‌కు అతని మొబైల్ సిగ్నల్ జత చేయడానికి ఈ సాంకేతికత వాడాలి. ఇది 4-64 ప్రమాణాల్లో ఉండాలి. 48కి మించి వాడితే, అందుకు కారణాలను ఆపరేటర్ వెల్లడించాల్సి ఉంటుంది.

పబ్లిక్ ఇష్యూ నిధులతో
20 వేల టన్నుల యూనిట్

- రూ.90 కోట్లతో ఏర్పాటు
- అపెక్స్ ఫ్రోజెన్ ఐపీఓ 22 నుంచి

ఈనాడు, హైదరాబాద్: పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించే నిధులను రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ వినియోగించనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా దాదాపు రూ.150 కోట్ల నిధులు లభించనున్నాయని. . ఇందులో కొత్త షేర్ల జారీ ద్వారా రూ.125 కోట్లు కంపెనీకి లభిస్తాయని అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) కె.ఎస్.మూర్తి తెలిపారు. ఇందులో దాదాపు రూ.90 కోట్లను ఏడాదికి 20,000 మెట్రిక్ టన్నుల రొయ్యలను ప్రాసెస్ చేసే యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి వినియోగిస్తామని చెప్పారు. ఈ యూనిట్ వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం నాటికి అందుబాటులోకి వస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సమగ్ర ఆక్వా ఉత్పత్తుల కంపెనీ అపెక్స్ ఫ్రోజెన్ పబ్లిక్ ఇష్యూ ఈనెల 22న ప్రారంభమై 24న ముగియనుంది. బుక్ బిల్డింగ్ విధానంలో షేర్లను కేటాయిస్తారు. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరు ధర శ్రేణిని రూ.171-175గా నిర్ణయించారు. ఇష్యూలో 72.5 లక్షల షేర్లను కొత్తగా జారీ చేస్తారు. 14.5 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తారు. ఇష్యూ తర్వాత కంపెనీలో ప్రమోటర్ల వాటా 72 శాతానికి తగ్గుతుంది. రొయ్యల పెంపకం నుంచి ప్రాసెసింగ్, ప్యాకింగ్, రవాణా వరకూ అన్ని కార్యకలాపాలను కంపెనీ నిర్వహిస్తోంది. గత అయిదు సంవత్సరాలుగా కంపెనీ ఆదాయం సగటున ఏడాదికి 29 శాతం వృద్ధి చెందింది. 2016-17లో ఆదాయం రూ.709.68 కోట్ల మేరకు ఉంది. నికర లాభం 26.89 శాతం సగటు వృద్ధితో రూ.24.4 కోట్లకు చేరింది. విదేశాల్లోని రిటైల్ గొలుసుకట్టు కంపెనీలు, రెస్టారెంట్లు, ఆహార విక్రయం సంస్థలకు ప్రాసెస్డ్ ఆక్వా ఉత్పత్తులను అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ ఎగుమతి చేస్తోంది. కంపెనీ ఆదాయంలో 82 శాతం అమెరికా నుంచే లభిస్తోంది. సొంత బ్రాండ్లతో ఆక్వా ఉత్పత్తులను విక్రయిస్తోందని అపెక్స్ ఫ్రోజెన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చౌదరి కరుటూరి చెప్పారు.

ఫార్చ్యూన్-40లో మనోళ్లు అయిదుగురు

- **ప్రభావవంత యువత జాబితా**

న్యూయార్క్: వ్యాపార రంగంతో పాటు ఆయా రంగాల్లో అపార ప్రతిభా పాటవాలు చూపుతూ, ఇతరులను ప్రభావితం చేసే 40 ఏళ్ల లోపు యువత 40 మందితో ఫార్చ్యూన్ మ్యాగజైన్ ఏటా జాబితా రూపొందిస్తుంటుంది. 2017 జాబితాలో భారతీయ మూలాలున్న అయిదుగురు చోటుదక్కించుకున్నారు. ఈ జాబితాలో ఉన్న వారంతా 'సంబంధిత విభాగాల్లో సంప్రదాయ ధోరణులను విచ్ఛిన్నం చేసి, సరికొత్త విధానాలు, ధోరణులను, వినూత్నతను ఆవిష్కరిస్తున్న వారు, కళాత్మకంగా వ్యవహరిస్తున్న వారు' అని ఫార్చ్యూన్ పేర్కొంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ (39)కు అగ్రస్థానం దక్కిన ఈ జాబితాలోని దేశీయ మూలాలున్న వారిని చూస్తే..

దివ్యా నాగ్ (26): స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పొందకున్నా, నాగ్‌కు జాబితాలో 27వ స్థానం లభించింది. మూలకణ పరిశోధనలకు సంబంధించి అంకుర సంస్థను నెలకొల్పడంతో పాటు, వైద్యరంగ అంకురాలను ప్రోత్సహించే యాసెలరేటర్‌ను 23 ఏళ్ల వయస్సులో నాగ్ నెలకొల్పారు. ఆరోగ్య సంరక్షణ సేవలకు సంబంధించిన యాప్‌లు రూపొందించేందుకు యాపిల్ నెలకొల్పిన రీసెర్చ్‌కిట్, కేర్‌కిట్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

రిశిషా (31), శ్రద్ధా అగర్వాల్ (32): జాబితాలో 38వ స్థానం వీరిది. ఆరోగ్య సంరక్షణ సేవల సాంకేతిక సంస్థ అవుట్‌కమ్ హెల్త్ పర్యవేక్షకులు. 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.32,000 కోట్ల) విలువ సాధించిన ఈ కంపెనీ 500 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయం పొందింది. 40,000 డాక్టర్ల కార్యాలయాల్లో వైద్య సమాచారం, సంబంధిత యాప్‌ల ఈ సంస్థ చోటు సాధించింది.

లీలా జానా (31): జాబితాలో 40వ స్థానం పొందారు.

FORTUNE

లాభాపేక్ష రహిత సంస్థ శామాసోర్స్ వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వహణాధికారి. ఈమె తండ్రి భారత్ నుంచి అమెరికాకు వలస వెళ్లారు. భారత్, కెన్యా, ఉగండాతో పాటు మరిన్ని పేదలు నివసించే ప్రాంతాల్లో కార్మికులను నియమించడం ద్వారా ఈ ఏడాది ఈ సంస్థ 15 మిలియన్ డాలర్ల (రూ.96 కోట్లు) ఆర్జించనుంది.

వరద్‌కర్ (38) : జాబితాలో అయిదో స్థానం ఐర్లండ్ నూతన ప్రధాని అయిన వరద్‌కర్‌దే.. ఈయన తండ్రి భారతీయుడు. ఎక్కువమంది వలస వెళ్లే దేశంగా ఐర్లండ్‌కు గుర్తింపు ఉన్నా, ముంబయి నుంచి వచ్చిన హిందూ వలసవాది కుమారుడు ప్రధాని కావడం ప్రత్యేకమని పేర్కొంది. వృత్తిరీత్యా వైద్యుడు అయిన వదర్‌కర్ ఐర్లండ్ శతాబ్దాల చరిత్రలోనే పిన్న వయస్సులో నాయకుడిగా గుర్తింపు సాధించారు.

విస్తరణ దిశగా కాల్‌హెల్త్

ఈనాడు – హైదరాబాద్

పలు రకాల వైద్య సేవలను ఒకే చోట అందించే హెల్త్‌కేర్ అగ్రిగేటర్ కాల్‌హెల్త్ విస్తరణ ప్రణాళికలను ప్రారంభించింది. ఇప్పటివరకూ నిర్మాణాత్మక అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారించిన సంస్థ ఇక నుంచి వినియోగదారులను సమీకరించడం, వారికి అవగాహన కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తోంది. దీనికోసం పలు సంస్థలతో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకునేందుకు సిద్ధం అవుతోంది. ఇప్పటికే దాదాపు రూ.230 కోట్ల వరకూ వ్యవస్థాపకులు, ఇతర పెట్టుబడిదార్ల నుంచి సమీకరించింది. భవిష్యత్తు అవసరాల కోసం కూడా ఇంతే మొత్తాన్ని పెట్టుబడుల రూపంలో సమీకరించాలని యోచిస్తున్నట్లు కాల్‌హెల్త్ సీఈఓ హరి తాలపల్లి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఫీనిక్స్ ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)లో కాల్‌హెల్త్ కేంద్రాన్ని సినీనటులు అక్కినేని నాగార్జున, అమల అక్కినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ. వైద్య సేవలకు సాంకేతికతను జత చేసి, అన్ని రకాల వైద్య సేవలను ఒకే చోట నుంచి పొందేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తోపాటు దేశ రాజధాని దిల్లీలో పలు ప్రముఖ సంస్థల్లో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 14 కేంద్రాలున్నాయనీ, రెండు మూడు నెలల్లో మరో 10కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, ఏడాదిలో వీటి సంఖ్య 50కు పెంచాలనే లక్ష్యం ఉన్నట్లు వివరించారు. ఏపీ, తెలంగాణల్లోని 8 పట్టణాల్లోనూ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యం, నర్సింగ్, మందుల సరఫరా తదితర 14 రకాల సేవలను అందిస్తున్నట్లు ఇందుకోసం 125కు పైగా సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు చెప్పారు.

రానున్న ఐదేళ్లలో 6 ఎస్ఈజెడ్‌లు: ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు వస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఇక్కడ ఆఫీసు స్థలానికి గిరాకీ అధికంగా ఉండబోతోందని ఫీనిక్స్ ఛైర్మన్ సురేశ్ చుక్కపల్లి అన్నారు. ఏడాదిలోపు ప్రస్తుతం ఉన్న ఫీనిక్స్ ఎస్ఈజెడ్‌లో మరో 10లక్షల చదరపు అడుగుల స్థలం అందుబాటులోకి వస్తుందని, దీంతో ఇక్కడి ఉద్యోగుల సంఖ్య ప్రస్తుతం ఉన్న 22 వేల నుంచి 50 వేలకు పెరుగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో మరో 5 ఏళ్లలో 6 ప్రత్యేక ఐటీ ఆర్థిక మండళ్లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో ఏర్పాటయ్యే సంస్థల ద్వారా సుమారు 2,50,000 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



ఫీనిక్స్ ఎస్ఈజెడ్‌లో కాల్‌హెల్త్ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతున్న నటి అమల. చిత్రంలో కాల్‌హెల్త్ సీఈఓ హరి తాలపల్లి, నాగార్జున అక్కినేని, ఫీనిక్స్ ఛైర్మన్ సురేశ్ చుక్కపల్లి.

స్థిరాస్తి రంగంపై జాతీయ సదస్సు 28 నుంచి

ఈనాడు, హైదరాబాద్: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ), స్థిరాస్తి (నియంత్రణ అండ్ అభివృద్ధి) చట్టం 2016 వంటి పరిణామాలు స్థిరాస్తి రంగానికి కొత్త ఊపును ఇవ్వనున్నాయని జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి (నారెడ్కో) దక్షిణ ప్రాంత ఉపాధ్యక్షుడు ఆర్. చలపతిరావు తెలిపారు. జీఎస్‌టీ అమలు నేపథ్యంలో 12 శాతం పన్ను విధింపు, దానిపై వచ్చే ఇన్‌పుట్ క్రెడిట్‌పై స్పష్టత లభించిందని నారెడ్కో ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షుడు జి.హరి బాబు, తెలంగాణ స్థిరాస్తి డెవలపర్ల సంఘం (ట్రెడా) అధ్యక్షుడు రవీంద్రరావు పేర్కొన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో దిల్లీలో నారెడ్కో 14వ జాతీయ సదస్సు జరుగుతున్న సందర్భంగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో రేరా చట్టం నోటిఫై అయిందని.. 15 రోజుల్లో అథారిటీ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించే వీలుందని హరి బాబు చెప్పారు. లే అవుట్లు, కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడానికి 10 రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అమరావతి పరిధిలో స్థిరాస్తి కార్యకలాపాలు పుంజుకునే వీలుందన్నారు.

పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంపు

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వం ముడి పామాయిల్‌పై ప్రస్తుతం ఉన్న 7.5శాతం దిగుమతి సుంకాన్ని 15శాతానికి పెంచడంపై ఆయిల్ పామ్ డెవలపర్స్ అండ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ (ఓపీడీపీఏ) హర్షం వ్యక్తం చేసింది. శుద్ధి చేసిన పామాయిల్‌పై 15శాతం నుంచి 25శాతానికి పెరిగింది. దిగుమతి సుంకాన్ని పెంచడం వల్ల దేశంలోని రైతులకు మేలు చేకూరుస్తుందని ఓపీడీపీఏ అధ్యక్షుడు సంజయ్ గోయెంకా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనివల్ల రైతులకు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వారికి రూ.40-60కోట్ల ఆదాయం అదనంగా వస్తుందన్నారు.

84 ఇండిగో విమాన సర్వీసులు రద్దు

ముంబయి: ఇంజిన్ సమస్యల వల్ల ఏ320 నియో విమానాలు 13 పనిచేయకపోవడంతో, శుక్రవారం 84 సర్వీసులను ఇండిగో రద్దు చేసింది. ప్రాట్ అండ్ విట్నీ సరఫరా చేసిన ఇంజిన్లలో సమస్యలు తలెత్తడమే ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. ఈ ఏడాది జూన్ 21 నుంచి జులై 3 మధ్య 667 సర్వీసులను ఇండిగో రద్దు చేసుకోవాల్సి వచ్చింది.

18వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
19న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్ఎస్ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

ఘనం (+)

నిఫ్టీ	18న	మార్పు %
BHARTI INFR	395.30	4.20
HINDUSTAN UNI	1202.20	2.12
ULTRATECH CEM	4014.35	2.07
BHARAT PETRO	503.30	1.94
EICHER MOTO	31511.45	1.89

గ్రహణం (-)

నిఫ్టీ	18న	మార్పు %
INFOSYS LIM	923.25	-9.56
SUN PHARM	470.15	-3.71
ZEE ENTERT	511.60	-2.88
VEDANTA LIM	298.40	-2.10
NTPC LTD	173.40	-1.92

నిఫ్టీ 50

ACC 1794.30 (1780.10) 274644
ADANI PORT & 386.20 (389.30) 2554849
AMBUJA CEMEN 274.95 (270.90) 2173179
ASIAN PAINTS 1140.00 (1134.95) 357491
AUROBIND PHA 704.75 (703.50) 1514532
AXIS BANK LT 490.40 (497.15) 4166976
BAJAJ AUTO L 2811.35 (2825.85) 128913
BANK OFBAROD 147.20 (148.25) 13628146
BHARTI AIRTE 421.00 (416.35) 2759975
BHARTI INFRA 395.30 (379.35) 4427161
BOSCH LTD 22034.00 (22037.95) 8709
BPCL 503.30 (493.70) 5973154
CIPLA 565.30 (573.20) 1680225
COAL INDIA L 243.35 (246.95) 3442524
DR. REDDYS 1982.00 (2011.25) 349297
EICHER MOTOR 31511.45 (30928.00) 39089
GAIL 381.25 (376.20) 2516673
HCL TECH 876.25 (871.40) 1064955
HDFC 1735.05 (1759.25) 1897962
HDFC BANK 1752.15 (1765.40) 926866
HERO MOTOCOR 3986.70 (3997.85) 209351
HINDALCO IND 230.05 (230.30) 10750779
HINDUSTAN UN 1202.20 (1177.30) 1407292
ICICI BANK 293.15 (293.15) 6700778
INDIABULLS H 1202.40 (1200.45) 887796
INDIAN OIL 427.35 (426.30) 5647900
INDUSINDBANK 1621.05 (1628.50) 620278
INFOSYS LTD 923.25 (1020.85) 82202480
ITC 281.85 (280.00) 14869905
KOTAK MAHIND 983.55 (989.00) 956180
LARSEN & TOU 1130.60 (1134.00) 1230709
LUPIN 938.35 (953.95) 1834424
M&M 1370.00 (1367.00) 678855
MARUTI SUZIK 7598.80 (7582.45) 332924
NTPC LTD 173.40 (176.80) 7572481
ONGC 160.90 (160.60) 5559512
POWER GRID C 222.95 (219.45) 4343111
RELIANCE IND 1575.40 (1567.10) 1814011
SBI 278.70 (280.85) 12653217
SUN PHARMA 470.15 (488.25) 4513543
TATA CONSULT 2513.80 (2485.65) 1418678
TATA MOT DVR 226.95 (228.60) 830778
TATA MOTORS 380.40 (385.30) 5856198
TATA POWER 80.30 (81.65) 2900287
TATA STEEL L 625.65 (625.40) 3386205
TECH MAHINDR 428.85 (424.40) 3610728
ULTRATECH 4014.35 (3932.90) 276537
VEDANTA LIMI 298.40 (304.80) 12780922
WIPRO 288.10 (288.35) 2980838
YES BANK LTD 1720.75 (1738.10) 1678905
ZEE ENTERTAI 511.60 (526.75) 3540595

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 4.10 (4.12) 10400
AMAR RAJA BA 796.50 (807.45) 39668
ANDHRA BANK 50.80 (51.20) 298766
ANDHRA CEMEN 8.96 (8.91) 15300
ANDHRA PETRO 27.05 (27.60) 34752
ASTRA MICROW 122.80 (124) 17285
AUROBINDO PH 704.50 (703.50) 170869
AVANTI FEEDS 1922.15 (1906.05) 40890
AVON ORG 4.89 (5.24) 10176
BHAGIRA CHEM 199.35 (195.05) 18813
BN RATHI SEC 31.55 (32.65) 6439
BRILLIANT SE 7.59 (7.25) 185919
CAMBRIDGE TE 70.70 (69.35) 5881
COROMAN FERT 444.70 (443.90) 19356
CUBEX TUB 16.15 (17) 2332
DIVI'S LAB 634.10 (645.50) 43976
DIVYA GRANIT 100.90 (100) 2754
DR REDDY 1982.90 (2010) 26360
GATI CORPN 109.20 (112.80) 91792
GAYATRI PROJ 161.35 (163.20) 2035
GMR INFRASTR 18.30 (18.60) 4615246
GOLDST INFRA 130.35 (124.15) 183301
GOLDSTONE EN 12.05 (11.48) 45944
GRANULES (I) 126.75 (126.80) 113672
GVK POWER 13.48 (13.24) 4267942
HBL NIFE POW 44.50 (45.60) 45208
ILFS ENGINEE 41.75 (42.80) 7084
INCAP 61 (59) 10970
IVRCL INFRAS 5.09 (5.24) 82352
KAKATIYA CEM 342.35 (346.75) 4785
KALLAM SPG 33.50 (28.15) 469526
KAVERI SEED 560.80 (548.60) 75975
KCP LTD 102.90 (105.15) 12725
KNR CONSTRUC 218.40 (220.10) 6993
LANCO INDUS 364.20 (363.20) 12931
LANCO INFRAT 0.94 (0.91) 11385404
LAURUS LABS 536.40 (545.45) 6077
LOKESH MACH 79.65 (80.55) 6664
MADHUCON PRO 29.50 (30.20) 31255
MEGA SOFT 13.40 (13.90) 13190
MIC ELECTRON 7.91 (8.14) 87723
MOLDTK PLA 292.10 (283.25) 5471
MSR INDIA LT 35.05 (33.40) 4741
NAGARJAGRICH 35.90 (37.05) 52265
NATCO PHARMA 752.80 (772.60) 57225
NAVA BH VENT 127.60 (128.85) 10609
NCC 87.30 (87.70) 244295
NCL IND 221.30 (221.20) 54639
NEHA INTER 4.99 (4.98) 346023
NETTLINX 98 (97.60) 15241
NIHAR INFO 16.50 (15.05) 610
NILE 616.60 (621.85) 7606
PANYAM CEMEN 59.10 (60.60) 3937
PENNER IND 59.60 (58.70) 477784
PIONEER DIST 199.25 (209.70) 3734
PITTI LAMIN 64.25 (53.60) 361574
PRAJAY ENGS 7.71 (7.94) 29030
PRISM CEMENT 111.85 (111.90) 14840
PRUDENTL PHA 3.88 (3.87) 84178
RAIN INDUSTR 138 (130) 446608
SAMKRG PIST 257.95 (263.20) 13295
SATVAH. ISPA 38 (39.35) 5752
SMS PHARMA 73.60 (75.70) 6619
SOUTH BIO TE 3.13 (3.39) 45047
SPHERE GLOBA 47.50 (47.45) 6124
SREE RAYAL A 28 (28.35) 98305
SRI KPR INDU 26 (24.80) 4851
SRINIVASA SH 59.35 (57.30) 69688
STEEL EXCHAN 83.70 (84.15) 234827
SUJANA METAL 1.65 (1.66) 13630
SUJANA TOWER 4.38 (4.15) 3450
SUJANA UNIVE 0.95 (0.98) 124420
SURANA TELE 4.65 (4.66) 4900
SURYALAKSH.C 98.70 (100.25) 11679
SUVEN PHARMA 160.85 (163.80) 37512
TAJ GVK HOTE 160.95 (162.70) 5517
TANLA 33.60 (31.50) 151898
TRANS BIOTEK 2.31 (2.22) 10256
VBC FERRO 39.90 (38.20) 2602
VICEROY HOTE 16.80 (17.05) 55251
VIJAY TEXTIL 59 (59.85) 36269
VIMTA LABS 130 (131) 9351
VISAKA IND 496.55 (506) 9832
VISTA PHARMA 31.25 (29.80) 8348
VIVIMED LABS 106 (106.50) 376502
YBRANT DIGIT 6.65 (6.82) 59783
ZENTECH 51.05 (52.45) 9444

ఈనాడు సినిమా

పుట్టినరోజే రావాలి...


పవన్ కల్యాణ్


అఖిల్

అభిమాన తారల పుట్టినరోజు కోసం ప్రత్యేకంగా ఎదురు చూస్తుంటారు ప్రేక్షకులు. ఆ రోజును ఓ వేడుకలా జరుపుకొంటుంటారు. అందుకోసం నెల రోజులు ముందు నుంచే సన్నాహాలు మొదలైపోతుంటాయి. అలాంటప్పుడు తారలు కూడా అభిమానుల్ని ఉత్సాహపరిచేలా ఏదో ఒకటి చేయాలి కదా! అభిమానులకి తారలు చెప్పే సినిమా సంగతుల కంటే ఉత్సాహాన్నిచ్చే విషయం ఏముంటుంది? ఆ విషయం దృష్టిలో పెట్టుకొనే తమ కొత్త చిత్రాలకి సంబంధించి ఏదో ఓ కొత్త విషయాన్ని బయటపెడుతుంటారు తారలు. ఈమధ్య అయితే టైటిల్, ఫస్ట్‌లుక్, టీజర్, ట్రైలర్ల ఆవిష్కరణలకి పుట్టినరోజునే ముహూర్తంగా నిర్ణయిస్తున్నారు. దాంతో అభిమానులకి తారల పుట్టిన రోజులు మరింత కీలకంగా మారిపోయాయి. పక్షం రోజుల వ్యవధిలో రాబోతున్న నాగార్జున, పవన్‌కల్యాణ్ పుట్టిన రోజుల గురించి అభిమానులు ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. అందుకు కారణం పవన్, అఖిల్‌ల కొత్త చిత్రాలకి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ల విడుదల కార్యక్రమం ఉండొచ్చని ప్రచారం సాగుతుండడమే. అఖిల్ కథానాయకుడిగా విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. నాగార్జున ఆ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఆ సినిమాకి సంబంధించి విడుదల తేదీ ఖరారైంది కానీ... పేరు, ఫస్ట్‌లుక్‌లాంటివేవీ బయటకి వెల్లడించలేదు. ఈ నెల 29న నాగార్జున పుట్టినరోజు కావడంతో ఆ రోజున అఖిల్ సినిమా పేరు, లుక్ బయటికొచ్చే అవకాశాలున్నాయని ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే పవన్‌కల్యాణ్ కొత్త చిత్రం పేరుని కూడా ఇప్పటివరకూ వెల్లడించలేదు. సెప్టెంబరు 2న పవన్ పుట్టినరోజు కాబట్టి ఆ రోజునే ఫస్ట్‌లుక్, పేరు బయటికొచ్చే అవకాశాలున్నాయని తెలిసింది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఆ చిత్రానికి సంబంధించి ఇప్పటికే పలు పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మరి పవన్ ఎలాంటి పేరును వినిపిస్తాడో అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. చిరంజీవి కథానాయకుడిగా నటించనున్న 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' మోషన్ పోస్టర్ విడుదల మాత్రం ఇప్పటికే ఖరారైంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకొని 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' మోషన్ పోస్టర్‌ని విడుదల చేయబోతున్నారు.

రామోజీ ఫిలింసిటీలో 'సాహో' షురూ!


ప్రభాస్

'బాహుబలి', 'బాహుబలి 2' చిత్రాలతో నాలుగున్నర ఏళ్లు ప్రయాణించారు ప్రభాస్. ఈ రెండు చిత్రాలు ఆయనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకొచ్చాయి. ఇప్పుడు 'సాహో'గా అలరించబోతున్నారు. ఈ సినిమా చిత్రీకరణ శుక్రవారం నుంచి రామోజీ ఫిలింసిటీలో మొదలైంది. అక్కడ ప్రత్యేకంగా వేసిన సెట్‌లో ఆఫీసు నేపథ్యంగా వచ్చే సన్నివేశాల్ని ప్రభాస్ తదితరులపై తెరకెక్కిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఫిలింసిటీలోనే చిత్రీకరణ చేయనున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ భామ శ్రద్ధా కపూర్ నటిస్తోంది. సుజీత్ దర్శకత్వంలో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'సాహో' టీజర్‌కు మంచి స్పందన లభించింది. గత చిత్రాలకు భిన్నంగా స్టైలిష్ లుక్‌తో ప్రభాస్ ఈ చిత్రంలో కనిపించనున్నారని చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రానికి కళ: సాబు సిరిల్, ఛాయాగ్రహణం: మది, సంగీతం: శంకర్ - ఎహసాన్- లాయ్.

కొత్త యాక్షన్ ప్రపంచంలోకి: ఈ సినిమా చిత్రీకరణ మొదలైన విషయాన్ని ప్రభాస్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. "దాదాపు నాలుగున్నర సంవత్సరాలు 'బాహుబలి'గా నా ప్రయాణం సాగింది. ఇప్పుడు 'సాహో'తో ఓ కొత్త యాక్షన్ ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా ఆసక్తిగా ఉంద"న్నారు ప్రభాస్.

ఆ రోజు కోసం: సాహో కథానాయిక శ్రద్ధాకపూర్ స్పందిస్తూ "బాహుబలి'గా బాక్సాఫీసు రికార్డులు కొల్లగొట్టి బాలీవుడ్‌లోనూ ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు ప్రభాస్. ఇప్పుడు ఆయన సరసన నటించే అవకాశం నాకు దక్కింది. 'సాహో' చిత్రబృందంలో నేను భాగమైనందుకు ఆనందంగా ఉంది. తొలిరోజు సెట్లో ప్రభాస్‌ను కలిసే క్షణం కోసం, ఆయనతో కలసి పనిచేయడం కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నా" అని చెప్పింది.

పంచ్ డైలాగ్

పట్టుదల, ఆత్మవిశ్వాసం ఒకే పోలీసు ఆఫీసర్‌లో ఉంటే... కళ్లు లేకపోయినా చట్టం చూడగలుతుంది!

చిత్రం: కర్తవ్యం

- పంపినవారు: సోమయాజుల వెంకట కామేశ్వరరావు, విశాఖపట్నం

మా కోసం కథలు పుడుతున్నాయి


సమంత

"కథానాయిక పాత్ర చిత్రణ ఇది వరకటి కంటే ఇప్పుడు బాగా మెరుగు పడింది. కథలో మాకూ భాగం ఉంటోంది. స్త్రీ పాత్రలకు గౌరవం ఇచ్చే దర్శకుల సంఖ్య పెరుగుతోంది. ఇది నిజంగా మంచి పరిణామం" అంటోంది సమంత. ఒక వైపు సినిమాలు, మరోవైపు సామాజిక కార్యక్రమాలు, ఇంకోవైపు వ్యక్తిగత జీవితం... ఇలా క్షణం కూడా ఖాళీ లేకుండా గడుపుతోంది సమంత. త్వరలోనే నాగచైతన్యతో పెళ్లి కాబోతోంది. ఆ పనులూ మొదలైపోయాయి. "వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో చాలా కీలకమైన దశలో ఉన్నా. నా జీవితాన్ని ఇప్పుడు పరిపూర్ణంగా అనుభవిస్తున్నా" అంటోంది సమంత. కథానాయికల స్థాయి పెరుగుతోందా? అంటే "తప్పకుండా పెరుగుతోంది. మమ్మల్ని దృష్టిలో ఉంచుకొని మంచి పాత్రలు సృష్టిస్తున్నారు. 'అఆ'లో హీరో ఎవరు అంటే టక్కున చెప్పలేం. అందులో కథే ముఖ్యం. నాయకానాయికల పాత్రలు సమానంగా ఉంటాయి. ఈ దిశగా ఆలోచిస్తే మంచి కథలు పుడతాయి. వాటి ఫలితాలూ బాగుంటాయి" అని చెప్పింది సమంత.

గీతోపదేశం

అవకాశం రాలేదంటూ
గుక్కే పట్టి ఏడొద్దే
ఏనాడో వచ్చుంటాది
నువ్వే వదిలేసుంటావే
చీకటినే తిడుతూ తొంగుంటే
వేకువకి చోటే లేదులే
నిన్నే తిరిగిరాదు కదా
రేపేం జరుగుతుందో కదా
నీకే మిగిలి ఉంది ఇక ఈరోజే

గీతం: పుడుతూనే ఉయ్యాల... చిత్రం: నేనింతే రచన: భాస్కరబట్ల రవికుమార్ - పంపినవారు: అల్లిబాబు, కర్నూలు


నాని

అబ్బాయి ఎప్పుడొస్తాడంటే?

ఈ ఏడాది ఇప్పటికే 'నేను లోకల్', 'నిన్ను కోరి' చిత్రాలతో అలరించాడు నాని. త్వరలో మిడిల్‌క్లాస్ అబ్బాయిగానూ తెరపై సందడి చేయబోతున్నాడు. వేగంగా సినిమాలు చేసే నాని మొత్తం మూడు చిత్రాలతో 2017కి ముగింపు పలకబోతున్నారు. నాని కథానాయకుడిగా వేణుశ్రీరామ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఎం.సి.ఎ' విడుదల తేదీ ఖరారైంది. డిసెంబరు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాని సరసన సాయిపల్లవి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. ఎం.సి.ఎ అంటే మిడిల్ క్లాస్ అబ్బాయి అంటూ తన సినిమాతో కొత్త అర్థం చెప్పబోతున్నాడు నాని. మధ్య తరగతి కుర్రాడిగా ఆయన పంచే వినోదాలు ఆకట్టుకుంటాయని చిత్రబృందం చెబుతోంది. ఈ సినిమాకి దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు.

గుండెలమీద చేయి వేసుకొని చూడండి


రవీందర్ రెడ్డి, మండలి బుద్ధప్రసాద్, ప్రగ్యా జైస్వాల్, బోయపాటి శ్రీను, బెల్లంకొండ శ్రీనివాస్, జగపతిబాబు

"కథానాయకులందరితోనూ సినిమాలు చేస్తా. నేను ఏ సినిమా తీసినా సరే, ప్రేక్షకుడు గుండెల మీద చేయి వేసుకొని సినిమా చూడొచ్చు. ఆ నమ్మకం మీకు కల్పిస్తాన"న్నారు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'జయ జానకి నాయక'. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా నటించారు. రకుల్‌ప్రీత్ సింగ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలు. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మాత. ఈ చిత్ర విజయోత్సవ సభని శుక్రవారం కృష్ణా జిల్లా హంసలదీవిలో నిర్వహించారు. ఈ సందర్భంగా బోయపాటి మాట్లాడుతూ "దైవదూతలు సంచరించిన ప్రదేశం ఇది. అలాంటి చోట మా సినిమా తెరకెక్కించాం. ఆ దీవెనల వల్లే ఇంత మంచి విజయం అందుకొంది. ఈ ప్రాంత ప్రజలు మమ్మల్ని సొంత బిడ్డల్లా చూసుకొన్నారు. ఆ అభిమానంతోనే ఇక్కడ విజయోత్సవం నిర్వహించుకొన్నామ"న్నారు. "ఈ విజయం సంతృప్తినిచ్చింది. ఈ ఉత్సాహంతో ముమ్ముందు ఇంకా మంచి కథల్ని ఎంచుకొంటా" అన్నారు బెల్లంకొండ శ్రీనివాస్. జగపతిబాబు మాట్లాడుతూ "జగపతిబాబు పనైపోయింది' అనుకొన్న సమయంలో బోయపాటి నన్ను ఆదుకొన్నాడు. 'లెజెండ్'లో మంచి పాత్ర ఇచ్చాడు. 'జయ జానకి నాయక'లో అంతకంటే మంచి వేషం వేయించాడ"న్నారు. "తెలుగు చిత్రసీమలో నా పునః ప్రవేశం 'జయ జానకి నాయక'లాంటి సినిమాతో జరగడం ఆనందంగా ఉంద"న్నారు వాణీ విశ్వనాథ్. "హంసలదీవి ప్రాభవాన్ని ఈ సినిమాలో చక్కగా చూపించారు. ఈ సినిమాతో హంసలదీవి టూరిజానికి నాంది పలికారు" అని ఆంధ్రప్రదేశ్ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎస్.పి త్రిపాఠి, నటులు ప్రగ్యా జైస్వాల్, నందు, జెపి, జొన్నవిత్తుల తదితరులు పాల్గొన్నారు.


సానియా, సూరజ్

స్నేహమే గొప్ప

సూరజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం '2 ఫ్రెండ్స్'. ట్రూలవ్... అనేది ఉపశీర్షిక. రవీంద్రతేజ, సానియా, స్నిగ్ధ, కార్తీక్, సారా ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. జి.ఎల్.బి.శ్రీనివాస్ దర్శకుడు. ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్ నాయుడు నిర్మాతలు. ఈ నెలాఖరు నుంచి మొదలయ్యే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. "ప్రేమ కంటే స్నేహం గొప్పదని నిరూపించిన ఇద్దరు స్నేహితుల కథ ఇది. వినోదంతో పాటు, అంతర్లీనంగా ఓ మంచి సందేశం ఈ చిత్రంలో ఉంటుంది" అన్నారు దర్శకుడు. "కథాబలమున్న చిత్రమిది. వరంగల్, బెంగుళూరు, అనంతపురంతో పాటు కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాల్లో చిత్రీకరణ జరుగుతుంద"న్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సురేందర్‌రెడ్డి, కథ, మాటలు, సంగీతం: పోలూర్ ఘటికాచలం

బుల్లెట్‌పై 81 ఏళ్ల బుల్లోడు



ధర్మేంద్ర పరిచయం అక్కర్లేని ప్రముఖ బాలీవుడ్ కథానాయకుడు. యాక్షన్ హీరోగా హీమ్యాన్‌గా ఆయన కంటూ ఓ ప్రత్యేక గుర్తింపుఉంది. ఇప్పుడు ఆయన వయసు 81 ఏళ్లు. పక్కనున్న ఫొటో చూస్తుంటే ఆయన వయసే గుర్తు రాదేమో. అంత ఉత్సాహంగా బుల్లెట్‌పై దూసుకుపోవడానికి ఆయన సిద్ధమవుతున్నారు. ఎక్కడకని అడగరే... ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'యమ్లా పగ్లా దీవానా ఫిర్ సే'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం రామోజీ ఫిలింసిటీలో జరుగుతోంది. ఆ సెట్‌లో తీసిన ఈ ఫొటోను ట్విట్టర్‌లో పంచుకున్నారు ధర్మేంద్ర. ఆయన తొలిసారి శుక్రవారం ట్విట్టర్‌లోకి అడుగుపెట్టారు.

నా ఫొటోలు... నా ఇష్టం!


ఇషా గుప్తా

ఇషా గుప్తా... ఇప్పుడు బాలీవుడ్‌లో ఓ హాట్ టాపిక్. సోషల్ మీడియాలో ఆమె ఫొటోలు వైరల్‌గా మారాయి. ఈ మధ్య తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఆమె పెట్టిన ఫొటోలు నెటిజన్ల మతిపోగేట్టాశాయి. టాప్‌లెస్‌గానూ, లోదుస్తుల్లో అర్ధనగ్నంగా ఉన్న ఇషా ఫొటో షూట్‌పై పెద్ద చర్చే జరుగుతోంది. లింగ బేధం లేకుండా నా ఫొటోలపై విమర్శలు చేసిన మగ, ఆడ నెటిజన్లకు నేను చెప్పేది ఏంటంటే "ఓ భారతీయ అమ్మాయి అందాల ఆరబోస్తుంటే చూసి వాళ్ల మగతనం ఎక్కడ షేక్ అవుతుందో అని మగాళ్లు కంగారు పడిపోతున్నారు. ఆత్మవిశ్వాసం లేని ఆడవాళ్లే నన్ను విమర్శిస్తున్నారు. నా ఫొటోలపై వస్తున్న కామెంట్లు చూస్తుంటే నవ్వొస్తుంది. వాళ్ల మనస్తత్వం ఎలాంటిదో అర్థమవుతోంది. ప్రపంచం తిరోగమనం వైపు వెళ్లిపోతుందా? అనే సందేహం కలుగుతోంద"ని చెబుతోంది ఇషా. 'అసలు ఓ భారతీయ అమ్మాయి చేసే పనేనా?', 'ఇషా భారతీయురాలే కాదు....' ఈ విమర్శలే నన్ను ఎక్కువ బాధపెడుతున్నాయి అంటోంది ఇషా. "నన్ను విమర్శించే అందరి కంటే నేనే అసలు సిసలు భారతీయురాల్ని. నా తండ్రి దేశానికి ఎంతో సేవ చేశారు. మరి మీ తండ్రి చేశారా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది ఇషా. "ప్రపంచంలో ఇన్ని సమస్యలుండగా నా ఫొటో షూట్ గురించే ఇంత చర్చ అవసరమా? మన చుట్టూ ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. ముందు వాటి గురించి మాట్లాడండి" అని గట్టిగానే చెబుతోంది ఇషా గుప్తా. "నన్ను విమర్శిస్తూ చాలామంది మెయిల్స్ పెట్టారు. వాళ్లందరికీ నెగెటివ్‌గా సమాధానం ఇవ్వలేదు. మరిన్ని ఫొటోలు పోస్ట్ చేశాను. నేను అందంగా ఉంటాను. నా అందాలను బంధించిన ఫొటోలు నాకు నచ్చాయి. వాటిని పంచుకున్నాను" అని నిర్మొహమాటంగా చెప్పేసింది ఇషా. తాజాగా ఈ భామ నటించిన అజయ్‌దేవగణ్ ప్రధాన పాత్రలో వస్తోన్న 'బాద్‌షాహో' త్వరలోనే విడుదల కానుంది.

'2019 మార్చి'కి డీఎడ్ పట్టాను సాధించాలి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తూ శిక్షణ పొందని ఉపాధ్యాయులు 'డీఎడ్' పట్టాను సాధించే గడువును 2019 మార్చి 31వరకు కేంద్రం పొడిగించింది. విద్యాహక్కు చట్టం ప్రకారం 2018 మార్చి 31వ తేదీ తర్వాత అన్ని రకాల పాఠశాల్లో శిక్షణ పొందిన టీచర్లు మాత్రమే పనిచేయాలి. ఈగడువును పొడిగించింది. 2019 మార్చిలోగా అర్హతల్ని సాధించకుంటే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి బోధన చేయడానికి వీల్లేదని విద్యాశాఖ కమిషనర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర గణాంకాల ప్రకారం శిక్షణ పొందని వారు దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 5,11,679, ప్రైవేట్ పాఠశాలల్లో 5,91,765 మంది ఉన్నారు. రాష్ట్రంలో 5,236 మంది ఉన్నారని పేర్కొన్నారు. 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలు' నుంచి కూడా డీఎడ్ విద్యను పూర్తిచేసే అవకాశాన్ని కల్పించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/327/2017 dt. 18-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం వేగివాడ గ్రామం నందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు కి.మీ. 0.108 నుండి కి.మీ. 0.375 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ ఉపకలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరువారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామము: వేగివాడ మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	4/2	3.47	0.16	సూర్యదేవర సూర్యభవాని భర్త ఎస్.ఎల్.ఎన్.ప్రసాద్	1	17	5	17	సాగుభూమి
2	6/2	1.28	0.07	అన్నపురెడ్డి రాఘవులు తండ్రి పుల్లయ్య	1	5	గ్రామ సరిహద్దు	1	సాగుభూమి
3	6/3	18.13	0.43	నాగులపల్లి శ్రీనివాసరావు తండ్రి విజయరామ కృష్ణారావు	1	5	గ్రామ సరిహద్దు	1	సాగుభూమి
4	6/4	6.20	0.05	నాగులపల్లి శ్రీనివాసరావు తండ్రి విజయరామ కృష్ణారావు	1	5	గ్రామ సరిహద్దు	1	సాగుభూమి
	మొత్తం	29.08	0.71						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/334/17 dt. 18-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం విజయరాయి గ్రామం నందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 1.409 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరువారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామము: విజయరాయి మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	6	73.00	1.61	కాజా రమేశ్ తండ్రి కుటుంబరావు	24	4	గ్రామ సరిహద్దులు	7	సాగుభూమి
2	7	8.74	0.23	కాజా ధనలక్ష్మి భర్త కుటుంబరావు	22	10	6	9	సాగుభూమి
3	9	11.16	0.01	కాజా ధనలక్ష్మి భర్త కుటుంబరావు	19	10	7	11	సాగుభూమి
4	22	52.30	0.02	అగ్రికల్చరల్యూనివర్సిటీ అగ్రికల్చర	21	6	23	19	సాగుభూమి
5	23	14.42	1.04	నువ్వుల విజయశ్రీ భర్త రామమోహనరావు	25	6	24	22	సాగుభూమి
6	24	14.82	0.95	కొడాలి సీతామహాలక్ష్మి భర్త వెంకటరత్నం	28	6	26	23	సాగుభూమి
7	26	24.58	0.25	బలుసు సీతారామవరప్రసాద్ తండ్రి కృష్ణమూర్తి	28	6	27	24	సాగుభూమి
8				శ్రీ గణపతిరాజు సత్యవతి భర్త వీరవెంకటచార్యులు					సాగుభూమి
	మొత్తం	199.02	4.11						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. No. C1/414/2017 dt. 17-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూలులో చూపబడిన పశ్చిమగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం తాడిపూడి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం **Substation on Package-3** నిర్మాణ నిమిత్తం అవసరమై ఉన్నదని శ్రీ. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఎరుక నిమిత్తము ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియూ లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-1, కొవ్వూరు వారికి, వారి సిబ్బందికి పనివారికి ఇందుమూలముగా అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ. విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.


పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలక్టర్ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-1, కొవ్వూరు వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: పశ్చిమగోదావరి మండలం: తాళ్ళపూడి గ్రామం: 95 – తాడిపూడి

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	సేకరించిన విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, మరియు కట్టడముల వివరాలు
1	2	3	4	6	7	8	9	10	11
1	204	8.63	4.04	చెన్నా రామకృష్ణరావు తండ్రి వీరన్న; చిరుకూరి నాగేశ్వరరావు తండ్రి సత్యం; ముళ్ల వెంకట్రామమ్మ భర్త గంగారావు; ముళ్ల అనసూయ భర్త ధర్మరాజు; అనిశెట్టి శ్రీనివాసరావు తండ్రి సత్యనారాయణ; మాదిరాజు వెంకట నరసింహారావు తండ్రి విశ్వసుందరం; మాదిరాజు మాణిక్య కామేశ్వరిబాయ భర్త సీతారామారావు; యండపల్లి నాగేశ్వరరావు తండ్రి వీరభద్రరావు	204/1A	V.No. Paidimetla	206	203	--
2	206	8.06	3.21	సింహాద్రి వెంకటగిరి జగ్గారావు తండ్రి రామం; మండపల్లి వాసు తండ్రి సత్యనారాయణమూర్తి; దేవిశెట్టి సూర్యనారాయణ తండ్రి సత్యం; చెల్లింకుల అన్నవరం తండ్రి సత్యం	206/2, 3, 4	207	208	204	--
	మొత్తం		7.25						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం



తిరుపతి నగరంలో మహాప్రస్థానం అభివృద్ధికి రూ.30 లక్షల చెక్కును శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందచేస్తున్న తానా అధ్యక్షుడు సతీష్ వేమన. చిత్రంలో కోమటి జయరాం తదితరులు

'గోవింద ధామం'కు తానా విరాళం

ఈనాడు, అమరావతి: తిరుపతిలో "గోవింద ధామం" పేరిట ఆధునిక సదుపాయాలతో నిర్మించిన గ్యాస్ ఆధారిత శ్మశానవాటిక అభివృద్ధికి తానా రూ.30లక్షల విరాళాన్ని అందించింది. తానా అధ్యక్షుడు సతీష్ వేమన, అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాంల ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. తానా, రోటరీక్లబ్ ఇతర సంస్థల సహకారంతో రూ.3కోట్ల వ్యయంతో ఈ శ్మశానవాటికను నిర్మించినట్లు వారు వివరించారు. వాటిక ప్రత్యేకతలపై తీసిన చిత్రాలను ముఖ్యమంత్రికి చూపించారు.

హెచ్ఐవీ రక్తపు సిరంజితో దాడి!

ఆసుపత్రి పర్యవేక్షకుడిపై వైద్యుడి ఘాతుకం

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: బాధ్యతాయుతమైన విధిలో ఉన్న ఓ ప్రభుత్వ వైద్యుడు ఆసుపత్రి పర్యవేక్షణాధికారిపై అమానుష దాడికి యత్నించాడు. హెచ్ఐవీ రోగి నుంచి సేకరించిన రక్తంతో ఉన్న సిరంజిని గుచ్చే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో పర్యవేక్షణాధికారికి సిరంజి గుచ్చుకోకపోవడంతో ప్రమాదం తప్పింది. కడప జిల్లా ప్రొద్దుటూరులో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రొద్దుటూరులోని జిల్లా ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ లక్ష్మీప్రసాద్‌పై ఇదే ఆసుపత్రిలోని ఎముకల వైద్యుడు డాక్టర్ డేవిడ్‌రాజు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. "విధులకు సక్రమంగా హాజరవుతున్నా ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది నా మాట వినటంలేదు. దీనిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవటంలేదు. నేను చికిత్స అందిస్తున్న రోగిని.. నాకు తెలియకుండానే డిశ్చార్జి చేశారు. ఈ ఘటనలతో ఒత్తిడికి గురై భయపెట్టటానికి ఈ విధంగా చేశా" అని డేవిడ్‌రాజ్ అధికారులకు వివరణ ఇచ్చారు. ఈ ఘటనపై డీసీహెచ్ఎస్ డాక్టర్ జయరాజన్ విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. డేవిడ్‌రాజును దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాలని ఆదేశించారు. ఇదే ఆసుపత్రిలోని హెచ్ఐవీ వార్డులో ఉన్న ఓ రోగి నుంచి డేవిడ్‌రాజు అనుమతి లేకుండా సిరంజితో రక్తం సేకరించినట్లు సిబ్బంది చెబుతున్నారు.

సీబీఐ విచారణకు హాజరు కావాలి

కార్తీ చిదంబరానికి సుప్రీం ఆదేశం

చెన్నై, న్యూస్‌టుడే: సీబీఐ దర్యాప్తు అధికారి ముందు ఈ నెల 23న విచారణకు హాజరుకావాలని సుప్రీంకోర్టు కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరానికి స్పష్టం చేసింది. విదేశీ పెట్టుబడుల అభివృద్ధి బోర్డు నుంచి అనుమతులు సంపాదించి పెట్టేందుకు ఐఎన్ఎక్స్ నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు పొందినట్లు వచ్చిన ఆరోపణల కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ముందు ఆయన హాజరుకావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. శుక్రవారం కోర్టుకు హాజరైన కార్తీని ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి జేఎస్ కేహార్, డీవై చంద్రచూడ్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ కార్తీ తన వాదనలను సమర్థించుకొనే పత్రాలు తీసుకెళ్లొచ్చని, న్యాయవాదిని కూడా వెంట తీసుకెళ్లొచ్చని చెప్పారు.

అనువైన విధానాలపై అధ్యయనం చేయండి

ఈనాడు–అమరావతి: రాజధాని నగరంలోని భవనాల నిర్మాణంలో శీతలీకరణ, రహదారులకు అనువైన విధానాలపై అధ్యయనం చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ సూచించారు. సింగపూర్ కన్సార్టియం, టెర్రా ఫర్మా ప్రతినిధులతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. సెంట్రల్ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం ద్వారా ఒక ప్రాంతంలో కూలింగ్ టవర్, చిల్లర్ ఏర్పాటు చేసి అన్నిటికి సరఫరా చేసే విధానాన్ని ఎస్ప్ గ్రూప్ ప్రతినిధులు వివరించారు. రహదారుల నిర్మాణంలో పౌడర్ బేస్డ్ పాలిమర్ కాంపౌండ్‌పై టెర్రా ఫర్మా ప్రతినిధులు తెలిపారు.




మృతి చెందిన తల్లి అనురాధ, కుమార్తె హనీ ★ డ్రైవర్ క్లింటన్

షిర్డీ వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

ముగ్గురు కర్నూలు వాసులు దుర్మరణం

ముంబయి, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు వాసులు ముగ్గురు దుర్మరణం చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయలయ్యాయి. ఈ దుర్ఘటన నాందేడ్-హైదరాబాద్ రహదారిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కర్నూలు జిల్లాకు చెందిన రంజిత్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి వాహనంలో షిర్డీ చేరుకున్నారు. దర్శనానంతరం తిరిగి కర్నూలుకు బయలుదేరారు. నాందేడ్ వద్ద డ్రైవర్ స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడంతో వాహనం డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. గ్రామస్థులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఏడేళ్ల చిన్నారితో సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులు అనురాధ(31), హనీ(7)(అనురాధ-రంజిత్‌ల కుమార్తె), డ్రైవర్ బోయి జార్జ్ క్లింటన్(22)లుగా గుర్తించారు. రంజిత్‌తో పాటు ఆయన మిగతా ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆర్టీసీలో ప్రత్యేక సెలవుగా సమైక్యాంధ్ర సమ్మె

ఈనాడు, అమరావతి: సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతుగా ఆర్టీసీలో నాడు సమ్మె చేయగా ఆ కాలాన్ని ప్రత్యేక సెలవుగా పరిగణిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. 2013లో ఆగస్టు 13 నుంచి అక్టోబరు 11 వరకూ సమ్మె జరిగింది. ఎన్‌యూ యూనియన్ నేతలుచంద్రయ్య, రమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పీజీ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ తేదీల వెల్లడి

ఈనాడు, అమరావతి: పీజీ ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 28నుంచి ప్రారంభం కానుంది. సుప్రీంకోర్టు ఆదేశాల్ని అనుసరించి జీపీఏటీ విద్యార్థులకు కూడా ఈ విద్యలో ప్రవేశాల్ని కల్పిస్తామని ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి వరదరాజన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

★ పీఈసెట్ కౌన్సెలింగ్ (వ్యాయామ విద్య) ప్రక్రియను సెప్టెంబరు 2 నుంచి, బీఎడ్ (ఎడ్‌సెట్)లో ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియను సెప్టెంబరు 4నుంచి ప్రారంభించనున్నారు. ★ న్యాయ విద్యలో ప్రవేశాలకు అవసరమైన కళాశాలల అనుబంధ గుర్తింపు కొనసాగింపు వివరాలు బీసీఐ నుంచి అందిన వెంటనే కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తామని వరదరాజన్ పేర్కొన్నారు.

వినోదపు హరివిల్లుగా శాఖమూరు

ఈనాడు–అమరావతి: రాజధాని ప్రాంతంలోని శాఖమూరును వినోదపు హరివిల్లుగా తీర్చిదిద్దడమే కాకుండా రిసార్ట్స్, కాటేజీలు, ఫౌంటెన్లు, విల్లాస్, క్రాఫ్ట్ బజార్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన కార్యశాలలో స్నోవరల్డ్, హెచ్‌యుఎస్ఎస్‌పార్క్ అట్రాక్షన్, క్లాసిక్ ఫౌంటెన్స్, వైట్‌వాటర్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సుందరంగా కృష్ణా నదీ ముఖద్వారం: అమరావతికి దారితీసే కృష్ణానదీ ముఖద్వారాన్ని, విజయవాడ నగరంలోని కాలువలను సుందరీకరించేందుకు ప్రతిపాదనలు తయారు చేసినట్లు అమరావతి అభివృద్ధి సంస్థ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి వివరించారు. ఏడీసీ చేపట్టే ప్రాజెక్టులపై జలవనరుశాఖ అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో చర్చించారు. ఇబ్రహీంపట్నం నుంచి రాజధాని స్టార్టప్ ప్రాంతం వరకు కృష్ణానదిపై నిర్మించే ఐకానిక్ వంతెనపై ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మాణ పరంగా ఉన్న ఇబ్బందులపై వివరాలు తీసుకున్నారు. సంగమం వద్ద జలవనరులశాఖ భూమిని ఇచ్చేందుకు అధికారులు సంసిద్ధత తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/336/2017 dt. 18-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం బాపిరాజుగూడెం గ్రామం నందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు కి.మీ. 0.000 నుండి కి.మీ. 1.037 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరువారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామము: బాపిరాజుగూడెం మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	314/4	10.54	0.25	వేగుంట వెంకట సురేష్‌బాబు తండ్రి ధనకోటేశ్వరరావు	338	313	328	318	సాగుభూమి
2				గాలి ముకాంబిక భర్త ప్రదీప్					సాగుభూమి
3	314/5	9.65	0.10	వేగుంట వెంకట సురేష్‌బాబు తండ్రి ధనకోటేశ్వరరావు	338	313	328	318	సాగుభూమి
4	314/6	19.3	0.33	కొడాలి పద్మరాని	338	318	314	గ్రామ సరిహద్దులు	సాగుభూమి
5	338	175.00	2.50	పావులూరి మల్లికార్జునరావు తండ్రి కోటయ్య	3341	314	335	501	సాగుభూమి
6				పావులూరి శీతారామయ్య తండ్రి కోటయ్య					సాగుభూమి
7	341/2	52.12	0.22	వేంపాటి మురళి	338	496	340	500	సాగుభూమి
	మొత్తం	266.61	3.40						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/338/2017 dt. 18-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను చూపబడిన పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం వేగివాడ గ్రామం నందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు కి.మీ. 0.5.085 నుండి కి.మీ. 5.650 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించేందుకు ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరువారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామము: వేగివాడ మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	12/1	1.87	0.20	మిద్దే వీర వెంకటేశ్వరరావు తండ్రి నారాయణస్వామి	13	118	11	116	సాగుభూమి
2	12/2	4.00	0.51	చిగురుబత్తుల సాంబశివరావు తండ్రి పోతురాజు	13	118	11	116	సాగుభూమి
3	12/3	1.01	0.10	మిద్దె ఆయలేస్వరమ్మ భర్త నారాయణస్వామి	13	118	11	116	సాగుభూమి
4	12/4	1.19	0.12	మిద్దె ఆయలేస్వరమ్మ భర్త నారాయణస్వామి	13	118	11	116	సాగుభూమి
5	116/2	4.44	0.34	మిద్దె బసవరాజు తండ్రి సూరయ్య	22	117	12	115	సాగుభూమి
6	116/3	4.36	0.32	కొడాలి ప్రసన్నకుమార్ తండ్రి శ్రీనివాసరావు	22	117	12	115	సాగుభూమి
7	115/2	4.68	0.01	ఆలపాటి బాలగంగాధర్ తిలక్ తండ్రి వెంకట సత్యనారాయణ	23	124	116	113	సాగుభూమి
	మొత్తం	21.55	1.60						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Ref. C1/340/2017 dt. 18-08-2017

స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఫారమ్ నెం. VI(ఎ)

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూములను పశ్చిమగోదావరి జిల్లా పెదవేగి మండలం తాళ్ళగోకవరం గ్రామం నందు ప్రజా ప్రయోజనమునకై అనగా చింతలపూడి ఎత్తిపోతల పథకం కొరకు నిర్మాణము కొరకు కి.మీ. 0.403 నుండి కి.మీ. 2.925 వరకు భూమి కావలయునని స్పెషల్ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందున, 2013వ సంవత్సరము, 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు జారీచేయబడినది.

చింతలపూడి ఎత్తిపోతల పథకంకు సంబంధించి అధ్యయనం చేయబడినది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏవియు లేవు.

స్పెషల్ కలక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్-12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ యూనిట్-2, ఏలూరు వార్కి వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూసేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుంచి ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏవ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయవిక్రయములు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలో సెక్షన్-15ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరవది) దినములలోగా ప్రత్యేక కలక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / ప్రత్యేక ఉపకలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, కుడి ప్రధాన కాలువ, యూనిట్-2, ఏలూరువారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

గ్రామము: తాళ్ళగోకవరం మండలం: పెదవేగి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ విస్తీర్ణం	రైతు పేరు తండ్రి / భర్త పేరు	హద్దులు తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	రిమార్కులు
1	51/2	2.19	0.08	యలమర్తి సుబ్బారావు తండ్రి భాస్కరరావు మరియు రామకృష్ణయ్య	50	8	9	52	సాగుభూమి
2	52/2	4.76	0.28	ఆకురాతి నాగేశ్వరరావు తండ్రి బసవయ్య	47	53	51	60	సాగుభూమి
3	52/3	7.27	0.12	యలమర్తి వాణి భర్త వెంకటరత్నం	47	53	51	60	సాగుభూమి
4	53/5	0.67	0.01	ఘంటా రాజేశ్వరి భర్త రాంబాబు	52	54	8	59	సాగుభూమి
5	53/6	0.92	0.32	ఘంటా రాజేశ్వరి భర్త రాంబాబు	52	54	8	59	సాగుభూమి
6	53/7	1.04	0.12	కందేపు సుబ్బారావు తండ్రి రాజారావు	52	54	8	59	సాగుభూమి
7	57/11	1.49	0.18	మలతపల్లి సత్యనారాయణ తండ్రి సూరయ్య	58	56	8	71	సాగుభూమి
8	58/1	0.59	0.12	ఎలమర్తి లక్ష్మణ్ తండ్రి వెంకటభాస్కర్	59	57	59	68	సాగుభూమి
9	58/2	1.52	0.22	లాగు సత్యవతి భర్త గోతయ్య	59	57	59	68	సాగుభూమి
10	59	4.80	0.17	ముసునూరి నాగరత్నం భర్త నాగేశ్వరరావు	60	57	53	58	సాగుభూమి
11	70/4	2.50	0.03	రంభా సుబ్బమ్మ భర్త సింహాచలం	66	74	71	77	సాగుభూమి
12	71/2B	0.26	0.09	దంగేటి లక్ష్మీకాంతం భర్త లక్ష్మీనారాయణ	69	72	57	70	సాగుభూమి
13	71/3	0.99	0.04	యాంద్ర వెంకటేశ్వరరావు తండ్రి ఆంజనేయులు	69	72	57	70	సాగుభూమి
14	71/7C	0.56	0.10	రాచప్రోలు రుక్మిణి భర్త శుక్రుడు	69	72	57	70	సాగుభూమి
15	71/7D	0.56	0.12	జంగం పాప భర్త వెంకటేశ్వరరావు	69	72	57	70	సాగుభూమి
	మొత్తం	30.12	2.00						

సం/- **సిహెచ్.భానుప్రసాద్,** స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఈతరం



తేనెటీగ సొగసు

కాదేది కవితకనర్హం.. మనకు తెలిసిన సామెతే. దాన్ని కొంచెం మార్చి కాదేది సొగసుకనర్హం అని రాసేసుకోవచ్చు. చిత్తు కాగితాలు.. చిరుగుల దుస్తులు.. .. దేంతోనైనా డిజైనర్లు ఫ్యాషన్‌ని పరుగులు పెట్టిస్తూనే ఉన్నారు. ఆ ఒరవడిలోనే తేనెటీగల స్ఫూర్తితో త్రీడీ ప్రింటెడ్ గార్మెంట్స్ రూపొందించింది డిజైనర్ జమేలా లా. తేనెపట్టులోని గూళ్లను పోలేలా జియోమెట్రిక్ ప్యాటర్న్స్ డిజైన్లు అదనపు ఆకర్షణ. దీనికోసం ప్లాస్టిక్, సిలికాన్ క్యాస్టింగ్స్ ఉపయోగించారు. 'బీయింగ్ హ్యూమన్' బ్రాండ్ ఈ డ్రెస్‌లను మార్కెటింగ్ చేస్తోంది.



సెల్ఫీకి సాహసాలొద్దు!

కుర్రకారు సెల్ఫీలతో ఎందుకు చెలరేగిపోతారు? ఫ్రేమ్ కట్టించి ఇంట్లో గోడకి వేలాడదీయడానికి మాత్రం కాదు గురూ. ఫేస్‌బుక్ వాల్‌పై ప్రదర్శించడానికి.. వాట్సాప్‌లో షేర్ చేసి 'వాహ్' అనిపించుకోవడానికి.. ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేసి తారలా పోజు కొట్టడానికి.. ఎవరి కారణం వారిది. అంత ప్రాముఖ్యం ఉన్న స్వీయచిత్రం అందరు మెచ్చేలా పేలిపోవాలంటే ఇవిగోండి చిట్కాలు.

సెల్ఫీ బాగా రావాలంటే లొకేషన్ ముఖ్యం. అలాగని బుర్జ్ ఖలీఫా ఎక్కి క్లిక్‌మనిపించాల్సిన పన్లేదు. అనవసర సాహసాలూ వద్దు. బ్యాగ్రౌండ్ బాగుండేలా చూసుకుంటే చాలు. బాత్రూమ్‌లు, టాయ్‌లెట్లు, మార్కెట్లు.. ఇలాంటిచోట్ల సెల్ఫీలు అసలొద్దు.

దిగాలు మొహాలు.. నిట్టూర్పుల భావాలు ఎవరికీ నచ్చవు. సెల్ఫీకి ముందు మన మొహం జోష్ యంత్రంలా కళకళలాడాలి. సరదా హావభావాలతో, చూస్తేనే నవ్వు పుట్టించేలా ఉత్సాహం కనపడాలి. అప్పుడే నలుగురి దృష్టిలో పడతాం.

పోజుల్లోనూ కొత్తదనం ఉండాలి. అవసరమైతే కాస్త వింతగా కనిపించాలి. ఇంట్లోని పెంపుడు జంతువులతో కలిసి ఫొటోలు దిగడం. చిత్ర, విచిత్ర హావభావాలతో ఆకట్టుకోవడం.. ఇలా.

సమయం, సందర్భం, పోజులే కాదు.. సెల్ఫీల్లో సాంకేతిక విషయాలూ ముఖ్యమే. మొహాలపై సూర్యకిరణాలు, నీడ పడటం.. తక్కువ లైటింగ్.. సెల్ఫీని తేలిపోయేలా చేస్తాయి.

కనిపించీ కనిపించకుండా, చూపించీ చూపించకుండా.. మొహం కొద్దిగా కనిపించేలా ఏవైనా అడ్డు పెట్టడం.. అరచేతుల్లో దాచుకోవడం.. పెట్స్‌ని మొహానికి అడ్డంగా ఉంచడం ఆసక్తి రేకెత్తిస్తాయి.

కళాశాలలో కార్యసాధకులు!

చదవాలి.. సరదాల్లో మునిగితేలాలి... చదువయ్యాక కొలువు గురించి ఆలోచించాలి.. ఇది ఒకప్పటి ట్రెండ్... కాలం మారుతోంది బాస్! క్లాస్‌రూమ్‌లో ఉంటూనే సరికొత్త ఆవిష్కరణలు చేయడం... ప్రాజెక్టువర్క్ చేస్తూనే బిల్‌గేట్స్, జుకర్‌బర్గ్‌లా కలలు కనడం... పరీక్షలు రాస్తూనే అంకుర సంస్థల ఏర్పాటుకు కసరత్తులు చేయడం... నేటితరం కుర్రాళ్ల వ్యూహాలివి... అలా కళాశాలల్లోనే భవిష్యత్తు ప్రణాళికలకు పదునుపెట్టి విజయాల బాట పట్టిన కొందరు యువతరంగాలతో మాట కలిపింది ఈతరం.

చదువుతూనే ప్రాంగణ నియామకాలకు ఎంపికవడం.. క్యాంపస్ బయటికొచ్చాక కొలువు ప్రయత్నాలు చేయడం.. కడుపులో చల్ల కదలకుండా టెన్ టూ సిక్స్ ఉద్యోగం చేయాలనుకోవడం.. ఈ ఆలోచనల పరిధుల్ని ఎప్పుడో దాటేశారు యూత్. అబ్దుల్‌కలాం చెప్పినట్టు వాళ్ల కలలన్నీ చాలా పెద్దవి. కాలేజీలో అడుగు పెడుతూనే భవిష్యత్తు దర్శనం చేస్తున్నారు. పట్టా పుచ్చుకోకుండానే కోట్లు కూడబెట్టే ప్రణాళికలు వేస్తున్నారు. సరదాలతోపాటు లక్ష్య సాధనకు హుషారుగా ముందుడుగేస్తున్నారు. పెట్రోలు కొలతల్లో మోసాల్ని కనిపెట్టే పరికరం రూపొందించిన కుర్రాళ్లకు ప్రాంగణ నియామకాల్లోనే కొలువు దక్కే అవకాశమొచ్చింది. చేస్తే హాయైన ఉద్యోగం. అయినా దాన్ని వదిలేసి సొంత ప్రయోగాలు మొదలుపెట్టారు. రెండేళ్లు కష్టపడి జనాలకు ఉపయోగపడే ఆవిష్కరణ చేశారు. ఇలాంటివాళ్లెంతోమంది.

యువత కలలు, లక్ష్యాలు పెద్దవే. వాళ్ల ప్రణాళికలకు అనుగుణంగా ఎవరైనా పెట్టుబడి పెడితే ఫార్చ్యూన్ కంపెనీల్ని సృష్టిస్తాం అన్నంత ఆత్మవిశ్వాసమూ ఉంది. కానీ వీళ్లను నమ్మి కోట్లు గుమ్మరించే పరిస్థితి లేదాయె! అంతమాత్రాన ఈ యువకిశోరాలేం ఉసూరుమనడంలేదు. నిరాశతో ప్రయత్నాలేం పక్కన పెట్టలేదు. ఉన్నంతలో తమ పరిధుల్లోనే చెలరేగిపోతున్నారు. 'సండేకార్ట్'ది అదే స్టోరీ. నర్సరావుపేట కుర్రాడు సాయికళ్యాణ్ కాలేజీలో ఉండగానే అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకి పోటీగా ప్రణాళికలు వేశాడు. పెట్టుబడి కోసం కాళ్లరిగేలా తిరిగాడు. ఎవరూ ముందుకు రాలేదు. సొంత ప్రయత్నాలు మొదలెట్టాడు. పరిమిత వనరులతోనే జనానికి దగ్గరయ్యే ప్రయత్నం చేసి విజయం సాధించాడు. చెప్పుకుంటూ పోతే స్ఫూర్తి వీరులెందరో. అందులో కొందరి పరిచయం.



బంక్‌ల్లో మోసాలకు చెక్



ఆవిష్కరణ: ఫ్యూయల్ ఫ్లో మెజర్‌మెంట్,
ఆవిష్కర్తలు: శివశైలేష్, రామకృష్ణ
ఉపయోగం: ఇంధనం కొలతల్లో మోసం పసిగడుతుంది.

నిత్య జీవితంలో ఎంతో ప్రాముఖ్యం ఉన్న పెట్రోల్, డీజిల్‌ని మనం కొనుగోలు చేస్తున్నపుడు బంక్‌ల్లో చాలారకాలుగా మోసం చేస్తుంటారు.

బైక్‌పై బయటికెళ్లిన పిల్లలు తిరిగొచ్చేవరకూ కన్నవాళ్లకు కంగారే. వాళ్లు ఎక్కడున్నారో తెలుసుకోవాలనే ఆదుర్దా సహజం. దాంతోపాటు ఒకవేళ బైక్ చోరీకి గురైనా కనుక్కోవడం కష్టం. ఈ రెండు సమస్యలకు పరిష్కారంగా ఫ్యూయల్ ఫ్లో మెజర్‌మెంట్ విత్ జీపీఎస్ ట్రాకింగ్ అనే పరికరం రూపొందించారు హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కాలేజీ విద్యార్థులు.

మనం బంక్‌ల్లో పెట్రోల్ పోయిస్తుంటాం. మీటరు లీటరు చూపిస్తున్నా చిప్ ట్యాంపరింగ్‌తో తక్కువే పడేలా చేస్తారు. తరచూ జరిగే ఈ కొలతల్లోని మోసాన్ని పసిగట్టేదే ఫ్యూయల్ ఫ్లో మెజర్‌మెంట్ విత్ జీపీఎస్ ట్రాకింగ్ డివైజ్. బీటెక్ మూడో ఏడాది చదువుతున్న శివశైలేష్, రామకృష్ణలు రెండేళ్లు కష్టపడి దీన్ని రూపొందించారు. ఈ పరికరాన్ని వాహనం పెట్రోల్ ట్యాంకు మూత వద్ద అమర్చాలి. పెట్రోలు, డీజిల్ ఆ ట్యాంకులో పోసేటపుడు లీటర్లు, మిల్లీలీటర్లతో సహా లెక్కగట్టి వివరాల్ని పరికరం తెరపై నమోదు చేస్తుంది. ముందే సెల్‌ఫోన్‌తో అనుసంధానం చేస్తే ఆ వివరాలు సందేశం రూపంలో సెల్‌ఫోన్‌కి అందుతాయి. ఇంకేం.. పెట్రోల్ బంక్‌లో ఏదైనా మోసం జరిగితే ఇట్టే తెలిసిపోతుంది. జీపీఎస్‌తో అనుసంధానం చేసుకునే అవకాశం ఉండటం ఈ పరికరం మరో ప్రత్యేకత. మన వాహనం చోరీకి గురైనా, బండి తీస్కొని బయటికెళ్లిన పిల్లల జాడ తెలుసుకోవాలన్నా చాలా తేలిక. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఆ వాహనం ఎక్కడుందో గూగుల్ మ్యాపింగ్ ద్వారా కచ్చితంగా తెలుసుకోవచ్చు. శైలేష్, రామకృష్ణలు దీనిపై పేటెంట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

– సీహెచ్ మురళీకృష్ణ, ఈనాడు: హైదరాబాద్

చిన్న పట్టణాల్లో.. ఈ-వ్యాపారం



అంకురసంస్థ: సండేకార్ట్
వ్యవస్థాపకుడు: కూరపాటి వెంకట సాయికళ్యాణ్
విస్తరణ: 30 ప్రాంతాలు

పిల్లాడి డైపర్ నుంచి ఖరీదైన సెల్‌ఫోన్ వరకు ఏది కొనాలన్నా.. ఇప్పుడు అందరి చూపూ ఆన్‌లైన్ వైపే. మెట్రో నగరాలు, పెద్ద పట్టణాల్లో సరే.. చిన్న పట్టణాల పరిస్థితేంటి? అంటే ఆ లోటును కొంతైనా పూడుస్తాం అంటున్నాడు కూరపాటి వెంకట సాయికళ్యాణ్.

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లాంటి ఈ-కామర్స్ వెబ్‌సైట్లు చేసేదేంటి? కొనుగోలుదార్లు, అమ్మకందార్ల మధ్య అనుసంధానకర్తలా ఉండటమే. సండేకార్ట్ లక్ష్యం అదే. వ్యాపారానికి ఎంచుకుంది మాత్రం చిన్న, మధ్యస్థాయి పట్టణాల్ని. నిత్యం ఆన్‌లైన్‌లో గడిపే నగర జీవుల్ని వదిలి సాయికళ్యాణ్ చిన్న పట్టణాల్ని ఎంచుకోవడం చిత్రంగానే ఉంది కదూ! సండేకార్ట్ మొదలుపెడతా పెట్టుబడులు పెట్టండి అని ఇన్వెస్టర్ల చుట్టు తిరిగినపుడూ ఇదే ప్రశ్న ఎదురైంది తనకి. దీనికి సమాధానంగా అతడి దగ్గర దీర్ఘకాలిక ప్రణాళికే ఉండేది. ద్వితీయశ్రేణి, చిన్న పట్టణాల్లోని మధ్యతరగతి ప్రజలకు మా ఊరు, మా ప్రాంతం, మేం కోరుకున్న షాపు అనే బలమైన సెంటిమెంట్ ఉంటుంది. ఆ ఆకర్షణ, ప్రేమను కాపాడుకుంటూనే స్థానికంగా ఉన్న దుకాణాదారులతో ఒప్పందం కుదుర్చుకొని వినియోగదార్లు కోరుకున్నవి అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఈ ఫార్ములా కజిన్ సత్యనారాయణ నమ్మకం ఉంచి పెట్టుబడి పెట్టాడు. వాళ్లిద్దరు ఊహించిందే జరిగింది. నర్సరావుపేటలో మొదలైన సండేకార్ట్ ఇప్పుడు తెలుగురాష్ట్రాల్లోని ముప్పై ప్రాంతాలకు విస్తరించింది. వెయ్యికిపైగా సెల్లర్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకొంది.

2008లో సాయికళ్యాణ్ బీటెక్ మొదలైంది. అప్పుడే ఈ-కామర్స్ వ్యాపారం ఊపందుకుంటోంది. ఆ రంగంలో ప్రతి డెవలప్‌మెంట్‌ని నిశితంగా గమనించేవాడు. తన ఇంజినీరింగ్ పూర్తయ్యేసరికే ఆన్‌లైన్ వ్యాపార మెళకువలపై పట్టు సాధించాడు. వచ్చిన ఉద్యోగ అవకాశాల్ని వదులుకొని సండేకార్ట్ స్టార్టప్ ఎలా ఉండాలో పరిశోధన చేశాడు. 2013 ఆగస్టులో తన కలల అంకురసంస్థ మొదలైంది. నిత్యావసర సరుకుల్ని డెలివరీ చేయడంతో మొదలుపెట్టి రెస్టరెంట్లు, బేకరీలు, హోటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, కోచింగ్ సెంటర్లు, బ్యూటీపార్లలకు విస్తరించాడు. ఎలక్ట్రీషియన్లు, ఇతర సేవలకు సైతం వారధిగా మారాడు. ఇదే ఊపుతో త్వరలో ఇతర రాష్ట్రాలకూ విస్తరిస్తానంటున్నాడు.

వార్తలు చదివి వినిపించే యాప్



ఆవిష్కరణ: లిజన్ ఎమ్ యాప్
రూపకర్తలు: తొమ్మిది మంది సభ్యుల బృందం
ఉపయోగం: వార్తలు చదివి వినిపిస్తుంది

రోజువారీ వార్తావిశేషాలు తెలుసుకోవడం చాలామందికి ఇష్టం. అవన్నీ చదివే ప్రయాస లేకుండా.. వారికి నచ్చినట్టు చదివి వినిపించే యాప్ **Listen em**.

వెంకట్ తనికెళ్ల, శ్రీనివాస్ గంగాడి, నారాయణ కళా, రామారావు బబ్బెళ్లపాటి, మన్మోహన్ జైన్, సుధీర్ చెముడుగుంట, శ్రీలక్ష్మి పోపూరి, రచనా రమేశ్, పర్శురాములు మద్దెల.. ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రాంతం, ఒక్కో నేపథ్యం. 'వాగ్మి ల్యాబ్స్' అనే అంకుర సంస్థగా ఏర్పడి ఈ యాప్ తయారు చేశారు. వెంకట్ కాలేజీ విద్యార్థిగా ఉన్నపుడు కిలోమీటర్లకొద్దీ దూరప్రయాణం చేసేవాడు. ఆ సమయం వృథా కాకూడదని సెల్‌ఫోన్‌లో న్యూస్ చదివేవాడు. కాసేపలా చూడగానే మెడనొప్పి వచ్చేది. అప్పుడొచ్చింది ఓ ఆలోచన. వార్తలు చదివి వినిపించేలా నేనే ఓ యాప్ ఎందుకు తయారు చేయకూడదని. ఈలోపే ప్రాంగణ నియామకాల్లో ఓ కార్పొరేట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. మంచి జీతం. జీవితం సాఫీగా సాగిపోతోంది. అయినా గత ఆలోచన కుదురుగా ఉండనిస్తేగా! తన ఆలోచనని సహోద్యోగులతో పంచుకున్నాడు. వాళ్లు తమ స్నేహితులతో చర్చించారు. అలా తొమ్మిదిమంది సభ్యుల బృందం తయారైంది. తాజా వార్తలు, విశేషాలు చదివి వినిపించే యాప్ తయారు చేయాలనే లక్ష్యం మొదలైంది.

ఇంతకుముందు ఇలాంటి యాప్స్ ఏమున్నాయో పరిశోధన చేశారు. వాటికన్నా భిన్నంగా, మిన్నగా ఉండేలా ప్రయత్నించారు. సాధారణంగా వేరే యాప్స్‌లో ఆడియోలు రికార్డింగ్ ఫైల్‌లా ఉంటాయి. దీంతో ఎక్కువ స్పేస్ తీసుకోవడమే కాదు.. అవి తెరుచుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. మరో విషయం ఏంటంటే ఇంటర్నెట్‌కి అనుసంధానం అయితేనే ఈ యాప్స్‌ని వాడగలుగుతాం. ఈ లోపాలన్నీ సవరిస్తూ ఎనిమిది నెలలపాటు కష్టపడి 'లిజన్ ఎమ్' తయారు చేసింది మిత్రబృందం. ఈ యాప్‌ని ఒక్కసారి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆఫ్‌లైన్‌లో కూడా వార్తలు వినొచ్చు. క్రీడలు, వైద్యం, వినోదం, సినిమాలు, సాంకేతికం, వ్యాపారం.. ఇలా ప్రతి విభాగాన్ని చేర్చారు. జీఆర్ఈ, టోఫెల్‌లాంటి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా అమెరికా, ఆస్ట్రేలియా, ఇండియన్ యాక్సెంట్‌తో వాయిస్‌ని తీర్చిదిద్దారు.

చదువులో స్పీడున్నోడు నటనకే ఓటేశాడు!



అల్లుడు శీనుతో తెరంగేట్రం చేసి నటనలో ఫర్వాలేదనిపించాడు... రెండో సినిమాతో దూకుడు పెంచి స్పీడున్నోడుగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు... ముచ్చటగా మూడో చిత్రం జయ జానకి నాయకాతో జయకేతనం ఎగరేశాడు... చూడ్డానికి పక్కింటి కుర్రాడిలా కనిపించే బెల్లంకొండ సాయిశ్రీనివాస్ తన ఆసక్తులు.. వ్యక్తిగత అభిరుచులు.. ఇదిగో ఇలా మనతో పంచుకున్నాడు.

నాకు ఊహ తెలిసే నాటికే నాన్న సురేశ్ పేరున్న నిర్మాత. కథా చర్చలు.. ఆడియో రిలీజ్.. సినిమా విడుదలంటూ ఇంట్లో వాతావరణం సందడిగా ఉండేది. నాకేమో వాటిపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. బుద్ధిగా చదువుకునేవాణ్ని. ప్రతి సబ్జెక్టులోనూ మార్కులు ఎనభై దాటేవి. కల్చరల్ ఈవెంట్స్‌లోనూ చురుగ్గా పాల్గొనేవాణ్ని. అప్పుడప్పుడు డ్రామాలేసేవాణ్ని. స్కూళ్లో ఏదైనా ప్రత్యేకమైన సందర్భాల్లో నాన్నతో చెప్పించి పెద్దపెద్దవాళ్లని గెస్టులుగా తీసుకొచ్చేవాణ్ని. ఫ్రెండ్స్‌కి సినిమా టికెట్లు ఇప్పించేవాణ్ని.

వినాయక్ చొరవతో: డైరెక్టర్ వినాయక్ అంకుల్ మా ఫ్యామిలీఫ్రెండ్. ఓసారి మా ఇంటికొచ్చినపుడు నన్ను చూసి 'అబ్బాయి బాగున్నాడు. ట్రైనింగ్ ఇప్పిస్తే తర్వాత సినిమాలో అరంగేట్రం చేయిద్దాం' అన్నారు నాన్నతో. అప్పుడే నా టెన్త్ అయిపోయింది. వయసు పదిహేనేళ్లు. బాగా లావుగా ఉండేవాణ్ని. అరుణ భిక్షూ గారి దగ్గర యాక్టింగ్ కోర్సులో చేరా. ఓవైపు నటనలో పాఠాలు, మరోవైపు ఇంటర్ కాలేజీ. ఒక్కసారిగా చాలా కష్టాలొచ్చిపడ్డాయ్. హీరో కావడం తేలికైన విషయం కాదని అర్థమైంది. ఆపై ఫారిన్ వెళ్లి మార్షల్ ఆర్ట్స్‌లో కూడా శిక్షణ పొందా. రెండేళ్లలో ఒక నటుడికి కావాల్సినవన్నీ నేర్చుకోవడానికి ప్రయత్నించా.

తొలిసారే: మొదటి సినిమా అల్లుడుశీనుతో కెమేరా ముందుకొచ్చా. దర్శకుడు వినాయక్ అంకుల్ మొదట్నుంచీ తెలుసు. గతంలోనే నటనలో శిక్షణ పొందడంతో బాగా చేయగలననే నమ్మకం ఉండేది. సీనియర్లు మంచి సలహాలిచ్చారు. మొదటిసారే ఇటలీ, జపాన్‌ల్లో షూటింగ్ చేశాం. అంతా ఓ పిక్నిక్‌లా గడిచిపోయింది. సినిమా విడుదలయ్యాక పరిశ్రమలోని స్టార్ హీరోలు, దర్శకులు బాగా చేశావంటూ మెచ్చుకున్నారు. నాపై నాకు పూర్తి నమ్మకం కలిగింది. రెండో సినిమా మాత్రం ఊహించని విధంగా బోల్తా కొట్టింది. సినిమాలో విషయం లేకపోతే ఎవరికైనా, ఎంతటి స్టార్‌కైనా పరాజయం తప్పదనిపించింది. మరింత జాగ్రత్తగా కష్టపడి మంచి సినిమాలు చేస్తూ పేరు తెచ్చుకోవాలనుకున్నా. జయ జానకీ నాయకా ఆ కసితోనే చేశా. 'ఫైట్లూ, డ్యాన్స్‌లేకాదు నటనలోనూ అదరగొట్టేశావ్.. మంచి పరిణతి కనిపిస్తోంది అని చాలామంది ఫోన్ చేసి చెప్పారు.

అల్లరి శీను: సినిమాల్లో ఎలా కనిపించినా బయట మాత్రం నేను గ్యాంగ్‌లీడర్ టైపు. అందరితో సరదాగా ఉండటం నాకలవాటు. సెయింట్ మేరీస్ కాలేజీలో చదివా. ఆ స్నేహితులంతా ఇప్పటికీ నాతో టచ్‌లోనే ఉన్నారు. ఏమాత్రం ఖాళీదొరికినా వాళ్లతో షికార్లకెళతా. రెస్టరెంట్లకు వెళ్లి పార్టీలు చేసుకుంటా. బడి, కాలేజీ క్లాస్‌లకు చాలాసార్లు బంక్ కొట్టినా మెరిట్ విద్యార్థి కావడం, యాక్టివ్‌గా ఉండటంతో టీచర్లకి నేనంటే ఇష్టమే.

సినిమాలు కాకుండా: క్రికెట్ ఇష్టం.
ఖాళీగా ఉంటే: స్నేహితులతో లాంగ్‌డ్రైవ్‌లకు వెళ్తుంటా.
అభిమానులకు దగ్గరవడానికి: ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో యాక్టివ్‌గా ఉంటా. ఈమధ్యే ట్విట్టర్ ఖాతా తెరిచా.
బెస్ట్‌ఫ్రెండ్: డాడీనే. సినిమా, కెరీర్, ప్రేమ.. ఏ విషయమైనా షేర్ చేసుకుంటా.
దైవభక్తి: ఎక్కువే. చిలుకూరు టెంపుల్, అంతర్వేది, అయినవిల్లి, సింహాచలం, తిరుమల, విజయవాడ.. తరచూ వెళ్తుంటా.
ఓ కొత్త విషయం: నేను మంచి కారు రేసర్‌ని. చాలా పోటీల్లో పాల్గొన్నా.
ప్రేమ ప్రపోజళ్లు: నాలుగైదున్నాయ్. తలచుకుంటే ఇప్పుడు సిల్లీగా అనిపిస్తోంది.
నచ్చిన వంటకం: అమ్మ చేసే పప్పు
యువతకో మాట: మనం కష్టపడి ఎదిగితే కన్నవాళ్లు పొందే సంతోషం వెలకట్టలేనిది. వాళ్ల కళ్లల్లో ఆనందం చూడగలిగితే అంతకు మించిన విజయం ఏముండదు.

షార్ట్‌ఫిల్మ్‌కి సలాం..



చాలామంది యువతకి సినిమాలంటే ప్రాణం. బోలెడంత ప్రతిభ కూడా ఉంటుంది. అది నిరూపించుకోవడానికే 'ఒకే ఒక్క ఛాన్స్' దొరకదు. ఈ జాబితాలో మీరూ ఉన్నారని భావిస్తే మీ టాలెంట్ నిరూపించుకోవాడానికి ఒక చక్కని అవకాశం వచ్చింది. ఇండీఫిల్మ్స్ వాళ్లు ఛానెల్ బిగ్ స్టార్ టీవీ, దేశీనామాలతో కలిసి ఒక ఆన్‌లైన్ లఘుచిత్రాల పోటీ నిర్వహిస్తున్నారు. మీ ప్రతిభ నిరూపించుకునేలా ఒక షార్ట్‌ఫిల్మ్ తీసి పంపండి. వచ్చిన దరఖాస్తుల్లోంచి ఉత్తమమైన ఆరింటికి ఆన్‌లైన్ ప్రచారం చేస్తారు. మెయిన్‌స్ట్రీమ్ సినిమాగా మలచడానికి సాయం చేస్తారు. గెల్చినవారికి మంచి బహుమతులూ ఉంటాయ్.

- 'కుట్ర' కథాంశంతో లఘుచిత్రం రూపొందించాలి
- పదినిమిషాలకు మించని నిడివి ఉండాలి
- డౌన్‌లోడ్ చేయగలిగేలా ఉన్న వీడియోలింక్‌ని దరఖాస్తు ఫారంతో కలిపి పంపాలి
- ఒక్కరు ఎన్ని దరఖాస్తులైనా పంపొచ్చు.
- చివరి తేదీ 25 సెప్టెంబరు



పూర్తి వివరాలకు
goo.gl/Y17bbk

మలచుకుంటే స్వర్గధామాలే

రాష్ట్రంలో బీచ్‌ల అభివృద్ధితో పర్యాటక పురోగతి



చింతపల్లి బీచ్‌లో వినియోగంలోకి రాని రిసార్ట్స్

ఈనాడు – అమరావతి

మనరాష్ట్రంలో సాగరతీరమనగానే టక్కున గుర్తుకువచ్చేది విశాఖపట్నంలోని రామకృష్ణ(ఆర్‌కే)బీచ్. విశాఖ నగరానికి కేవలం 5.కి.మీ.ల దూరంలోనే బీచ్ సందర్శకులు, పర్యాటకులకు కనువిందు చేస్తోంది. సమీపంలోనే నౌకాశ్రయం, సబ్‌మెరైన్, విశాఖ మ్యూజియం వంటివన్నీ ఈ బీచ్‌కు అదనపు ఆకర్షణ. ఆర్.కె.బీచ్ నుంచి భీమిలి వరకు సుమారు 30కి.మీ.ల మేర అద్భుతమైన సాగర తీరం వీక్షకులను అలరిస్తుంది. ఇంకా రుషికొండ, భీమిలి, యారాడ, తొట్లకొండ బీచ్‌లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

అరకొరగా కమ్యూనిటీ గార్డులు

- విశాఖలోని పలు తీరాల్లో మత్స్యకారులను ‘కమ్యూనిటీ గార్డులు’గా నియమించి తీరంలో కొట్టుకుపోయేవారిని రక్షించే ఏర్పాటుచేసినప్పటికీ వారి సంఖ్య అతితక్కువగా ఉంది. వీరికి మరపడవలుగానీ, తీరంలో తిరగడానికి వాహనాలుగానీ లేకపోవడంతో సముద్రంలో మునిగిపోయే సందర్శకులను కాపాడటం ఇబ్బందవుతోంది.
- సందర్శకులు ప్రమాదాల బారిన పడకుండా హెచ్చరించడానికి ‘వాచ్‌టవర్లు’ రుషికొండ, ఆర్.కె.బీచ్ వద్ద మాత్రమే అందుబాటులో ఉండగా మిగిలిన చోట్ల ఎక్కడా ఆ తరహా సౌకర్యాలు లేవు.
- ఆర్‌కే, రుషికొండ, భీమిలి బీచ్‌ల్లో స్నానాలు చేశాక బట్టలు మార్చుకోవడానికి తగిన సంఖ్యలో గదులు లేవు. మరుగుదొడ్ల నిర్వహణలేని కారణంగా వాటిలోకి వెళ్లేందుకు భయపడే పరిస్థితి. వర్షం వస్తే తడిసిపోవలసిందే.
- సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, పెదజాలరిపేట ప్రాంతాల్లోని సాగరతీరాల్లోకి నగరంలోని మురికినీటిని వదిలిపెట్టేస్తుండడంతో ఆయా ప్రాంతాల వాసులు తీర అందాల్ని ఆస్వాదించలేకపోతున్నారు.

చేయాల్సిన ఏర్పాట్లు

- ఈ బీచ్‌ల్లో పర్యాటకులను ఆకర్షించేలా వినోద, ప్రత్యేక కార్యక్రమాలను ఎక్కువ సంఖ్యలో చేపట్టాలి.
- జలక్రీడలు, బోటింగ్ వంటివి ఏర్పాటు చేస్తే పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవచ్చన్న వాదన ఉంది.

పర్యాటకుల మనసుదోచే సూర్యలంక

గుంటూరు జిల్లా బాపట్లకు 5.కి.మీ.ల దూరంలో ఉన్న సూర్యలంక బీచ్‌కు ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకుల తాకిడి బాగానే ఉంటోంది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన జెట్‌స్కీ‌పై సముద్రతీరంలో విహరించవచ్చు. ఇప్పుడిప్పుడే రిసార్టుల ఏర్పాటు వంటి పనులను చేపడుతున్నారు. కార్తీకమాసంలో అయితే ఇక్కడకు లక్షల్లోనే సందర్శకులు వస్తుంటారు.

అప్పుడప్పుడే బందోబస్తు

పర్యాటకులు ఎక్కువగా వచ్చే సందర్భాల్లో మాత్రమే మాత్రమే మెరైన్, బాపట్ల గ్రామీణ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పర్యాటకులకు సరిపడా విడిదిగృహాలు లేకపోవడం ఇబ్బందికరంగా ఉంటోంది. మహిళలు, పురుషులు స్నానాలు చేసేందుకు వేర్వేరుగా గదులున్నప్పటికీ మహిళల కోసం ఏర్పాటు చేసిన భవనాలు దెబ్బతినడంతోపాటు, ఏమాత్రంగా శుభ్రంగా ఉండడం లేదు. అలాగే బీచ్‌లో కూడా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. పొరబాటున ఎవరైనా నీటిలో మునిగితే కాపాడేందుకు గజఈతగాళ్లు అందుబాటులో లేరు.

అమరావతికి సమీపంలోనే మంగినపూడి

రాజధాని అమరావతికి 80కి.మీల దూరంలో ఉన్న మంగినపూడి బీచ్‌లో దుస్తులు మార్చుకునేందుకు గదుల్లేవు. రూ.15 లక్షలతో నిర్మించిన పర్యాటక సమాచార కేంద్ర భవనం శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారైంది. జలక్రీడల పేరుతో ఏర్పాట్లు చేసినప్పటికీ ఉపయోగకరంగా లేకపోవడంతో పర్యాటకులు నిట్టూరుస్తున్నారు. పర్యాటకుల రక్షణకు చర్యల్లేవు.

సరిహద్దు రాష్ట్రాల సందర్శకులకు స్వర్గధామం

శ్రీకాకుళం జిల్లాలోని 11 మండలాల పరిధిలో సుమారు 193కి.మీ.ల మేర తీరప్రాంతం విస్తరించి ఉంది. బారువ, భావనపాడు, అక్కుపల్లి, కళింగపట్నం బీచ్‌లు దశాబ్దాలుగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇవేగాకుండా 11 మండలాల్లోనూ బీచ్‌లు బాగానే ఉన్నాయి. ఉత్తరాంధ్రతోపాటు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశా నుంచి ఎక్కువ మంది పర్యాటకులు బారువ, కళింగపట్నం బీచ్‌లకు వస్తుంటారు.

ఒకపూటకు మించి గడపలేం

ఈ బీచ్‌ల్లో తీరం, సముద్ర జలాలు తప్ప ఇతర ఆహ్లాదకర కార్యక్రమాలు ఏవీ లేకపోవడంతో పర్యాటకులు ఇక్కడ ఒకపూట మించి గడిపేందుకు సుముఖత చూపని పరిస్థితి. బారువాలో మహిళలకు కనీస వసతులు లేవు. రక్షణ చర్యలు లేనేలేవు.

పర్యాటకులు ఎక్కువగా వచ్చినప్పుడే

ప్రమాద హెచ్చరికలూ లేవు. మెరైన్‌పోలీసు స్టేషన్ ఉంది. పోలీసులు పర్యాటకులు ఎక్కువగా వచ్చే సమయంలో పహారా కాస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు కూడా ఏర్పాట్లు లేవు.

కొత్తపట్నానికి గజ ఈతగాళ్ల రక్ష

ఒంగోలుకు సమీపంలోని కొత్తపట్నం తీరానికి రోజుకు సగటున 2 వేల మంది వస్తుంటారు. ప్రమాద సమయాల్లో కాపాడేందుకు గజ ఈతగాళ్లు, రక్షణ కల్పించేందుకు పోలీసులు అందుబాటులో ఉంటున్నారు.

అలంకారంగా అతిథిగృహాలు

ఏడాది కిందట రూ.2 కోట్ల వ్యయంతో అతిథి గృహాలు నిర్మించినా వినియోగంలో లేవు. దీంతో పర్యాటకులు ప్రైవేట్ రిసార్టులను ఆశ్రయించాల్సి వస్తోంది. పదేళ్ల కిందట రూ.10లక్షలతో ఇందిర ప్రియదర్శిని వనాన్ని నిర్మించినా ఒక్కరోజూ వినియోగించలేదు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు చోటు లేదు.

కార్తీకమాసంలో పేరుపాలెంకు 10 లక్షలమంది

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణానికి 20కి.మీ. దూరంలో గల పేరుపాలెం బీచ్‌కు రోజూ 2వేల మంది, శని, ఆదివారాల్లో 5-10వేలు, కార్తీకంలో 10లక్షల మంది, ఈస్టర్‌రోజు లక్షమంది పర్యాటకులు విచ్చేస్తారు.

అధికారులకే ఆ భవనం

బీచ్‌లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఎలాంటి సౌకర్యాలూ లేవు. ఉన్న ఒక్క భవనం అధికారులకే పరిమితమైంది. ప్రమాద హెచ్చరిక బోర్డులను తాత్కాలికంగా ఏర్పాటుచేశారు. కార్తీక మాసంలో మాత్రమే గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు.

మైపాడులో మెరుగ్గానే...

నెల్లూరు నగరానికి 20కి.మీ.ల దూరంలో ఉన్న మైపాడ్ బీచ్ కాస్త మెరుగ్గానే ఉంది. పర్యాటకాభివృద్ధి సంస్థకు చెందిన హరితా రిసార్ట్స్, రెస్టారెంట్ అందుబాటులో ఉన్నాయి. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వసతులను కల్పించారు. రూ.11కోట్లతో మరికొన్ని అభివృద్ధి పనులు చేస్తున్నారు. ప్రమాదహెచ్చరిక బోర్డులు, పోలీసుల పహరా ఇక్కడ పర్వాలేదు.

అతీగతీ లేని రిసార్టుల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా 35 బీచ్‌ల్లో బీచ్ రిసార్టులను నిర్మించేందుకు ఏడాది కిందట పర్యాటక శాఖ అనుమతులు ఇచ్చినా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. వాటిని పూర్తి చేయించాల్సిన బాధ్యతను పర్యాటక శాఖ గాలికొదిలేసింది. జలక్రీడలు ఏర్పాటు చేస్తామంటూ మూడేళ్లుగా మాటలే తప్ప కార్యాచరణ లేదు. రెండు నెలల నుంచి ఒకటి రెండు చోట్ల జెట్‌స్కీ, మోటార్‌బైక్, కెనాయింగ్ వంటివి బీచ్‌లో ఒకటీ రెండు చొప్పున ఏర్పాటు చేయించారు. ప్రైవేటు వ్యక్తులు వీటిని ఏర్పాటు చేయడంతో రుసుము ఎక్కువగా ఉంటోందని పర్యాటకులు ఆసక్తి కనబర్చడం లేదు.

గోవా తీరంలో ఇలా...

గోవాలో పర్యాటకుల భద్రతతోపాటు ఆహ్లాదాన్ని అందించే విషయంలో పర్యాటకశాఖ శ్రద్ధ కనబరుస్తోంది. బాగా, కండోలిమ్, సింక్వేరిమ్ తదితర ప్రాంతాల్లో నీటిలోకి దిగే పర్యటకులను ఎప్పటికప్పుడు గమనించేందుకు లైఫ్ గార్డు సేవలు ఉన్నాయి. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు నీటిలోకి దిగేముందు లైఫ్‌గార్డులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. రక్షిత ప్రాంతాల్లోనే ఈతకు దిగాల్సి ఉంటుంది. 40 మైక్రాన్లకు మించి ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం, అందుబాటులో చెత్తబుట్టలు ఉంచుతారు. వివిధ రకాల వాటర్ స్పోర్ట్స్ కూడా పర్యటకుల్ని ఆకర్షిస్తాయి.

మెరీనాలో పటిష్ఠ రక్షణ చర్యలు..

చెన్నై మెరీనాలో బీచ్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది గుర్రాలపై తిరుగుతూ పర్యవేక్షిస్తుంటారు. పెట్రోలింగ్ కోసం ఇసుకలో 60 కిలోమీటర్ల వేగంతో నడిచే ప్రత్యేక వాహనాలున్నాయి. సీసీటీవీ విధానం అమలు చేస్తున్నారు. అసాంఘిక శక్తుల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తుంటారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాలను వినియోగిస్తారు. ప్రత్యేక కార్యక్రమాల సమయంలో సముద్రం లోపలకు వెళ్లే అవకాశం లేకుండా బారికేడింగ్ ఏర్పాటు చేస్తారు.

చింతపల్లికి శని, ఆదివారాల్లో 10 వేల మంది

విజయనగరం జిల్లా చింతపల్లి బీచ్‌కు శని, ఆదివారాలతోపాటు కార్తీకమాసంలో రోజుకు 10వేల మంది వస్తారు. 2012లో రూ.1.60కోట్లతో డార్మెటరీలు, కాటేజీలు, రెస్టారెంట్ పనులు చేపట్టినప్పటికీ ఇప్పటికీ పూర్తి కాలేదు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాలు రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా నిలుస్తున్నాయి.



విశాఖపట్నంలో సాగర్‌నగర్ సమీపంలో సముద్రంలో కలుస్తున్న మురుగునీరు

తూర్పుగోదావరిలో అలరించే ఆరు బీచ్‌లు

జిల్లాలో కాకినాడ(సూర్యారావుపేట బీచ్), అంతర్వేది, ఓడలరేవు, ఎస్.యానం, తాళ్లరేవు, ఉప్పాడ బీచ్‌లు పర్యాటకులను అలరిస్తున్నాయి. ఈ బీచ్‌లన్నింటిలోనూ దాదాపు ఒకేరకమైన సమస్యలున్నాయి. కార్తీకమాసంలో మాత్రమే పోలీసులు బందోబస్తు లేదా ట్రాఫిక్ నియంత్రణ కోసం పనిచేస్తున్నారు తప్ప సాధారణ రోజుల్లో రక్షణ లేని పరిస్థితి. గజ ఈతగాళ్లను కూడా ఈ మాసంలోనే నియమిస్తున్నారు. ప్రమాద హెచ్చరిక బోర్డులు కనిపించవు.

కాకినాడకు 10కి.మీ దూరంలో గల సూర్యారావుపేట బీచ్‌లో హరిత బీచ్ రిసార్ట్స్ కొంత మేర పర్యాటకుల అవసరాలు తీరుస్తున్నాయి. అమలాపురం పట్టణానికి సమీపంలోని ఓడలరేవుకు వారాంతంలో రద్దీ పెరుగుతుంది. ఒక ప్రైవేటు రిసార్ట్ మాత్రమే ఉంది.



ఓడరేవు బీచ్‌లో అధ్వానంగా పారిశుద్ధ్యం

వెంకయ్య జీవితం నేటి తరానికి దిక్సూచి

- కేంద్ర మంత్రుల వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రసంగాలు, ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం నేటి తరానికి దిక్సూచి వంటివని కేంద్ర మంత్రులు రాజీవ్‌ప్రతాప్ రూడీ, ముఖ్తార్‌అబ్బాస్ నఖ్వీ, విశాఖ ఎంపీ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల విడుదల చేసిన వెంకయ్య ప్రసంగాల సంకలనంతో కూడిన పుస్తకం ‘అలుపెరుగని గళం.. విరామమెరుగని పయనం’పై శుక్రవారం ఇక్కడ జరిగిన చర్చాగోష్ఠిలో వారు పాల్గొన్నారు. ఈ పుస్తకానికి సహ రచయితలుగా కూడా వ్యవహరించిన వీరు వెంకయ్యతో తమకున్న సుదీర్ఘ అనుబంధం, రాజకీయాల్లో ఆయన ద్వారా నేర్చుకున్న పాఠాలను నెమరు వేసుకున్నారు. విషయ పరిజ్ఞానం, యతి ప్రాసలు, హాస్యచతురత కలగలిసిన ఆయన ప్రసంగాలను ఎవరూ అంత త్వరగా మరచిపోలేరని కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు.

అధికార నివాసంలోకి మారిన వెంకయ్య

వెంకయ్యనాయుడు శుక్రవారం ఇక్కడి 6, మౌలానా ఆజాద్ రోడ్డులోని ఉపరాష్ట్రపతి అధికార నివాసానికి మారారు. ఆయన 19 ఏళ్లపాటు 30, ఏపీజే అబ్దుల్‌కలాం రోడ్డులో ఉన్నారు.

1975 గొలుసు దుకాణాల రద్దు!

- ప్రణాళికామండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు వెల్లడి

ఈనాడు, అమరావతి: పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులు, ప్రజాభిప్రాయాల మేరకు ఇప్పటివరకు రాష్ట్రంలో 1975 గొలుసు దుకాణాలను రద్దు చేశామని రాష్ట్ర ప్రణాళికామండలి ఉపాధ్యక్షుడు కుటుంబరావు తెలిపారు. విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో అత్యధికంగా 224, కృష్ణాలో 202, పశ్చిమగోదావరి జిల్లాలో 189 గొలుసు దుకాణాలను రద్దు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మద్యం విధానంపై గత వారం 89 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. ఈ వారం అందులో 0.4 శాతం మాత్రమే పెరుగుదల కనిపించిందన్నారు. గొలుసు దుకాణాల నియంత్రణకు ప్రభుత్వ చర్యలు ఎలా ఉన్నాయన్న ప్రశ్నకు 52 శాతం మంది బాగోలేవని, గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారని వెల్లడించారు.

పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగింపునకు హామీ: ఫ్యాప్టో

ఈనాడు, అమరావతి: పురపాలక, నగర పాలక పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు దశల పోరాట కార్యక్రమం అనంతరం పురపాలక శాఖ సంచాలకులు కె.కన్నబాబు ఫ్యాప్టోను చర్చలకు ఆహ్వానించారని, శుక్రవారం అన్ని డిమాండ్లపై చర్చించారని సంఘం ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు పి.బాబురెడ్డి, జి.హృదయరాజు తెలిపారు. గుంటూరులోని డీఎంఏ కార్యాలయంలో నిర్వహించిన చర్చల్లో కన్నబాబు సానుకూలంగా స్పందిస్తూ పురపాలక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఈ మేరకు పాఠ్యపుస్తకాలను తక్షణమే సరఫరా చేస్తామని కన్నబాబు చెప్పారని తెలిపారు.

చెత్త సేకరణపై రియల్‌టైం ఆరా


ఈనాడు, అమరావతి: పల్లెటూళ్లలో చెత్త సేకరణకు అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించుకొనేందుకు పంచాయతీరాజ్ శాఖ సన్నద్ధమైంది. ప్రతి ఇంటి నుంచీ చెత్త సేకరించారో లేదో తెలుసుకొనేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ గుర్తింపు కార్డు (ఆర్‌ఎఫ్‌ఐడీ) వినియోగించనున్నారు. ప్రతి రోజు ఇళ్ల నుంచి చెత్త డబ్బాలు తీసుకొన్న వెంటనే ఆర్‌ఎఫ్‌ఐడీని స్కాన్ చేయగానే రియల్ టైంలో వివరాలు నమోదవుతాయి. ఇందుకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయోగాత్మకంగా 400 గ్రామాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆ ఊళ్లలో ప్రతి ఇంటికీ ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డులు అతికిస్తారు. ఇంటి నుంచి చెత్త సేకరించేందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమిస్తారు. వీరికి ఉపాధి హామీ ద్వారా వేతనాలు ఇస్తారు. చెత్త సేకరించిన తరవాత గ్రీన్ అంబాసిడర్‌కి ఇచ్చిన ఫోన్ ద్వారా ఆర్‌ఎఫ్‌ఐడీపై ఉంచి స్కాన్ చేయాల్సి ఉంటుంది. ఏ రోజు ఏ సమయంలో చెత్తను సేకరించిందీ తెలిసిపోతుంది. ఎక్కడ సేకరణ సక్రమంగా సాగడం లేదో పర్యవేక్షించేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికే పశ్చిమగోదావరి జిల్లా ఐ.పంగిడిలో కొంతమేరకు పరిశీలన చేశారు.

రాష్ట్ర ఆహార కమిషన్‌కు పూర్తి అధికారాలు

- త్వరలో గుడి, బడి రైతుబజార్లు
- రైతు బజార్లను 500 వరకు పెంచాలని నిర్ణయం
- పౌరసరఫరాలు, రైతుబజార్లపై ముఖ్యమంత్రి సమీక్ష

ఈనాడు – అమరావతి

రాష్ట్ర ఆహార కమిషన్‌కు పూర్తి అధికారాలను కల్పించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఏర్పాటుచేసిన ఈ కమిషన్‌కు వచ్చే ఏడాది నుంచి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించారు. మరోవైపు రైతుబజార్లను విస్తరించనున్నారు. ఆహార కమిషన్, రైతుబజార్లు, చౌకధరల దుకాణాల్లో (గ్రామీణమాల్స్) ఏర్పాటుపై శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.



రాష్ట్ర ప్రజలకు ఆహార భద్రత కల్పించడంతోపాటు ధరల నియంత్రణ, పౌష్టికాహారాన్ని అవసరార్థులకు అందేలా చూడడం వంటి బాధ్యతలను నిర్వర్తించడంలో ఈ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. దీనికి పౌరసరఫరాలు, పాఠశాల విద్యాశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు.

50వేల జనాభాకో రైతుబజార్

రాష్ట్రంలో రైతుబజార్‌లకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 2014 ఎన్నికల ప్రణాళికలో నియోజకవర్గానికో రైతుబజార్ ఏర్పాటుచేస్తామని ఇచ్చిన హామీ అమలు దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ 50వేల జనాభాకు ఒక రైతుబజార్ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నాలుగైదు నెలల వ్యవధిలో 300 రైతుబజార్లను ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ రాజశేఖర్ ముఖ్యమంత్రికి నివేదించారు. వాటిని కేవలం కూరగాయల విక్రయకేంద్రాలుగానే కాకుండా రైతు ఉత్పత్తుల విక్రయ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో నిత్యాన్నదాన కేంద్రానికి కూరగాయలు సరఫరా చేస్తున్నట్లుగానే ఇతర జిల్లాల్లోనూ నిత్యాన్నదానాల కేంద్రాలకు రైతుబజార్ ద్వారానే కూరగాయలు అందించేలా గుడి రైతుబజార్ పేరుతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ వసతిగృహాల్లో పిల్లలకు భోజనం కోసం అవసరమైన కూరగాయలను సరఫరా చేసేందుకు గ్రామంలో ప్రత్యేకంగా బడి రైతుబజార్ పేరుతోనూ కేంద్రాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. సాధారణ రైతుబజార్లలో కూరగాయలతోపాటు ఆన్‌లైన్‌లో ఆర్డర్‌పై ప్యాకింగ్ చేసిన కూరగాయలను వినియోగదారుల ఇళ్లకే చేరవేసేలా వర్చువల్ రైతుబజార్ల ఏర్పాటుపై చర్చించారు. ఇలా అన్ని రకాలు కలిపి మొత్తంగా 500 వరకు రైతుబజార్లను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. వీటి ఏర్పాటు, మౌలిక సదుపాయాలకల్పనకు నిధులు, పర్యవేక్షణ అంశాలు చర్చకు వచ్చాయి. రైతుబజార్లను ప్రస్తుత మార్కెటింగ్ శాఖ పరిధి నుంచి పౌరసరఫరాల శాఖ పరిధిలోకి తీసుకువస్తే బాగుంటుందన్న ప్రతిపాదన వచ్చింది. దీనికోసం మార్గదర్శకాలను సిద్ధం చేయాలని, వారంలో కొత్త బజార్ల ఏర్పాటుపై నివేదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఆలయాల్లో గోసంరక్షణకు ఏర్పాట్లు

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు

సత్యనారాయణపురం (విజయవాడ), న్యూస్‌టుడే: మానవాళికి అనేక ప్రయోజనాలు చేకూర్చే గోమాతను రక్షించుకోవడం పౌరుల కర్తవ్యమని రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ గాంధీనగర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన సభలో గోసంజీవని ఆవులు, ఎడ్లు, సుళ్ల గ్రంథాలను ఆయన ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గోసంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాయన్నారు. మనల్ని మనం కాపాడుకునేందుకు గోవులను పరిరక్షించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలన్నింటిలోనూ గోశాలలు ఏర్పాటుచేసి గోసంరక్షణ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రతి దేవాలయంలోనూ కనీసం ఒక్క గోవునైనా సంరక్షించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గోసంరక్షణ, పెంపకానికి నిర్వాహకులు సరైన సమాచారం, ప్రణాళికతో వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం రైతు నేస్తం పబ్లికేషన్స్ వారి డాక్టర్ ములగలేటిశివరామ్ రచించిన గోసంజీవని ఆవులు, ఎడ్లు, సుళ్ల గ్రంథాలను ఆవిష్కరించారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు పుస్తకాల విశిష్టతను తెలియజేశారు. సామాజిక కార్యకర్త సత్యవాణి, అధికారులు అనిల్, ప్రసాద్, కొండలరావు, తదితరులు హాజరయ్యారు.

ఒంగోలు గిత్తల అభివృద్ధి చేపట్టాలి: గ్రంథావిష్కరణకు ముందు నిర్వహించిన సమావేశంలో ఒంగోలు జాతి గిత్తలను రక్షించుకోవాలని, గోఆధారిత వ్యవసాయం చేపట్టాలని తీర్మానించారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి 10 వరకు ఒంగోలు జాతి పశుసంపదపై గణన చేపట్టాలని నిర్ణయించారు. ఒంగోలు జాతి, ఆవులు, గిత్తలు, దూడలు చిత్రాలను సేకరించి పుస్తకరూపంలో పోషకులకు అందించాలని నిర్ణయించారు. ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి పశు పోషకులు, రైతులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో మంత్రి మాణిక్యాలరావు, శివరామ్, సత్యవాణి, కొండలరావు, రైతు నేస్తం వెంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు

సచివాలయంలో ప్రైవేటు వైద్యుడి ఆత్మహత్య

తుళ్ళూరు, న్యూస్‌టుడే: వెలగపూడి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం పాకాలపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు గండికోట రాజగోపాల్(50) పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అప్పుల పాలయిన ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సాయం కోరేందుకు ఉదయం సచివాలయానికి చేరుకున్నారు. సాయంత్రానికి పురుగుమందు తాగారు. అపస్మారక స్థితికి చేరుకున్న రాజగోపాల్‌ను సచివాలయ ఆసుపత్రి సిబ్బంది 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబరుకు కొత్తగూడెం-కిరండోల్ సర్వే పూర్తి

ఈనాడు, హైదరాబాద్: కొత్తగూడెం నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని కిరండోల్ వరకూ ప్రతిపాదిత నూతన రైల్వేప్రాజెక్టు సరకు రవాణాలో కీలకమార్గం అయ్యే అవకాశాలున్నాయి. 180 కిలోమీటర్ల ఈ మార్గానికి సంబంధించిన సర్వేను డిసెంబరు కల్లా పూర్తిచేసి రైల్వేబోర్డుకు సమర్పించేలా రైల్వేశాఖ ప్రణాళికలు రూపొందించింది. వచ్చే బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కొత్తగూడెంలో బొగ్గు గనులున్నాయి. మణుగూరు సమీపంలో న్యూక్లియర్ రియాక్టర్లకు సంబంధించిన భారజల కర్మాగారం ఉంది. వీటికి సంబంధించిన ముడిపదార్థాల రవాణా ఎక్కువగా జరుగుతుంటుంది. కిరండోల్‌లో భారీ ఎత్తున ఇనుప ఖనిజం ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగూడెం-మణుగూరు-కిరండోల్ రైలుమార్గం సర్వేకు కేంద్రం 2015-16లో ఆమోదం తెలిపింది.

రాజ్యాంగ విరుద్ధం.. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం

- కింది కోర్టుల్లో ‘సుప్రీం’ ప్రతిపాదిత ఎంపిక ప్రక్రియపై వ్యతిరేకత
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచీ అభ్యంతరాలు

దిల్లీ: కేంద్రీయ ఎంపిక యంత్రాంగం ద్వారా అధీన(సబార్డినేట్) న్యాయ వ్యవస్థలో ఎంపిక ప్రక్రియ చేపట్టాలన్న సుప్రీంకోర్టు ప్రతిపాదనకు శుక్రవారం వ్యతిరేకత వ్యక్తమైంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతుందని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా హైకోర్టు అభ్యంతరం చెప్పాయి. కింది కోర్టుల్లో భారీగా న్యాయమూర్తుల ఖాళీలు ఉండటం వల్ల కేసులు పేరుకుపోతున్నాయని కొత్త పద్ధతిలో ఎంపిక ప్రక్రియపై సుప్రీంకోర్టు సానుకూలత వ్యక్తం చేసిన సంగతి విదితమే. అధీన న్యాయవ్యవస్థలో ఎంపిక ప్రక్రియను ఆర్టికల్ 233 ప్రకారం హైకోర్టులు మాత్రమే చేపట్టాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తరపున వాదించిన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జె.ఎస్.ఖెహర్, జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయల్, జస్టిస్ యు.యు.లలిత్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట తమ వాదన వినిపించారు. అమికస్ క్యూరి అరవింద్ దతర్ సమర్పించిన ప్రతిపాదనాంశం ఆర్టికల్ 233కు విరుద్ధమని, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని అతిక్రమించేలా ఉందని కోల్‌కతా హైకోర్టు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా పేర్కొన్నారు. కేంద్రీయ ఎంపిక కమిటీకి శ్రీకారం చుట్టడం ఆర్టికల్ 233ను అతిక్రమించడమేనన్నారు. ప్రతి హైకోర్టు స్వాతంత్ర్యానికి భంగకరమన్నారు. మరోవైపు అంతకుముందు వాదప్రతివాదనల ప్రారంభంలో దతర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రతిపాదనపై కోల్‌కతా, చత్తీస్‌గఢ్, సిక్కిం, అసోం, జమ్మూకశ్మీరు, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదించారు. ఆర్టికల్ 35ఏ కారణంగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉండొచ్చని జమ్మూకశ్మీరు ప్రభుత్వం తరపున హాజరైన షోయబ్‌ఆలం అనే న్యాయవాది విన్నవించారు. వాదప్రతివాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 21న చేపట్టనున్నట్లు ప్రకటించింది.

మిర్చి డబ్బులు ఎప్పుడిస్తారు?

- 15 రోజులకు పైగా ఆగిన చెల్లింపులు
- అదనపు ధర పథకం కింద రావాల్సిన మొత్తం రూ.38 కోట్లు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు



ఈనాడు – అమరావతి

మిర్చి రైతులకు అదనపు ధర పథకం కింద చెల్లించాల్సిన సొమ్ములు నిలిచిపోయాయి. పక్షం రోజులకు పైగా అన్నదాతల ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ కావడం లేదు. ప్రభుత్వం ఈ పథకం కింద పూర్తి స్థాయిలో నిధులు కేటాయించక పోవడమే దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపి నెల రోజులు గడిచినా ...నిధుల మంజూరుపై మార్కెటింగ్‌శాఖకు ఎటువంటి అనుమతులు అందలేదు. డబ్బులు ఎప్పుడు వేస్తారని రైతులు బ్యాంకులను సంప్రదిస్తున్నారు. ఇంకొందరు మార్కెటింగ్‌శాఖ అధికారులకు ఫోన్లపై ఫోన్లు చేస్తున్నారు. రైతులకు ఏమి చెప్పాలో పాలుపోక వారు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

అనుమతి ఎప్పటికొచ్చేనో...!

గడచిన మిర్చి సీజన్‌లో ధరలు రోజు రోజుకీ పతనం కావడంతో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అదనపు ధర పథకం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. క్వింటాకు రూ.1500లు వంతున ఒక్కో రైతుకు రూ.20 క్వింటాళ్ల వరకు ఈ పథకాన్ని వర్తింపచేసేలా విధివిధానాలు రూపొందించి మిర్చి క్రయవిక్రయాలు జరిపారు. ఏప్రిల్ 20న ప్రారంభమైన పథకం జూన్‌30న ముగిసింది. మొదట్లో ఒక్క గుంటూరు మిర్చియార్డులోనే ఈ పథకం కింద కొనుగోళ్లు జరపాలని నిర్ణయించారు. రాష్ట్రంలోనే గాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీగా మిర్చి బస్తాలు తరలి రావడంతో గుంటూరుతో పాటు దాచేపల్లి, చర్లపూడి, నందిగామ, జగ్గయ్యపేట, కర్నూలు మార్కెట్ యార్డుల్లో కూడా క్రయవిక్రయాలు జరిపారు. ఇప్పటి వరకు రూ.100కోట్లను మిర్చి అదనపు ధర పథకానికి కేటాయించారు. ఈ నిధులన్నీ కొంతమంది రైతుల ఖాతాల్లో జమచేశారు. మిగిలిన రైతులకు ఇంకా మరో రూ.38కోట్లు వరకు జమచేయాల్సి ఉంది. ఈ నిధులను కేటాయించాలని నెల రోజుల క్రితమే మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. గుంటూరు మిర్చియార్డుకు చెందిన నిధులే ఇంకా 60కోట్లకు పైగా నిధులు ఉన్నాయి. గతంలో మార్క్‌ఫెడ్‌కు పసుపు కొనుగోళ్లకు నిమిత్తం రైతులకు చెల్లింపులకు గాను రెండు విడతలుగా రూ.100కోట్లు నిధులను మళ్లించారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే మిగిలిన రైతులకు గుంటూరు మిర్చియార్డు నిధుల నుంచి చెల్లింపులు జరిపే అవకాశం ఉంది. జూన్ 30తో అదనపు ధర పథకం ముగియగా జులై 31 వరకు రైతుల ఖాతాల్లో ఉన్నంత వరకు నిధులను జమ చేశారు. ఆగస్టు నెలలో నిధుల కొరత కారణంగా ఒక్క రైతుకు కూడా చెల్లింపులు జరపలేకపోయారు. ప్రస్తుతం వ్యవసాయపు పనులు జోరందుకుంటున్న తరుణంలో రావాల్సిన డబ్బు చేతికందితే పెట్టుబడులకు పనికొస్తాయని రైతులు వాపోతున్నారు.

అదనపు ధర పథకం కింద మిర్చి కొనుగోళ్లు, చెల్లింపులు ఇలా...

మొత్తం మిర్చి క్రయవిక్రయాలు:	9,13,645 క్వింటాళ్ళు
ఈ పథకం కింద మిర్చిని అమ్ముకున్న రైతులు:	59,753 మంది
మొత్తం రైతులకు చెల్లించాల్సిన సొమ్ము:	రూ. 137.33 కోట్లు
ఇప్పటివరకు చెల్లించినది:	రూ. 99.94 కోట్లు

వర్షపు చినుకుల్లో త్రివర్ణం.. సమ్మోహనం..!



చెట్టు కొమ్మకు వేలాడుతున్న వాన నీటి బిందువుల్లో జాతీయ జెండా చక్కగా ఒదిగిపోయి ఈ రమణీయ దృశ్యం కనిపించింది. శుక్రవారం ఉదయం విజయవాడ నగరంలో వర్షం కురిసింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ఇటీవల స్థానిక సత్యనారాయణపురంలోని ఓ పాఠశాల ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో జాతీయ పతాక జెండాలను ఆకర్షణీయంగా వేలాడదీశారు. స్కూల్ ఆవరణలోని ఓ వృక్షం కొమ్మపై నిలిచిన వర్షపు నీటి చుక్కల్లో.. సంబంధిత త్రివర్ణ పతాకాల ప్రతిబింబాలు ఇలా చూడముచ్చటగా నిలిచి ఆకట్టుకున్నాయి. –ఈనాడు, అమరావతి

మట్కా కట్టడికి 'పరివర్తన'!

నేడు కడపలో సదస్సు

ఈనాడు, కడప: మట్కా వ్యసనాన్ని రూపుమాపడానికి కడప జిల్లా పోలీసులు 'పరివర్తన' పేరుతో రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కడప జిల్లా నుంచి కొందరు బీటర్లు, పంటర్లు చుట్టు పక్కల జిల్లాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు కేంద్రంగా మట్కా నిర్వహిస్తున్నారు. రోజుకు రూ.లక్షల్లోనే వ్యాపారం సాగిస్తున్నారు. గతంలో మట్కా నిర్వాహకులు జిల్లా బహిష్కరణకు గురైనా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అట్టాడ బాబూజీ తాజాగా 'పరివర్తన' పేరుతో కొత్త కార్యక్రమాన్ని రూపొందించారు. మట్కా నిర్వాహకులు.. ఆ మహమ్మారికి బలైపోయిన కుటుంబాలను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నారు. మట్కా వ్యవహారంలో జిల్లాలో 3 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా. కడప జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహిస్తున్న పరివర్తన కార్యక్రమంలో మట్కా నిర్వహిస్తున్న వ్యక్తులకు.. ఈ ఆటతో ఆర్థికంగా చితికి పోయిన వారి బాధలను ప్రత్యక్షంగా వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం పోలీసుశాఖ ప్రత్యేక ఆహ్వాన పత్రాలు తయారుచేసి వారందరినీ ఆహ్వానించింది.

కరవు సమస్యను వెంటనే పరిష్కరించాలి: సీపీఐ

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నెలకొన్న కరవు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా రాష్ట్రంలో తీవ్రమైన కరవు ఛాయలు అలుముకున్నాయన్నారు. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకత్వం అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు పర్యటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న కరవు పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నట్లు చెప్పారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో వర్షాలు లేనందున లక్షలాది ఎకరాల్లో వేరుసెనగ పంట వేయలేదన్నారు. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతంలోనూ వర్షాలు లేక 45 శాతం సాగుభూమిలో పంటలు వేయలేదన్నారు. ప్రతి రైతుకు నెలకు రూ.10 వేలు పింఛను ఇవ్వాలని, పంట వేయడానికి వందశాతం రాయితీతో ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని కోరారు.

ఔరా.. కీరా!



1700 గ్రాములున్న కీర దోసకాయను చూపుతున్న నాగేశ్వరరావు

ఈ చిత్రంలో కనిపిస్తున్నది కీర దోసకాయ. కృష్ణా జిల్లా గన్నవరం మండలం గొల్లనపల్లి గ్రామానికి చెందిన రైతు పోరండ్ల నాగేశ్వరరావు నివాసంలో కాసిన ఈ భారీ కీర దోస స్థానికులను అబ్బురపరుస్తోంది. కొన్నాళ్ల క్రితం ఆయన తన ఇంటి ఆవరణలో కీరదోస పాదు వేశారు. వాతావరణం అనుకూలించడంతో అది ఏపుగా పెరిగి పెద్ద సంఖ్యలో కాయలను కాసింది. అందులో భారీ పరిమాణంలో ఉన్న ఈ కీరదోసను తూకం వేసి చూడగా 1700 గ్రాముల బరువు తూగింది. ఈ విషయమై ఉద్యాన శాఖ అధికారిణి హేమ స్పందిస్తూ.. అప్పుడప్పుడూ అనూహ్యంగా, జన్యులోపాలతో కొన్నికాయలు ఈ తరహాలో ఎదగడం సహజమేనని తెలిపారు. – న్యూస్‌టుడే, గన్నవరం

నకిలీ ఇంజిన్ ఆయిల్ తయారీ కేంద్రాలపై దాడులు

- మూడు సంస్థల సీజ్
- రూ.12లక్షల సరకు స్వాధీనం

విజయవాడ, న్యూస్‌టుడే: విజయవాడలోని భవానీపురం కేంద్రంగా నకిలీ ఇంజిన్ ఆయిల్ తయారు చేస్తున్న సంస్థలపై టాస్క్‌ఫోర్స్, భవానీపురం స్టేషన్ పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేశారు. స్థానిక మహ్మదీయ కో-ఆపరేటివ్ సొసైటీ స్థలాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న మూడు సంస్థలపై దాడులు నిర్వహించి వీటిల్లో మూడు వేల లీటర్ల వరకు నకిలీ ఇంజిన్ ఆయిల్, ట్యూటీ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొదట సానికొమ్ము వెంకటరెడ్డికి చెందిన కంపెనీని పరిశీలించి అక్కడ మెట్రో, విజయ్ సూపర్ పేరిట ఐదు, లీటరు, చిన్నపాటి పౌచ్‌లలో నకిలీ ఆయిల్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు రూ.3.5 లక్షలు విలువ చేసే 850లీటర్ల వరకు ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని కంపెనీని సీజ్ చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డి నిర్వహించే కేంద్రాన్ని పరిశీలించి ఇతను కూడా మెట్రో, హైమా కంపెనీ పేరిట తయారు చేస్తున్న ఆయిల్‌ను పరిశీలించి రూ.6 లక్షలు విలువచేసే 1500 లీటర్ల సరకు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతిరెడ్డి అనే వ్యక్తి నిర్వహిస్తున్న మరొక కంపెనీపై దాడి చేసి రూ.2.5 లక్షల విలువైన 650 లీటర్ల మేర నకిలీ ఆయిల్‌ను గుర్తించారు. మూడు కంపెనీలను సీజ్ చేశారు. ఇక్కడ తయారు చేసిన ఇంజిన్ ఆయిల్‌ను ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లుగా తెలిసిందని అధికారులు వెల్లడించారు. వాహనాలకు వినియోగించిన ఇంజిన్ ఆయిల్‌ను సేకరించి పౌడర్, రంగులు కలిపి రీ-సైకిల్ చేస్తున్నట్లుగా గుర్తించామన్నారు. ఆయిల్‌ను ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయిస్తామన్నారు.



నకిలీ ఆయిల్ డబ్బాను పరిశీలిస్తున్న పోలీసులు

ఎమ్మార్ టీకాతో బాలిక మృతి చెందిందంటూ ఫిర్యాదు

ఈనాడు–గుంటూరు, తాడేపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా తాడేపల్లిలోని యానాది కాలనీలో 13 ఏళ్ల బాలిక ఎమ్మార్ టీకాతో మరణించిందంటూ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఈ నెల 17న మండల ఆరోగ్య కేంద్రం సిబ్బంది కత్తి చెంచమ్మ(13)కు టీకా ఇచ్చారు. టీకా ఇచ్చిన గంట తర్వాత అస్వస్థతకు గురైంది. రాత్రి నోటి వెంట నురుగు వచ్చింది. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి బాలికను పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.' అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మార్ వ్యాక్సిన్‌కు సంబంధం లేదు...: కత్తి చెంచమ్మ మరణానికి, ఎమ్మార్ వ్యాక్సిన్‌కు సంబంధం లేదని ముగ్గురు బోధనాచార్యులతో కూడిన వైద్యనిపుణుల కమిటీ నిర్ధారించింది. కమిటీ సభ్యులు మృతురాలి ఇంటికి వెళ్లి పాప తల్లిని కలుసుకుని మరణానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన వివరాల ఆధారంగా పాప మృతికి, ఎమ్మార్ వ్యాక్సిన్‌కు సంబంధం లేదని ఇప్పటికే వ్యాక్సిన్ వేయించుకున్న 75 లక్షల మంది సురక్షితంగా ఉన్నారని ఆ వైద్యుల బృందం తెలియ జేసింది. మృతికి నిర్దిష్ట కారణాలు తెలుసుకోవాలంటే శవపంచనామా నిర్వహించాలని కమిటీ అభిప్రాయపడింది. ఈ కమిటీ సభ్యులుగా గుంటూరు వైద్య కళాశాలకు చెందిన ఆచార్యులు డాక్టర్ కె.నాగేశ్వరావు(కమ్యూనిటీ మెడిసన్) డాక్టర్ దేవాకుమార్ (చిన్న పిల్లల విభాగం), డాక్టర్ వాణిశ్రీ(మైక్రో బయాలజీ) ఉన్నారు. మరోవైపు ఇదే విషయంపై మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మార్ టీకాతో బాలిక మృతి చెందే అవకాశం లేదని పేర్కొన్నారు.

రోబోటిక్స్ విధానంలో విజయవంతంగా కీళ్ల మార్పిడి

- శ్రీకర హాస్పిటల్స్ ఛైర్మన్ డా.అఖిల్ దాడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అత్యాధునిక రోబోటిక్స్ విధానంతో తమ ఆసుపత్రిలో కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు శ్రీకర హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స వైద్య నిపుణులు డా.అఖిల్ దాడి తెలిపారు. భారత్‌లో తొలిసారిగా ఈ విధానాన్ని గత మేలో అందుబాటులోకి తెచ్చామనీ, ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఈ సాంకేతికతతో మోకాళ్ల కీళ్ల మార్పిడి చేశామన్నారు. అమెరికాకు చెందిన రోబోటిక్స్ శస్త్రచికిత్స నిపుణులతో కలిసి శుక్రవారం మదీనగూడలోని ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోబోటిక్స్ విధానంతోనే కీళ్లమార్పిడి వందశాతం విజయవంతం అవుతుందనీ.. రోగికి నొప్పి తక్కువగా ఉండటంతోపాటు శస్త్రచికిత్స ఏ మేరకు అవసరమో ఈ విధానంలో కచ్చితంగా గుర్తించగలమన్నారు. అమర్చిన కీలు జీవితాంతం పనిచేస్తుందని, రోగి త్వరగా కోలుకోవడమే కాకుండా, తక్కువ రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారన్నారు. ప్రస్తుత శస్త్రచికిత్సతో పోల్చితే ఈ విధానంలో అయ్యే ఖర్చు అంత ఎక్కువేమీ కాదన్నారు. భారత్‌లో 70% మంది మహిళల్లో కీళ్ల అరుగుదల కనిపిస్తోందని, రోబోటిక్స్ విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మోకాళ్ల నొప్పి బాధితులకు ఊరట లభించినట్లేనని అమెరికాకు చెందిన రోబోటిక్స్ శస్త్రచికిత్స నిపుణులు డా.కాపర్, లీహోవ్‌లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డా.అఖిల్ దాడి, అమెరికాకు చెందిన వైద్య నిపుణులు

వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోవడం అల్జీమర్స్‌కు సూచిక



టొరంటో: వివిధ రకాల వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోతే అల్జీమర్స్ మొదలైనట్లేనని ఓ అధ్యయనం తెలిపింది. ఉదాహరణకు నిమ్మకాయలు, పెట్రోలు వంటి వాటి నుంచి వచ్చే వాసనల మధ్య భేదాన్ని గుర్తించలేకపోవడం మతిమరుపు సూచిక అని తెలిపింది. అల్జీమర్స్ లక్షణాలు కనిపించడానికి 20 ఏళ్ల ముందే మెదడు ఈ వ్యాధికి గురవుతుంది. సాధారణ వాసనలు గుర్తించే పరీక్ష చేయడం వల్ల వ్యాధిలక్షణాలు బయటపడటానికి ముందే అది ఏస్థాయిలో ఉందో గుర్తించవచ్చని కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త జాన్ బ్రిట్నర్ తెలిపారు. వ్యాధి లక్షణాల ప్రారంభాన్ని ఓ ఐదేళ్లు ఆపగలిగితే ఆ లక్షణాల వ్యాప్తిని, తీవ్రతను యాభైశాతం వరకు తగ్గించవచ్చని ఆయన తెలిపారు. సగటున 63 ఏళ్ల వయసున్న 300 మంది వ్యక్తులపై వివిధ పదార్థాల వాసనలు గుర్తించే పరీక్షలు చేయగా కొందరు గుర్తించలేకపోయారు. వాసనలు గుర్తించలేని వారిలో అల్జీమర్స్ రావడానికి సూచనలున్నాయని గుర్తించడం ఇదే మొదటిసారని విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ విద్యార్థి మారీ ఏలిస్ లాఫిల్లే తెలిపారు.

రంగుల ఎమ్మారై మరింత ప్రభావవంతం

శోధన

వాషింగ్టన్: వ్యాధులను గుర్తించడంలో మాగ్నటిక్ రిసోనెన్స్ ఇమేజింగ్ (ఎమ్మారై)ను మరింత ప్రభావవంతంగా మార్చే కొత్త పద్ధతిని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎమ్మారై చిత్రాల్లో శరీరం లోపలి భాగాలు స్పష్టంగా కనిపించేందుకు రోగి నరాల్లోకి ఓ కాంట్రాస్ట్ ఏజెంట్‌ను ఎక్కిస్తారు. అయితే ఒకేసారి రెండు కాంట్రాస్ట్ ఏజెంట్‌లను ఎక్కించి.. వివరణాత్మకమైన రంగుల చిత్రాలను రూపొందించే కొత్త విధానాన్ని అమెరికాలోని కేస్ వెస్టర్న్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఫలితంగా అవయవాలకు సంబంధించిన భిన్నమైన లక్షణాలు గుర్తించేందుకు అవకాశం ఏర్పడుతుంది. గాడోలినియం, మాంగనీస్‌లను ఇలా కాంట్రాస్ట్ ఏజెంట్లుగా ఉపయోగించుకోవచ్చని పరిశోధకులు పేర్కొన్నారు. వ్యాధికి గురైన కణజాలాన్ని, ఆరోగ్యంగా ఉన్న కణజాలాన్ని గుర్తించేందుకు విడివిడిగా ఇవి పనిచేస్తాయని పరిశోధకులు తెలిపారు.

నొప్పులకు శక్తిమంతమైన నివారిణి



హ్యూస్టన్: నొప్పుల నుంచి ఉపశమనం పొందటానికి ఇప్పటివరకు ఉపయోగిస్తున్న మందుల కంటే శక్తిమంతమైన నొప్పి నివారిణిని అమెరికా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. యుకెహెచ్-1114గా పిలుస్తున్న నొప్పి నివారిణిని గాయపడ్డ ఎలుకలపై ప్రయోగించగా, ఇది నాడీసంబంధిత నొప్పుల నివారణకు సాధారణంగా ఉపయోగించే గాబాపెంటిన్ వలె ప్రభావవంతంగా పనిచేసిందని వారు తెలిపారు. అయితే ఈ సింథటిక్ సమ్మేళనం తక్కువ మోతాదులోనూ, ఎక్కువ కాలం పాటు పనిచేస్తుందని పరిశోధకులు అంటున్నారు. గాబాపెంటిన్ రెండు, మూడు గంటలపాటు పనిచేస్తే ఇది కొన్నిరోజులపాటు కేవలం ఆరోవంతు పరిమాణంలోనే పనిచేస్తుందని టెక్సాస్ విశ్వవిద్యాలయ సహ అధ్యాపకుడు థియోడోర్ ప్రైస్ తెలిపారు. నాడీ సంబంధిత నొప్పులు లేదా దీర్ఘకాలిక నొప్పులు కేంద్రనాడీవ్యవస్థలోని నాడులు దెబ్బతినడం మూలంగా సంభవిస్తాయి. ఈ నొప్పి నివారిణి కేంద్రీయ నాడీవ్యవస్థ కణాలంతటా వ్యాపించి ఉన్న సిగ్మా 2 గ్రాహకాలను పట్టుకొని ఉంటుంది. ఈ గ్రాహకాన్ని శాస్త్రవేత్తలు 25సంవత్సరాల క్రితమే కనుగొన్నప్పటికీ అది ఎలా పనిచేస్తుందో ఇప్పటివరకు తెలుసుకోలేకపోయారు.

పర్యవేక్షణ గు(గ్గొ)డ్డుబోయింది!

- పిల్లలు, గర్భిణుల పోషకాహారాన్ని దోచుకుంటున్న గుత్తేదారులు
- అత్యంత చిన్న కోడిగుడ్లు సేకరించి అంగన్‌వాడీలకు సరఫరా
- 45 గ్రాముల బరువున్నవి సరఫరా చేయాలనేది నిబంధన
- అందిస్తున్నది 30 గ్రాముల లోపువే

ఈనాడు – ఒంగోలు



గోళీలా 25 గ్రాముల బరువు మాత్రమే ఉన్న ఇలాంటి కోడిగుడ్లను ప్రకాశం జిల్లా సంతనూతలపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలు, చిన్నారులకు పోషకాహారంగా ఇస్తున్నారు.

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో 32.5 శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దాదాపు 6 లక్షల మంది చిన్నారులు తక్కువ బరువు ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం గుత్తేదారుల స్వార్థం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నీరుగారిపోతోంది.

నిబంధనలు ఇవీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అన్న అమృతహస్తం' పథకం పేరుతో ఆరేళ్లలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పోషకాహారంలో భాగంగా కోడిగుడ్లు అందిస్తోంది.

★ రాష్ట్రవ్యాప్తంగా 48,770 ప్రధాన; 6,830 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో ఆరేళ్లలోపు చిన్నారులు 30.35 లక్షల మంది; గర్భిణులు, బాలింతలు కలిపి 6.20 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు.

★ ఇందులో మూడేళ్లలోపు చిన్నారులకు నెలకు 8 గుడ్లు; 3 నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు వారానికి నాలుగు; గర్భిణులు, బాలింతలకు రోజూ ఆహారంలో భాగంగా ఒక గుడ్డు ఇస్తున్నారు.

★ ఒక్కో గుడ్డుకు రూ.4.63 చెల్లిస్తూ సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వం గుత్తేదారులకు అప్పగించింది. 45 గ్రాముల బరువున్న గుడ్లను అందించాలని నిబంధన పెట్టింది. దీని ద్వారా 70 క్యాలరీల పోషకాలు అందుతాయి. ఇందుకోసం నెలకు రూ.13 కోట్లు, సంవత్సరానికి రూ.156 కోట్లు వ్యయం చేస్తోంది.

★ అంగన్‌వాడీల్లో సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ. 4.63 చొప్పున చెల్లిస్తున్నా.. గుత్తేదారులు సరఫరా చేస్తున్న గుడ్ల సగటు బరువు 32 గ్రాములే ఉంటోంది. కనిష్ఠంగా 25 గ్రాములు, గరిష్ఠంగా 35 గ్రాములు ఉంటున్నాయి. ఫలితంగా లబ్ధిదారులకు 50 క్యాలరీలకు మించి పోషకాలు అందడం లేదు.

★ బయట మార్కెట్‌లో రూ.4.60 పెడితే 60 గ్రాముల గుడ్డు లభిస్తుండగా, ప్రభుత్వం రూ.4.63 పైసలు చెల్లిస్తున్నా ఈ కేంద్రాల్లో లబ్ధిదారులకు 45 గ్రాముల గుడ్డు అందడం లేదు. గుత్తేదారులు కాసులకు కక్కుర్తి పడి తక్కువ రకం చిన్న గుడ్లను సేకరించి సరఫరా చేస్తున్నారు.

ఆ ముగ్గురు...: కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టును రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు ప్రధాన గుత్తేదారులు పొందారు. వారు ప్రతి జిల్లాలో ఉప గుత్తేదారులను నియమించుకుని.. వారికి గుడ్డుకు రూ.3.90 నుంచి రూ.4.15 మధ్య చెల్లిస్తున్నారు. ఉపగుత్తేదారులు కూడా స్థానికంగా కోళ్లఫారాలు, పౌల్ట్రీ వ్యాపారులకు ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు. పౌల్ట్రీల్లో చిన్న పరిమాణంలో ఉన్న గుడ్లను వేరు చేసి ఈ కేంద్రాలకు అందిస్తున్నారు. వారికి ఒక్కో గుడ్డుకు రూ.3.60 ఇస్తున్నారు. ఈ గుత్తేదారులందరూ రాజకీయ పలుకుబడి కలిగిన వారు కావడంతో అధికారులు ఆ గుడ్లను వెనక్కు పంపే సాహసం చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బ్లాక్‌లిస్టులో పెడతాం: మంత్రి సునీత

నిబంధనల ప్రకారం అంగన్‌వాడీల్లో అందించే కోడిగుడ్డు బరువు కనీసం 45 గ్రాములుండాలి. ఇలా లేకుంటే తిరస్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. చాలా చోట్ల మార్పు రాలేదు. దిగువ స్థాయిలో కొందరు అధికారులకు ఈ అవినీతిలో భాగం ఉంటోంది. దీన్ని సహించం. గుడ్డు కనీస పరిమాణం తగ్గితే సంబంధిత గుత్తేదారును బ్లాక్‌లిస్టులో పెట్టి బిల్లులు నిలిపివేస్తాం.

పాత పింఛను విధానం కోరుతూ మిలీనియం మార్చ్

ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

కాకినాడ, న్యూస్‌టుడే: పాత పింఛను విధానమే అమలు చేయాలని కోరుతూ సెప్టెంబరు 1న విజయవాడలో మిలీనియం మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఐకాస అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్ ఉద్యోగులు చేపట్టనున్న మిలీనియం మార్చ్‌కు ఏపీ ఐకాస అమరావతి మద్దతుగా నిలుస్తుందన్నారు. నూతన పింఛను విధానం రద్దుకు తమిళనాడు, కేరళ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు కమిటీలు వేశాయని, రాష్ట్రంలో కూడా కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో దీనిపై చర్చిస్తామన్నారు.

21న పలు రైళ్ల దారి మళ్లింపు

ఈనాడు, హైదరాబాద్: ఏపీ రాష్ట్రం నాయుడుపేట లెవల్‌క్రాసింగ్ వద్ద సబ్‌వే నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు, నెల్లూరు, సూళ్లూరుపేట మధ్య మెమూ రైళ్ల సర్వీసులను రద్దుచేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 21న ఈ మార్గంలో నడిచే చెన్నై గరీబ్‌రథ్, కోరమాండల్, అలప్పుజ ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి, ఇండోర్-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లను రేణిగుంట, అరక్కోణం స్టేషన్ల మీదుగా దారిమళ్లిస్తున్నట్లు తెలిపింది.

కుళ్లిన పచ్చళ్లతో తిరిగి తయారీ!

- 200 డ్రమ్ముల నిల్వలు పట్టివేత
- రూ.75 లక్షల సరకు జప్తు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: గుంటూరు నగరం సమీపంలో ఆటోనగర్ కేంద్రంగా పచ్చళ్లను కల్తీ చేస్తున్న కంపెనీపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. పచ్చళ్లను కల్తీ చేస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎస్పీ శోభామంజరి, ఏవో వెంకట్రావు, ఎస్సై శ్రీనివాసరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డిల బృందం ఆటోనగర్‌లోని కేదార్ ప్రొడక్ట్స్ పేరుతో పచ్చళ్లు తయారు చేస్తున్న కంపెనీ లోపల తనిఖీలు చేయగా అవి కుళ్లి పోయిన స్థితిలో కనిపించాయి. ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో కుళ్లిపోతున్నాయని వాటిని కల్తీ చేసి కొత్త పచ్చళ్లుగా విక్రయాలు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని విజిలెన్స్ ఎస్పీ శోభామంజరి తెలిపారు. కంపెనీలో పచ్చళ్లు నిల్వ ఉన్న డ్రమ్ములను పరిశీలిస్తే అన్నింటిలోను పచ్చళ్లు తయారు చేసే పదార్థాలు కుళ్లిపోవడం, బూజుపట్టడం విస్మయపరిచిందన్నారు. సుమారు రూ.75 లక్షలు విలువ చేసే 200 డ్రమ్ముల పచ్చళ్లను జప్తు చేశామన్నారు. వాటిని ఆహార భద్రత నియమాల ప్రకారం తనిఖీలకు లాబ్‌కు పంపిస్తున్నామన్నారు. కంపెనీపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

అగ్రిగోల్డ్ బాధితులకిచ్చిన హామీని నెరవేర్చాలి

- చైతన్య యాత్రకు సంపూర్ణ మద్దతు: సీపీఎం

విజయవాడ, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సొమ్ము వెంటనే చెల్లించాలని కోరుతూ బాధితుల సంఘం ఈ నెల 16 నుంచి చేపట్టిన చైతన్యయాత్రకు సీపీఎం మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి, 2017లో ముఖ్యమంత్రి 120రోజుల్లోగా సొమ్మును బాధితుల పేరిట డిపాజిట్ చేస్తామని, ఆత్మహత్యలు చేసుకున్న వారికి రూ.5లక్షల పరిహారం చెల్లిస్తామని, అగ్రిగోల్డ్ ఆస్తుల వేలాన్ని వేగవంతం చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. నాలుగు నెలల్లో 35 మంది బాధితులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు.

ప్రత్యేక హోదాపై భాజపా, తెదేపాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని మరోసారి స్పష్టమైందన్నారు. దేశమంతటికీ జీఎస్టీ అమలు చేస్తున్నందున ప్రత్యేక హోదాకు ప్రాధాన్యం లేదని కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాష్ట్ర ప్రజలను మభ్యపుచ్చారన్నారు. ఆగస్టు 16న సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ప్రత్యేక హోదాగల రాష్ట్రాల్లోని పరిశ్రమలకు పన్ను రాయితీ చెల్లించాలని నిర్ణయించిందన్నారు. దీంతో ప్రత్యేక హోదాపై రాష్ట్ర ప్రజలకు అవాస్తవాలు చెప్పినట్లు వెల్లడైందన్నారు.

ఐఐటీహెచ్ సహాయ ఆచార్యునికి 'యువ శాస్త్రవేత్త' పురస్కారం



చంద్రశేఖర్ శర్మ

ఈనాడు, సంగారెడ్డి: పర్యావరణ హిత పరిశోధనలు, సృజనాత్మక ఆవిష్కరణలు సాగిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్ శర్మను 'యువ శాస్త్రవేత్త' అవార్డు వరించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న ఆయనకు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా(ఎన్‌ఏఎస్‌ఐ) తాజాగా ఈ పురస్కారాన్ని ప్రకటించింది. 2017 సంవత్సరానికిగాను ఎన్‌ఏఎస్‌ఐ దేశవ్యాప్తంగా 17 మందిని ఈ అవార్డుకు ఎంపికచేయగా..ఆ జాబితాలో శర్మ ఉన్నారు. ఇప్పటికే ఇండో-యూఎస్ రీసెర్చ్ ఫెలోషిప్-2016కు ఎంపికైన ఆయన.. ఈ ఏడాది మార్చి నుంచి అమెరికాలోని అక్రాన్ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు సాగిస్తున్నారు. అవార్డు ప్రకటించిన సందర్భంగా 'ఈనాడు'తో ఆయన మాట్లాడుతూ.. జనహితమే లక్ష్యంగా కొన్నేళ్లుగా తాము సాగిస్తున్న పరిశోధనలకు దక్కిన గుర్తింపు ఇది అని అభిప్రాయపడ్డారు. శర్మ పర్యావరణహిత న్యాప్‌కిన్లు, థర్మాకోల్ పునర్వినియోగం ద్వారా చమురును పీల్చుకునే వస్త్రం తయారీకి కృషిచేశారు. కొవ్వొత్తిని మండించడం ద్వారా వచ్చే నుసి నుంచి బ్యాటరీల్లో ఉపయోగించే కార్బన్‌ను సంగ్రహించడంపైనా పరిశోధనలు చేశారు.



దంబుల్లా: 2008, ఆగస్టు 18న దంబుల్లాలో అతని కెరీర్ మొదలైంది. తొమ్మిదేళ్లు గిర్రున తిరిగాక మళ్లీ అతను అక్కడికి వచ్చాడు. ఈసారి ప్రపంచంలోనే మేటి బ్యాట్స్‌మెన్‌లో ఒకడిగా, టీమ్‌ఇండియా కెప్టెన్‌గా! విరాట్ కోహ్లి ప్రస్థానమిది. లంకపై దంబుల్లాలో తొలి వన్డే ఆడిన విరాట్.. ఈసారి కెప్టెన్‌గా అదే లంకపై, అదే వేదికపై భారత్ జట్టును నడిపించనున్నాడు. "కొన్ని విషయాలు ఎప్పటికి మారవు. కానీ దిగ్గజాలు ఎదుగుతూనే ఉంటారు" అని కోహ్లిని ఉద్దేశించి బీసీసీఐ ట్వీట్ చేసింది. డ్రెస్సింగ్ రూమ్‌లో కుర్చీలో కూర్చొని.. విజయ సంకేతం చూపిస్తూ కోహ్లి కూడా ఒక ఫొటో ట్విటర్‌లో పోస్టు చేశాడు.

మొదలెట్టిన చోటే..

"ఇదే రోజు (ఆగస్టు 18) ఈ కుర్చీ నుంచే నా పయనం మొదలైంది. తొమ్మిదేళ్లు భారత్ తరపున ఆడాను.. ఆడుతున్నాను. అందరికి కృతజ్ఞతలు" అని విరాట్ ఆ ఫొటోకు వ్యాఖ్యలను జోడించాడు. తానాడిన తొలి మ్యాచ్‌లో గంభీర్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలో దిగిన విరాట్.. 12 పరుగులకే ఔటయ్యాడు.

ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే..

దుబాయ్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ విరాట్ కోహ్లి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 873 పాయింట్లతో ఉన్న విరాట్.. నంబర్‌వన్ ర్యాంకు నిలబెట్టుకున్నాడు. అతనికి.. రెండో స్థానంలో ఉన్న ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు మధ్య అంతరం 12 పాయింట్లే. కానీ ఆదివారం నుంచి శ్రీలంకతో ఐదు వన్డేల సిరీస్ ఆరంభం కానున్న నేపథ్యంలో ర్యాంకింగ్ పాయింట్లు పెంచుకునే అవకాశం కోహ్లి ముందుంది. బౌలింగ్‌లో భువనేశ్వర్ (13వ ర్యాంకు) మాత్రమే టాప్-15లో చోటు దక్కించుకున్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం మూడో ర్యాంకులో ఉన్న టీమ్‌ఇండియా.. లంకతో సిరీస్‌లో కనీసం 4-1తో గెలిస్తేనే ఆ స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. 3-2తో గెలిచినా.. నాలుగో స్థానానికి పడిపోతుంది.

సెమీస్‌లో సానియా జోడీ

సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీ



దిల్లీ: సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ టోర్నీలో సానియా-షుయె పెంగ్ (చైనా) జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ఈ ఇండో-చైనా ద్వయం 6-3, 6-7 (1/7), 10-3 తేడాతో కమెలియా బేగు- రాలుకా ఒలారు జంటపై నెగ్గింది. మొదటి సెట్ గెలిచి ఊపులో కనిపించిన సానియా జోడీకి రెండో సెట్లో పరాజయం ఎదురైంది. చివరి సెట్లో తిరిగి పుంజుకుని ఆడి సెట్‌తో పాటు మ్యాచ్‌నూ గెలుచుకుంది. మరో వైపు పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న జోడీ క్వార్టర్స్‌కు చేరింది. ఏడో సీడ్ బోపన్న-ఇవాన్ డోడిగ్ జంట 5-7, 7-5, 10-8తో సెబాస్టియన్-ఫాబియోపై విజయం సాధించింది.

ఛాంపియన్స్

శ్రీలంకను టెస్టు సిరీస్‌లో భారత్ 3-0తో చిత్తు చేయడం సంతోషమే! కానీ ఈ సిరీస్ ఆసక్తి రేకెత్తించిందా..? క్రికెట్ వీక్షకుల్ని ఆకర్షించిందా..? వినోదం పంచిందా..? అంటే 'లేదు' అన్నదే సమాధానం! మొత్తంగా మూడు టెస్టుల్లో రెండు మూడు సెషన్లలో మినహాయిస్తే అంతా ఏకపక్షమే! ఇక రెండు జట్ల మధ్య ఆదివారం నుంచి వన్డే సిరీస్ ఆరంభం కాబోతోంది. మరి పరిమిత ఓవర్ల క్రికెట్లో అయినా లంక పుంజుకుంటుందా? భారత్‌కు పోటీ ఇస్తుందా? ఈ సిరీస్ అయినా హోరాహోరీగా సాగుతుందా?

ఫార్మాట్ మారె.. మరి ఆట?



7 శ్రీలంకలో భారత్ ఆడిన ద్వైపాక్షిక సిరీస్‌లు. వీటిలో భారత్‌దే పైచేయి. మూడింట్లో (2008, 2009, 2012) భారత్ నెగ్గింది. రెండు సిరీస్‌ల్లో (1993, 1997) శ్రీలంక నెగ్గింది. రెండు సిరీస్‌లు (1985, 2006) డ్రా అయ్యాయి.

కొలంబో

శ్రీలంకతో మూడు టెస్టుల సిరీస్‌లో భారత్ గెలుపు ఊహించిందే! కానీ కోహ్లీ సేన మరీ అంతలా ఆధిపత్యం చలాయిస్తుందని.. ఏకపక్షంగా గెలుస్తుందని అనుకోలేదు. సొంతగడ్డపై శ్రీలంక మరీ అంత పేలవంగా ఆడుతుందని.. పోరాడకుండానే అంత సులువుగా సిరీస్ సమర్పించేస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. ఆ జట్టు ప్రదర్శన లంక అభిమానుల్ని తీవ్ర నిరాశకు గురి చేసింది. సిరీస్ సాగిన తీరు భారత అభిమానులకు కూడా రుచించలేదు. మ్యాచ్‌లు అంత ఏకపక్షంగా సాగితే ఎవరికి మాత్రం ఆసక్తి ఉంటుంది? పోరాటమే లేకుండా ప్రత్యర్థి లొంగిపోతే గెలుపులో మజా ఏముంటుంది? అందుకే వన్డే సిరీస్ అయినా హోరాహోరీగా సాగుతుందని.. వినోదాన్ని పంచుతుందని ఆశిస్తున్నారు ఇరు దేశాల అభిమానులు. గత రెండేళ్లలో టెస్టుల్లో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూ, ఎదురొచ్చిన ప్రతి ప్రత్యర్థినీ గెలుస్తూ వస్తున్న భారత్.. పరిమిత ఓవర్ల క్రికెట్లో ఇంత ఆధిపత్యం చలాయించట్లేదు. టెస్టుల్లో భారత్ ముందు నిలవలేకపోయిన జట్లు.. వన్డేలు, టీ20ల్లో భారత్‌కు సవాలు విసిరాయి. శ్రీలంక కూడా అదే బాటలో సాగొచ్చని భావిస్తున్నారు. టెస్టులతో పోలిస్తే వన్డేల్లో ఆ జట్టు కొంచెం మెరుగ్గా కనిపిస్తోంది కూడా. మలింగ, తరంగ, కపుగెదెర, తిసార పెరీరా లాంటి అనుభవజ్ఞుల రాకతో ఆ జట్టు బలం పెరుగుతుందనడంలో సందేహం లేదు. రెండు నెలల కిందట ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్‌ఇండియాకు లంక షాకిచ్చిన సంగతి మరువరాదు. భారత్ నిర్దేశించిన 320కి పైగా లక్ష్యాన్ని ఛేదించి సంచలనం సృష్టించింది లంక. ఆ మ్యాచ్‌లో మెరిసిన కుశాల్ మెండిస్.. తాజాగా టెస్టు సిరీస్‌లోనూ ఒక ఆణిముత్యం లాంటి ఇన్నింగ్స్ ఆడాడు. అతడితో పాటు చండిమాల్, మాథ్యూస్ కూడా సత్తా చాటితే భారత్‌కు లంక దీటుగా బదులిచ్చేందుకు అవకాశముంటుంది.

లంక ఆటగాళ్లకు బిస్కెట్లు బంద్

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు ప్రదర్శన రోజు రోజుకూ దిగజారి పోతుండటానికి ఆటగాళ్ల ఫిట్‌నెస్ లేమే కారణమంటూ కొన్నాళ్ల కిందట ఆ దేశ క్రీడల మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం, మూడు నెలల్లో ఫిట్‌నెస్ ప్రమాణాలు అందుకోని పక్షంలో ఆటగాళ్లను సాగనంపుతామని హెచ్చరికలు జారీ చేయడం తెలిసిన సంగతే. ఈ నేపథ్యంలోనే లంక క్రికెటర్లకు డ్రెస్సింగ్ రూంలో బిస్కెట్ల సరఫరాను ఆపివేయించాడు ఆ జట్టు మేనేజర్ అసంక గురుసిన్హా. విరామాల మధ్య ఎక్కువగా బిస్కెట్లు తింటుండటం వల్ల ఆటగాళ్ల శరీరం అదుపు తప్పుతోందన్న ఉద్దేశంతో ఫిట్‌నెస్ శిక్షకుడి సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు గురుసిన్హా తెలిపాడు. డ్రెస్సింగ్ రూంలో బిస్కెట్లు గమనించిన తాను వాటిని తీయించేసినట్లు చెప్పాడు.

అందుకోసమైనా ఆడతారా?

టెస్టు సిరీస్‌లో చిత్తుగా ఓడిన నేపథ్యంలో వన్డేల్లో అయినా భారత్‌కు గట్టిగా బదులివ్వాలని లంకేయులు పట్టుదలతో ఆడే ప్రయత్నం చేయొచ్చు. అదే సమయంలో ఆ జట్టు కసిగా ఆడేందుకు మరో కారణం కూడా కనిపిస్తోంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్న లంక.. సెప్టెంబరు 30 వరకు ఈ ర్యాంకును నిలబెట్టుకోవాలి. అంతకంటే ఒక ర్యాంకు తగ్గినా 2019 వన్డే ప్రపంచకప్ కోసం క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. 1996లో ప్రపంచకప్ గెలిచాక పెద్ద జట్లలో ఒకటిగా ఉంటూ.. ఇంకో రెండుసార్లు (2007, 2011) ఫైనల్ చేరిన లంక.. క్వాలిఫయర్స్ ఆడాల్సి వస్తే అంతకంటే అవమానం మరొకటి ఉండదు. కాబట్టి నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధించడం ఆ జట్టుకు ప్రతిష్టాత్మకం. భారత్‌తో ఐదు వన్డేల సిరీస్‌లో లంక రెండు మ్యాచ్‌లు గెలిస్తే.. ఆ జట్టుకు చింత తీరిపోతుంది. ప్రస్తుతం 88 పాయింట్లతో ఉన్న లంక.. రెండు విజయాలతో 90 పాయింట్లకు చేరుకుంటుంది. ప్రస్తుతం 78 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో ఉన్న వెస్టిండీస్.. సెప్టెంబరు 30 లోపు ఆడబోయే ఆరు వన్డేల్లోనూ గెలిచినా లంకను దాటలేదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం రెండు వన్డేలైనా గెలవాలన్న పట్టుదలతో ఉంది లంక. కాబట్టి ఆ జట్టు భారత్‌కు దీటుగా బదులిస్తుందని ఆశించవచ్చు.

లంక అలా ఆడితేనే..

మహేల జయవర్ధనె

మూడో టెస్టు కూడా సిరీస్‌లో గత రెండు మ్యాచ్‌ల్లాగే సాగింది. ముందుగా భారత్ పరుగుల వరద పారింది. తర్వాత శ్రీలంక టాప్‌ఆర్డర్ కుప్పకూలింది. చివరికి లంక భారీ తేడాతో ఓడింది. సొంతగడ్డపై 0-3తో ఓడిపోవడం శ్రీలంక అభిమానుల్ని తీవ్ర నిరాశకు గురి చేసింది. ఈ పరిస్థితుల్లో జట్టుకు మద్దతుగా నిలవాలి. ఆటగాళ్లు తమవంతుగా అత్యుత్తమంగా ఆడే ప్రయత్నం చేస్తున్నారు. భారత్ నంబర్‌వన్ టెస్టు జట్టుగా అడుగుపెట్టి.. అందుకు తగ్గట్లే ఆడింది. బలమైన ప్రత్యర్థిని ఢీకొనేటపుడు అవసరమైన దూకుడు, విజయ కాంక్షను శ్రీలంక చూపించలేకపోయింది. మూడో టెస్టు తొలి రోజు సమతూకంతో కనిపించింది. కానీ హార్దిక్ పాండ్య కళ్లు చెదిరే ఇన్నింగ్స్‌తో అంతా మార్చేశాడు. భారత్‌కు అతను అన్ని ఫార్మాట్లలోనూ చక్కటి ఆల్‌రౌండర్‌గా ఉపయోగపడతాడని భావిస్తున్నా. వన్డే సిరీస్‌కు ముందు తిరిగి ఆత్మవిశ్వాసం పుంజుకోవడం లంక ముందున్న సవాల్. గత కొన్ని నెలల్లో వన్డేల్లో మా జట్టు ఫామ్ బాగుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో లంక.. భారత్‌ను ఓడించింది కూడా. అది మా జట్టుకు ఆత్మవిశ్వాసాన్నందించేదే. ఐతే ఇంగ్లాండ్‌లో మాదిరే దూకుడుగా, స్వేచ్ఛగా ఆడితే తప్ప భారత్‌ను ఓడించడం సాధ్యం కాదు. టెస్టు సిరీస్‌ను మరిచిపోయి దూకుడు ప్రదర్శించాలి. అది అంత సులువు కాదు. అయినప్పటికీ సీనియర్ ఆటగాళ్లు, జట్టు యాజమాన్యం ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపి సరైన దృక్పథంతో బరిలోకి దిగేలా చూడాలి.

ముంబా గట్టెక్కింది

ఉత్కంఠ పోరులో యూపీపై విజయం



లఖ్‌నవూ: ప్రో కబడ్డీ లీగ్-5లో యు ముంబా మరో విజయాన్ని సొంతం చేసుకుంది. శుక్రవారం చివరిదాకా ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ముంబా 37-34తో యూపీ యోధపై విజయం సాధించింది. ఒక దశలో 4-12తో వెనకబడిన ముంబా..గొప్పగా పుంజుకుని గెలిచింది. గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన షబీర్ బాపు (13) ముంబా విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ గేమ్‌లో ఆరంభం నుంచి యూపీదే జోరు. రిషాంక్ దేవడిగ (14 పాయింట్లు) రెండో నిమిషంలోనే సూపర్ రైడ్ సాధించడంతో యూపీ 4-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒక దశలో 15-8తో ఆ జట్టు విజయం దిశగా సాగింది. అయితే షబీర్‌తో పాటు అనూప్‌కుమార్ (8) విజృంభించి ముంబాను మళ్లీ పోటీలోకి తెచ్చారు. దీంతో విరామ సమయానికి ముంబా 12-15తో ప్రత్యర్థిని సమీపించింది. ద్వితీయార్ధంలో ముంబా మరింత చెలరేగింది. యూపీ కూడా అదే స్థాయిలో స్పందించడంతో పోరు హోరాహోరీ సాగింది. కానీ కొద్దిసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా యూపీ 31-28తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత కడియన్ రెండు పాయింట్లు తేవడంతో ముంబా 31-31తో స్కోరు సమం చేసింది. ఈ స్థితిలో యూపీని ఆలౌట్ చేసిన ముంబా.. 35-31తో ఆధిక్యంలో నిలవడమే కాక.. ఆఖరి రెండు నిమిషాల్లో ప్రత్యర్థికి పాయింట్లు రాకుండా కాచుకుని విజయం సాధించింది. మరో ఉత్కంఠభరిత పోరులో జైపుర్ పింక్ పాంథర్స్ 30-28తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. జస్వీర్ సింగ్ (10), మంజీత్ చిల్లార్ (8) జైపుర్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ మ్యాచ్‌లో ప్రథమార్ధంలో బెంగళూరు ఆధిపత్యం ప్రదర్శిస్తే.. ద్వితీయార్ధంలో జైపుర్ అనూహ్యంగా పుంజుకుంది. జస్వీర్, మంజీత్ వరుస పాయింట్లు సాధించడంతో 27-16తో విజయానికి చేరువైంది. అయితే రోహిత్‌కుమార్ (10) మెరవడంతో బుల్స్ వేగంగా పుంజుకుంది. 28-28తో స్కోరు సమం చేసింది. కానీ చివర్లో కీలక సమయంలో జస్వీర్ రైడ్ పాయింట్ తేవడంతో జైపుర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సీజన్లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన జైపూర్‌కు ఇది రెండో గెలుపు.

ప్రో కబడ్డీలో ఈనాడు		
తెలుగు టైటాన్స్ × యూ ముంబా	రాత్రి 8 గంటలకు	ప్రసారం: స్టార్ స్పోర్ట్స్ 2
యూపీ యోధ × హరియాణా స్టీలర్స్	రాత్రి 9 గంటలకు	వేదిక: లఖ్‌నవూ

కుక్ 243

ఇంగ్లాండ్ 514/8 డిక్లేర్డ్ ● వెస్టిండీస్‌తో డే/నైట్ టెస్టు



బర్మింగ్‌హామ్: వెస్టిండీస్‌తో డే/నైట్ టెస్టు (మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటిది)లో ఇంగ్లాండ్ భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 514 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. మాజీ కెప్టెన్, ఓపెనర్ అలిస్టర్ కుక్ (243; 407 బంతుల్లో 33×4) మారథాన్ ఇన్నింగ్స్‌తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. తొలి రోజే కెప్టెన్ జో రూట్ (136)తో కలిసి 248 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పిన కుక్.. రెండో రోజూ జోరు కొనసాగించాడు. 153 పరుగులతో క్రీజులోకి వచ్చిన అతను శుక్రవారం తొలి సెషన్లోనే డబుల్ సెంచరీ పూర్తి చేశాడు. మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ మలన్ (65; 139 బంతుల్లో 10×4)తో కలిసి కుక్ 162 పరుగులు జోడించాడు. మలన్ ఔటయ్యాక కుక్‌కు సరైన సహకారం అందలేదు. స్టోక్స్ (10), బెయిర్‌స్టో (18), మొయిన్ అలీ (0) విఫలమయ్యారు. అయినప్పటికీ కుక్ జోరు కొనసాగించాడు. అతను ఎనిమిదో వికెట్ రూపంలో వెనుదిరగ్గానే రూట్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన వెస్టిండీస్.. కడపటి వార్తలందేసరికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 44 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే క్రెయిగ్ బ్రాత్‌వైట్‌ను అండర్సన్ డకౌట్ చేశాడు. కీరన్ పావెల్ (18), హోప్ (25) క్రీజులో ఉన్నారు.

భారత పర్యటనకు స్టార్క్ దూరం



మెల్‌బోర్న్: ఐదు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ కోసం వచ్చే నెలలో భారత్‌కు రానున్న ఆస్ట్రేలియా జట్టులో స్టార్ ఫాస్ట్‌బౌలర్ మిచెల్ స్టార్క్ లేడు. పాదం గాయంతో బాధపడుతున్న స్టార్క్‌ను ఈ పర్యటనకు ఎంపిక చేయలేదు. స్టార్క్ ఈ ఏడాది ఆరంభంలో భారత్‌తో జరిగిన టెస్టు సిరీస్ నుంచి కూడా గాయంతో అర్ధంతరంగా తప్పుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన జేమ్స్ ఫాల్క్‌నర్ వన్డే జట్టులోకి పునరాగమనం చేశాడు. నాథన్ కౌల్టర్‌నైల్ వన్డేలతో పాటు టీ20 జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. భారత్-ఆస్ట్రేలియా తొలి వన్డే సెప్టెంబరు 17న జరుగుతుంది. ఐదు వన్డేల అనంతరం మూడు టీ20ల సిరీస్ అక్టోబరు 13న ముగుస్తుంది. ఓ టీ20 మ్యాచ్‌కు హైదరాబాద్ ఆతిథ్యమిస్తుంది.

బీసీసీఐతో ఎన్వోసీ ఇప్పించండి

హైకోర్టుకు శ్రీశాంత్



కోచి: స్కాట్లాండ్‌లోని గ్లెన్‌రాథెస్ క్రికెట్ క్లబ్‌లో ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లు ఆడేందుకు తనకు బీసీసీఐ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేయాలంటూ కేరళ క్రికెటర్ శ్రీశాంత్ ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాడు. ఆ క్లబ్‌కు ఆడేందుకు తనకు ఎన్వోసీ ఇవ్వాలని బోర్డుకు తాను ఇప్పటికే విన్నవించినట్లు తన పిటిషన్లో శ్రీశాంత్ వెల్లడించాడు. కోర్టు జోక్యం చేసుకుంటే తప్ప బోర్డు ఎన్వోసీ ఇచ్చేలా లేదని అతనన్నాడు. స్కాట్లాండ్‌లో క్రికెట్ ఆడేందుకు శ్రీశాంత్ గతంలోనే ప్రయత్నించగా.. బీసీసీఐ నిరభ్యంతర పత్రం జారీ చేయలేదు. శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ కేరళ కోర్టు బీసీసీఐని ఆదేశించిన సంగతి తెలిసిందే.

హారిక ఓటమి

అబుదాబి: అబుదాబి అంతర్జాతీయ చెస్ టోర్నీలో గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారికకు తొలి ఓటమి ఎదురైంది. శుక్రవారం నాలుగో రౌండ్లో నల్లపావులతో ఆడిన ప్రపంచ నం.9 హారిక రొమేనియా గ్రాండ్ మాస్టర్ బోగ్డాన్ డానియల్ చేతిలో పరాజయం పాలైంది. నాలుగు రౌండ్లు ముగిసే సరికి హారిక 2.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచింది.

కేఎస్‌సీఏ విజేత ఆంధ్ర



ఫైనల్లో రంజీ ఛాంప్ గుజరాత్‌కు షాక్

బెంగళూరు: అఖిల భారత కేఎస్‌సీఏ క్రికెట్ టోర్నీలో ఆంధ్ర విజేతగా నిలిచింది. దేశవాళీ సీజన్‌కు ముందు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ టోర్నీ ఫైనల్లో రంజీ ట్రోఫీ ఛాంపియన్ గుజరాత్‌కు ఆంధ్ర షాకిచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్‌ను ఆంధ్ర 365 పరుగులకే కట్టడి చేసింది. అనంతరం 526/9 స్కోరు వద్ద ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఆంధ్ర విజేతగా నిలిచింది. రూ.1 లక్ష నగదు బహుమతితో పాటు డాక్టర్ తిమ్మప్పయ్య ట్రోఫీని ఆంధ్ర కైవసం చేసుకుంది. అఖిల భారత స్థాయి క్రికెట్ టోర్నీలో ఆంధ్ర విజేతగా నిలవడం ఇదే ప్రథమం. మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్న జట్టును ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు జీవీకే రంగరాజు, కార్యదర్శి సీహెచ్ అరుణ్‌కుమార్ అభినందించారు.



ముంబయిలో ఓ కార్యక్రమంలో పానీపూరీ తింటున్న ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ క్లార్క్

ఇక క్యూ స్పోర్ట్స్ లీగ్

అహ్మదాబాద్: భారత్ వేదికగా పుట్టుకొచ్చిన లీగ్‌ల జాబితాలో మరో ఆట చేరింది. క్రికెట్, కబడ్డీ, హాకీ, టెన్నిస్, ఫుట్‌బాల్ లీగ్‌ల సరసన క్యూ స్పోర్ట్స్ లీగ్ కూడా నిలిచింది. అహ్మదాబాద్ వేదికగా శనివారం ఇండియన్ క్యూ మాస్టర్స్ లీగ్ ప్రారంభం కానుంది. రూ.50 లక్షల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో భారత స్టార్ పంకజ్ అడ్వాణీతో పాటు అలోక్ కుమార్, సౌరభ్ కొఠారి తదితరులు పోటీ పడుతున్నారు. ఈ లీగ్‌లో ఐదు జట్లు (దిల్లీ డాన్స్, చెన్నై షార్క్స్, గుజరాత్ కింగ్స్, బెంగళూరు బడ్డీస్, హైదరాబాద్ హస్టలర్స్) పాల్గొంటున్నాయి. అడ్వాణీ చెన్నై జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. మూడుసార్లు యూరోపియన్ ఛాంపియన్ సిరొటినా, వెల్ష్ విజార్డ్ తదితరులు పోటీపడనున్నారు. ప్రతి జట్టులో ఐదుగురు క్రీడాకారులు ఆడతారు. ఏ జట్టులోనైనా ముగ్గురు భారతీయులు ఆడడం తప్పనిసరి.



ట్రోఫీతో క్రీడాకారులు

స్వచ్ఛ భారత్‌పై ప్రాథమిక విద్యార్థులకు పోటీలు

దిల్లీ: స్వచ్ఛ భారత్‌పై కేంద్ర రక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తోంది. 2022 నాటికి దేశం నుంచి మురికిని తొలగించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు అమల్లో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం ఈ పోటీలు జరుపుతోంది. 'స్వచ్ఛ్ సంకల్ప్ సే స్వచ్ఛ్ సంకల్ప్ సిద్ధి' అనే నినాదం కింద సెప్టెంబరు 8 వరకు ఈ పోటీలు జరుగుతాయి. 'భారత్‌ను పరిశుభ్రంగా ఉంచడానికి నేనేమి చేయగలను?' అనే అంశంపై వ్యాసరచన, 'పరిశుభ్ర భారత్‌కు నా భాగస్వామ్యం ఏమిటి' అనేదానిపై ఫిల్మ్, 'నా కలల పరిశుభ్ర భారత్'పై చిత్రలేఖనం పోటీలు ఉంటాయి. విజేతలకు అక్టోబరు రెండో తేదీన జాతీయ స్వచ్ఛ భారత్ పురస్కారాలను బహూకరిస్తారు.

దివ్యాంగ ఉద్యోగినుల శిశు సంరక్షణ భత్యం రెట్టింపు

దిల్లీ: శిశు సంరక్షణ నిమిత్తం దివ్యాంగ ఉద్యోగినులకు ఇస్తున్న భత్యాన్ని కేంద్ర ప్రభుత్వం రెట్టింపు చేసింది. ప్రస్తుతం శిశువు జన్మించినప్పటి నుంచి రెండేళ్ల వయసు వరకు నెలకు రూ.1500 భత్యంగా ఇస్తుండగా, దాన్ని రూ.3000కు పెంచింది. ఇద్దరు పిల్లలకే ఇది వర్తిస్తుంది. ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసినట్టు సిబ్బంది, శిక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

- ★ ఉద్యోగుల పిల్లలకు విద్యా భత్యం కింద నెలకు రూ.2,250, వసతి గృహం రాయితీ కింద నెలకు రూ.6,750 చెల్లించాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగులు మొదట విద్యాసంస్థల రుసుములు, వసతి గృహం ఖర్చులు చెల్లిస్తే, తరువాత ఈ మొత్తం మేరకు వాపసు చేస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులయితే ఒక్కరికే ఈ సౌకర్యం వర్తిస్తుంది.
- ★ ఈ పిల్లలు దివ్యాంగులయితే రెట్టింపు భత్యం చెల్లిస్తారు.

త్రిపుర సీఎంని హతమార్చాలంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు

అగర్తలా: త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌ను హతమార్చిన వారికి రూ. ఐదు లక్షలు ఇస్తానని ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టు కలకలం రేపింది. ప్రపంచ కమ్యూనిజం వ్యతిరేక మండలి తరఫున రియారోయ్ అనే వ్యక్తి పేరుతో ఈ పోస్టు ఉంది. ఇది నకిలీపేరుతో వచ్చి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

యూపీ సీఎం ఆదిత్యనాథ్‌ను చంపుతానని బెదిరింపు

లఖ్‌నవూ: గుర్తుతెలియని ఓ వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను హతమారుస్తానని దిల్లీ పోలీసులకు ఫోన్ చేసి బెదిరించిన ఘటనపై దర్యాప్తు బాధ్యతలను యూపీ ఉగ్రవాద వ్యతిరేక పోరాట బృందానికి అప్పగించామని పోలీసులు తెలిపారు. ఈ ఫోన్‌కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో గుర్తించలేకపోయామని పోలీసులు పేర్కొన్నారు.

అయిదేళ్లలో కశ్మీర్ సమస్యకు పరిష్కారం: రాజ్‌నాథ్ సింగ్

కశ్మీర్ సహా, ఉగ్రవాదం, నక్సలిజం, ఈశాన్య రాష్ట్రాల్లో తిరుగుబాటు వంటి సమస్యలకు 2022లోగానే పరిష్కారం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'సంకల్ప్ సే సిద్ధి.. నయా భారత్ కే నిర్మాణ్' అనే అంశంపై శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. నూతన భారత్ కోసం అందరం ప్రతిజ్ఞ చేస్తున్నందున ఇవన్నీ అయిదేళ్లలో పరిష్కారమవుతాయని హామీ ఇస్తున్నానని ప్రకటించారు.



శుక్రవారం అసోంలోని గౌహతి రైల్వే స్టేషన్‌లో దాదాపు 8-10 కిలోల బరువు గల బాంబును గుర్తించారు. తపాలా శాఖ ముఠాల్లోని ఓ పార్సిల్‌లో దీనిని గుర్తించారు. గురువారం రాత్రి గౌహతి జనరల్ పోస్టాఫీసులో బుక్ చేసుకున్న ఈ పార్సిల్ గురించి బాంబు నిర్వీర్యక దళానికి రైల్వే సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారు ఇలా రోబో సాయంతో దానిని నిర్మానుష్య ప్రాంతానికి తరలించి దానిని నిర్వీర్యం చేశారు

ఉగ్రపంజాతో స్పెయిన్ విలవిల

- వాహనంతో జనంపైకి దూసుకెళ్లి మరో దాడి
- 14కు చేరిన మృతుల సంఖ్య
- 125 మందికిపైగా గాయాలు
- ఐదుగురిని కాల్చిచంపిన పోలీసులు
- దాడి తమ పనేనన్న ఇస్లామిక్ స్టేట్
- ఖండించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ



స్పెయిన్‌లోని క్యాంబ్రిల్స్‌లో ఉగ్రవాదులు ఉపయోగించిన కారు. శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు వారిని వెంబడించి కాల్చి చంపారు

బార్సిలోనా,వాషింగ్టన్, దిల్లీ

ఐరోపాలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్ని లక్ష్యంగా చేసుకుంటున్న ఉగ్రవాదులు ఈసారి స్పెయిన్‌పై గురిపెట్టారు. చాలాకాలంగా ప్రశాంతంగా ఉన్న ఈ దేశాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. తక్కువ వనరులతో, భారీ నష్టం కలిగించేలా నవ్యరీతిలో వాహనాలతో వరస దాడులకు పాల్పడటంతో స్పెయిన్ విలవిల్లాడింది. గురువారం బార్సిలోనా నగరంలో పాదచారులపైకి వ్యానుతో దూసుకెళ్లి 13 మంది మరణానికి కారణమైన ఉగ్రవాదులు.. శుక్రవారం తెల్లవారుజామున మరోచోట అదేతరహా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనల్లో మొత్తంగా 14 మంది అమాయకులు బలయ్యారు. సుమారు 125 మందిదాకా క్షతగాత్రులయ్యారు. దాడులకు సంబంధించి ఐదుగురు అనుమానిత ఉగ్రవాదుల్ని పోలీసులు కాల్చి చంపారు. వ్యాను డ్రైవర్ కోసం వేట కొనసాగుతోంది.

శుక్రవారం తెల్లవారుజామున బార్సిలోనాకు 130 కి.మీ. దూరంలో ఉన్న తీర పట్టణం క్యాంబ్రిల్స్‌లో ఆడి కారుతో పాదచారులపైకి దూసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. క్యాంబ్రిల్స్‌లో ఐదుగురు అనుమానిత ఉగ్రవాదుల్ని పోలీసులు కాల్చి చంపారు. అగంతకులు నకిలీ పేలుడు పదార్థాల్ని ఒంటికి అమర్చుకున్నట్లు తెలుస్తోంది.



బార్సిలోనాలో పోలీసులు అదుపులోకి తీసుకున్న ఓ అనుమానితుడు

బార్సిలోనా దాడికి సంబంధించి అనుమానితుడిగా భావిస్తున్న మౌస్సా ఔకబీర్(18) కోసం పోలీసులు గాలిస్తున్నారు. మౌస్సా తన సోదరుడి పత్రాలను ఉపయోగించి అద్దెకు తీసుకున్న వ్యానునే జనంపైకి తోలినట్లు అనుమానిస్తున్నారు. అతని చిత్రాలను విడుదల చేశారు. దాడి తర్వాత మౌస్సా సోదరుడు డ్రిస్ ఔకబీర్‌ను అరెస్టు చేశారు. తనకేమీ సంబంధం లేదనీ, తన పత్రాలు దొంగతనానికి గురైనట్లు డ్రిస్ వెల్లడించినట్లు సమాచారం. బార్సిలోనా ఘటనకు తామే బాధ్యులమని ఉగ్రసంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ప్రకటించుకుంది.

పేలుడు జరగకపోయి ఉంటే..: రెండు వరస ఘటనలకూ సంబంధం ఉందనీ, ఇస్లామిక్ ఉగ్రవాద బృందం సుదీర్ఘ ప్రణాళికతో దాడులకు సిద్ధపడిందని పోలీసులు అనుమానిస్తున్నారు. బార్సిలోనాకు 200 కి.మీ.దూరంలోని అల్కనార్ పట్టణంలోని ఓ ఇంట్లో ఉగ్రవాదులు సుదీర్ఘకాలంగా దాడులకు కుట్రపన్నారనీ, బుధవారం రాత్రి ప్రమాదవశాత్తూ బ్యూటేన్ వాయువు కారణంగా పేలుడు సంభవించి ఆ ఇల్లు ధ్వంసమైందని అధికారులు వివరించారు. అల్కనార్ పేలుడులో ఒకరు మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

స్పెయిన్ దాడులకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. బార్సిలోనా దాడిలో 8 మంది హస్తమున్నట్లు అనుమానిస్తున్నారు. బాధితుల్లో 34 విభిన్న దేశాలకు చెందినవారున్నట్లు పేర్కొన్నారు.

ఎవరేమన్నారు..

- ఉగ్రదాడిని తమదేశం ఖండిస్తోందనీ, ఎలాంటి సహాయం అవసరమైనా చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు.
- ఇది జిహాదీల దాడి అనీ, విషాదంలో తామంతా ఒకేమాటపై ఉన్నట్లు స్పెయిన్ ప్రధానమంత్రి మారియానో రజోయ్ పేర్కొన్నారు.
- ఉగ్రదాడుల్ని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఖండించారు.

ఫిన్లాండ్‌లో విచ్చలవిడిగా కత్తిపోట్లు

ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు

హెల్సింకీ: ఫిన్లాండ్‌లోని టుర్కు నగరంలో శుక్రవారం గుర్తుతెలియని అగంతకులు విచ్చలవిడిగా కత్తిపోట్లకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో ఇద్దరు మరణించగా, ఆరుగురు గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇది ఉగ్రవాద చర్యా, మరేదైనా లక్ష్యంతో చేశారా అనేది తెలియరాలేదని పేర్కొన్నారు. కత్తులతో దాడులకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న ఒక వ్యక్తిపై కాల్పులు జరిపి అరెస్టు చేశామనీ, మిగతావారి కోసం వేట కొనసాగుతోందని తెలిపారు. ఈ దాడులకు ఉగ్రవాదంతో సంబంధంఉందా అనేది తెలియదని అంతర్గత మంత్రి పౌలా రిసిక్కో పేర్కొన్నారు.

జర్మనీలో కత్తితో దాడి ఒకరి మృతి

బెర్లిన్: జర్మనీ పశ్చిమ ప్రాంతంలోని వుప్పెర్టల్ నగరంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి కత్తితో పొడవడంతో ఒకరు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆ నగరంలోని ఎల్బెర్‌ఫెల్డ్ ప్రాంతంలో మధ్యాహ్నం 12.45 (జీఎంటీ కాలమానం ప్రకారం) గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనలో ఒకరుగానీ, అంతకన్నా ఎక్కువ మందిగానీ పాల్గొన్నట్టు కనిపిస్తోందని పోలీసులు తెలిపారు.

దిల్లీలో దుశ్శాసన పర్వం!

- ఉద్యోగిని చీర లాగిన అధికారి
- ఫిర్యాదు చేసిన బాధితురాలినే విధుల నుంచి తొలగించిన యాజమాన్యం

దిల్లీ: దేశ రాజధానిలో ఓ అయిదు నక్షత్రాల హోటల్ సెక్యూరిటీ మేనేజరు తన కింద పనిచేసే మహిళా ఉద్యోగి(33)ని లైంగికంగా వేధించినందుకు పోలీసులు అతణ్ని అరెస్టు చేశారు. ఉద్యోగిని చీర లాగి, లోబరుచుకునే ప్రయత్నం చేసిన దృశ్యాలు హోటల్ సీసీటీవీలో నమోదయ్యాయి. మూడు వారాల తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. 'జులై 29 నా పుట్టిన రోజు సందర్భంగా అతడు నన్ను తన గదిలోకి పిలిచాడు. తన క్రెడిట్ కార్డును తీసి నీకు ఏం కావాలి అని అడుగుతూ పక్కన కూర్చోమన్నాడు. నేను నిరాకరించగా.. తన వైపు లాక్కుంటూ నా చీర లాగే ప్రయత్నం చేశాడు. ఇతర సిబ్బందిని గది ఆవరణ నుంచి వెళ్లిపోమన్నాడు. శారీరకంగా లోబరుచుకునేందుకు ఒత్తిడి చేశాడని' అని బాధితురాలు తెలిపారు. భర్త సాయంతో జులై 30న పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన రోజే సెక్యూరిటీ మేనేజర్‌పై హోటల్ మానవ వనరుల విభాగానికి(హెచ్‌ఆర్) ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె పోలీసులతో వాపోయారు. గురువారం మధ్యాహ్నం ఆమె విధులకు హాజరవడానికి వెళ్లగా, ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు హోటల్ యాజమాన్యం తెలిపింది.

ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే ఓడిన అభ్యర్థిపైనా కేసులు

చట్టాన్ని సవరించాలని ఎన్నికల సంఘం సూచన

దిల్లీ: అక్రమాల విషయంలో ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థిపైనా కేసులు పెట్టే విధంగా చట్టాన్ని సవరించాలని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. 'అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రస్తుతం ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థిపైనే కేసులు పెట్టే అవకాశం ఉంది. ఓడిపోయిన అభ్యర్థి అక్రమాలకు పాల్పడినా ప్రశ్నించే అధికారం ఉండడం లేద'ని ఎన్నికల కమిషనర్ ఓ.పి.రావత్ వ్యాఖ్యానించారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ అనే సంస్థ ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు చట్టాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు చెప్పారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడితే ఆరేళ్ల అనర్హత వేటు పడుతుందని, అది అందరికీ వర్తించాలంటే ఓడిన వారినీ దీని పరిధిలోకి తీసుకురావాల్సి ఉందని తెలిపారు. ఎన్నికల్లో అన్ని నైతిక విలువలను విస్మరిస్తున్నారని, ఎలాగైనా విజయం సాధించాలన్నదే ఏకైక లక్ష్యంగా మారిందని రావత్ విమర్శించారు. విజేతలు ఏ తప్పూ చేయరు, అధికార పార్టీలోకి ఫిరాయిస్తే అన్ని నేరాలూ మాఫీ అవుతాయన్న సంస్కృతి నెలకొందని అన్నారు. శాసనకర్తలను తమ వైపు తిప్పుకోవడం, విచ్చలవిడిగా ఖర్చు చేయడం, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడమే పార్టీల వనరులుగా మారాయని విమర్శించారు.



వరద నీటిలో మునిగిపోయిన బిహార్‌లోని మోతిహారి జిల్లాలోని పలు గ్రామాలు

డోక్లామ్‌కు టెలికాంతో విరుగుడు

- విద్యుత్, కమ్యూనికేషన్ రంగాల్లో చైనా కంపెనీలపై భారత్ గురి
- నిబంధనలను కఠినతరం చేస్తున్న ప్రభుత్వం

దిల్లీ: సరిహద్దుల్లో కయ్యానికి కాళ్లు దువ్వుతున్న చైనాను సైనికపరంగా ఎదుర్కొంటూనే.. ఆర్థికపరమైన చర్యలకూ భారత్ సిద్ధమవుతోంది. దేశంలోని విద్యుత్ ప్రసార రంగంలోకి ప్రవేశించే వ్యాపార సంస్థలకు నిబంధనలను కఠినతరం చేస్తోంది. విద్యుత్, టెలికం సాధనాల్లో మాల్‌వేర్ ఆచూకీ పట్టేందుకు తనిఖీలను తీవ్రతరం చేయనుంది. భారత్‌లోని సున్నితమైన రంగాల్లో చైనా జోరును నియంత్రించడమే వీటి ఉద్దేశమని ప్రభుత్వ, పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

హార్బిన్ ఎలక్ట్రిక్, డాంగ్‌ఫాంగ్ ఎలక్ట్రానిక్స్, షాంఘై ఎలక్ట్రిక్, సిఫాంగ్ ఆటోమేషన్ వంటి చైనా కంపెనీలు భారత్‌కు విద్యుత్ సాధనాలను సరఫరా చేయడం కానీ దేశంలోని 18 నగరాల్లో విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌లను నిర్వహించడం కానీ చేస్తున్నాయి. విద్యుత్ రంగంలో చైనా ప్రమేయాన్ని అనుమతించడం వల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని స్థానిక కంపెనీలు చాలాకాలంగా ఆందోళన వ్యక్తంచేశాయి. ఇదేతరహాలో చైనా మార్కెట్లలో ప్రవేశించడానికి తమకు అనుమతి రావడంలేదని వాపోతున్నాయి.

దేశంలో విద్యుత్ ప్రసార కాంట్రాక్టుల కోసం ప్రయత్నించే సంస్థల కోసం కొత్త నిబంధనలను రూపొందిస్తూ కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ) ఇచ్చిన నివేదికను మోదీ సర్కారు పరిశీలిస్తోంది. ఇందులోని అంశాలు స్థానిక కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయి.

- ★ భారత్‌లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్న కంపెనీలు కనీసం పదేళ్ల నుంచి అక్కడ కార్యకలాపాలు సాగిస్తుండాలి.
- ★ ఆ సంస్థలో ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్‌లుగా భారత పౌరులు ఉండాలి. సదరు విదేశీ సంస్థ ఉద్యోగులు నిర్దిష్టకాలం పాటు భారత్‌లో నివాసం ఉండాలి.
- ★ విద్యుత్ ప్రసార వ్యవస్థల కోసం ఎక్కడి నుంచి ముడి సరకును కొంటున్నదీ సవివరంగా తెలియజేయాలి. వాటిలో మాల్‌వేర్ ఉన్నట్లు తేలితే.. భారత్‌లో తదుపరి కార్యకలాపాలు నిర్వహించకుండా ఆ సంస్థపై నిషేధం విధిస్తారు.

ఈ నివేదికలో నేరుగా చైనా ప్రస్తావన లేకపోయినప్పటికీ.. భద్రతా ముప్పుల నేపథ్యంలో భారత్‌లోకి ఆ దేశ కంపెనీలు మరింత ఎక్కువగా చొరబడకుండా చూడటమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. చైనా కంపెనీలు దీన్ని ఖండిస్తున్నాయి. భద్రతా ముసుగులో విదేశీ పోటీని అడ్డుకునేందుకు భారత సంస్థలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయని చైనాకు చెందిన విద్యుత్ సాధనాల ఎగుమతి కంపెనీ ప్రతినిధి ఒకరు ఆరోపించారు. దాని వల్ల నష్టపోయేది భారతేనని చెప్పారు.

మాకు ప్రయోజనం..

విద్యుత్ సౌకర్యం లేని దాదాపు 25 కోట్ల మందికి చౌకలో విద్యుత్‌ను అందించేందుకు భారత్.. చైనా విద్యుదుత్పత్తి, పంపిణీ పరికరాలను ఉపయోగిస్తోంది. తాజా నిబంధనలను అమల్లోకి తెస్తే తమకు ప్రయోజనం కలుగుతుందని స్థానిక పరిశ్రమలు చెబుతున్నాయి.

టెలికం రంగంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఇలాంటి చర్యలను చేపట్టింది. చైనా ఆధిపత్యమున్న ఈ రంగంలో అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలను పాటించాలని స్పష్టంచేసింది. ఆయా ఉత్పత్తుల్లో పాటించే భద్రతా ప్రమాణాలు, మార్గదర్శకాలు, ఆర్కిటెక్చర్ ఫ్రేమ్‌వర్క్‌లను తెలియజేయాలంటూ 21 స్మార్ట్ ఫోన్ తయారీదారులకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ కంపెనీల్లో షియోమీ, లెనోవో, అప్పో, వివో, జియోనీ వంటి చైనా కంపెనీలు ఉన్నాయి.

లవ్ జిహాద్‌పై ఎన్ఐఏ కేసు నమోదు

దిల్లీ: కేరళలో ఓ హిందూ మహిళ మతం మార్చి ముస్లిం యువకుడు పెళ్లి చేసుకున్న వ్యవహారంపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం కేసు నమోదు చేసింది. మల్లాపురం జిల్లా పెరింథలమన్న పోలీసు స్టేషన్‌లో ఈ కేసు నమోదయింది. కేరళలో ఇలాంటివి ఒక వ్యూహంలా జరుగుతున్నాయన్న ఫిర్యాదుల మేరకు దీనిపై దర్యాప్తు జరపాలని బుధవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ మహిళ ఇస్లాంలోకి మారిన తరువాత జహాన్ అనే వ్యక్తిని వివాహం చేసుకుంది. అయితే ఆమెను సిరియాలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ సభ్యురాలిగా చేర్చుకుందని, జహాన్ ఒక పావు మాత్రమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. అంతకు ముందు కేరళ హైకోర్టు దీనిని 'లవ్ జిహాద్'గా అభివర్ణించి వివాహాన్ని రద్దు చేసింది.

భారత్‌తో రక్షణ బంధం బలోపేతం చేసుకుందాం

- అమెరికా, జపాన్ నిర్ణయం
- చైనాకు ముకుతాడు వేసేందుకే..

వాషింగ్టన్: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు పెరుగుతున్న నేపథ్యంలో భారత్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా వంటి దేశాలతో రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని అమెరికా, జపాన్‌లు నిర్ణయించాయి. తూర్పు చైనా సముద్రంలో నెలకొన్న భద్రతా వాతావరణంపై ఆందోళన వ్యక్తంచేశాయి.

అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్, రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్, జపాన్ విదేశాంగ మంత్రి టారో కోనో, రక్షణ మంత్రి ఇట్సునోరి ఒనోడెరాలు శుక్రవారం ఇక్కడ సమావేశమయ్యారు. చైనా నుంచి తలెత్తుతున్న ముప్పులపై వారు ప్రధానంగా చర్చించారు. అనంతరం సంయుక్తంగా విలేఖరులతో మాట్లాడారు. కొరియా, ఆస్ట్రేలియా, భారత్, ఆగ్నేయాసియా దేశాలతో రక్షణ సహకారాన్ని మరింత వృద్ధి చేసుకుంటాం" అని కోనో చెప్పారు. అనంతరం విడుదలైన సంయుక్త ప్రకటనలోనూ ఈ బహుళపక్ష సహకార అంశాన్ని ప్రస్తావించారు. పద్ధతి మార్చుకునేలా ఉత్తర కొరియాకు నచ్చజెప్పాలని చైనాను కోరారు. దక్షిణ చైనా సముద్రంలో ఏకపక్ష బెదిరింపు చర్యలు, వివాదాస్పద ప్రాంతాల సైనికీకరణ వంటి చర్యలకు దిగవద్దని విజ్ఞప్తి చేశారు.

ఉత్తర కొరియా దుస్సాహసాన్ని తిప్పికొడతాం

ఉత్తర కొరియా నుంచి ఉత్పన్నమయ్యే ఎలాంటి దుస్సాహసాన్ని ఎదుర్కొనేందుకైనా తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్ స్పష్టం చేశారు. తమ భూభాగంపైన కానీ మిత్రపక్షాలపై కానీ క్షిపణి దాడి చేస్తే 'తక్షణ చర్యలు' ఉంటాయని హెచ్చరించారు.

లద్దాఖ్ తరహా కొట్లాటలు మంచివి కావు


- భారత్, చైనా బలగాల మధ్య ఘర్షణ నిజమే
- ధ్రువీకరించిన విదేశాంగ శాఖ

దిల్లీ: లద్దాఖ్‌లో పాంగాంగ్ సరస్సు వద్ద భారత్, చైనా బలగాల మధ్య ఒక 'ఘటన' జరిగిన మాట నిజమేనని భారత్ శుక్రవారం ధ్రువీకరించింది. డోక్లామ్ వద్ద రెండు దేశాల సైన్యం మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు పరస్పర ఆమోదయోగ్య పరిష్కారం లభించేవరకూ చైనాతో చర్చలు కొనసాగిస్తామని పునరుద్ఘాటించింది.

"పాంగాంగ్ సరస్సు వద్ద ఆగస్టు 15న ఒక ఘటన జరిగినట్లు ధ్రువీకరిస్తున్నా. అలాంటి పరిణామాలు సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతకు విఘాతం కలిగిస్తాయి. రెండు దేశాల ప్రయోజనాలకు అవి మంచివి కావు" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ పేర్కొన్నారు.

జపాన్ వ్యాఖ్యలపై.. డోక్లామ్ అంశంపై భారత వైఖరిని జపాన్ సమర్థించినట్లు వచ్చిన వార్తలపైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి సూటిగా స్పందించలేదు. "డోక్లామ్ ప్రాంతంపై భూటాన్, చైనాల మధ్య వివాదం ఉందని, దానిపై రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని మాకు తెలుసు. అలాగే భారత్‌కు, భూటాన్‌కు మధ్య రక్షణ ఒప్పందం ఉందనీ, అందువల్లే భారత బలగాలు అక్కడ మోహరించాయని మేం గమనించాం. బలప్రయోగం ద్వారా ఏకపక్షంగా డోక్లామ్‌లో వాస్తవ పరిస్థితిని మార్చడానికి ఏ దేశమూ ప్రయత్నించకూడదు" అని భారత్‌లో జపాన్ రాయబారి కెంజి హిరామట్సు వ్యాఖ్యానించినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. డోక్లామ్ సంక్షోభంపై భారత్‌కు బాహాటంగా మద్దతు పలికిన మొట్టమొదటి దేశం జపానే. మరో వైపు జపాన్ రాయబారి వ్యాఖ్యలపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ బీజింగ్‌లో ఆగ్రహం వ్యక్తంచేసింది.

వియత్నాంకు బ్రహ్మోస్ ఇవ్వలేదు: వియత్నాంకు భారత్ శక్తిమంతమైన బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులను సరఫరా చేసినట్లు వచ్చిన వార్తలను రవీష్ ఖండించారు.



శుక్రవారం దిల్లీలో తాను రచించిన 'నరేంద్ర మోదీ: ద మేకింగ్ ఆఫ్ ఏ లెజెండ్' పుస్తకాన్ని ప్రధాని మోదీకి అందజేస్తున్న సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాథక్

భాజపా పార్లమెంటరీ పార్టీ ఆర్టీఐ పరిధిలోకి ఎందుకు రాదు?

- కేంద్ర సమాచార కమిషన్ ప్రశ్న

దిల్లీ: భాజపా పార్లమెంటరీ పార్టీని రాజ్యాంగ/చట్ట పరిధిలోని సంస్థ(పబ్లిక్ అథారిటీ)గా ఎందుకు ప్రకటించరాదని.. ఆర్టీఐ పరిధిలోకి ఎందుకు తీసుకురాకూడదని కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ప్రశ్నించింది. లోక్‌సభలో సంబంధిత అధికార ప్రతినిధులెవరైనా దీనిపై సెప్టెంబరు 7లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. భాజపా ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్న బిహార్‌లోని మధుబని నియోజకవర్గంలో ఎంపీలాడ్స్ పనులపై సమాచారాన్ని కోరుతూ ఒకరు దరఖాస్తు(ఆర్టీఐ) చేశారు. దీనిపై సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖ స్పందించడం లేదంటూ సీఐసీని ఆశ్రయించారు. ఎంపీ లాడ్స్ వివరాలను అన్ని పార్టీలూ బహిర్గతం చేయాలని సిఫార్సు చేసింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2015-17 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00